
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 260

బుధవారం 11-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


**సేవలకు ఇక సెలవు**

ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంతదాస్ పదవీకాలం పూర్తి - 15లో



**పెళ్లి మీది.. ఫండ్ మాది**

ముహూర్తం పెట్టడమే ఆలస్యం.. రుణాల రూపంలో వచ్చి పడుతున్న నిధులు -15లో



**పార్లమెంట్‌లో 'సోరోస్' రగడ**

కాంగ్రెస్–జార్జి సోరోస్ బంధం, అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది.


వివరాలు 6లో ▸



**జస్టిస్ శేఖర్ వ్యాఖ్యలపై ఆగ్రహం**

వీహెచ్‌పీ కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



**వెల్‌డెక్ రికవరీ విజయవంతం**

గగన్‌యాన్‌లో భాగంగా క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన 'వెల్‌డెక్' రికవరీ ట్రయల్స్ విజయవంతమయ్యాయని ఇస్రో తెలిపింది.

వివరాలు 6లో ▸



**సిరియాపై భీకర దాడులు**

సిరియాలోని బఫర్‌జోన్‌లోకి చొరబడ్డ ఇజ్రాయెల్ సైన్యం డమాస్కస్‌కు సమీపంలోకి వెళ్లినట్లు ఆ దేశ ప్రతిపక్షం చెబుతోంది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి



లోన్ యాప్ వేధింపులు భరించలేక.. పెళ్లయిన 50 రోజులకే విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్ యాప్‌లో రూ.2 వేలు తీసుకున్న యువకుడు.. తిరిగి ఆ మొత్తం చెల్లించేశాడు. అయినా ఇంకా కట్టాలంటూ లోన్ యాప్ నిర్వాహకులు యువకుడి ఫొటోలు మార్ఫింగ్ చేసి అతని భార్యకు, బంధువులకు పంపించారు. ఈ అవమానం తట్టుకోలేక ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. 8లో

### పోలీసులే కిడ్నాప్ చేస్తే!



మాచర్ల కోర్టు ప్రాంగణంలో గిరిజన నేతపై ఏకంగా పోలీసులే దాడి చేసి కిడ్నాప్ చేశారు. పల్నాడు జిల్లా కాకిరాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీనునాయక్‌పై కూటమి ప్రభుత్వంలో మూడు అక్రమ కేసులు నమోదు చేశారు. 2 కేసుల్లో సుమారు 70 రోజులు జైలులో ఉన్న శ్రీనునాయక్ బెయిల్‌పై విడుదలయ్యాడు. మూడో కేసులో లొంగిపోయేందుకు మాచర్ల కోర్టుకు వచ్చిన శ్రీనునాయక్‌పై పోలీసులు దాడి చేసి కిడ్నాప్ చేశారు. 5లో

# హై ఓల్టేజ్ షాక్

## గృహ వినియోగదారులపై 25 నుంచి 55% వరకూ అదనంగా వడ్డింపు

## నవంబర్ బిల్లులో రూ.6 వేల కోట్లకు పైగా కరెంట్ చార్జీల వాతలు

## వచ్చే నెల నుంచి పడనున్న మరో రూ.9,412.50 కోట్ల భారం


చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు

అధికారంలోకి రాగానే రూ.15,485.36 కోట్ల చార్జీల బాదుడు

అదనంగా పెరిగిన విద్యుత్ చార్జీలు చూసి నివ్వెరపోతున్న వినియోగదారులు

పేద, మధ్య తరగతి, చిరు వ్యాపారులకు కూటమి సర్కారు వరుస షాక్‌లు

వాడకం తక్కువగా ఉండే శీతకాలంలోనే ఇంత షాక్‌లిస్తే.. ఇక రానున్న నెలల్లో కరెంట్ మంటలే!




సాక్షి, అమరావతి: 'ఓట్లేయ్యండి తమ్ముళ్లూ..! అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం.. పైగా తగ్గిస్తాం.. నేను గ్యారెంటీ..!' అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఐదు నెలలకే మాట తప్పి రాష్ట్ర ప్రజలకు వరుసగా విద్యుత్ షాక్‌లు ఇస్తోంది. సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కినట్లుగానే విద్యుత్ చార్జీలపై చేసిన వాగ్దానాన్ని మరచి ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారు. విద్యుత్తు చార్జీల మోత మోగిస్తూ హై వోల్టేజీ షాకులిస్తున్నారు. రూ.15,485.36 కోట్ల చార్జీల బాదుడుకు తెర తీశారు. విద్యుత్తు వాడకం తక్కువగా ఉండే శీతకాలంలోనే

మిగతా 5వ పేజీలో ▶

# జగదీప్ ధన్‌ఖడ్‌పై విపక్షాల 'అవిశ్వాసం'

## ఎగువ సభ చరిత్రలో తొలిసారిగా నోటీసు


రాజ్యసభ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్

అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చిన 'ఇండియా' కూటమి పార్టీలు

నోటీసుపై 60 మంది ఎంపీల సంతకాలు

డిప్యూటీ చైర్మన్ ఆమోదిస్తే ఓటింగ్ నిర్వహించే అవకాశం

6లో



# మంచు కుటుంబంలో మంటలు!

8లో



- హైదరాబాద్‌లో నటుడు మోహన్‌బాబు ఇంటి వద్ద రోజంతా హైడ్రామా, ఉద్రిక్తత
- ఉదయం మనోజ్ దంపతులను బయటకు పంపించిన విష్ణు
- న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన మనోజ్, మౌనిక
- సాయంత్రం మళ్లీ ఇంటికి.. 7 నెలల కుమార్తెను అప్పగించాలని డిమాండ్
- అడ్డుకున్న సెక్యూరిటీ.. బలవంతంగా లోనికి చొచ్చుకెళ్లిన మనోజ్
- చిన్నకొడుకు తీరును తప్పుబడుతూ ఆడియో విడుదల చేసిన మోహన్‌బాబు
- ఆపై మీడియాపై మోహన్‌బాబు దాడి.. ఆయన కాలికి గాయం అవడంతో ఆస్పత్రికి తరలింపు

## కేన్సర్.. పారాహుషార్



దేశంలో కేన్సర్ కేసులు, మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. భారత వైద్య పరిశోధన మండలికి చెందిన జాతీయ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్(ఐసీఎమ్ఆర్-ఎన్‌సీఆర్‌పీ) సమాచారం ప్రకారం గత ఐదేళ్లలో సుమారు 39.48 లక్షల మంది కేన్సర్‌తో మరణించారు.

| సంవత్సరం | కేన్సర్ కేసులు | కేన్సర్ మరణాలు |
|---|---|---|
| | (లక్షల్లో) | |
| 2019 | 13.58 | 7.51 |
| 2020 | 13.92 | 7.70 |
| 2021 | 14.26 | 7.89 |
| 2022 | 14.61 | 8.08 |
| 2023 | 14.96 | 8.28 |


ఆధారం: కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ

# వచ్చేదంతా వాట్సాప్ గవర్నెన్స్

## ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

- పాలనలో మరింతగా సాంకేతికత వినియోగం
- విభాగాల వారీగా రియల్‌టైమ్ డ్యాష్ బోర్డులు
- ఆర్టీజీఎస్‌కు మొత్తం పర్యవేక్షణ బాధ్యతలు
- మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు
- జనవరి 1న జనన, మరణాల నమోదుకు కొత్త పోర్టల్

7లో



# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం నుంచి గురువారం వరకు జిల్లా కలెక్టర్ల సదస్సును నిర్వహించనున్నట్లు ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆరు నెలల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఈ సదస్సులో చర్చిస్తారని, స్వర్ణాంధ్ర విజన్–2047 డాక్యుమెంట్, నూతనంగా తీసుకొచ్చిన పాలసీలు వంటి అంశాలపై సీఎం దిశానిర్దేశం చేస్తారని పేర్కొంది. ఈ సదస్సులో 26 జిల్లాల కలెక్టర్లు, 40 శాఖల అధిపతులు పాల్గొంటారని, వారి అభిప్రాయాలను సీఎం తెలుసుకుని, రానున్న నాలుగున్నరేళ్లలో ఏ విధమైన లక్ష్యాలతో ముందుకెళ్లాలన్న అంశంపై చర్చిస్తారని తెలిపింది. తొలి రోజు ఉదయం ఆర్టీజీఎస్, వినతుల పరిష్కారం, గ్రామ, వార్డు సచివాలయాలు, వాట్సాప్ గవర్నెన్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై, మధ్యాహ్నం నుంచి వ్యవసాయం, పశుసంవర్థక శాఖ, హార్టికల్చర్, పౌర సరఫరాలు, అడవులు, జలవనరులు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటి సరఫరా, సెర్ప్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, శాంతిభద్రతలు వంటి అంశాలపై చర్చిస్తారని వివరించింది.



నేడు కేంద్ర మంత్రివర్గ

# సమావేశం

## జమిలి ఎన్నికల బిల్లుపై చర్చించే అవకాశం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. కీలకమైన 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై ముసాయిదా బిల్లును కేంద్ర న్యాయ శాఖ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుపై చర్చించి, ఆమోదించబోతున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. 6లో

# ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

రాజకీయ కురు వృద్ధుడు, కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ మంగళవారం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న 92 ఏళ్ల కృష్ణ బెంగళూరులోని తన నివాసంలో మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. 6లో





# ఇక ప్రీమియం మద్యం స్టోర్స్ దందా

## ఎల్లో సిండికేట్ ఎన్ని అడిగితే.. అన్ని ఇచ్చేలా నిర్ణయం

అందుకే స్టోర్స్ సంఖ్యను స్పష్టం చేయని ప్రభుత్వం

ప్రీమియం మద్యం స్టోర్స్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు

చంద్రబాబు సర్కారు కొత్త సంవత్సరం కానుక

- వివరాలు 7లో





నిజమే సార్! రెగ్యులర్‌గా అయితే మన ఆరోగ్యం దెబ్బతింటోంది!!



సుబ్బయ్య (ఫైల్)

30 మందిని కాపాడి..

# వీరమరణం

- ల్యాండ్‌మైన్ పేలి ఆర్మీ జవాన్ మృతి
- జమ్మూలో విధి నిర్వహణలో ఉండగా దుర్ఘటన
- ల్యాండ్‌మైన్‌ను గుర్తించి తోటి జవాన్‌లు 30 మందిని దూరంగా పంపిన సుబ్బయ్య
- అనంతరం దాని బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్.. మృతుడి స్వగ్రామం ప్రకాశం జిల్లా రావిపాడులో విషాదం

12లో

# కుక్క తల్లిదండ్రుల పేర్లు చెప్పాలంట!

- తిరుపతి పోలీసులు వెటకారమాడారు
- రూ.2 లక్షలు ఇస్తారు.. సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు
- మీడియా ఎదుట బాధితురాలి ఆవేదన
- ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

3లో



బాధితురాలు లావణ్య

# 'సానా'కు శానా చేస్తున్నారు

## రాజ్యసభ అవకాశం ఇవ్వడంపై టీడీపీలో తీవ్ర విమర్శలు

## ఒత్తిళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు లొంగిపోయారని నేతల ఆగ్రహం

- సీబీఐ, ఈడీ కేసులున్న వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ఆందోళన
- కొత్త నేతను అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని సీనియర్ల నిలదీత
- ఎవరెన్ని చెప్పినా అలాంటి నేతలే అవసరమని సీఎం స్పష్టీకరణ



### ప్రశ్నిస్తే పనిపడతా!

బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు

కేపీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం

దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు

ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు

యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు

7లో

సాక్షి, అమరావతి: మనీ లాండరింగ్, హవాలా కేసులు సహా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర ఉన్న సానా సతీష్‌కు సీఎం చంద్రబాబు రాజ్యసభ సీటు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లాబీయింగ్, అవినీతి వ్యవహారాలతో అంటకాగే వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం సరికాదంటూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో, వ్యక్తిగత సంభాషణల్లో విరుచుకుపడుతున్నారు. పార్టీ కోసం సుదీర్ఘ కాలం నుంచి పని చేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తున్న సానా సతీష్‌కు ఉన్నత పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తున్నారని కొన్ని రోజుల క్రితమే తెలియడంతో చాలా మంది ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి తమ అసంతృప్తి వెలిబుచ్చారు. ఎంతో మంది సీనియర్లు ఉండగా, తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని పరిగణనలోకి

మిగతా 7వ పేజీలో ▶


Prestige efficia
ఇప్పుడు మీ గ్యాస్ స్టౌవ్ తో
ఎక్కువ మైలేజ్ పొందండి!
ఉత్తమమైన సమర్థత తో మరింత గ్యాస్ ని ఆదా చెయ్యండి.
75 Years of Prestige
75%
థర్మల్
ఎఫిషియన్సీ*
efficia 3 బర్నర్
efficia 2 బర్నర్
5 సంవత్సరాల వారంటీ కలిగిన గ్లాస్
ప్రోడక్ట్ యొక్క లక్షణాలు:
2 సంవత్సరాలు వారంటీ కలిగిన ప్రోడక్ట్
ఇత్తడి బర్నర్
టఫెన్డ్ బ్లాక్ గ్లాస్ టాప్
3 వే గ్యాస్ ఇన్లెట్
ఎర్గోనామిక్ నాబ్ డిజైన్
చిందే అవకాశం లేని డిజైన్
సర్టిఫైడ్
Prestige
*స్టాండర్డ్ గ్యాస్ స్టవ్ లు 68% థర్మల్ ఎఫిషియన్సీతో పోలిస్తే, ఈ ప్రోడక్ట్ 75% థర్మల్ ఎఫిసియన్సీ కలిగి ఉంది.
MADE WITH PRIDE IN INDIA
CUSTOMER CARE NO 080-6000 4411
Store Locator
Scan to Connect
Shop Online on shop.ttkprestige.com
తనవాళ్ళ మీద ప్రేమ ఉన్నవారు ప్రెస్టీజ్‌ని ఎలా కాదనగలరు.
Prestige Xclusive
ప్రెస్టీజ్ ఎక్స్‌క్లూసివ్ లో మరియు లీడింగ్ డీలర్ అవుట్‌లెట్స్ లో లభిస్తుంది.




## కార్పొరేట్ సామాజిక బాధ్యత పెరిగింది

సామాజిక బాధ్యత కింద కార్పొరేట్ కంపెనీలు (సీఎస్ఆర్) ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, నైపుణ్య శిక్షణ వంటి అనేక రంగాలూ, అంశాల్లో వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఖర్చు చేస్తున్న సీఎస్ఆర్ నిధులు ప్రతి ఏటా పెరుగుతూ ఉన్నాయి. 2018–19లో రూ.20,217 కోట్లు ఖర్చు చేస్తే... 2022–23 నాటికి ఇది రూ.29,988 కోట్లకు చేరింది. 2022–23లో అత్యధిక నిధులు పొందిన రాష్ట్రం మహారాష్ట్ర. ఏపీకి రూ.955 కోట్లు వచ్చాయి.

| | |
|---|---|
| మహారాష్ట్ర | రూ. 5,495 కోట్లు |
| కర్ణాటక | రూ. 1,985 కోట్లు |
| గుజరాత్ | రూ. 1,982 కోట్లు |
| తమిళనాడు | రూ. 1,559 కోట్లు |
| ఢిల్లీ | రూ. 1,462 కోట్లు |
| ఉత్తరప్రదేశ్ | రూ. 1,152 కోట్లు |
| రాజస్థాన్ | రూ. 1,102 కోట్లు |
| తెలంగాణ | రూ. 1,007 కోట్లు |

ఆధారం : కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

## మెడికల్ భారం.. బీమాతో కొంత దూరం

- దేశంలో మూడేళ్లలో 30 శాతం పెరిగిన బీమా క్లెయిమ్‌లు
- మొత్తం క్లెయిమ్‌లలో 18–35 ఏళ్ల వారిదే 38 శాతం వాటా
- 'పాలసీ బజార్' అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: పట్టుమని పాతికేళ్లు కూడా నిండకుండానే బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె జబ్బులు వంటివి చుట్టుముట్టేస్తున్నాయి. మరోవైపు వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా వచ్చే డెంగీ, మలేరియా, విషజ్వరాలు విజృంభణ అంతకంతకూ పెరుగుతోంది. వెరసి ఆరోగ్య సంరక్షణ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. దీంతో పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చుల నుంచి గట్టెక్కడానికి బీమాను నమ్ముకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీని ఫలితంగా గత మూడేళ్లలో ఆరోగ్య బీమా క్లెయిమ్‌లు **30 శాతం** పెరిగాయి. దేశంలో సగటు క్లెయిమ్ పరిమాణం 2023లో రూ.62,014 ఉండగా, ప్రస్తుత ఏడాది రూ.70,152కు చేరుకుంది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.81,025కు చేరుకుంటుందని అంచనా. ఈ విషయాలు ఇటీవల పాలసీ బజార్ సంస్థ చేసిన అధ్యయనంలో వెల్లడయ్యాయి. డెంగీ, మలేరియా, విష జ్వరాలు తదితర సీజనల్ వ్యాధులతోపాటు గుండె, క్యాన్సర్ వంటి జబ్బుల బారినపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది.

### యువత అధికం...

ముఖ్యంగా యువత బీమా క్లెయిమ్‌లలో గణనీయమైన వాటాను కలిగి ఉంది. 2024లో మొత్తం ఆరోగ్య బీమా క్లెయిమ్‌లలో 18–35 మధ్య వయసు గల యువత వాటా 38.20 శాతం ఉంది. 36 నుంచి 45 మధ్య వయసు గల వారి వాటా 29.50 శాతం. దేశంలోని మొత్తం క్లెయిమ్‌లలో 14.5 శాతం వాటాతో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచింది. అనంతరం 10.2 శాతంతో ఢిల్లీ, 5.90 శాతంతో హరియాణ వరుస స్థానాల్లో ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో గుండె చికిత్స క్లెయిమ్‌లు రెట్టింపు కావడంతోపాటు చికిత్సల ఖర్చులు 53 శాతం పెరిగాయి. ఇక గుండె జబ్బు, సహజ మరణాలు టర్మ్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు కూడా అధికంగా ఉన్నాయి. గుండె జబ్బులకు సంబంధించి 25–30 శాతం, సహజ మరణాలు– 30–35 శాతం, ప్రమాదాలు–15.20 శాతం చొప్పున క్లెయిమ్‌లు నమోదయ్యాయి.

**మొత్తం క్లెయిమ్‌లలో గుండె జబ్బుల వాటా**



| సంవత్సరం | శాతం |
|---|---|
| 2019-20 | 9-12 |
| 2023-24 | 18-20 |

**వయసుల వారీగా 2024లో నమోదైన క్లెయిమ్‌ల వాటా**

| వయసు | క్లెయిమ్‌ల శాతం |
|---|---|
| 18–35 | 38.20 |
| 36–45 | 29.50 |
| 46–60 | 25.30 |
| 61–75 | 6.40 |
| 75+ | 0.50 |

## నేడు ప్రకాశం జిల్లా నేతలతో జగన్ సమావేశం

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం కానున్నారు. ఆ జిల్లాకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింతగా బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై నేతలకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.



## ఎన్ని అడ్డంకులెదురైనా ప్రజల పక్షమే

- వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా రైతాంగం వెంట నడవాలి
- పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు
- బరితెగించిన కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం
- 13న రైతు సమస్యలపై జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా
- 27న విద్యుత్ చార్జీల బాదుడుపై, జనవరి 3న ఫీజు బకాయిలపై ఆందోళన



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కూటమి సర్కార్‌తో పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని.. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా ప్రజల పక్షాన నిలబడాల్సిందేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ఎక్కడా వెనక్కు తగ్గే ప్రసక్తే ఉండబోదని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఆ పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతాంగానికి అండగా నిలవాల్సిన సమయం వచ్చిందని, వారి గొంతుకగా మనం ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఉందనే మెసేజ్ బలంగా వెళ్లాలని, ప్రజా సమస్యలపై ప్రభుత్వం దిగి వచ్చే వరకు మనం వారికి అండగా నిలవాలని చెప్పారు. బరితెగించి వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై కలిసికట్టుగా పోరాడుదామన్నారు. 'వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా రైతాంగం వెంట నడవాలి. ఈ ప్రభుత్వం సూపర్ సిక్స్ సహా ఇతర హామీలను నిలబెట్టుకోలేకపోయింది. గత ప్రభుత్వంలో చేసిన పనులు, పేదల అభ్యున్నతి కోసం అమలు చేసిన పథకాలు, నెలకొల్పిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం నాశనం చేసింది. డెలివరీ మెకానిజంను కూకటివేళ్లతో పెకిలించడమే కాక.. ప్రశ్నిస్తే కేసులు పెట్టి గొంతు నొక్కుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ప్రజల పక్షంగా వారి తరఫున నిలబడాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ చేపట్టబోయే కార్యక్రమాలను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఇప్పటికే అందరి సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 13న రైతుల సమస్యలపై.. 27న విద్యుత్ చార్జీల బాదుడుపై.. జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయాలి' అని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు.. నేతలు, సర్పంచ్‌ల నుంచి జెడ్పీ చైర్మన్ల వరకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ నెల 13న రైతుల సమస్యలపై భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు అందించాలన్నారు. ర్యాలీని వినూత్నంగా నిర్వహించాలని, ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఇతరత్రా మార్గాల్లో సమస్య ఫోకస్ అయ్యేలా చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## 'అన్నదాతకు వైఎస్సార్‌సీపీ అండ'

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ తీరు వల్ల రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా మారిన నేపథ్యంలో వారికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో రూపొందించిన పోస్టర్‌ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పలువురు నేతలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రైతులకు న్యాయం చేసేందుకు 13న రాష్ట్ర వ్యాప్త కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు ఇవ్వడం తెలిసిందేనన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆ రోజు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అంబటి రాంబాబు, వెలంపల్లి శ్రీనివాస్, లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, వేమారెడ్డి, కాకుమాను రాజశేఖర్, కొమ్మూరి కనకారావు, నారాయణమూర్తి, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఎంత కష్టం.. ఎంత కష్టం!

డోలీలో మృతదేహం తరలింపు



అనంతగిరి (అరకులోయ టౌన్) : రాకెట్లలో ప్రయాణించేలా శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నడవలేని, చనిపోయిన వాళ్లను తీసుకెళ్లడానికి డోలీపై ఆధారపడిన దుస్థితి ఆందోళన కలిగిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పరిధిలోని మద్రేబు గ్రామానికి చెందిన మహిళ కొండతం బాలి చిలకమ్మ (60) అనారోగ్యానికి గురై ఆదివారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లడానికి ఏకంగా ఆరు కిలోమీటర్లు డోలీలో మోయాల్సి వచ్చింది. సోమవారం అంబులెన్స్‌లో దేవరాపల్లి వరకు మృతదేహాన్ని తీసుకువచ్చి, అక్కడి నుండి జీనబాడు పంచాయతీలోని సరియా గ్రామం వరకు ఆటోలో తరలించారు. అక్కడి నుంచి మద్రేబు వరకు రహదారి సౌకర్యం లేనందున అతి కష్టంగా కొండలు దాటుకుంటూ 6 కిలోమీటర్లు డోలీలో తీసుకెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

## 17న రాష్ట్రపతి పర్యటన



సాక్షి, అమరావతి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న ఏపీలో పర్యటించనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ప్రథమ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి ముర్ము ఈనెల 17వ తేదీ ఉదయం 11.20 గంటలకు వాయుసేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడ జరిగే ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొంటారు.

## పోలవరం కుడి రెగ్యులేటర్ అంచనా వ్యయం రూ.166.37 కోట్లకు పెంపు

జలవనరుల శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ప్రధాన డ్యాంతో కుడి కాలువను అనుసంధానం చేసే రెగ్యులేటర్, ఆఫ్ టేక్ రెగ్యులేటర్.. ''ఈ'', ''ఎఫ్'' శ్యాడిల్ డ్యామ్‌ల నిర్మాణ పనులు (62వ ప్యాకేజీ) అంచనా వ్యయాన్ని రూ.166.37 కోట్లకు ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలవరం కుడి కాలువను జలాశయంతో అనుసంధానం చేసేందుకు 62, 63, 64 ప్యాకేజీల కింద చేపట్టిన పనులను రూ.245 కోట్లతో చేపట్టేందుకు 2004లో ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఇందులో 62వ ప్యాకేజీ పనుల అంచనా వ్యయాన్ని రూ.166.37 కోట్లకు సవరించాలని ఈ ఏడాది మే 21న పోలవరం సీఈ పంపిన ప్రతిపాదనపై ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

## విభజనపై పార్లమెంటులో చర్చకు కృషి చేయండి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఉండవల్లి లేఖ



సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రాన్ని విభజించిన తీరు, తద్వారా ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చ జరిగేలా నోటీసు ఇప్పించాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. ఈ మేరకు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రాసిన లేఖను మంగళవారం రాజమహేంద్రవరంలో విడుదల చేశారు. 2014 నుంచి జరిగిన పరిణామాలను ఆ లేఖలో ప్రస్తావించారు. '2014 ఫిబ్రవరి 18న రాష్ట్ర విభజన బిల్లుపై ఎటువంటి చర్చా జరగకుండా.. ఎంతమంది విభజనకు అనుకూలమో.. ఎంతమంది వ్యతిరేకమో డివిజన్ ద్వారా లెక్క తేల్చకుండా, తలుపులు మూసేసి టీవీ ప్రత్యక్ష ప్రసారం నిలిపివేసి, రాష్ట్ర విభజన జరిగిపోయిందని లోక్‌సభలో ప్రకటించారు. ఈ విషయం మీకు తెలిసిందే..' అని లేఖలో పేర్కొన్నారు. 'రాష్ట్ర విభజనపై నేను సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పదేళ్లుగా నడుస్తూనే ఉన్నా... కేంద్రం నేటికీ కనీసం కౌంటర్ దాఖలు చేయలేదు. 2018 ఫిబ్రవరి 18న మీరు(పవన్) ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ, కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన బకాయిలు రూ.74,542 కోట్లుగా లెక్క తేల్చింది. 2018 జూలై 16న అప్పటి సీఎం చంద్రబాబును కలిసి లోక్‌సభలో జరిగిన దుర్మార్గం గురించి వివరించాను. నేను చూపించిన లోక్‌సభ రికార్డులను పరిశీలించిన చంద్రబాబు నా వాదనతో ఏకీభవించి, లోక్‌సభలో ఈ విషయం చర్చించేందుకు నోటీసు ఇవ్వాలని, అలాగే సుప్రీంకోర్టులో రాష్ట్రం తరఫున అఫిడవిట్ దాఖలు చేయాలని నిర్ణయించారు. కారణాలేమైనా అవి అమలు కాలేదు. 2019 జనవరి 29న విజయవాడలో నేను ఏర్పాటు చేసిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ, సీపీఎం తప్ప మిగిలిన ముఖ్య పార్టీల నేతలందరూ హాజరయ్యారు. జనసేన పార్టీ అధ్యక్షుడిగా మీరు స్వయంగా హాజరయ్యారు. 2019 ఎన్నికల అనంతరం ఎవరు అధికారంలోకి వచ్చినా, మనకు జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చించాలని, సుప్రీంకోర్టులో ప్రస్తావించాలని ఆ రోజు సమావేశంలో తీర్మానించుకున్నాం. ఇప్పుడు మీరు, చంద్రబాబు ఇద్దరూ బీజేపీతో కలిసి రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. విభజన సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలోను, సహకరించిన బీజేపీ కేంద్రంలోను అధికారంలో ఉన్నాయి. రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టుకోవడానికి, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దడానికి ఇదే సరైన సమయం. మీరిద్దరూ శ్రద్ధ తీసుకుని, పార్లమెంట్ ఉభయ సభల్లో రాష్ట్ర విభజనపై, జరిగిన అన్యాయంపై చర్చకు నోటీసులు ఇప్పించాలి. దీంతోపాటు సుప్రీంకోర్టులో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాన్ని త్వరితగతిన ఒక కొలిక్కి తీసుకురావాలి.' అని ఉండవల్లి ఆ లేఖలో పేర్కొన్నారు.

## కుక్క తల్లిదండ్రుల పేర్లు చెప్పాలంట!

- తిరుపతి పోలీసులు వెటకారమాడారు

తిరుపతి క్రైం/తిరుపతి కల్చరల్: మానవత్వం మరిచి పెంపుడు కుక్కను రాక్షసంగా వేట కొడవళ్లతో నరికి చంపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే.. కుక్క తల్లిదండ్రుల పేర్లు చెప్పాలంటూ తిరుపతి పోలీసులు వెటకారంగా మాట్లాడారని తిరుపతికి చెందిన లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం తమ పెంపుడు కుక్క(టామీ)ను ఇద్దరు వ్యక్తులు దారుణంగా నరికి చంపేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. తమతో వెటకారంగా మాట్లాడుతూ చులకనగా వ్యవహరించారని లావణ్య వాపోయారు. కుక్కను చంపిన వారికి వత్తాసు పలుకుతూ.. రూ.2 లక్షలు ఇస్తారు సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ ఒత్తిడి చేశారని చెప్పారు. తానే రూ.2 లక్షలు ఇస్తానని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటారా అని పోలీసులను లావణ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ యానిమల్స్ చైర్మన్ దివ్యారెడ్డి పాల్గొన్నారు.

### ఇద్దరు నిందితుల అరెస్టు..

టామీ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఈ వివరాలను ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ రామకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు.. శంకర్ కాలనీకి చెందిన లావణ్య ఈనెల 6న బయటకు వెళ్తూ తన కుమార్తె గ్రీష్మతో పాటు టామీని స్కావెంజర్స్ కాలనీలోని తన మామయ్య ఆనందయ్య ఇంట్లో వదిలి వెళ్లారు. అదేరోజు సాయంత్రం 5.30 గంటల సమయంలో కుమార్తె గ్రీష్మ.. లావణ్యకు ఫోన్ చేసి తాతయ్య ఎదురింట్లో ఉన్న శివకుమార్, సాయికుమార్ టామీని చంపేశారని తెలిపింది. శివకుమార్ ఇంటి వైపు టామీ చూసి అరుస్తుండడంతో.. సాయికుమార్ రాయితో కొట్టాడని.. ఆ వెంటనే శివకుమార్ కత్తితో టామీని నరికి చంపేశాడు. లావణ్య ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు.



వివేకపు ఎదుగుదలను కోపం తగ్గుదల ద్వారా కొలవవచ్చు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, 11 డిసెంబర్ 2024

# అసమ్మతి... అనైక్యత...

ఆరు నెలల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అనతికాలంలోనే నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచని పరిస్థితిలో పడినట్టు కనిపిస్తోంది. జార్ఖండ్, జమ్ము – కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుబాటలో పయనించినా, హర్యానా, మహారాష్ట్రల్లో ఎదురైన దిగ్భ్రాంతికరమైన పరాజయాలు ఇప్పుడు కూటమి భాగస్వామ్యపక్షాల మధ్య విభేదాల కుంపటిని రాజేస్తున్నాయి. హర్యానా ఎన్నికల్లో మితిమీరిన ఆత్మవిశ్వాసంతో చేజేతులా కాంగ్రెస్ ఓటమి కొనితెచ్చుకుంటే, మహారాష్ట్రలో మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ) సోదిలో లేకుండా పోవడమూ స్వయంకృతమేనన్న భావన అసమ్మతిని పెంచింది. ఖర్గే సారథ్యంలోని 'ఇండియా' కూటమిలో ప్రధానపాత్ర కాంగ్రెస్‌దే గనక మహారాష్ట్రలో దెబ్బతో అనూహ్యంగా నాయకత్వ మార్పు అంశం తెర మీదకొచ్చింది. సారథ్యానికి సిద్ధమంటూ మమత ముందుకు రావడంతో కథ మలుపు తిరిగింది.

కూటమి ఆశించిన ఫలితాలు రావడం లేదన్న అసంతృప్తి పెరుగుతున్న పరిస్థితుల్లో అసలీ కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించినదే మమతా బెనర్జీ గనక ఇప్పుడీ కూటమికి ఆమే సారథ్యం వహించాలనీ, అందుకామె సిద్ధంగా ఉన్నారనీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ ముందుగా గళం విప్పారు. ఆ తర్వాత కొద్ది రోజులకే దీదీ ఓ ఇంటర్వ్యూ ఇస్తూ, 'కూటమిని వారు నడిపించ లేకపోతే, నేనే నడిపిస్తాను' అని కుండబద్దలు కొట్టేశారు. బెంగాల్‌ను వీడకుండా,అక్కడ నుంచే కూటమి సాఫీగా నడిచేలా చేస్తాననీ వ్యాఖ్యానించారు. దానికి కొనసాగింపుగా జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అగ్రనేత శరద్ పవార్ సైతం జాతీయ నేతగా మమత సమర్థురాలనడంతో తేనెతుట్టె కదిలింది. కూటమిలోని లుకలుకలు, కాంగ్రెస్ పట్ల ఇతర భాగస్వామ్య పక్షాల అసంతృప్తి, అసమ్మతి స్వరాలు బయటపడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అలాగే రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) అధినేత లాలూ సహా పలువురు కోరస్ కలపడంతో విషయం వీధికెక్కింది. సీపీఐ సైతం సీట్ల సర్దుబాటులో వామపక్షాలకు కూటమి చోటివ్వడం లేదంటూ, కాంగ్రెస్ ఆత్మశోధన చేసుకోవాలనేశారు.

నిజానికి, ఈ ఏటి లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి కొంత ఊపు వచ్చినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బలతో అంతా నీరుగారింది. ఆ మధ్య హర్యానాలో దెబ్బ తినడమే కాక, తాజా మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి తుడిచిపెట్టుకుపోవడం అశనిపాతమైంది. ఆశలు క్షీణించడంతో హస్తం పార్టీ సారథ్యంపై అసమ్మతి స్వరం పెరిగింది. ఆ మాటకొస్తే తృణమూల్ చాన్నాళ్ళుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటోంది. ఎన్నికల్లో పొత్తు పెట్టుకోలేదు సరికదా పార్లమెంట్ సమావేశాల్లోనూ అంటీముట్టని వైఖరి. ఇటీవల ఎస్పీది సైతం అదే ధోరణి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో హస్తం పార్టీతో కలవడానికి ఇష్టపడకపోగా, పార్లమెంట్‌లో రాహుల్ ముందుండి నడుపుతున్న అదానీ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లోనూ తృణమూల్ లానే పాలు పంచుకోవట్లేదు. ఇది చాలదన్నట్టు రానున్న ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నట్టు ఆప్ ప్రకటించింది. అభ్యర్థుల పేర్లు విడతల వారీగా విడుదల చేసేస్తూ, చర్చలకు తావు లేకుండా చేసేసింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలనీ, ప్రతిపక్ష ఐక్యతకు చర్యలు ఆలోచించాలనీ శివసేన (ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) పేర్కొన్నదంటే వ్యవహారం ఎందాకా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని కాంగ్రెస్ శైలిపై అసంతృప్తి బాహాటమవుతున్న వేళ... ప్రతిపక్ష కూటమి భవిష్యత్ నేత ఎవరు, భవిష్యత్ దిశ ఏమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కూటమిని దీదీ నడిపితే అభ్యంతరం లేదంటూనే, ఈ బీజేపీ వ్యతిరేక కూటమిలో పలువురు సీనియర్ నేతలు ఉన్నందున కూర్చొని చర్చించి, ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలంటూ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఇప్పటికే సన్నాయి నొక్కులు నొక్కారు. అసలు బీజేపీయేతర ప్రతిపక్షాలన్నీ కలసి 'ఇండియా' కూటమిగా జట్టు కట్టినా, వాటికి సరైన సైద్ధాంతిక భూమికే కాదు... నేటికీ సమన్వయ సంఘం, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, భవిష్యత్ మార్గదర్శనం లాంటివేమీ లేవు. అందుకోసం గడచిన ఏణ్ణర్థం పైగా ప్రత్యేకించి కసరత్తులు చేసిన దాఖలాలూ లేవు. నిన్నగాక మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఎంవీఏ గొడుగు కింద అందరూ కలసి పోటీ చేసినా... బాబ్రీ మసీదు కూల్చివేతను శివసేన (యుబీటీ) నేత ఒకరు సమర్థించడంతో యూపీలో ముస్లిమ్ ఓట్లపై ఆధారపడ్డ ఎస్పీ తాజాగా ఎంవీఏ నుంచి బయటకొచ్చేసింది. దీన్నిబట్టి ఎన్నికల కోసం కలవడమే తప్ప 'ఇండియా' పక్షాల మధ్య సహాయ సహకారాలే కాదు సమన్వయం కూడా లేదన్నది స్పష్టం.

కాంగ్రెస్‌కు కానీ, కూటమికి కానీ సారథ్య బాధ్యతలు తీసుకోకున్నా చక్రం తిప్పడంలో ముందున్న రాహుల్ పరివారానికి ఇప్పుడిది కొత్త పరీక్ష. పార్లమెంట్‌లో సోనియా, రాహుల్, తాజాగా గెలిచొచ్చిన ప్రియాంక – ముగ్గురున్నా కూటమికి బలిమి చేకూరుతున్న దాఖలాలు లేవు. పెద్దన్న పాత్రలో అత్యుత్సాహం చూపుతున్న హస్తం పార్టీ కార్యకర్తలకు కానీ, ఇతర పార్టీలకు కానీ స్ఫూర్తినివ్వడంలో పదే పదే విఫలమవుతోంది. ఇకనైనా సాటిపక్షాల మాటలకు అది చెవి ఒగ్గాలి. పరస్పర గౌరవంతో అందరినీ కలుపుకొనిపోవాలి. తాజా గందరగోళంతో త్వరలోనే 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవడం ఖాయమని బీజేపీ జోస్యం చెబుతోంది. కాషాయపార్టీపై సమైక్యంగా పోరు సాగించడమే ధ్యేయంగా పురుడు పోసుకున్న ప్రతిపక్ష కూటమి ఇలా అనైక్యతా రాగం ఆలపిస్తూ పోతే చివరకు అదే జరుగుతుంది. నాయకత్వచర్చ చివరకు కూటమి ఎన్నికల అజెండాపై కారుమబ్బుల్ని కమ్మేస్తేనే కష్టం. అధికారపక్ష అంచనా తప్పు అని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రతిపక్షాలదే!

# క్షయ నిర్మూలన ఓ అత్యవసరం!

సందర్భం



జగత్ ప్రకాశ్ నడ్డా

**క్షయ (టీబీ) వ్యాధిని పూర్తిగా నిర్మూలించే వ్యూహంలో భాగంగా డిసెంబర్ 7న మరో పరివర్తనాత్మక కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఈ వ్యాధిపై పోరాటాన్ని వేగవంతం చేసేందుకు, వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 347 జిల్లాలను కలుపుకొని ప్రభుత్వం జాతీయ స్థాయిలో 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. టీబీ నిర్మూలనలో మన దేశం రోగ నిర్ధారణ వ్యవస్థలను విస్తరించేందుకు, రోగులు పూర్తిగా కోలుకునేందుకు తోడ్పడటానికి పోషకాహార సహాయ పథకం 'ని–క్షయ పోషణ యోజన' (ఎన్‌పీవై)ని అమలుచేస్తోంది. ఔషధాలకు లొంగని వేరియంట్ సోకిన రోగులకు చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను పరిగణించి, స్వల్పకాలిక చికిత్సా విధానమైన బీపీఏఎల్ఎంకూ అనుమతి ఇవ్వడం విశేషం.**

దేశం నుంచి క్షయ (టీబీ)ని పారదోలాలని గౌరవ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఆయన నాయకత్వంలో టీబీని నిర్మూలించేందుకు వ్యాధి నివారణ, నిర్ధారణ, చికిత్సల్లో మార్పు తీసుకువచ్చేందుకు గత కొన్నేళ్లుగా వినూత్న విధానాలను భారత్ అవలంబిస్తోంది. డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన 'ప్రపంచ టీబీ నివేదిక – 2024'లో ఇప్పటి వరకు దేశంలో అవలంబిస్తున్న విధానాలను ప్రస్తావించింది. దేశంలో 2015 నుంచి 2023 వరకు 17.7 శాతం మేర టీబీ వ్యాప్తి తగ్గింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే వ్యాధి క్షీణత రేటు విషయంలో ఇది రెట్టింపు. అలాగే దేశ వ్యాప్తంగా 25.1 లక్షల మంది టీబీ రోగులను గుర్తించారు. ఫలితంగా ఈ వ్యాధికి చికిత్స తీసుకునేవారి శాతం 2015లో ఉన్న 59 నుంచి 2023 నాటికి 85 గణనీయంగా పెరిగింది.



ప్రధానమంత్రి దార్శనిక స్ఫూర్తితో టీబీని పూర్తిగా నిర్మూలించే వ్యూహంలో భాగంగా డిసెంబర్ 7న మరో పరివర్తనాత్మక కార్యక్రమం భారత్‌లో ప్రారంభమైంది. క్షయపై పోరాటాన్ని వేగవంతం చేసేందుకు, ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 347 జిల్లాలను కలుపుకొని ప్రభుత్వం జాతీయ స్థాయిలో 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమాన్ని పంచకుల నుంచి ప్రారంభించింది. వ్యాధి తొలిదశలో ఉండగానే క్షయ రోగులందరినీ గుర్తించి వారికి సకాలంలో అవసరమైన, నాణ్యమైన చికిత్సను అందించాలనే మా సంకల్పాన్ని ఈ కార్యక్రమం మరింత బలోపేతం చేస్తుంది. 'జన్ భగీదారి' స్ఫూర్తితో మనమంతా– ప్రజాప్రతినిధులు, ఆరోగ్య నిపుణులు, పౌరసమాజం, కార్పొరేట్ సంస్థలు, సంఘాల–సంయుక్తంగా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేద్దాం.

భారత్ నుంచి టీబీని తరిమేసే ప్రయాణంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అందిస్తున్న చురుకైన భాగస్వామ్యం... ఈ కార్యక్రమం మరో మైలురాయిగా నిలుస్తుందనే భరోసాను ఇచ్చింది.

### టీబీ నిర్మూలనలో మన దేశ సామాజిక విధానం

రోగ నిర్ధారణ వ్యవస్థలను విస్తరించేందుకు, టీబీ రోగులు పూర్తిగా కోలుకొనేందుకు తోడ్పడటానికి పోషకాహార సహాయ పథకం ... 'ని–క్షయ పోషణ యోజన' (ఎన్‌పీవై)ని భారత్ అమలుచేస్తోంది. ఏప్రిల్ 2018 నుంచి 1.16 కోట్ల మంది లబ్ధి దారులకు ఎన్‌పీవై పథకం ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రూ. 3,295 కోట్లు అందించారు. ఈ పథకం ద్వారా నెలవారీగా అందించే ఆర్థిక సాయం గత నవంబర్ నుంచి రూ. 500 నుంచి రూ. 1000కి పెంచడం క్షయ నిర్మూలనలో భారత్ నిబద్ధతను సూచించే మరో అంశం.

మరో కీలక అంశం... పోషకాహార సమస్యను పరిష్కరించడంతో పాటు సమాజ భాగస్వామ్యం పెరిగేలా 'టీబీ ముక్త భారత్ అభియాన్' తోడ్పడింది. అలాగే సమాజంలో వివిధ వర్గాలను ఏకం చేసి అవగాహన పెంచడానికి, టీబీ రోగులకు పోషకాహారం, వృత్తిపరంగా, మానసికంగా సాయం అందించే దిశగా సామూహిక ఉద్యమాన్ని సృష్టించింది. జన్ భగీదారి స్ఫూర్తితో ప్రభుత్వ – పౌర భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ఉద్యమం 1.75 లక్షల మంది ని–క్షయ మిత్రల ద్వారా దేశవ్యాప్తంగా 21 లక్షల ఆహార కిట్లను సరఫరా చేసేందుకు స్ఫూర్తినిచ్చింది.

### టీబీని రూపుమాపడానికి వినూత్న విధానం

అనేక సంవత్సరాలుగా చికిత్స సఫలతా రేటును పెంపొందించేందుకు బెడాక్విలైన్, డెలామనిడ్ వంటి సరికొత్త ఔషధాలను భారత్ ప్రవేశపెట్టింది. ఔషధాలకు లొంగని వేరియంట్ సోకిన రోగులకు చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను పరిగణించి స్వల్ప కాలిక చికిత్సా విధానమైన బీపీఏఎల్ఎంకు అనుమతి నిచ్చాం. ఇప్పటికే ఉన్న చికిత్సా విధానాలతో పోలిస్తే ఇది మరింత ప్రభావ వంతంగా ఉంటుంది. ప్రస్తుతం మనకు 19 నుంచి 20 నెలల పాటు సాగే సంప్రదాయ చికిత్సా విధానంతో పాటు 9 నుంచి 11 నెలల పాటు సాగే చికిత్సా విధానం కూడా మనకు అందుబాటులో ఉంది. ఇప్పుడు ఈ బీపీఏఎల్ఎమ్ విధానంతో రోగులు ఆరు నెలల్లోనే చికిత్సను పూర్తి చేసుకోవచ్చు.

క్షేత్ర స్థాయిలో రోగులందరినీ గుర్తించి సత్వరమే చికిత్స అందించడానికి వీలుగా అందుబాటులో అధునాతన పరికరాలు ఉండేలా నిరంతర కృషి చేస్తున్నాం. దీని కోసమే సమర్థవంతమైన, కచ్చితమైన పరీక్షా పద్ధతులను ప్రవేశపెట్టాం. అవే జీవ పరమాణు పరీక్షలు (మాలిక్యులర్ టెస్ట్స్). 2014 –15లో కొన్ని వందల సంఖ్యలో మాత్రమే ఉన్న వ్యాధి నిర్ధారణ పరికరాల సంఖ్య ప్రస్తుతం 8,293 కు చేరుకున్నాయి. ఈ పరికరాలు అన్ని జిల్లాల్లోనూ అందుబాటులో ఉన్నాయి.

'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ స్ఫూర్తితో స్వదేశీ జీవ పరమాణు పరీక్షలను క్షేత్రస్థాయిలో పరీక్షించి రూపొందించిన పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. తద్వారా జిల్లా, బ్లాకు స్థాయిల్లో టీబీ నిర్ధారణకు వెచ్చించే సమయాన్ని తగ్గించడంతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు, చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించగలిగాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందిన మన స్వదేశీ మాలిక్యులర్ పరీక్షలను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉపయోగిస్తున్నారు. ఈ కార్యక్రమాలు టీబీ నిర్మూలనలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపాయి.

2018 నుంచి టీబీ పరిశోధనలపై అధికంగా నిధులు వెచ్చిస్తున్న అగ్ర సంస్థల్లో ఒకటిగా భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) స్థిరంగా నిలవడం మనందరికీ గర్వకారణం. రోగులకు అతి చేరువలోనే సమర్థవంతమైన వ్యాధి నిర్ధారణ సౌకర్యాలతో సహా మరిన్ని నూతన సాధనాలను త్వరిత గతిన అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు కొనసాగిస్తాం.

### భవిష్యత్తు వైపు దృష్టి సారిస్తూ...

వివిధ రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించడం, నిరూపితమైన సాంకేతికతలను వేగంగా అందుబాటులోకి తీసుకురావడం... టీబీ నిర్మూలనా దిశలో భారత్ నాయకత్వానికి నిదర్శనాలు. అధునాతన రోగ నిర్ధారణ, చికిత్సలకు దారితీసే మార్గదర్శక పరిశోధనల నుంచి సార్వత్రిక సామాజిక తోడ్పాటును అందించే నియమాలను ప్రవేశ పెట్టేవరకూ... టీబీని పారదోలడంలో మన దేశం ముందంజలో ఉంది. టీబీని గుర్తించడం, నిర్ధారించడం, చికిత్స, నివారణలో సామాన్య ప్రజలను భాగస్వాములను చేయడం ఈ సమయంలో అత్యవసరం. 100 రోజుల పాటు ఉద్ధృతంగా సాగే ప్రచారం టీబీని రూపుమాపడంలో సామూహిక నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. గౌరవనీయులైన ప్రధానమంత్రి నాయకత్వంలో అందరి భాగస్వామ్యంతో, మానవాళికి పెద్ద శత్రువుగా ఉన్న టీబీని ఓడించి, ఆరోగ్యకరమైన భవిష్యత్తును కల్పిస్తామని నేను విశ్వసిస్తున్నాను.

వ్యాసకర్త కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### ఒప్పుకొన్నట్టేనా?



"బీజేపీ 'తప్పుడు సమాచారం' వ్యాప్తి చేస్తోంది" అని చెబుతోంది ఫ్రెంచ్ మీడియా హౌజ్ 'మీడియా పార్ట్'. యూఎస్ విదేశాంగ శాఖకు వ్యతిరేకంగా తన ఆరోపణలకు గతంలో ఇదే మీడియా గ్రూపును అధికార పక్షం దన్నుగా తెచ్చుకున్నది. ఆశ్చర్యకరంగా దీనిపై భారత విదేశాంగ శాఖ ఇప్పటికీ నోరు విప్పలేదు.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

### ఆఫ్రికాతో సమానం



ఇండియా తలసరి ఆదాయం 2,800 డాలర్లు. ఇందులోంచి అంబానీ, అదానీలను మినహాయిస్తే అది 2,700కు తగ్గుతుంది. టాప్ 10 ధనవంతులను మినహాయిస్తే అది 2,500 అవుతుంది. టాప్ 200 మందిని మినహాయిస్తే, 2,150 అవుతుంది. టాప్ 1 శాతాన్ని మినహాయిస్తే, 1,730 అవుతుంది. టాప్ 5 శాతాన్ని మినహాయిస్తే అది 1,130 డాలర్లకు పడిపోతుంది. ఇది సహారా ఎడారి ఆఫ్రికా దేశాల తలసరి ఆదాయంతో సమానం.

– మహేశ్వర్ పేరి, పబ్లిషర్

### వెనక ఉన్నది!



సిరియాలో గాజా స్ట్రిప్‌కు రెండింతల భూమిని ఇజ్రాయెల్ తీసుకుంది. రాజధాని డమాస్కస్‌కు 30 మైళ్ల దూరంలోనే తన ట్యాంకులను మోహరించింది. అయినా 'హెచ్‌టీఎస్' (హయత్ తహ్రీర్ అల్–శామ్) ఒక్క గుండు కూడా ఇజ్రాయెల్ సైనికుడి మీద పేల్చలేదు. ఏం జరుగుతున్నదో ఇది మీకు అర్థం చేయించకపోతే ఇంకేదీ చేయించలేదు.

– క్రెయిగ్ ముర్రే, చరిత్రకారుడు

### మంచి సీఎం



ఎస్.ఎం. కృష్ణ ఆత్మకు శాంతి కలుగుగాక! కర్ణాటక ఉత్తమ ముఖ్యమంత్రి వెళ్లిపోయారు. ఆయన హయాం తర్వాత ఆయనలో సగంపాటి మంచి సీఎంని కూడా కర్ణాటక చూడలేదు. (విదేశీ వ్యవహారాల మంత్రిగానూ కృష్ణ పనిచేశారు.)

– యూసుఫ్ ఉంర్భూవాలా, సంపాదకుడు

### అది కనబడదా?



సిరియాలో మీద టర్కీ బాంబులు కురిపిస్తూనే ఉంది. అయినా ప్రపంచ ఆగ్రహం అంతా తన బఫర్ జోన్‌ను సురక్షితం చేసుకున్న ఇజ్రాయెల్ మీదే ఉంది. దీన్నే యూదు వ్యతిరేకత అంటారు.

– రిద్వాన్ అయ్‌దెమిర్, యూట్యూబర్

### జరిగేది!



కులీన వామపక్ష ఉదారులు చాలావరకు మరో ఎజెండాను కప్పే పీలిక గుడ్డల్లాంటివారంతే. వాళ్లు మధ్యేవాదులను వ్యతిరేకించి, అతివాదులకు ద్వారాలు తెరుస్తుంటారు. – సుధీర్ మిశ్రా, దర్శకుడు

ఇన్ బాక్స్

### ఇంకెంత కాలమిలా?

వ్యాకుల వీణానాదాలను
ఆలపించే సంధ్యారాగాలను
ఇంతకు వినేదెవరు?

సుదూరంగా
మరణ వేదనల్లో రోదిస్తున్న
పాలస్తీనా ప్రజల
హాహాకారాల మధ్య
సొంత నేల విముక్తి ఎప్పుడు?



నిలుచున్న తావునే
ఉనికిని కోల్పోతున్న శ్రామికుల
పోరాటాలు ఫలించేదెన్నడు?
ఓటమి అంచున
ఒంటరి యుద్ధాల ఫలితం
కన్నీటి ధారలేనా?

కులాల వారీగా కీచులాటలూ
రాజ్యాధికారం పెనుగులాట
పీలికలు పేలికలుగా
నినదిస్తున్న జనసందోహంలో
మన రాజ్యాంగమొక ఆటబొమ్మ!

– నిఖిలేశ్వర్ I 91778 81201

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

# ఆ వ్యతిరేకత మనకు కలిసొచ్చేనా?

ట్రంప్ తిరిగి ఎన్నిక కావడం ఆయన చైనా విధానం గురించి ప్రశ్నలను లేవనెత్తుతోంది. అది ఇండో–పసిఫిక్ క్రియాశీలక శక్తులను ప్రభావితం చేస్తుంది. అంతేకాకుండా అమెరికా–చైనా ఉద్రిక్తతల నడుమ భారతదేశానికి పెట్టుబడులను ఆకర్షించే అవకాశాన్ని అందిస్తుంది.

గతం నాంది అయినట్లయితే, అమెరికా అధ్యక్షులు వారి రెండవ టర్మ్‌లో మరింత దూకుడుగా ఉంటారని చెబుతారు. ట్రంప్ 2.0 చైనా విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చు. ఎందుకంటే, తన మొదటి హయాంలో ట్రంప్, బీజింగ్‌తో వాషింగ్టన్ ప్రాథమిక ఒడంబడికనే మార్చేశారు. 1970ల చివరలో ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి చేరినప్పటి నుండి, ఆర్థిక, శాస్త్రీయ సాంస్కృతిక రంగాలలో సహకారం పెరిగింది. ట్రంప్ రెండు దేశాల మధ్య ఆ బంధాన్ని తెంచేశారు.

వాణిజ్యం, భౌగోళిక రాజకీయాలు, భద్రతలో సవాళ్లను కూడా పరిష్కరించాలని ట్రంప్ చూస్తున్నారు. వాణిజ్య లోటును తగ్గించేందుకు చైనా దిగుమతులపై ట్రంప్ ప్రభుత్వం సుంకాలు విధించిన నేపథ్యంలో చైనా–అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. చైనా సంతకం చేసిన వాణిజ్య ఒప్పంద నిబంధనల ప్రకారం, అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లను పెంచడానికీ, మేధో సంపత్తికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికీ, అమెరికన్ ఆర్థిక సంస్థలకు ఎక్కువ మార్కెట్ అందుబాటు ఇవ్వడానికీ అంగీకరించింది. అయితే, ట్రంప్ ప్రభుత్వం జిన్‌పింగ్ నేతృత్వంలోని చైనాను వ్యూహాత్మక ప్రత్యర్థిగా ముద్ర వేసింది. అందువల్ల, జాతీయ భద్రతా ఆందోళనలు ముఖ్యమైనవిగా మారాయి. సున్నితమైన రంగాలలో చైనీస్ పెట్టుబడులపై నియంత్రణలు, హువై, జీటీఈ వంటి చైనీస్ బడా వాణిజ్య సంస్థలపై పరిమితులు పెరిగాయి. టెలికాం నెట్‌వర్క్‌లు, సెల్‌ఫోన్ యాప్ పర్యావరణ వ్యవస్థలు, క్లౌడ్ కంప్యూటింగ్‌లలో చైనీస్ ప్రభావాన్ని ఎదుర్కోవాలనే ఒత్తిడి పెరిగింది.

ఇదే పునాదిపై బైడెన్ పరిపాలన చైనాకు సున్నితమైన సాంకేతికత, పెట్టుబడి, మానవ మూలధన ప్రవాహాలను పరిమితం చేస్తూ తన చైనా విధానాన్ని నిర్మించింది. జిన్‌పింగ్ చైనా ఎలక్ట్రిక్ వాహనాల వంటి సాంకేతికత ద్వారా తన ప్రాధాన్యతను పెంచుకోగా, అమెరికా దాన్ని సుంకాల విధింపు ద్వారా దెబ్బతీసింది. అందువల్ల, రిపబ్లికన్, డెమొక్రాట్ పరిపాలనల రాజకీయ ఎజెండా మొత్తంగా ఏమిటంటే చైనాను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నట్లు భావించే చర్యలను పెంచడమే.

తన ఎన్నికల ప్రచారంలో భాగంగా, ట్రంప్ వస్తూత్పత్తిలో అమెరికా ప్రాధాన్యతను పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. అధునాతన సమాచార సాంకేతికత, హై–ఎండ్ న్యూమరికల్ కంట్రోల్ మెషినరీ, రోబోటిక్స్, వైమానిక సామగ్రి, సముద్ర ఇంజనీరింగ్ టెక్నాలజీ వంటి ముఖ్యమైన



ట్రంప్ జిన్‌పింగ్

రంగాలలో ఆధిపత్యాన్ని పెంపొందించడానికి ప్రయత్నిస్తున్న జిన్‌పింగ్ పాలనలోని చైనా తయారీ రంగ చొరవపై ట్రంప్ దెబ్బకొట్టారు. అధునాతన రైలు పరికరాలు, శక్తిని ఆదా చేసే వాహనాలు, విద్యుత్ పరికరాలు, వ్యవసాయ యంత్రాలు, బయో ఫార్మాస్యూటికల్స్, అధిక పనితీరు గల వైద్య పరికరాలు తదితర చైనా వస్తువులపై అధిక సుంకాలు విధించాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్ –19ని జిన్‌పింగ్ తప్పుగా నిర్వహించడమే 2020 ఎన్నికలలో తన పతనానికి దారితీసిందని ట్రంప్ భావిస్తున్నారు.

చైనా విషయానికి వస్తే, ట్రంప్ తిరిగి రావడం దాని రాజకీయ, ఆర్థిక పథాలపై ఆందోళనలను రేకెత్తించింది. పాలనా మార్పు ద్వారా కమ్యూనిస్ట్ పార్టీని తొలగించే ప్రయత్నాలు జరగవచ్చని కూడా జిన్‌పింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ప్రజలలో కూడా దీని ప్రతిధ్వని వినిపించింది. చైనా ఉద్దేశించిన స్థూల దేశీయోత్పత్తి వృద్ధి లక్ష్యమైన 5 శాతాన్ని సాధించకపోవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అమెరికా, చైనాల మధ్య క్షీణిస్తున్న సంబంధాలు, ఆర్థిక మాంద్యం బీజింగ్‌ను అమెరికన్ సంస్థలకు ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానం నుంచి తొలగించాయి. చైనాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యూరోపియన్ వాణిజ్య సంస్థలు తాము పెట్టిన పెట్టుబడికి గానూ తగ్గిన రాబడులపై ఆందోళన వ్యక్తం చేశాయి. చైనీస్ మార్కెట్‌లోని సమస్యలు అపరిష్కృతంగానే ఉంటాయని అవి నమ్ముతున్నాయి. నియంత్రణ సమస్యలకు సంబంధించి చూస్తే, ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యాపార సంస్థలకు ప్రాధాన్యత, మార్కెట్–ప్రాప్యత అడ్డంకులు, మితిమీరిన సామర్థ్యం కారణంగా చైనాలో పెట్టుబడి పెట్టడం గురించి ఈ సంస్థలు పునరాలోచించవలసి ఉంటుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య అమెరికా టెక్ కంపెనీలు చైనా నుండి నిష్క్రమించడం కూడా దీనికి తోడ్పడింది.

భారతదేశం దీన్నుంచి తన ప్రయోజనాన్ని పొందేందుకు ప్రయత్నించాలి. ట్రంప్ గెలిచిన తర్వాత ఆయనతో అనుసంధానం అయిన మొదటి నాయకులలో ప్రధాని నరేంద్ర మోదీ ఒకరు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న తొలి సమయంలో సంబంధాలను పెంచుకోవడానికి మోదీ ప్రయత్నించారు. చైనాతో పాశ్చాత్య దేశాల విరక్తిని మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు భారత్ ఉపయోగించుకోగలదా అనేది ప్రశ్న. ట్రంప్ తొలి హయాంలో పునాది ఒప్పందాలపై సంతకం చేయడం ద్వారా సైనిక సహకారం అభివృద్ధి చెందింది. భారత్, చైనా వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నప్పటికీ, ఢిల్లీ తన నిరోధక సామర్థ్యాన్ని పెంపొందించడానికి దాని రక్షణ– పారిశ్రామిక సముదాయాన్ని మెరుగుపరచాలి. ట్రంప్ హయాంలో, 2017లో 'క్వాడ్' పునరుత్థానం చెందింది. పాకిస్తాన్ అధోగతి పాలైనవేళ, కశ్మీర్‌లో ఉగ్రవాదం మళ్లీ పుంజుకుంటున్న వేళ, తన మొదటి ఇన్నింగ్స్‌లో భారత ఆందోళనలను పట్టించుకున్న ట్రంప్‌తో విధిగా మాట్లాడుతుండాలి.

– హర్ష్ వి. పంత్, 'ఓఆర్ఎఫ్' చైనా స్టడీస్ ఉపాధ్యక్షుడు
– కల్పిత్ మన్కికర్, 'ఓఆర్ఎఫ్' చైనా స్టడీస్ ఫెలో
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

# జ్ఞానం – విజ్ఞానం

అర్థం చేసుకోవటానికి కష్టమైన విషయాలను సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పగల నైపుణ్యం గలవాడు శ్రీరామకృష్ణ పరమహంస. బ్రహ్మ జ్ఞానానికి కూడా ఆవల ఒక స్థితి ఉందంటాడాయన. 'జ్ఞానానికి ఆవల విజ్ఞానం వస్తుంది. జ్ఞానం ఎరుకవున్న వ్యక్తి, అజ్ఞానం ఎరుకనూ గ్రహించి ఉంటాడు.

బ్రహ్మర్షి అయిన వశిష్ఠుడు నూరు మంది పుత్రుల మరణ శోకంతో కుప్పకూలి పోయాడు. లక్ష్మణుడు 'బ్రహ్మ జ్ఞాని అయిన వ్యక్తి అలా శోకించటం ఎందుకు' అని రాముని అడిగాడు. రాముడు, 'సోదరా! జ్ఞానాజ్ఞానాలను దాటిపో' అన్నాడు. ఎందుకంటే జ్ఞానం ఉన్న వ్యక్తికి అజ్ఞానం కూడా ఉంటుంది. పాదంలో ముల్లు గుచ్చుకొంటె మరొక ముల్లుతో మొదటి ముల్లును తీసివేయాలి. ఆ పైన రెండవ ముల్లును కూడా పారవేయాలి' అని అంటూ జ్ఞానాజ్ఞాలను త్యజించి వేయాలని రామకృష్ణుడు మహేంద్రనాథ్ గుప్తాకు చెప్పాడు. అదే విజ్ఞానం యొక్క ప్రయోజనం. ఇది వెలుతురు అన్న జ్ఞానం ఉన్న వ్యక్తికి చీకటి అంటె ఏమిటో తెలిసి ఉండటం. నీవు గమనించలేదా? సుఖం ఎరుక గల వ్యక్తికి దుఃఖం ఎరుక కూడా ఉంటుంది. పుణ్యం ఎరుక ఉన్న వ్యక్తికి పాపం ఎరుక ఉండే ఉంటుంది. మడి అన్న జ్ఞానం ఉన్న వ్యక్తి మైల అనే జ్ఞానమూ కలిగి ఉంటాడు. 'నేను' అన్న భావం ఉన్న వ్యక్తికి నువ్వు అన్న భావనా ఉంటుంది. విజ్ఞానం అంటే విశేష రీతిలో భగవంతుని తెలుసుకోవటమే. కట్టెలో అగ్ని ఉన్నదనే ఈ ఎరుకను, ఈ విశ్వాసాన్ని జ్ఞానం అంటారు. కానీ ఆ కట్టెలమంటపై అన్నం వండి, ఆ అన్నం తిని పుష్టికరంగా తయారవ్వడమే విజ్ఞానం.

జ్యోతిర్మయం

అంతరిక అనుభవం చేత భగవంతుడున్నాడని తెలుసుకోవటం జ్ఞానం. కాని ఆయనతో మాట్లాడి వాత్సల్య, సఖ్య, దాస, మధుర ఇత్యాది భావాలలో ఏదో ఒక భావంలో ఆనందం చవి చూడడమే విజ్ఞానం. ఆయనే ఈ జీవ జగత్తులుగా అయి ఉన్నాడని దర్శించడమే విజ్ఞానం. (పుటలు 350–351–శ్రీరామకృష్ణ కథామృతం–1).

– రాచమడుగు శ్రీనివాసులు


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.11.44 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** రేవతి ఉ.10.04 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** తె.4.38 నుండి 6.07 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.30 నుండి 12.14 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.48 నుండి 9.18 వరకు తదుపరి రా.1.40 నుండి 3.09 వరకు, గీతా జయంతి ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 5.23.



"ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బి.శివాజీ. విజయవాడలోని కానూరులో ఉంటారు. ఆయన ప్రతి నెలా దాదాపు రూ.600 విద్యుత్ బిల్లు చెల్లిస్తుండగా ఈ నెల రూ.813 బిల్లు వచ్చింది. దాదాపు 35 శాతం అదనంగా చార్జీలు పడటంతో శివాజీ గగ్గోలు పెడుతున్నాడు. ఇంత భారం మోపితే కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నాడు. పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అడిగేవారే లేరా? అని నిస్సహాయంగా ప్రశ్నిస్తున్నాడు.




# హై ఓల్టేజ్ షాక్








■ విజయవాడలోని ప్రసాదంపాడుకు చెందిన ఏ.సహిల్ ( సర్వీస్ నెంబర్ 6511118010865)కు ఈ నెల (నవంబర్)రూ.1,321 బిల్లు వచ్చింది. గత నెల ఇదే సర్వీసుకు ఆయన చెల్లించిన బిల్లు రూ.861 మాత్రమే. అంటే ఈ నెల బిల్లులో ఏకంగా 53 శాతం అదనంగా భారం పడింది.

**ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా మనుబోలులో నివసించే గడ్డం రమణారెడ్డి (సర్వీస్ నెంబర్ 3521520000654)కి నవంబరులో రూ.1,620 విద్యుత్ బిల్లు రాగా ఈ నెల ఏకంగా రూ.2,544 బిల్లు వచ్చింది. గత నెలతో పోలిస్తే 56 శాతం అదనంగా పెరిగి రూ.924 అధికంగా బిల్లు రావడంతో ఆయన లబోదిబోమంటున్నారు.**

నవంబర్, డిసెంబరు నెలల బిల్లులు







▶ మొదటి పేజీ తరువాయి

బిల్లులు ఇలా పేలిపోతుంటే ఇక తరువాత నెలల్లో ఏ స్థాయిలో షాక్‌లు ఉంటాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఓవైపు ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను దూరం చేసి బిల్లులతో బాదేస్తున్న కూటమి ప్రభుత్వం ఇతర వర్గాలపై పెనుభారం మోపింది.


## నివ్వెరపోతున్న వినియోగదారులు..


ఇప్పటికే రూ.6,072.86 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని గత నెల విద్యుత్ వినియోగం నుంచి ప్రభుత్వం వేస్తోంది. పెరిగిన విద్యుత్తు చార్జీలను ప్రతి యూనిట్‌కు సగటున రూ.1.27గా నిర్ణయించిన ఏపీఈఆర్‌సీ దీనిని 15 నెలల్లో వసూలు చేయాలని సూచించడంతో ప్రతి నెలా వినియోగదారులపై ఈ సర్దుబాటు భారం యూనిట్‌కు సగటున రూ.0.63 చొప్పున పడుతోంది.

## వచ్చే నెల నుంచి మరింత మోత..


ప్రస్తుతం వసూలు చేస్తున్న రూ.6,072.86 కోట్లకే ప్రజలపై ఇంత భారీగా చార్జీల భారం పడుతుంటే వచ్చే నెల నుంచి కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారుల మీద మరో పిడుగు వేయనుంది. రూ.9,412.50 కోట్ల విద్యుత్తు చార్జీల వసూలుకు డిస్కమ్‌లు సిద్ధమవుతున్నాయి. డిసెంబర్ నెల వినియోగం నుంచి అంటే జనవరి మొదటి వారం నుంచి వచ్చే విద్యుత్ బిల్లుల్లో ఈ చార్జీలను ప్రభుత్వం వసూలు చేయనుంది. అసలే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుంటే దానికి తోడు విద్యుత్ చార్జీల బాదుడుతో సామాన్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

▸ చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెలో అద్దె ఇంట్లో నివసించే రమేష్ (సర్వీస్ నెంబర్ 5112402008564)కి ప్రతి నెలా రూ.300 - రూ.400 మధ్య కరెంట్ బిల్లు వస్తుంది. అక్టోబర్‌లో రూ.363 వచ్చింది. నవంబర్‌లోనూ రూ.385కి మించలేదు. అలాంటిది ఈ నెల ఏకంగా రూ.679 రావడంతో షాక్ తిన్నాడు.




## విద్యుత్ ఛార్జీలు పెంచనన్నారుగా బాబు





**16/08/2023:** టీడీపీ విజన్ డాక్యుమెంట్- 2047 విడుదల సందర్భంగా విద్యుత్ చార్జీలు పెంచం.. వీలైతే తగ్గిస్తామని ప్రకటించిన చంద్రబాబు





**10/08/2022** టీడీపీ కార్యకర్తలతో టెలీ కాన్ఫరెన్స్‌లో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రకటించిన చంద్రబాబు




కర్నూలులోని బుధవారంపేటలో అద్దె ఇంట్లో నివసించే ప్రైవేట్ ఉద్యోగి అజయ్‌కి (సర్వీస్ నెంబర్ 8311102106824) గత నెలలో విద్యుత్ బిల్లు రూ.688 రాగా ఈ నెలలో ఏకంగా రూ.1,042 రావడంతో గుండె గుభిల్లుమంది. ఆ కుటుంబంపై ఒక్క నెలలోనే రూ.354 అదనపు ఆర్థిక భారం పడింది.





● ఈ నెల నుంచి పెరిగిన విద్యుత్ బిల్లుల బాదుడు స్పష్టంగా కనిపిస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో 88 యూనిట్లకు రూ.348.97 బిల్లు రాగా (సర్వీస్ నెంబర్ 1453494901000916) ప్రస్తుతం 91 యూనిట్లకు రూ.463.51 బిల్లు వచ్చినట్లు కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన కె.సూర్యకాంత్ తెలిపారు. అదనంగా వాడిన మూడు యూనిట్లకు రూ.114.54 బిల్లు ఎక్కువగా రావడంతో ఆయన షాక్ తిన్నాడు.

## ఎస్సీ, ఎస్టీలకు జగన్ ఉచితం..

వైఎస్సార్ సీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందించిన విద్యుత్‌ను కూడా పాత బకాయిలుగా చూపిస్తూ కూటమి సర్కారు బలవంతపు వసూళ్లకు దిగుతోంది. రూ.లక్షలు.. వేలల్లో బకాయిలు చెల్లించాలంటూ ఆదేశిస్తోంది. అంత డబ్బు కట్టలేని పేదల కరెంట్ కనెక్షన్లను విద్యుత్ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా కట్ చేస్తూ మీటర్లను తొలగిస్తున్నారు. పాత బకాయిల పేరుతో విద్యుత్తు సిబ్బంది కరెంట్ మీటర్లు తొలగించి తీసుకుపోతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని తేల్చి చెబుతుండటంతో పేదలు తీవ్ర షాక్‌కు గురవుతున్నారు. తాటాకు ఇళ్లు, రేకుల షెడ్లు, ప్రభుత్వ కాలనీల్లో నివసించే వారంతా చీకట్లోనే కాలం గడుపుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించారు. మొత్తం సుమారు 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.2,845.90 కోట్ల మేర ఉచిత విద్యుత్తు ద్వారా మేలు చేకూర్చారు.

## బాబు బాదుడు..






విద్యుత్ అధికారులు ఇచ్చిన కరెంటు బిల్లు

కరెంట్ బిల్లును చూపిస్తున్న కత్తి రామక్క (సర్వీస్ నెంబర్ 2234401011821)

● వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసించే కత్తి రామక్క నలుగురు సంతానం అనారోగ్యంతో బాధపడుతున్నారు. చిరు వ్యాపారంతో ఆమె కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఎస్సీలకు ఉచిత విద్యుత్తు పథకాన్ని వర్తింపచేయడంతో ఐదేళ్లుగా ఆమెకు కరెంటు బిల్లు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం రాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే కరెంటు బిల్లు కట్టాలంటూ విద్యుత్ శాఖ అధికారులు ఇంటి వద్దకు వచ్చారు. రూ.3,464 బిల్లు కట్టాలని, 2018 నుంచి బకాయిలు చెల్లించాలని హెచ్చరిస్తూ కరెంట్ కట్ చేయడంతో అంధకారంలో మగ్గిపోతోంది.

## సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసులో మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి మంగళగిరి పోలీసులు నమోదు చేసిన కేసులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఈ నెల 24వ తేదీ వరకు ఆ ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు తదుపరి విచారణను ఆ రోజుకే వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## రామచంద్రపురంలో నూతన జిల్లా సెషన్స్ కోర్టు ప్రారంభం

### వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నూతన అదనపు జిల్లా సెషన్స్ కోర్టును హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి గంధం సునీత జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధులు, గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులు, న్యాయమూర్తులు ఉన్న చరిత్ర కలిగిన ప్రాంతం రామచంద్రపురమన్నారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టు నుంచి సుమారు 700 కేసులను రామచంద్రపురం జిల్లా కోర్టుకు బదిలీ చేశామని చెప్పారు. ఈ కోర్టు మంజూరుకు గత ప్రభుత్వ హయాంలో విశేష కృషి చేసి, ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక నెరవేర్చిన మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు బార్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీసులే కిడ్నాప్ చేస్తే!

### కోర్టులో లొంగిపోయేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నేత శ్రీనునాయక్

- అతడిపై దాడికి పాల్పడి కిడ్నాప్ చేసిన మాచర్ల పోలీసులు
- కూటమి అధికారంలోకి వచ్చాక అతడిపై మూడు అక్రమ కేసులు



శ్రీనునాయక్ రక్తం తనపై పడిందని చూపుతున్న న్యాయవాది రామానాయక్

సాక్షి, నరసరావుపేట: పట్టపగలు న్యాయస్థాన ప్రాంగణంలో గిరిజన నేతపై దాడి చేయడమే కాకుండా బలవంతంగా అపహరించారు. చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీలే రౌడీల అవతారమెత్తారు. కోర్టులో లొంగిపోయేందుకు వచ్చిన నిందితుడిని కోర్టు ప్రాంగణంలోనే కిడ్నాప్ చేశారు. దుర్గి మండలం కాకిరాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రమావత్ శ్రీనునాయక్‌పై ఇప్పటికే మూడు అక్రమ కేసులు నమోదు చేశారు. అందులో రెండు కేసుల్లో సుమారు 70 రోజులపాటు సబ్‌జైలులో ఉన్న శ్రీనునాయక్ బెయిల్‌పై విడుదలయ్యాడు. జైలులో ఉన్న సమయంలో అప్పటికే నమోదైన మూడో కేసులో పీటీ వారెంట్ వేయకుండా బయటకు వచ్చిన తరువాత అరెస్ట్ చేసి హింసించాలన్న దురుద్దేశంతో పోలీసులు ఆ సమయంలో అరెస్ట్ చూపలేదు. బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత ఎలాగైనా అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేయాలని పోలీసులపై టీడీపీ ప్రజాప్రతినిధి నుంచి తీవ్ర స్థాయిలో ఒత్తిడి వచ్చింది. విషయం తెలుసుకున్న శ్రీనునాయక్ కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులను, సన్నిహితులను పోలీసులు వేధింపులు గురి చేస్తుండటంతో శ్రీనునాయక్ కోర్టులో లొంగిపోయేందుకు మంగళవారం మాచర్ల న్యాయస్థానం వద్దకు చేరుకున్నారు. తన న్యాయవాది ద్వారా కోర్టులో సరెండర్ పిటిషన్ దాఖలు చేశారు. మరికొన్ని నిమిషాల్లో న్యాయమూర్తి ఎదుట హాజరవుతాడనగా.. మాచర్ల పోలీసులు అక్కడకు చేరుకున్నారు. బలవంతంగా శ్రీనునాయక్‌ను కోర్టు ప్రాంగణం నుంచి నెట్టుకుంటూ పక్కకు తీసుకెళ్లారు. గమనించిన అతని తరఫు న్యాయవాది రామానాయక్ అడ్డుకోబోయాడు. అయినప్పటికీ పోలీసులు చొక్కా చించి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో శ్రీనునాయక్ చేతి వేళ్లకు గాయాలయ్యాయి. కోర్టు ప్రాంగణంలో పోలీసులు వ్యవహరిస్తున్న దౌర్జన్యకాండను మరో న్యాయవాది షేక్ ఖాసిం తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. గమనించిన పోలీసులు న్యాయవాది వద్ద నుంచి ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. అనంతరం ఎవరూ ముందుకు రావద్దంటూ పోలీసులు బెదిరిస్తూ శ్రీనునాయక్‌ను కిడ్నాప్ చేసి కార్‌లో ఎక్కించుకుని వెళ్లారు. అనంతరం న్యాయవాది రామానాయక్ జరిగిన ఘటనను న్యాయమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లొంగిపోయేందుకు వచ్చిన తమ క్లయింట్‌ను పోలీసులు బలవంతంగా అపహరించడంతోపాటు తనపట్ల దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీనునాయక్ రక్తంతో తడిసిన తన చొక్కాను న్యాయమూర్తికి అప్పగించినట్టు రామానాయక్ తెలిపారు. న్యాయస్థాన ప్రాంగణంలో పోలీసుల దౌర్జన్యకాండ పట్ల న్యాయవాదులు మండిపడుతున్నారు.

**నా భర్తకు ప్రాణహాని ఉంది**

పోలీసుల నుంచి తన భర్తకు ప్రాణహాని ఉందని కిడ్నాప్‌కు గురైన శ్రీనునాయక్ భార్య లక్ష్మీభాయ్ విలేకరుల ఎదుట వాపోయింది. కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకువెళ్లిన తరువాత ఎక్కడ పెట్టారో చెప్పలేదన్నారు. తన భర్తను చూసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా అక్కడ లేదని వెనక్కి పంపారన్నారు. కాగా.. పాత కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనునాయక్‌ను కోర్టు సమీపంలో అరెస్ట్ చేశామని గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు.

## మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులిచ్చారు

- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది శ్రీరామ్
- సోషల్ మీడియా యాక్టివిస్టు రిమాండ్ విషయంలో తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: పోస్టుల వ్యవహారంలో అరెస్టయిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ పప్పుల వెంకట రామిరెడ్డికి రిమాండ్ విధిస్తూ పల్నాడు జిల్లా వినుకొండ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. తీర్పు రిజర్వ్ చేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన కుమారుడు వెంకట రామిరెడ్డికి వినుకొండ కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేసి అతన్ని విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పప్పుల చలమారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా చలమారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్, శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వెంకట రామిరెడ్డికి రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో బీఎన్ఎస్ సెక్షన్ 111 ఈ కేసుకు వర్తిస్తుందని పేర్కొన్నారని, అయితే సెక్షన్ 111 ఏం చెబుతుందో కనీసం పరిశీలించలేదన్నారు. మేజిస్ట్రేట్ చట్ట ప్రకారం నడుచుకోలేదు కాబట్టే రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతున్నామన్నా రు. పోలీసుల తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

# ఐసిస్ ఉగ్రభూతం మళ్లీ విజృంభిస్తుందా?



## సిరియాలో అల్‌ఖైదా, ఐసిస్ మూలాలున్న మాజీ ఉగ్రవాది ముఠా చేతుల్లోకి అధికారం

### ఈ నేపథ్యంలో మళ్లీ పెరిగిన ఉగ్రభయాలు

ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్) ఉగ్రసంస్థ మొదట్నుంచీ సిరియా కేంద్రంగానే తన ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బషర్ అల్ అసద్ నియంత పాలనలో ఇన్నాళ్లూ ఉక్కుపిడికిలి కింద నలిగిపోయి కటిక పేదరికంలో మగ్గిపోయిన సిరియన్లు ఇకనైనా మంచి రోజులు వస్తాయని సంబరపడుతున్నారు. అయితే ఈ ఆనందక్షణాలు కలకాలం అలాగే నిలిచి ఉంటాయో లేదోనన్న భయాలు అప్పుడే కమ్ముకుంటున్నాయి. అసద్ పాలన అంతమయ్యాక పాలనాపగ్గాలు అబూ మొహమ్మద్ అల్ జొలానీ చేతుల్లోకి వెళ్తున్నాయి. ఈయన దేశాన్ని కర్కశపాలన నుంచి విముక్తి ప్రసాదించిన నేతగా ప్రస్తుతానికి స్థానికులు కీర్తిస్తున్నా ఆయన చరిత్రలో చీకటికోణాలు చాలానే ఉన్నాయి. ఎందుకంటే జొలానీ మూలాలు అల్‌ఖైదా ఉగ్రసంస్థలో ఉన్నాయి. ఐసిస్ ఉగ్రసంస్థతో మంచి దోస్తీ చేసి తర్వాత తెగదెంపులు చేసుకున్నా.. ఇప్పుడు మళ్లీ పాత మిత్రులకు ఆహ్వానం పలికితే సిరియాలో ఐసిస్ ఉగ్రభూతం మళ్లీ జడలు విప్పుకుని కరాళ నృత్యం చేయడం ఖాయమని అంతర్జాతీయ యుద్ధ, రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

#### జొలానీతో సుస్థిరత పాలన సాధ్యమా?

ఉగ్రమూలాలున్న వ్యక్తికి యావత్‌దేశాన్ని పాలించేంత శక్తియుక్తులు ఉన్నాయా? అనే సందేహాలు అందరికీ వస్తున్నాయి. 2011లో వెల్లువలా విస్తరించిన అరబ్ ఇస్లామిక్ విప్లవం ధాటికి ఈజిప్ట్, లిబియా, టునీషియా, యెమెన్‌లలో ప్రభుత్వాలు కూలిపోయాయి. దేశ మత, విదేశాంగ విధానాలు మారిపోయాయి. ఇప్పుడు హయత్ తహ్రీర్ అల్ షామ్(హెచ్‌టీఎస్) చీఫ్ హోదాలో జొలానీ సిరియాలోని తిరుగుబాటుదారులు, వేర్వేరు రెబెల్స్ గ్రూప్‌లను ఏకతాటి మీదకు తేగలరా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అల్‌ఖైదాతో గతంలో సత్సంబంధాలు ఉన్న హెచ్‌టీఎస్‌ను అమెరికా, ఐక్యరాజ్యసమితి గతంలోనే ఉగ్రసంస్థగా ప్రకటించాయి. ఉగ్రసంస్థగా ముద్రపడిన సంస్థ.. ఐసిస్‌ను నిలువరించగలదా అన్న మీమాంస మొదలైంది. రాజకీయ శూన్యతను తమకు అనువుగా మార్చుకుని ఐసిస్ మళ్లీ చాపకింద నీరులా విస్తరించే ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది. 2019 నుంచి అమెరికా ఇచ్చిన సైనిక, ఆర్థిక సహకారంతో సిరియాలో పెద్దగా విస్తరించకుండా ఐసిస్‌ను బషర్ అసద్ కట్టడిచేయగలిగారు. సిరియా సామాజిక, ఆర్థిక, రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిన అంతర్యుద్ధానికి తెరపడిన నేపథ్యంలో ప్రస్తుత ప్రధాని మొహమ్మెద్ ఘాజీ జలానీ.. హెచ్‌టీఎస్ చీఫ్ జొలానీతో అధికార మార్పిడికి పూర్తి సుముఖత వ్యక్తంచేశారు. అయితే అధికారం చేతికొచ్చాక రెబెల్స్‌లో ఐక్యత లోపిస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని అంతా భయపడుతున్నారు. దేశం మొత్తమ్మీద జొలానీ పట్టుసాధించని పక్షంలో ఇన్నాళ్లూ దూరం దూరంగా చిన్న చిన్న ప్రాంతాలకు పరిమితమైన ఐసిస్ అత్యంత వేగంగా విస్తరించే సామర్థ్యాన్ని సముపార్జించగలదు. అసద్ పాలన అంతం తర్వాత ఆరంభమైన ఈ కొత్త శకం అత్యంత రిస్క్‌తో, ఏమౌతుందో తెలియని గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యలు చూస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంతటి డోలాయమానంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

#### ఐసిస్ ప్రభావమెంత?

బషర్ అసద్ కాలంలోనూ ఆయనకు వాయవ్య సిరియాపై పట్టులేదు. అక్కడ ఐసిస్ ప్రభావం ఎక్కువ. ఈ వాయవ్య ప్రాంతంలో 900కుపైగా అమెరికా సైనికులు ఉన్నా సరిపోవడం లేదు. ఈ జనవరి–జూన్‌కాలంలో ఇరాక్, సిరియాల్లో ఐసిస్ 153 దాడులు చేసిందని అమెరికా సెంట్రల్ కమాండ్ గణాంకాల్లో వెల్లడైంది. ఐసిస్‌ను అంతమొందించేందుకు అమెరికా తరచూ గగనతల దాడులు చేస్తోంది. ఐసిస్ ఉగ్రవాదులు, సానుభూతిపరులు, స్థావరాలే లక్ష్యంగా ఇటీవలే 75 చోట్ల దాడులుచేసింది. కొన్ని ప్రాంతాలను తుర్కియే దన్నుతో 'సిరియన్ నేషనల్ ఆర్మీ' పాలిస్తోంది. అమెరికా నుంచి సాయం పొందుతున్న కుర్ద్‌ల బలగాలు కొన్నిచోట్ల పాలిస్తున్నాయి. ఐసిస్ ఉగ్రసంస్థ కొంత ప్రాంతాన్ని ఏలుతోంది. హెచ్‌టీ ఎస్ తిరుగుబాటుదారులు, విపక్షాల ఫైటర్లు ఇంకొన్ని ప్రాంతాలను తమ అధీనంలో ఉంచుకున్నారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

#### ఐసిస్‌ను ఎలా కట్టడిచేశారు?

హెచ్‌టీఎస్ గ్రూప్‌కు మొదట్నుంచీ అల్‌ఖైదాతో సంబంధాలున్నాయి. అయితే 2016లో అల్‌ఖైదాతో హెచ్‌టీఎస్ తెగదెంపులు చేసుకుంది. అయితే 2011 నుంచే సిరియాలో ఐసిస్ విస్తరిస్తోంది. మాస్కులు ధరించిన ఐసిస్ ఉగ్రవాదులు అమాయక బందీలను తల నరికి చంపేసిన వీడియోలు అంతర్జాతీయ మీడియాలో ప్రత్యక్షమయ్యాక ఐసిస్ ఎంత నిర్దయగల సంస్థో ప్రపంచానికి తెలిసివచ్చింది. 2014 నుంచే సిరియాలో ఐసిస్‌ను అంతం చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నంలో 2016లో అమెరికా కొంతమేర సఫలీకృతమైంది. కుర్ద్, తుర్కియే బలగాలకు ఆయుధ సాయం అందించి మరింత విస్తరించకుండా అమెరికా వాయవ్య సిరియాకు మాత్రమే ఐసిస్‌ను పరిమితం చేయగలిగింది. 2018లో ఐసిస్ పని అయిపోయిందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కానీ 2019లో మళ్లీ దాడులతో ఐసిస్ తనలో చావ చచ్చిపోలేదని నిరూపించుకుంది. అయితే ఐసిస్ ప్రభావం కొనసాగినంతకాలం అంతర్యుద్ధం తప్పదని మేధోసంస్థ గల్ఫ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ అబ్దుల్‌అజీజ్ అల్ సగేర్ వ్యాఖ్యానించారు. 2003లో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ పతనం, లిబియా నియంత గఢాఫీ 2011లో అంతం తర్వాత ఆయా దేశాల్లో పౌరయుద్ధాలు మొదలయ్యాయని ఆయన ఉదహరించారు.

#### ఐసిస్‌ను నిలువరించే సత్తా జొలానీకి ఉందా?

హెచ్‌టీఎస్ వంటి తిరుగుబాటు సంస్థకు నేతృత్వం వహించినా జొలానీ ఏనాడూ హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్ష పాత్ర ఉన్నట్లు కనిపించకుండా జాగ్రత్తపడ్డారు. విప్లవయోధుడు చెగువేరా తరహాలో తానూ సిరియా విముక్తి కోసం పోరాడుతున్న ఆధునిక తరం యోధునిగా తన వేషభాషల్లో వ్యక్తం చేసేవారు. అతివాద సంస్థకు నేతృత్వం వహిస్తూనే ఉదారవాద నేతగా కనిపించే ప్రయత్నంచేశారు. ఐసిస్ వంటి ముష్కరమూకతో పోరాడాలంటే మెతక వైఖరి పనికిరాదని విశ్లేషకులు చెబుతున్నారు. '' ఐసిస్ అధీనంలోని వాయవ్య సిరియాలో ఎవరైనా తమను విమర్శిస్తే వారిని చిత్రహింసలకు గురిచేయడం, జైళ్లో పడేయడం, చంపేయడం అక్కడ మామూలు. ఈ దారుణాలను సిరియా పగ్గాలు చేపట్టాక జొలానీ నిలువరించగలగాలి'' అని న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే సోఫాన్ గ్రూప్ ఉగ్రవ్యతిరేక వ్యవహారాల నిపుణుడు కోలిన్ అన్నారు. '' అసద్‌ను గద్దె దింపేందుకు అమెరికా బిలియన్ల డాలర్లను ఖర్చుచేసింది. ఇప్పుడు కొత్త ఆశలు చిగురించినా ఐసిస్ నుంచి సవాళ్లు ఉన్నాయి'' అని ట్రంప్ అన్నారు. జొలానీ పాలనాదక్షత, అంతర్జాతీయ సమాజం నుంచి ఆర్థిక, ఆయుధ అండదండలు అందితే, వాటిని సద్వినియోగం చేసుకుంటే సిరియాలో మళ్లీ శాంతికపోతాలు ఎగురుతాయి. లేదంటే మళ్లీ ఐసిస్ ముష్కరమూకలు సిరియన్ల కలలను కకావికలం చేయడం ఖాయం.

# కేంద్ర మంత్రివర్గ సమావేశం నేడు

### జమిలి ఎన్నికల బిల్లుపై చర్చించే అవకాశం

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. కీలకమైన జమిలి ఎన్నికల బిల్లుపై ఈ భేటీలో చర్చించే అవకాశం కనిపిస్తోంది. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'పై ముసాయిదా బిల్లును కేంద్ర న్యాయ శాఖ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ బిల్లుపై చర్చించి, ఆమోదించబోతున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గం ఆమోదించిన తర్వాత బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'కు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి జమిలి ఎన్నికల చట్టం రావాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. మరోవైపు జమిలి ఎన్నికలకు 32 రాజకీయ పార్టీలు అంగీకారం తెలియజేశాయి. మరో 13 పార్టీలు వ్యతిరేకించాయి. జమిలి ఎన్నికల బిల్లును ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టి, ఆమోదింపజేసుకోవాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. 2027లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని మోదీ సర్కారు నిర్ణయించినట్లు సమాచారం.

# బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు పెట్టాలి

### మహారాష్ట్రలోని మరో గ్రామం తీర్మానం

**పుణే:** ముమ్ముందు జరిగే ఎన్నికల్లో బ్యాలెట్ విధానాన్నే అమలు చేయాలంటూ మహారాష్ట్రలోని మరో గ్రామం తీర్మానం చేసింది. సతారా జిల్లా కరాడ్(దక్షిణ)అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొలెవాడి గ్రామ సభ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఎంవీఏ)లను వ్యతిరేకించడంతోపాటు ఇకపై ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లనే వాడాలని కోరింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ సొంత నియోజకవర్గమిది. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో చవాన్‌పై బీజేపీ అభ్యర్థి అతుల్ భోసలే సుమారు 40 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో, ఈ ఎన్నికపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోసారి ఈవీఎంలను వాడితే తాము ఎన్నికలను బహిష్కరిస్తామని వారంటున్నారు. గ్రామస్తుల తీర్మానం ప్రతి అందాకే, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సతారా జిల్లా కలెక్టర్ జితేంద్ర చెప్పారు. షోలాపూర్ జిల్లా మల్సిరాస్ నియోజకవర్గంలోని మర్కడ్‌వాడీ గ్రామస్తులు ఈ నెల 2న బ్యాలెట్ పేపర్లతో మాక్ రీపోలింగ్ చేపట్టడం, ఈవీఎంల విధానం విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తం చేయడం తెలిసిందే.

# తొలిసారిగా కోర్టు బోనెక్కిన నెతన్యాహూ

**టెల్ అవీవ్:** అవినీతి, మోసం, నమ్మకద్రోహం వంటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మంగళవారం టెల్ అవీవ్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. తన రాజకీయ జీవితంలో తొలిసారిగా కోర్టు బోనెక్కారు. నేరారోపణలు ఎదుర్కొంటూ కోర్టులో విచారణకు హాజరైన తొలి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కావడం గమనార్హం. తాజా పరిస్థితుల దృష్ట్యా టెల్ అవీవ్‌లోని అండర్ గ్రౌండ్ చాంబర్‌లో విచారణ జరిగినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రయోజనాల పరిరక్షణ కోసం అంకితభావంతో పని చేస్తున్నానని నెతన్యాహూ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని చెబుతున్నారు. అయినప్పటికీ చట్టాన్ని గౌరవిస్తూ కోర్టులో విచారణకు హాజరయ్యారు. మరోవైపు గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడినందుకు నెతన్యాహూపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు గతంలో అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే.

# సిరియాపై భీకర వైమానిక దాడులు

**డమాస్కస్:** సిరియాలోని బఫర్‌జోన్‌లోకి చొరబడ్డ ఇజ్రాయెల్ సైన్యం డమాస్కస్‌కు అతి సమీపంలోకి వెళ్లినట్లు ఆ దేశ ప్రతిపక్షం చెబుతోంది. రాజధానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోకి చేరుకుందని తెలిపింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు డమాస్కస్, నగర శివారు ప్రాంతాలపై భారీ వైమానిక దాడులు కొనసాగాయని తెలిపిన మీడియా.. ధ్వంసమైన మిస్సైల్ లాంఛర్లు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాల వీడియోలను విడుదల చేసింది. డమాస్కస్‌లోకి తిరుగుబాటుదార్లు ప్రవేశించినప్పటి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ 300కు పైగా వైమానిక దాడులు చేపట్టినట్లు ప్రతిపక్షం పేర్కొంది. లెబనాన్‌తో గల సరిహద్దుల గుండా సిరియాలో ఇజ్రాయెల్ సైన్యం ముందుకు సాగుతోందని కూడా వెల్లడించింది. సిరియాలో ముమ్ముందు దేశంలో అధికారం చెలాయించే వారు ఆయుధ సంపత్తిని మళ్లీ సమకూర్చుకోవాల్సిన అవసరం కలిగేలా తమ సైన్యం ఆ దేశంలోని ఇంకా మిగిలి ఉన్న సైనిక సంపత్తిని ఒక పద్ధతి ప్రకారం నాశనం చేస్తోందని ఇజ్రాయెల్ మీడియా సైతం పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతానికి ఇజ్రాయెల్ ఆర్మీని అక్కడ అడ్డుకునే వారేలేరని వ్యాఖ్యానించింది. అయితే, ఇజ్రాయెల్ ఆర్మీ అలాంటిదేమీ లేదంటూ కొట్టిపారేసింది.

# ధన్‌ఖడ్‌పై 'అవిశ్వాసం'

- ఎగువ సభ చరిత్రలో తొలిసారిగా విపక్షాల నోటీసు
- రాజ్యసభ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- డిప్యూటీ చైర్మన్ ఆమోదిస్తే ఓటింగ్ నిర్వహించే అవకాశం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ ఎగువ సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష 'ఇండియా' కూటమిపార్టీలు మంగళవారం అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాయి. అధికార పక్షానికి కొమ్ముకాస్తున్న ధన్‌ఖడ్‌ను రాజ్యసభ చైర్మన్ పదవి నుంచి తొలగించాల్సిందేనని తేల్చిచెప్పాయి. అవిశ్వాస తీర్మానం నోటీసుపై కాంగ్రెస్, ఆర్జేడీ, టీఎంసీ, సీపీఐ, సీపీఎం, జేఎంఎం, ఆమ్ ఆద్మీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన 60 మంది ఎంపీలు సంతకాలు చేశారు. రాజ్యసభ చరిత్రలో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో తమ హక్కుల కోసం గట్టిగా పోరాడుతామన్న సందేశం ఇవ్వడానికే అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చినట్లు ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ధన్‌ఖడ్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వడం బాధాకరమే అయినప్పటికీ తప్పడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. ఆయన అన్ని పరిధులు అతిక్రమించారని, అందుకే నోటీసు ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యనాయకులపై బీజేపీ ఎంపీలు ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటున్నా ధన్‌ఖడ్ పట్టించుకోలేదని విమర్శించారు. ఈ మేరకు జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ధన్‌ఖడ్ విషయంలో ఇండియా కూటమి పార్టీలన్నీ ఐక్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. సభను ఆయన నడిపిస్తున్న తీరు సక్రమంగా లేదన్నారు. ప్రతిపక్షాలపై ఆయన వివక్ష చూపుతున్నారన్న అభిప్రాయం కలుగుతోందన్నారు. ధన్‌ఖడ్ కేవలం ప్రభుత్వ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు తప్ప రాజ్యసభ చైర్మన్‌గా నిజాయతీగా పనిచేయడం లేదని తప్పుపపట్టారు. ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తప్పించడానికి అవసరమైన బలం తమకు లేదని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు సాగరికా ఘోష్ చెప్పారు. అయినప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ కోసమే పోరాడుతున్నారని, తాము ఎవరికీ వ్యతిరేకం కాదని తేల్చిచెప్పారు.

**ధన్‌ఖడ్‌ను చూసి గర్వపడుతున్నాం: రిజిజు**

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తొలగించడానికి విపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వడం చాలా విచారకరమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ధన్‌ఖడ్‌ను చూసి తాము గర్వపడుతున్నామని చెప్పారు. ఆయన చాలా హుందాగా, పక్షపాతానికి తావులేకుండా పనిచేస్తున్నారని తెలిపారు. అవిశ్వాస తీర్మానం నెగ్గే అవకాశం ఎంత మాత్రం లేదని, రాజ్యసభలో ఎన్డీయేకు పూర్తి మెజార్టీ ఉందని రిజిజు గుర్తుచేశారు.



**లోక్‌సభలో మూడుసార్లు నోటీసులు**

లోక్‌సభలో స్పీకర్‌ను తొలగించాలని కోరుతూ అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చిన సందర్భాలు గతంలో ఉన్నాయి. 1954 డిసెంబర్ 18న అప్పటి స్పీకర్ జి.వి.మౌలాంకర్, 1966 నవంబర్ 24న హుకం సింగ్, 1987 ఏప్రిల్ 15న బలరాం జక్కడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చాయి. మౌలాంకర్, బలరాం జక్కడ్‌పై తీర్మానాలు వీగిపోయాయి. హుకుం సింగ్‌పై ఇచ్చిన నోటీసు తిరస్కరణకు గురైంది. ఓటింగ్‌లో పాల్గొనడానికి 50 మంది కంటే ఎక్కువ మంది సభ్యులు సముఖత వ్యక్తం చేయకపోవడమే ఇందుకు కారణం. ఓటింగ్ జరగాలంటే కనీసం 50 మంది సభ్యులు అంగీకరించాలి.

## కంప్యూటర్ బేస్డ్ విధానంలో క్యూట్–యూజీ పరీక్ష

**న్యూఢిల్లీ:** కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల్లో దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన క్యూటీ–యూజీ పరీక్ష విధానంలో యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) కీలక మార్పులు చేసింది. గతంలో హైబ్రిడ్ మోడ్‌లో పరీక్ష చేపట్టగా ఇకపై 2025 నుంచి కేవలం కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తామని యూజీసీ మంగళవారం వెల్లడించింది. పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యూజీసీ చైర్మన్ జగదీశ్ పలు వివరాలను పంచుకున్నారు. '' సీయూఈటీ–యూజీ పరీక్ష రాసే అభ్యర్థులు 12వ తరగతిలో అభ్యసించిన సబ్జెక్టులతో సంబంధంలేకుండా తమకు నచ్చిన సబ్జెక్ట్ కోసం పరీక్ష రాసుకోవచ్చు. ఈ పరీక్షల్లో సబ్జెక్టుల్ని ఈసారి 63 నుంచి 37కు తగ్గిస్తున్నాం. ఇప్పుడు అన్నింటికీ 60 నిమిషాల పరీక్షకాలం వ్యవధిని ఖరారుచేశాం. ఐచ్ఛిక ప్రశ్నల విధానానికి స్వస్తి పలికాం. సీయూఈటీ–పీజీ పరీక్ష వ్యవధిని 105 నిమిషాల నుంచి 90 నిమిషాలకు కుదించాం'' అని జగదీశ్ కుమార్ చెప్పారు.

# పార్లమెంట్‌లో 'సోరోస్' రగడ

- సోరోస్‌తో కాంగ్రెస్ పెద్దలకు సంబంధాలున్నాయి
- దేశాన్ని అస్థిరపర్చడానికి కుట్రలు చేస్తున్నారు
- రాజ్యసభలో కేంద్ర మంత్రి జె.పి.నడ్డా ఆగ్రహం
- ఖండించిన కాంగ్రెస్ నేతలు
- అదానీ అంశంపై చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్–జార్జి సోరోస్ బంధంతోపాటు అదానీ వ్యవహారంపై పార్లమెంట్ ఉభయ సభలు అట్టుడికిపోయాయి. మంగళవారం ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు అదానీ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఎంతకీ అదుపులోకి రాకపోవడంతో సభ మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి నడ్డా మాట్లాడారు. బిలియనీర్ ఇన్వెస్టర్ జార్జి సోరోస్‌కు, కాంగ్రెస్ పెద్దలకు మధ్య సంబంధాలున్నాయని ఆరోపించారు. వారంతా చేతులు కలిపారని, ఇండియాను అస్థిరపర్చడానికి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. నడ్డా ఆరోపణలపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు ప్రారంభించారు. బీజేపీ సభ్యులు ప్రతిస్పందించారు. సోరోస్‌తో సంబంధాలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. నడ్డా ఆరోపణలను కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ ఖండించారు. అదానీ పెద్ద ఎత్తున లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయని, దీనిపై వెంటనే చర్చ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నినాదాలు మిన్నంటాయి. దీంతో సభను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు.

**లోక్‌సభలోనూ అదే దుమారం**

సోరోస్‌తోపాటు భారతదేశ వ్యతిరేక శక్తులతో కాంగ్రెస్ నాయకులు సంబంధాలు కొనసాగిస్తున్నారని లోక్‌సభలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కిరణ్ రిజిజు ఆరోపించం దుమారం రేపింది. మంగళవారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. తర్వాతవిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలున్నాయంటూ రిజిజు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీకి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా లోక్‌సభను మరుసటి రోజుకు వాయిదావేశారు. అంతకు ముందు మర్చంట్ షిప్పింగ్ బిల్లు–2024ను కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మర్చంట్ షిప్పింగ్ చట్టం–1958 స్థానంలో ఈ బిల్లును తీసుకొచ్చారు.

### పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన

అదానీ వ్యవహారంపై విపక్ష ఎంపీలు మంగళవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మోదీ, అదానీ ఫొటోలు ముద్రించి ఉన్న సంచులను ధరించారు. ఈ సంచులకు మరోవైపు 'మోదీ అదానీ భాయి భాయి' అని రాసి ఉంది. పార్లమెంట్ మకరద్వారం మెట్ల ముందు కాంగ్రెస్ సభ్యులు రాహుల్ గాంధీ, ప్రియాంకతోపాటు డీఎంకే, జేఎంఎం, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలు నిరసన వ్యక్తంచేశారు. మోదీ, అదానీ బంధంపై పెద్ద ఎత్తున నినాదాలు కొనసాగించారు.

# వెల్‌డెక్ రికవరీ ట్రయల్ విజయవంతం



**సూళ్లూరుపేట:** గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా క్రూ మాడ్యూల్‌కి సంబంధించిన 'వెల్‌డెక్'రికవరీ ట్రయల్స్ విజయవంతమయ్యాయని ఇస్రో తెలిపింది. నావికా దళం సహకారంతో ఈనెల 6న విశాఖ తీరంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామంది. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు అక్కడ విధులు ముగించుకుని క్రూ మాడ్యూల్‌లోనే భూమిపైకి తిరిగి వస్తారు. ఈ క్రూ మాడ్యూల్‌ను సముద్ర జలాల్లో పడేలా చేస్తారు. అక్కడి నుంచి తెస్తే వ్యోమగాములు సురక్షితంగా వెలుపలికి తిరిగి వస్తారు. మాడ్యూల్‌ను 4 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి అక్కడ నుంచి సముద్రంలో పడేలా చేసి దాన్ని వెలికి తీసే ప్రక్రియను ఇప్పటికే పలుమార్లు నిర్వహించారు. తాజా ట్రయల్స్‌లో నేవీ సిద్ధం చేసి ఉంచిన వెల్‌డెక్ షిప్‌ను వినియోగించారు. ఈ షిప్ డెక్ నీటిలో మునిగే ఉంటుంది. దీనివల్ల నీళ్లలోని పడవలు, ఉపగ్రహాల వంటి వాటిని సునాయాసంగా షిప్‌లోకి తరలించేందుకు వీలుంటుంది.

# ఎస్‌ఎం కృష్ణ కన్నుమూత

- సీఎంగా, గవర్నర్‌గా, కేంద్రమంత్రిగా ఎనలేని సేవలు
- ప్రభుత్వ లాంఛనాలతో నేడు అంత్యక్రియలు



**బెంగళూరు:** రాజకీయ కురు వృద్ధుడు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న 92 ఏళ్ల కృష్ణ బెంగళూరులోని తన నివాసంలో మంగళవారం తెల్లవారుజామున 2.45 గంటలకు కన్నుమూశారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్‌ఎం కృష్ణ పార్థివదేహానికి ఆయన స్వగ్రామం సోమనహళ్లిలో బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఎస్‌ఎం కృష్ణ పూర్తిపేరు సోమనహళ్లి మల్లయ్య కృష్ణ. ఈయనకు భార్య ప్రేమ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాండ్య జిల్లాలోని ఆయన స్వగృహంలో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**ప్రముఖుల ప్రగాఢ సంతాపం**

ఎస్‌ఎం కృష్ణ మరణంతో పార్టీలకతీతంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. కృష్ణ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఆరాధించే గొప్ప నాయకుడని కొనియాడారు. రాష్ట్రానికి, దేశానికి విశేష సేవలందించిన కృష్ణ నిజమైన అభివృద్ధి ఛాంపియన్ అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కొనియాడారు. బీజేపీ నేత బీఎస్ యడియూరప్ప, జేడీఎస్ నేత కుమారస్వామి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తమను తీవ్రంగా కలచివేసిందన్నారు.

### బెంగళూరును ప్రపంచ పటంలో నిలిపిన నేత

కర్ణాటకలోని మాండ్య జిల్లా మద్దూరు తాలూకాలోని సోమనహళ్లిలో 1932 మే ఒకటో తేదీన కృష్ణ జన్మించారు. ఆయన తండ్రి మల్లయ్య కూడా రాజకీయాల్లో సుపరిచితులే. బెంగళూరులోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. వాషింగ్టన్ డీసీలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ లా స్కూల్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 1962లో మద్దూరు అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్‌లో చేరడానికి ముందు ఆయన ప్రజా సోషలిస్టు పార్టీలో పనిచేశారు. కృష్ణ కర్ణాటక అసెంబ్లీ, మండలి రెండింటిలోనూ సభ్యుడిగా ఉన్నారు. 1993 నుంచి 1994 వరకు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా 1999 అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి అయ్యారు. 1999 అక్టోబర్ 11 నుంచి 2004 మే 28 వరకు కర్ణాటకకు 16వ ముఖ్యమంత్రిగా ఉన్నారు. సీఎంగా ఐటీ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి బెంగళూరును ప్రపంచ ఐటీరంగంలో ఒకటిగా మార్చిన ఘనతను కృష్ణ సొంతం చేసుకున్నారు. 2004– 2009 వరకు మహారాష్ట్ర గవర్నర్‌గా చేశారు. మన్మోహన్ కేబినెట్‌లో విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

# జస్టిస్ యాదవ్ వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలు అందజేయాలని అలహాబాద్ హైకోర్టును ఆదేశించింది. జడ్జి శేఖర్ వ్యాఖ్యల విషయంలో వార్తాపత్రికల్లో ప్రచురితమైన వార్తలను పరిగణనలోకి తీసుకుంటున్నామని కోర్టు పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సదరు న్యాయమూర్తి వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించినట్లు సమాచారం. దేశంలో మెజార్టీ వర్గం మనోభావాలకు అనుగుణంగానే పాలన సాగుతుందని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన వీహెచ్‌పీ కార్యక్రమంలో జడ్జి శేఖర్ అన్నారు. సామాజిక సామరస్యాన్ని, లింగ సమనత్వాన్ని, లౌకికవాదాన్ని యూసీసీ ప్రోత్సహిస్తోందని వెల్లడించారు. ఈయన వ్యాఖ్యలపై విమర్శలు వచ్చాయి. ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెడతానని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ చెప్పారు. దీనిపై వీహెచ్‌పీ నేత అలోక్ కుమార్ స్పందించారు. జస్టిస్ యాదవ్ ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. యూసీసీ వంటి అంశాలపై సదస్సులు ఏర్పాటు చేస్తుంటామని, వీటికి సిట్టింగ్ జడ్జిలను ఆహ్వానిస్తుంటామని వివరించారు.




## నక్సల్స్ బెడద తగ్గింది

దేశంలో నక్సలైట్ల బెడద గత 6 ఏళ్లలో చాలా తగ్గింది. వామపక్ష తీవ్రవాద ప్రాబల్యం ఉన్న జిల్లాల సంఖ్య 90 నుంచి ప్రస్తుతం 38కి తగ్గింది. గత 5 ఏళ్లలో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా చర్యలు, మౌలిక వసతుల కల్పన, హెలికాప్టర్ల ఏర్పాటు వంటి వాటికి కేంద్రం రూ.4,911 కోట్లు ఖర్చు చేసింది. ఈ చర్యల ఫలితంగా హింసాత్మక ఘటనలు, మరణాలు చాలా వరకు తగ్గాయి.

2010తో పోలిస్తే 2023లో తగ్గిన హింసాత్మక ఘటనలు **73%**

138 నక్సల్స్ కారణంగా మరణించిన భద్రతా దళాలు, పౌరుల సంఖ్య. 2010లో ఇది 1,005.

2018 నుంచి 2024 మధ్య.. నక్సల్స్ ప్రభావం పూర్తిగా లేదని ప్రకటించిన జిల్లాలు




ఆధారం: కేంద్ర హోం శాఖ

## క్లుప్తంగా...

### ఆయుష్ మెడికల్ ఆఫీసర్లుగా 67 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. మొత్తం 67 మంది ఎంపికైనట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

### బీసీలకు తీవ్ర అన్యాయం చేశావ్

**చంద్రబాబుపై మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు ధ్వజం**



సాక్షి, రాజమహేంద్రవరం: ధన బలం ఉన్న వారికి రాజ్యసభ సీట్లను అమ్ముకుంటూ.. బీసీలకు తీవ్ర అన్యాయం చేసిన వ్యక్తిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డబ్బున్న వారికే చంద్రబాబు రాజ్యసభ సీట్లు ఇస్తున్నారని ఆరోపించారు. సానా సతీశ్‌కు రాజ్యసభ సీటు ఇవ్వడం దారుణమన్నారు. బీసీ కులాల గొంతును చంద్రబాబు నొక్కేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు జగన్ సముచిత స్థానం కల్పించారని, చట్టసభల్లో గళం విప్పే అవకాశం కల్పించారని గుర్తు చేశారు.

### ఆర్.కృష్ణయ్య పార్టీలకు అమ్ముడుపోతున్నాడు

**ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ధ్వజం**



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పార్టీలకు అమ్ముడుపోతూ బీసీలను మోసగిస్తున్నాడని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ ధ్వజమెత్తారు. బీసీలంటే బిచ్చమెత్తుకునేవాళ్లా... అంటూ చట్టసభల్లో మాట్లాడిన ఆ వ్యక్తి పార్టీలను వీడుతూ మరో పార్టీలో చేరడం బిక్షం ఎత్తుకోవడం కాదా... అని ప్రశ్నించారు. మంగళవారం ఢిల్లీలో కేఏ పాల్ మీడియాతో మాట్లాడారు. 2014లో టీడీపీలో ఉన్న కృష్ణయ్యను ఆ తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్ పిలిచి మరీ రాజ్యసభ ఇచ్చారని గుర్తుచేశారు. బీసీల సమస్యలపై పోరాడాల్సిన కృష్ణయ్య ఇప్పుడు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరడం అత్యంత దుర్మార్గమన్నారు. కృష్ణయ్య ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ ఎన్నికల్లో ఓడిపోతుందన్నారు.

### బ్లడ్ బ్యాంక్ వాహనాల దుర్వినియోగంపై విచారణ

సాక్షి, అమరావతి: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) పరిధిలోని బ్లడ్‌బ్యాంక్ వాహనాలను దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. శాక్స్ పీడీగా రాజేంద్రకుమార్ ఉన్న 2023 డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో బ్లడ్‌బ్యాంక్ వాహనాలను ఆయుష్ మందుల రవాణాకు వినియోగించారన్న ఆరోపణలున్నాయి.

# ప్రశ్నిస్తే పనిపడతా!

**బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు**

- కేవీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం
- దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు
- ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు
- యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు

సాక్షి, అమరావతి : రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చంద్రబాబు ఇప్పుడు పార్టీలోని ఇద్దరు బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టారు. సుదీర్ఘ కాలం నుంచి తనకు బలమైన మద్దతుదారుగా ఉన్న సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలను జీర్ణించుకోలేక ప్రశ్నించడంతో ఆయనపైకి మరో సీనియర్ నేత, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను ఉసిగొల్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా టీడీపీ సోషల్ మీడియా కూడా యనమలకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయి ఆరోపణలతో ట్రోల్ చేస్తోంది. దీనికంతటికీ కాకినాడ పోర్టు వ్యవహారంలో చంద్రబాబు వైఖరికి విరుద్ధంగా యనమల రామకృష్ణుడు ఆయనకు లేఖ రాయడమే కారణం. కాకినాడ పోర్టుకు చెందిన కేవీ రావు చౌదరికి చంద్రబాబు మద్దతు పలుకుతూ రాజకీయంగా ఆయన్ను పావులా వాడుకుంటున్నారు. కానీ యనమల మాత్రం తాను రాసిన లేఖలో కేవీ రావు చౌదరి కాకినాడ సెజ్ భూముల ద్వారా వేల కోట్ల లబ్ధి పొందారని.. బీసీ, మత్స్యకార రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తనను ధిక్కరిస్తూ లేఖ రాయడంతో చంద్రబాబు.. యనమలను ప్రశ్నించకుండా ఇతర బీసీ నేతలను ఆయనపైకి ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే రెడ్డి సుబ్రహ్మణ్యం బహిరంగంగా యనమల రామకృష్ణుడిపై ఆరోపణలు గుప్పించారు. 40 ఏళ్లుగా యనమల బీసీల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు తనకు పదవి ఇవ్వలేదనే కారణంతో చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.




యనమల రామకృష్ణుడుపై సోషల్ మీడియాలో టీడీపీ నేత ఆగ్రహం

ఆయనకు తోడుగా మరికొందరు కింది స్థాయి నేతలు కూడా యనమలపై విమర్శలు చేశారు. టీడీపీ సోషల్ మీడియా అయితే యనమల పార్టీలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి ఆడేసుకుంటోంది.

### చంద్రబాబుకు తెలియకుండానే తిడతారా?

పార్టీలో తన స్థాయి ఉన్న ఒక సీనియర్ బీసీ నాయకుడిని, మరో సీనియర్ బీసీ నాయకుడు బహిరంగంగా తిట్టారంటే అందుకు చంద్రబాబు పరోక్ష అనుమతి కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యనమలకు వ్యతిరేకంగా పార్టీలోనే ఇంత జరుగుతున్నా, చంద్రబాబు స్పందించక పోవడాన్ని బట్టి ఆయన అభిమతం ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కొందరు బీసీ నేతలు యనమలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు ఆది నుంచి తోడు, నీడగా ఉన్న నాయకుడిని ఇలా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా పార్టీలోనే బీసీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడినా, చంద్రబాబు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల యనమల రామకృష్ణుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనలాంటి సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికితోడు కాకినాడ పోర్టు, సెజ్ విషయంలో కేవీ రావు చౌదరికి అనుకూలంగా వ్యవహరించడం, రాజ్యసభ స్థానాలను లాబీయిస్టులకు కట్టబెడుతుండడంతో తట్టుకోలేక ఆయన తొలిసారిగా చంద్రబాబును ధిక్కరించి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడం నుంచి చంద్రబాబుతో కలిసి పని చేసిన యనమల లాంటి నాయకుడు తిరుగుబాటు స్వరం వినిపించడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.




యనమల రామకృష్ణుడిని దూషిస్తూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్

## 3 రాజ్యసభ స్థానాలకు నామినేషన్లు దాఖలు

**సానా సతీష్, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య ఎన్నిక లాంఛనమే**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ సభ్యుల స్థానాలకు ఎన్డీయే కూటమి తరఫున ముగ్గురు అభ్యర్థులు మంగళవారం నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థులుగా బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌బాబు, బీజేపీ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్య నామినేషన్లు వేశారు. అసెంబ్లీ భవనంలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వనితా రాణికి వీరు నామినేషన్ పత్రాలు అందించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి రోజైన మంగళవారం సాయంత్రం వరకు మూడు స్థానాలకు మూడు మాత్రమే నామినేషన్లు దాఖలవడంతో వారి ఎన్నిక లాంఛనం కానుంది. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థుల తరఫున మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, పి.నారాయణ, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**నేను పార్టీలు మారలేదు... పార్టీలే నన్ను పిలిచాయి: ఆర్.కృష్ణయ్య**

నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ తాను ఎప్పుడూ పార్టీలు మారలేదని చెప్పారు. ఆయా రాజకీయ పార్టీలే తనను పిలిచి పదవులు ఇస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు 2014లో తనను తెలంగాణ టీడీపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ఎల్బీ నగర్ సీటు ఇచ్చారని, ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి రాజ్యసభ సీటు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు బీజేపీ పిలిచి మళ్లీ రాజ్యసభ సీటు ఇచ్చిందన్నారు. తాను ఆ పార్టీల్లోకి వెళ్లలేదని, తన వద్దకే ఆ పార్టీలు వచ్చాయని చెప్పారు. తాను ఏ పార్టీ కండువాలు వేసుకోలేదన్నారు. బీజేపీ తనకు కొత్త కాదని, తాను ఆ పార్టీలోనే పుట్టానని, హిందూ మతం తల్లిలాంటిదని పేర్కొన్నారు. సనాతనధర్మం తల్లి అని, బీసీలు అన్నదమ్ములని ఆయన చెప్పారు.

## రాజ్యసభ సీట్లు అమ్ముకున్న బాబు

- క్రిమినల్ 'సానా'కు సీటు ఇవ్వడం దారుణం
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు



అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్ బీసీలకు రాజ్యసభ సీట్లు ఇవ్వగా.. సీఎం చంద్రబాబు మాత్రం క్రిమినల్స్‌కు, ధన బలం ఉన్నవారికి అమ్ముకున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. మంగళవారం శ్రీకాకుళంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. సానా సతీశ్ అనే క్రిమినల్‌కు చంద్రబాబు రాజ్యసభ సీటు కేటాయించడం దారుణమన్నారు. సతీశ్‌పై సీబీఐ, ఈడీ కేసులున్నాయని చెప్పారు. హవాలా వ్యాపారి ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారం చేసిన కేసులో సీబీఐకే రూ.2 కోట్లు లంచం ఇచ్చానని చెప్పుకున్న వ్యక్తికి రాజ్యసభ సీటు ఇవ్వడం దారుణమన్నారు. అలాగే బీద మస్తాన్‌రావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి.. చంద్రబాబుకు డబ్బులిచ్చి సీటు కొనుక్కున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక.. సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి సర్కారు అక్రమ కేసులు పెట్టి నోరు నొక్కేయాలనుకోవడం దారుణమన్నారు. చంద్రబాబుకు ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని అన్నారు.

# 'సానా'కు శానా చేస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి



సానా సతీష్

తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ లాంటి సీనియర్ల పరిస్థితి ఏమిటని.. క్యాడర్‌కు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలని అడిగినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో, అంతకు ముందు.. పార్టీకి భారీగా నిధులు ఇచ్చిన వారికి ఇప్పుడు న్యాయం చేయక తప్పదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. లోకేశ్ పాదయాత్రలో సతీష్ లాంటి నేతలు చాలా ఉపయోగపడ్డారని, వారు డబ్బు ఖర్చు చేశారు కాబట్టే అధికారంలోకి వచ్చాక ప్రతిఫలం ఇస్తున్నామని స్పష్టం చేసినట్లు.. అంతటితో ఆగకుండా పార్టీలో కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు స్పందించిన తీరుతో సీనియర్ నాయకుల్లో ఇంకా ఆగ్రహం పెరిగిపోయింది. పార్టీ చంద్రబాబు చేతుల్లో లేదని, లోకేశ్ కోటరీ చేతుల్లో ఉందని చర్చించుకుంటున్నారు. లోకేశ్ కోటరీలో అత్యంత కీలకంగా ఉంటూ బదిలీలు, కాంట్రాక్టులు సహా అన్ని వ్యవహారాలను సానా సతీష్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో ఆయన పేరును రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించక తప్పలేదంటున్నారు.

**సబ్ ఇంజినీర్ నుంచి కోట్లకు పడగలెత్తి..**

➡ కాకినాడకు చెందిన సానా సతీష్ మొదట్లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజినీర్‌గా పని చేశారు. ఉద్యోగం వదిలేశాక అక్రమ వ్యాపారాలతో కోట్లు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మనీ లాండరింగ్, హవాలా కేసులు నమోదయ్యాయి. అలాంటి వ్యక్తి చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు.

➡ అక్రమంగా సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వారికి బాగా దగ్గరయ్యారు. లోకేశ్ పాదయాత్ర ఖర్చును చాలా వరకు సతీష్ భరించినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీగా డబ్బు సమకూర్చినట్లు తెలిసింది. చాలా వ్యవహారాల్లో లోకేశ్ వెన్నంటే ఉండి అన్నీ సమకూర్చినట్లు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా అవతరించారు.

➡ మంత్రి పదవులు, ఉన్నతాధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, కాంట్రాక్టులు ఇతర అనేక వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవి ఆయన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా కాకలు తీరిన సీనియర్ నేతలను కాదని రాజ్యసభ సీటునే తన్నుకుపోయారు.

**తీవ్ర ఆరోపణలు**

➡ సానా సతీష్‌పై మనీ లాండరింగ్ అభియోగాలుండడంతో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ కేసులకు సంబంధించి 2019 జూలైలో ఆయన్ను ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపింది.

➡ మనీ లాండరింగ్, హవాలా కేసుల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మీట్ వ్యాపారి మొయిన్ ఖురేషీతో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు తేలింది. ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారాలు కూడా చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే తనపై ఉన్న మనీ లాండరింగ్ కేసుల నుంచి తప్పించుకునేందుకు ఖురేషీ ద్వారా సీబీఐ అధికారులకు సతీష్ లంచం ఇచ్చినట్లు స్పష్టమైంది.

➡ అదే సమయంలో సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన రాకేష్ ఆస్థానా, మరో సీబీఐ అధికారి అలోక్ వర్మ మధ్య చిచ్చుపెట్టి.. ఏకంగా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర సతీష్‌ది. తనను కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు స్పష్టమవడంతో ఈడీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు.

➡ తనపై ఉన్న ఆరోపణలను కొట్టేయాలంటూ ఈ ఏడాది జూలైలో సానా సతీష్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా, దాన్ని కోర్టు కొట్టివేసింది. ఇలా తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని విచారించాల్సిందేనని స్పష్టం చేసింది.

## మిశ్రా కమిషన్ నియామకాన్ని రద్దు చేయండి

**హైకోర్టులో మల్లెల వెంకటరావు పిటిషన్**

సాక్షి, అమరావతి: ఎస్సీ వర్గీకరణపై అధ్యయనం కోసం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని, అందువల్ల ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకటరావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారించారు. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు మద్దతు తెలుపుతూ తమ వాదనలు వినిపించేందుకు వీలుగా పలువురు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్లపై కూడా ఆ రోజున నిర్ణయం తీసుకుంటానని న్యాయమూర్తి తెలిపారు.

## వచ్చేదంతా వాట్సాప్ గవర్నెన్స్

**ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

సాక్షి, అమరావతి: వచ్చేదంతా వాట్సాప్ గవర్నెన్స్ అని.. అందుకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ శాఖలు సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సీఎంవో సహా ఆర్టీజీఎస్‌కు చెందిన అధికారులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రియల్‌టైమ్‌లో సమాచారాన్ని సేకరించి మిగిలిన శాఖలతో అనుసంధానం కావాలన్నారు. అన్ని శాఖల సమాచారాన్ని ఆర్టీజీఎస్ సమీకృతం చేసి, మొత్తంగా పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. అంతిమంగా 'వాట్సాప్ గవర్నెన్స్' ద్వారా అత్యుత్తమ సేవలు అందించాలన్నారు. ప్రజలు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ వంటి అన్ని ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు వాట్సాప్‌ను వేదిక చేసుకునేలా వ్యవస్థను రూపొందించాలన్నారు. ప్రజల వినతులు స్వీకరించేందుకు ఏఐ, డీప్‌టెక్ వంటి టెక్నాలజీ సేవలు వినియోగించుకుని వేగంగా పరిష్కరించాలని సూచించారు. వినతుల పరిష్కార విధానం, ప్రజల సంతృప్తి స్థాయిలను ఆర్టీజీఎస్ పరిశీలించే ఏర్పాట్లు చేయాలన్నారు.

### విజువల్స్ ఇంటిగ్రేషన్

డ్రోన్లు, సీసీ కెమెరాలు, శాటిలైట్లు, ఐవోటీ డివైస్‌ల ద్వారా సేకరిస్తున్న విజువల్స్‌ను కూడా సమీకృతం చేయాల్సి ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గూగుల్ మ్యాప్‌ల ద్వారా పంట తెగుళ్లను గుర్తించి, రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను డ్రోన్ల ద్వారా అన్వేషించి, ప్రమాద స్థలాలను గుర్తించి ప్రమాదాలను నివారించాలన్నారు.

### ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి

ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు సీఎంకు వివరించగా.. ఎక్కడైనా అసంతృప్తి ఉంటే ఎందుకు వ్యక్తమవుతోందనే విషయాలను పరిశీలించి తక్షణం పరిష్కరించాలని చంద్రబాబు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సమాచార ప్రామాణికతను విశ్లేషించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు చెప్పగా.. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందా, లేదా అనేది సరిచూసుకోవాలని సీఎం కోరారు. ఆధార్ నంబంధిత సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు అవసరమైన మరో వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు రూ.20 కోట్ల నిధుల మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. వీలైనంతగా త్వరగా గ్రామ/వార్డు సచివాలయాల్లో వెయ్యి ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.

### ప్రత్యేక పోర్టల్‌లో భారీ ప్రాజెక్టుల ప్రగతి

రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని సీఎం కోరారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్‌టైమ్‌లో అప్డేట్ చేయాలన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందడంలో తలెత్తుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారంగా తీసుకువస్తున్న నూతన వెబ్ పోర్టల్‌ను జనవరి ఒకటో తేదీన ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టల్ కొనసాగాలన్నారు.

## గత సర్కారులోనే అన్ని సేవలు

- ఇందుకు వేదికైన గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ
- సొంతూళ్లలోనే 545 సేవలు పొందేలా సంస్కరణలు
- ఆ సేవలు ఇప్పుడే మొదలు పెడుతున్నట్లు కూటమి సర్కారు హడావుడి

సాక్షి, అమరావతి: గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఉన్న ఊళ్లలోనే ఏకంగా 545 సేవలు అందించేది. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లను నేరుగా వాట్సాప్ ద్వారా కూడా పంపించేది. ఇలా వాట్సాప్ వేదికగా ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజలకు అందజేసే విధానం గత ప్రభుత్వ హయాంలోనే మొదలైంది. దరఖాస్తుదారుడికి ఎప్పటికప్పుడు సమాచారం ఎస్ఎంఎస్‌తో పాటు వాట్సాప్ ద్వారా తెలియజేసే విధానం కూడా అప్పట్లోనే ప్రారంభమైంది. ప్రజలకు గడప వద్దనే ప్రభుత్వ సేవలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయం-వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో సాంకేతికతను వినియోగించడం నాలుగైదు ఏళ్ల క్రితమే రాష్ట్రంలో ప్రారంభమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వం రాకముందు పింఛన్ల మంజూరు వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగిపోయేలా తిరగాల్సి వచ్చేది. గత ఐదేళ్లలో ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో చేసుకునే విధానం మొదలైంది. సచివాలయాల్లోనే ఆధార్ సెంటర్లను కూడా ఏర్పాటు చేసింది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలకు అర్హత ప్రమాణాలు కూడా ఆన్‌లైన్ విధానంలోనే పరిశీలన చేసే సిక్స్ స్టెప్ వ్యాల్యుడేషన్ (ఆరు దశల పరిశీలన) ప్రక్రియను గత ప్రభుత్వమే ఆరంభించింది. ప్రత్యేకంగా తయారు చేసిన మొబైల్ యాప్ ద్వారానే ఆయా లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచే దరఖాస్తు పంపడం, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందినప్పుడు ఈ-కేవైసీ తీసుకునే తంతు కూడా సాగేది. అయితే ఈ సేవలన్నీ కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే వచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర నేతలు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. ఇది గత ప్రభుత్వ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నమేనని స్పష్టమవుతోంది.

## రాంగోపాల్ వర్మకు ముందస్తు బెయిల్

**సోషల్ మీడియా కేసుల్లో మంజూరు చేసిన హైకోర్టు**



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి పలు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైకోర్టు షరతులతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల చొప్పున పూచీకత్తు సమర్పించాలని వర్మను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనేపల్లి హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంగోపాల్ వర్మ గతేడాది 'వ్యూహం' సినిమా విడుదల సందర్భంగా ఆ పోస్టర్లను ట్విట్టర్‌లో పోస్టు చేశారని, ఇవి ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను అవమానపరిచేలా ఉన్నాయంటూ ప్రకాశం జిల్లా గార్లపాడుకు చెందిన ముత్తనపల్లి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంపై అనకాపల్లి జిల్లా రావికమతం పోలీసులు, గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కూడా వర్మపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులన్నింటిలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వర్మ హైకోర్టులో మూడు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ హరినాథ్ మంగళవారం విచారణ జరిపారు.

**రాజకీయ కారణాలతోనే కేసులు..**

వర్మ తరఫు న్యాయవాది రాజగోపాలవన్ తాయి వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కారణాలు, దురుద్దేశాలతోనే పోలీసులు ఈ కేసులు పెట్టారని చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ దర్యాప్తునకు సహకరించడం లేదని.. విచారణకు రావాలని కోరినా స్పందించడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ పిటిషనర్ రాంగోపాల్ వర్మకు ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. దర్యాప్తునకు వర్మ సహకరించకపోతే ముందస్తు బెయిల్ రద్దు కోసం చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవచ్చని పోలీసులకు న్యాయమూర్తి స్పష్టం చేశారు.

## ఇక ప్రీమియం మద్యం స్టోర్స్ దందా

- ఎల్లో సిండికేట్ ఎన్ని అడిగితే.. అన్ని ఇచ్చేలా నిర్ణయం
- అందుకే స్టోర్స్ సంఖ్యను స్పష్టం చేయని ప్రభుత్వం
- ప్రీమియం మద్యం స్టోర్స్‌కు అనుమతిస్తూ ఉత్తర్వులు
- చంద్రబాబు సర్కారు కొత్త సంవత్సరం కానుక



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో మద్యం దందాకు పూర్తిస్థాయిలో తెగించింది. ఇప్పటికే టీడీపీ నేతల సిండికేట్‌కు 3,396 ప్రైవేట్ మద్యం దుకాణాలను కట్టబెట్టిన ప్రభుత్వం తాజాగా కొత్త సంవత్సరం కానుకగా రాష్ట్రంలో ప్రీమియం మద్యం స్టోర్స్‌కు షట్టర్స్ తెరవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో నగర, పట్టణ ప్రాంతాల్లో ప్రీమియం మద్యం స్టోర్స్ విధానాన్ని మంగళవారం ప్రకటించింది. ఆ మేరకు ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. టీడీపీ ప్రభుత్వం సెప్టెంబర్‌లో ప్రకటించిన మద్యం విధానానికి తానే తూట్లు పొడుస్తూ మరింతగా ప్రీమియం మద్యం దందాకు తలుపులు బార్లా తెరవడం గమనార్హం. నగర, పట్టణ ప్రాంతాల్లో 12 ప్రీమియం మద్యం స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తన మద్యం విధానంలో తెలిపింది. కానీ.. మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ప్రీమియం మద్యం స్టోర్స్ సంఖ్యను ప్రకటించకపోవడం గమనార్హం. పైగా ఎక్సైజ్ కమిషనర్ అన్ని అంశాలను పరిశీలించి ఎప్పుడు.. ఎన్ని ప్రీమియం మద్యం స్టోర్స్ అవసరమని భావిస్తే అన్ని స్టోర్స్ ఏర్పాటు చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది. అంటే పరిమితి లేకుండా ప్రీమియం మద్యం స్టోర్స్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. టీడీపీ కూటమి పెద్దలు రాష్ట్రంలో ఎప్పుడు.. ఏ ప్రాంతంలో ప్రీమియం మద్యం స్టోర్స్ ఏర్పాటు చేయాలని భావిస్తే.. తదనుగుణంగా ఎక్సైజ్ శాఖ అనుమతి జారీ చేసేందుకు సదా సిద్ధంగా ఉంటుందన్నది అసలు లోగుట్టు. ఐదేళ్ల కాల పరిమితితో ప్రీమియం మద్యం స్టోర్స్‌కు ప్రభుత్వం లైసెన్సులు కేటాయిస్తుంది. వేలం ప్రక్రియ ద్వారా లైసెన్సులు కేటాయిస్తామని ప్రభుత్వం పేర్కొంది. అందుకు ఒక్కో స్టోర్‌కు రూ.15 లక్షలు నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలి. దరఖాస్తులు ఆన్‌లైన్, హైబ్రీడ్, ఆఫ్‌లైన్ విధానంలో స్వీకరిస్తారు. ప్రీమియం మద్యం స్టోర్ లైసెన్స్ దక్కించుకున్న వారు ఏడాదికి ఎక్సైజ్ శాఖకు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఈటీ)గా రూ.కోటి చెల్లించాల్సి ఉంటుంది. ఆర్ఈటీ ఏటా 20 శాతం పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది. ఒకట్రెండు రోజుల్లో వీటికి విడిగా నోటిఫికేషన్ జారీ చేయనుంది. జనవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో ప్రీమియం మద్యం స్టోర్స్ ప్రారంభం కానున్నాయి.

## క్లుప్తంగా...

### 'ఉపాధి' వేతనాల పర్యవేక్షణకు ప్రత్యేక సెల్

సాక్షి, అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నవారికి గరిష్ట వేతనాలు అందేలా చూసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వేజ్ మానిటరింగ్ సెల్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మంగళవారం విడుదల చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు గరిష్టంగా రూ.300 చొప్పున వేతనం చెల్లించాలని కేంద్రం నిర్ణయించింది. కానీ, ప్రస్తుతం సగటున రూ.225 చొప్పున మాత్రమే కూలీలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలు గరిష్ట వేతనం రూ.300 పొందేలా చూసేందుకు ఏపీ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి కో–ఆర్డినేటర్‌గా రాష్ట్రస్థాయి వేజ్ మానిటరింగ్ సెల్, డ్వామా పీడీలు లేదా జిల్లా విజిలెన్స్ అధికారులు కో–ఆర్డినేటర్లుగా జిల్లా స్థాయి వేజ్ మానిటరింగ్ సెల్స్ పని చేస్తాయని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

### కార్మికుల భద్రతకు ప్రాధాన్యం: మంత్రి వాసంశెట్టి



సాక్షి, అమరావతి: కార్మికుల భద్రత, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు వసుధా మిశ్రా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ త్వరలోనే నివేదిక అందజేసే అవకాశముందని వెల్లడించారు. అమరావతి, కర్నూలు, నెల్లూరుల్లో ఈఎస్‌ఐ ఆస్పత్రుల ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందన్నారు.

### లబ్ధిదారులను ఎంపిక చేయండి

మంత్రి పార్థసారథి



సాక్షి, అమరావతి: పీఎంఏవై–2.0 పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వంతో ఎంవో యూ పూర్తయిన క్రమంలో లబ్ధిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఒక మోడల్ కాలనీ అభివృద్ధి చేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణంపై మంగళవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల కాలనీలలో శాశ్వత మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

### 62.30లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

మంత్రి నాదెండ్ల



సాక్షి, అమరావతి: దీపం–2 పథకంలో భాగంగా మహిళలకు 62.30లక్షల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 80.37లక్షల సిలిండర్లు బుక్ చేసుకుంటే 62.30లక్షల సిలిండర్లు పంపిణీ చేసి రూ.463.81 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. లబ్ధిదారులు సమస్యలుంటే 1967 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# ఏపీ తీరం... 1,027.58 కి.మీ.

**భారతదేశ తీర రేఖ పొడవు 11,098.81 కి.మీ.**

- కేంద్ర జలసంఘం తాజా అధ్యయనంలో వెల్లడి
- గత అధ్యయనం ప్రకారం దేశ తీర రేఖ పొడవు 7,516.6 కి.మీ.
- ఎక్కువ తీర ప్రాంతం కలిగిన రాష్ట్రాల్లో గుజరాత్ ఫస్ట్
- రెండో స్థానానికి చేరిన తమిళనాడు.. మూడో స్థానంలో ఏపీ
- కేంద్ర పాలిత ప్రాంతాల్లో తొలి స్థానంలో అండమాన్ నికోబార్ దీవులు
- తీర ప్రాంతం అత్యధికంగా కోతకు గురవుతున్న రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ ఫస్ట్
- నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- రాష్ట్రంలో కోతకు గురైన తీర ప్రాంతం 272.34 కి.మీ.



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తీర రేఖ పొడవు ఎన్ని కిలో మీటర్లు అని అడిగితే... 973.7 కిలో మీటర్లు అని వెంటనే చెప్పేస్తారు. కానీ.. అది గతం.. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఏపీ తీర రేఖ పొడవు 1,027.58 కిలో మీటర్లు అని తేల్చింది. గత అధ్యయనం ప్రకారం దేశ పశ్చిమ, తూర్పు తీర రేఖ పొడవు 7,516.6 కిలో మీటర్లు కాగా.. తాజాగా నిర్వహించిన అధ్యయనంలో అది 11,098.81 కిలో మీటర్లుగా తేలింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దేశంలో తీర ప్రాంతంపై సీడబ్ల్యూసీ విస్తృతంగా అధ్యయనం చేసి పలు కీలక విషయాలు వెల్లడించింది.

### 2,31,831 కిలో మీటర్ల మేర కోత

- దేశంలో ఇప్పటికే 2,318.31 కిలో మీటర్ల పొడవునా తీరం కోతకు గురైందని కేంద్ర జలసంఘం తేల్చింది. మరో 1,855.02 కిలో మీటర్ల పొడవునా తీర ప్రాంతం కోతకు గురవుతోంది. పశ్చిమ బెంగాల్‌లోని తీర ప్రాంతం అధికంగా కోతకు గురవుతోంది. తీర ప్రాంతం ఎక్కువగా కోతకు గురవుతున్న రాష్ట్రాల్లో ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.
- మన రాష్ట్రంలో ఇప్పటికే 272.34 కిలో మీటర్ల పొడవున తీర ప్రాంతం కోతకు గురైంది. మరో 434.26 కిలో మీటర్ల పొడవున తీర ప్రాంతం కోతకు గురవుతోంది. 320.98 కిలో మీటర్ల పొడవున తీర ప్రాంతం కోతకు గురికాకుండా సురక్షితంగా ఉంది. తూర్పు గోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో తీర ప్రాంతం అధికంగా కోతకు గురైంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఉప్పాడ ప్రాంతంలో తీర రేఖ అధికంగా కోతకు గురైంది.
- వాతావరణ మార్పుల వల్ల సముద్రపు నీటి మట్టం పెరగడం, అలల ఉధృతి తీవ్రమవడం, తుపానులు, అధిక ఉధృతితో నదులు ప్రవహించడం వల్ల సముద్ర తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సహజసిద్ధంగా ఏర్పడిన మడ అడవులను నరికివేయడం, పగడపు దిబ్బలను తవ్వేయడం, సముద్రం నాచును తొలగించడం వల్ల తీర ప్రాంతం భారీ ఎత్తున కోతకు గురికావడానికి దారితీస్తోంది.
- తీర ప్రాంతం అధికంగా కోతకు గురవుతుండటం వల్ల ఉప్పు నీరు చొచ్చుకొస్తోంది. దీంతో తీర ప్రాంతం ఉప్పు నీటి కయ్యలుగా మారుతోంది. తీరం కోతకు గురవడం వల్ల ఆ ప్రాంతంలో నివసించే ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.
- తీర ప్రాంతం కోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టకపోతే ఉత్పాతాలు తప్పవని, మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీడబ్ల్యూసీ హెచ్చరించింది. సీ–వాల్(తీరానికి వెంబడి గోడ) నిర్మించడం, రాళ్లతో రివిట్‌మెంట్ చేయడం ఇతర రక్షణ చర్యల ద్వారా, తీర ప్రాంతం కోతకు గురికాకుండా రక్షించవచ్చని సూచించింది. ఏపీలోని ఉప్పాడ ప్రాంతంలో తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీ ప్రతిపాదించింది.

### రాష్ట్రంలో జిల్లాల వారీగా తీర రేఖ పొడవు, కోతకు గురవుతున్న తీర ప్రాంతం వివరాలు



| ఉమ్మడి జిల్లా | తీర రేఖ పొడవు | కోతకు గురైన తీర ప్రాంతం | కోతకు గురవుతున్న తీర ప్రాంతం | కోతకు గురికాని తీర ప్రాంతం (కిమీలలో) |
|---|---|---|---|---|
| 1.నెల్లూరు | 172.10 | 50.24 | 71.5 | 50.36 |
| 2.ప్రకాశం | 107.18 | 23.30 | 64.18 | 19.70 |
| 3.గుంటూరు | 64.24 | 2.56 | 52.14 | 9.54 |
| 4.కృష్ణా | 133.36 | 55.121 | 60.38 | 17.86 |
| 5.పశ్చిమగోదావరి | 17.98 | 7.22 | 9.72 | 1.04 |
| 6.తూర్పుగోదావరి | 189.84 | 79.3 | 84.94 | 25.60 |
| 7.విశాఖపట్నం | 136.98 | 14.94 | 19.3 | 102.74 |
| 8.విజయనగరం | 32.78 | 11.96 | 18.28 | 12.54 |
| 9.శ్రీకాకుళం | 173.12 | 27.7 | 63.82 | 81.60 |
| మొత్తం | 1027.58 | 272.34 | 434.26 | 320.98 |

### సీడబ్ల్యూసీ అధ్యయనంలో వెల్లడైన ప్రధాన అంశాలు ఇవీ..

- దేశంలో తీర ప్రాంతం పశ్చిమాన గుజరాత్‌లోని కచ్ ప్రాంతం నుంచి ప్రారంభమై... తూర్పున పశ్చిమ బెంగాల్‌లోని సుందర్ బన్స్ వద్ద ముగుస్తుంది. తీర ప్రాంతం తొమ్మిది రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లతోపాటు నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలు డయ్యూ–డామన్, లక్షద్వీప్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులలో విస్తరించింది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 15 శాతం తీర ప్రాంతంలో నివసిస్తున్నారు. ముంబయి, కోల్‌కతా, చెన్నై, విశాఖపట్నంతోపాటు 70 నగరాలు, పట్టణాలు తీర ప్రాంతంలో వెలిశాయి.
- తీర రేఖ పొడవు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలిచింది. గత అధ్యయనం ప్రకారం గుజరాత్ తీర రేఖ పొడవు 1,214.7 కిలో మీటర్లు కాగా... తాజా అధ్యయనం ప్రకారం 2,340.62 కిలో మీటర్లకు పెరిగింది.
- ఇప్పటి వరకు తీర రేఖ పొడవు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉండేది. తాజా అధ్యయనం ప్రకారం తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు తీర రేఖ పొడవు 1,068.69 కిలో మీటర్లు.
- ప్రస్తుతం తీర రేఖ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. గతంలో ఆంధ్రప్రదేశ్ తీర రేఖ పొడవు 973.7 కిలో మీటర్లు. ప్రస్తుతం అది 1,027.58 కిలో మీటర్లకు పెరిగింది.
- రాష్ట్రంలో తీర రేఖ పొడవు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి (189.84 కి.మీ.) మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో శ్రీకాకుళం (173.12 కి.మీ.), మూడో స్థానంలో నెల్లూరు (172.10 కి.మీ.) ఉన్నాయి.

# రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా?

## కాకినాడ సెజ్‌లో ఎవరు ఉంటే మాకేంటి?.. రైతులకు న్యాయం జరగడమే కావాలి

- జగన్ ప్రభుత్వం 90 శాతం రైతులకు భూములు తిరిగిచ్చింది
- ఆ లేఖలో ఆంతర్యం ఏమిటో యనమలకే తెలియాలి
- మండలిలో విపక్ష నేత బొత్స



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? అనే అనుమానం కలుగుతోందని శాసన మండలిలో విపక్ష నేత, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్త బొత్స సత్యనారాయణ అన్నారు. కాకినాడ పోర్టు, కాకినాడ ఎస్‌ఈజెడ్‌లలో కేవీ రావు చౌదరి... అరబిందో .. ఎవరు ఉంటే తమకేమిటని ఆయన ప్రశ్నించారు. తాము కోరుకునేది బాధిత రైతులకు న్యాయం జరగడం ఒక్కటేనని స్పష్టంచేశారు. బొత్స సత్యనారాయణ మంగళవారం కాకినాడలో విలేకరులతో మాట్లాడారు. కాకినాడ సెజ్ భూ సేకరణ ప్రారంభించినప్పుడు టీడీపీ నేత యనమల రామకృష్ణుడే ఆర్థిక మంత్రిగా ఉన్నారని బొత్స గుర్తుచేశారు. అప్పుడేమీ మాట్లాడకుండా ఇప్పుడు లేఖ రాయడంలో ఆంతర్యం ఏమిటో యనమలకే తెలియాలన్నారు. తమ నాయకుడు, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం 2,160 ఎకరాలను రైతులకు తిరిగి ఇచ్చే ప్రక్రియ ప్రారంభించి, అధికారంలో ఉండగానే దాదాపు 90 శాతం పూర్తి చేశారని చెప్పారు. సాంకేతిక ఇబ్బందులతో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కొద్దిపాటి భూములకు రిజిస్ట్రేషన్ పూర్తిచేసి రైతులకు తిరిగి అప్పగించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. 'ఏ విషయంలోనైనా మేం తప్పు చేసి ఉంటే.. అధికారంలో ఉన్నది మీరే కాబట్టి చర్యలు తీసుకోవాలి' అని బొత్స సవాల్ విసిరారు. సొంత పార్టీ మంత్రిపై నమ్మకం లేకనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలకు వచ్చినట్టుగా ఉందని బొత్స ఎద్దేవా చేశారు. ఏదైనా శాఖలో తప్పు జరిగితే ఆ బాధ్యత మంత్రిది కాదా..? అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పైసా కూడా పెంచబోమని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు... గద్దెనెక్కాక మాట మార్చి ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలపై భారం పడకుండా కూటమి ప్రభుత్వమే రూ.15 వేల కోట్లను డిస్కంలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డిస్కంలకు రూ.45 వేల కోట్లు చెల్లించి, ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు విశాఖ వచ్చిన ఒక షిప్‌లో కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ ఉన్నాయంటూ హడావుడి చేసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీశారని బొత్స మండిపడ్డారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఏ స్థాయిలో బురద చల్లారో ప్రజలకు గుర్తుందన్నారు. ఆ షిప్‌లో డ్రగ్స్ లేవనే విషయాన్ని దర్యాప్తు సంస్థలు ఇప్పుడు తేల్చడం చూస్తుంటే వ్యవస్థలను ఏ స్థాయిలో మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతోందన్నారు. కొందరు ఎమ్మెల్సీలు అమ్ముడుపోయి, అనర్హులుగా ప్రకటించండని అడుగుతున్న తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యమంటే ఇదా.. అనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రులు దాడిశెట్టి రాజ, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనూరాధ, జెడ్పీచైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

### విశాఖలో బియ్యం టీడీపీ నాయకుడివి కాదా?

తాజాగా విశాఖలో మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టుకున్న బియ్యం టీడీపీ నాయకుడివి కాదని చెప్పగలరా..? అని బొత్స ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం చేతగానితనం అన్ని విషయాల్లో బయటపడిందని విమర్శించారు. సంపద సృష్టిస్తామంటే ప్రజలను దోచుకు తినడమా.. అని బొత్స ఆగ్రహం వ్యక్తంచేశారు.

# లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి

## పెళ్లయిన 50 రోజులకే ఆత్మహత్య

- లోన్ యాప్ ద్వారా రూ.2 వేలు తీసుకున్న యువకుడు
- ఆ మొత్తం చెల్లించినా.. ఇంకా కట్టాలంటూ యువకుడి ఫొటోలు మార్ఫింగ్
- వాటిని నవ వధువు, ఆమె బంధువులకు పంపించిన యాప్ నిర్వాహకులు
- అవమానం తట్టుకోలేక తనువు చాలించిన యువకుడు



నరేంద్ర(ఫైల్)

అల్లిపురం (విశాఖ): లోన్ యాప్ వేధింపులకు విశాఖ నగరంలో ఓ యువకుడు బలైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. మహారాణిపేట సీఐ బి.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. అంగడిదిబ్బ ప్రాంతానికి చెందిన సూరాడ నరేంద్ర తన భార్య అఖిలాదేవి, తల్లి, తండ్రితో కలసి జీవిస్తున్నాడు. ఇతనికి వివాహమై సుమారు 50 రోజులైంది. సముద్రంలో వేటకు వెళ్లి వస్తుంటాడు. భార్య అఖిల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. ఇంటి అవసరాల నిమిత్తం నరేంద్ర ఆన్‌లైన్ యాప్‌లో రూ.2 వేలు రుణం తీసుకున్నాడు. ఆ మొత్తం చెల్లించేశాడు. కానీ.. రుణం తిరిగి చెల్లించాలంటూ లోన్ యాప్ నిర్వాహకులు అఖిల సెల్‌ఫోన్‌కు నరేంద్ర, అఖిల ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి పంపించారు. లోన్ తక్షణమే తీర్చకపోతే వాటిని ఇతరులకు సైతం పంపిస్తామని బెదిరించారు. ఇంటికి వచ్చిన తరువాత నరేంద్రను అఖిల ఈ విషయం అడగ్గా.. ఇంటి అవసరాల నిమిత్తం తీసుకున్నట్టు చెప్పాడు. తర్వాత అఖిల ఆస్పత్రిలో డ్యూటీకి వెళ్లిపోయింది. రాత్రి 8 గంటల సమయంలో అఖిల అత్త ఫోన్‌చేసి నరేంద్ర తలుపులు తీయటం లేదని చెప్పటంతో ఇంటికి చేరుకుంది. తలుపులు కొట్టినా ఎంతకీ తీయక పోవటంతో పక్కనే ఉన్న కిటికీ లోంచి చూడగా.. నరేంద్ర గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. దీంతో తలుపులు విరగ్గొట్టి నరేంద్రను కిందికి దించి కేజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు.

### నిందితుల కోసం ప్రత్యేక బృందం

యువకుడి మరణానికి కారణమైన లోన్ యాప్ నిర్వాహకులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, మహిళలను అవమానించడం, నేరపూరిత బెదిరింపు, మరొకరి గుర్తింపును మోసపూరితంగా ఉపయోగించడం, ఎలక్ట్రానిక్ రూపంలో లైంగిక, అసభ్యకరమైన విషయాలను ప్రచురించడం, ప్రసారం చేయడం తదితర నేరాలపై బీఎన్ఎస్ 108, 79, 351(2), ఐటీ యాక్ట్ సెక్షన్ 66 (సి), 67(ఎ) కింద కేసు నమోదు చేశామని తెలిపారు. మృతుని మొబైల్ ఫోన్‌ను పరిశీలించి నేరస్తులను గుర్తించేందుకు సైబర్ నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

# మంచు కుటుంబంలో మంటలు!

సాక్షి, హైదరాబాద్/పహాడీ షరీఫ్: సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో గొడవలు మంగళవారం తారస్థాయికి చేరాయి. హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం 'మంచు టౌన్'వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు హైడ్రామా నడిచింది. ఓవైపు పోలీసులు, మరోవైపు వ్యక్తిగత బౌన్సర్ల మోహరింపు.. తోపులాటలు.. దూషణలు.. మీడియా ప్రతినిధులపై దాడితో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.

### విష్ణు ఇన్... మనోజ్ ఔట్...

దుబాయ్ నుంచి 'మంచు టౌన్'కు తిరిగి వచ్చిన మోహన్‌బాబు పెద్ద కుమారుడు విష్ణు తొలుత తన సోదరుడు మనోజ్‌తో ఇటీవలి పరిణామాలపై చర్చించారు. అయితే ఆ చర్చలు సఫలం కాకపోవడంతో ఇంటిని అధీనంలోకి తీసుకొని మనోజ్, ఆయన భార్య మౌనిక, వారి సిబ్బంది, బౌన్సర్లను బలవంతంగా బయటకు పంపించేశారు. ఈ నేపథ్యంలో ఆయా బౌన్సర్ల మధ్య వాగ్వాదం, తోపులాట, ఘర్షణలు జరిగాయి. ఆ ఇల్లు మోహన్‌బాబు పేరిట ఉండటంతో అక్కడ ఉన్న పోలీసులు ఏమీ చేయలేకపోయారు.

### పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న మనోజ్...

తనపై దాడి జరిగిందని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా తనకు రక్షణ కల్పించకుండా పహాడీషరీఫ్ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. తాను ఆస్తి, డబ్బు కోసం పోరాటం చేయట్లేదని.. ఆత్మగౌరవం, భార్యాపిల్లల రక్షణ కోసం పోరాడుతున్నానన్నారు. ఈ విషయంలో న్యాయం కోసం ప్రపంచంలో ఎవరినైనా కలుస్తానంటూ వ్యాఖ్యానించారు. అనంతరం శాంతిభద్రతల అదనపు డీజీ మహేష్ భగవత్‌తోపాటు ఇంటెలిజెన్స్ డీజీ బి. శివధర్‌రెడ్డిని సతీసమేతంగా వెళ్లి వేర్వేరుగా కలిశారు. తనకు అన్యాయం జరుగుతోందని.. న్యాయం చేయాలని.. రక్షణ కల్పించాలని కోరారు. మరోవైపు సోమవారం మనోజ్, మోహన్‌బాబు ఇచ్చిన పరస్పర ఫిర్యాదులపై వేర్వేరు కేసులు నమోదు చేసిన పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు కోసం 'మంచు టౌన్'కు వెళ్లారు. మోహన్‌బాబు నుంచి వాంగ్మూలం నమోదు చేశారు.



ఇంటి గేట్ బయట మనోజ్, మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మోహన్‌బాబు, ఇంటి లోపల విష్ణు

### సాయంత్రానికి హీటెక్కిన వాతావరణం...

మోహన్‌బాబు, విష్ణు తమ అనుచరులతో కలిసి మనోజ్ దంపతుల సామగ్రిని బయటకు తరలించడానికి రెండు వాహనాలను సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మనోజ్, మౌనిక తిరిగి 'మంచు టౌన్'కు వెళ్లారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది గేట్లు తెరవకపోవడంతో తన ఏడు నెలల పాప ఇంట్లో ఉందంటూ వారితో మనోజ్ వాగ్వాదానికి దిగారు. బలవంతంగా గేట్లు తెరుచుకుని లోపలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీసులు మంచు టౌన్ వద్ద అదనపు బలగాలను మోహరించారు. అక్కడి నుంచి బౌన్సర్లను బయటకు పంపారు. ఈలోగా మోహన్‌బాబు తన చిన్నకుమారుడి తీరును ఆక్షేపిస్తూ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అనంతరం గేటు బయటకు వచ్చి అక్కడున్న మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఒక జర్నలిస్టు గాయపడ్డాడు. దాడిని ఖండించిన జర్నలిస్టులు.. మోహన్‌బాబు క్షమాపణ చెప్పాలంటూ అక్కడే ధర్నా చేశారు. మరోవైపు మోహన్‌బాబు కాలికి గాయం కావడంతో విష్ణు ఆయన్ను గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఉదంతంలో గాయపడ్డ జర్నలిస్టును పోలీసులు శంషాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, టీవీ9 విలేకరి రంజిత్ ఫిర్యాదు మేరకు మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### నేడు పోలీసుల ఎదుటకు..

మోహన్‌బాబు, ఆయన కుమారులను బుధవారం ఉదయం 10:30 గంటలకు స్వయంగా తన ఎదుటహాజరుకావాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు నోటీసులు జారీ చేశారు. అలాగే ముగ్గురి తుపాకులతోపాటు రూ.లక్ష చొప్పున పూచికత్తు సమర్పించాలని ఆదేశించారు.

## గారాబంగా పెంచిన నా గుండెలపై తన్నావు

### మనోజ్‌ను ఉద్దేశించి ఆడియో సందేశంలో మోహన్ బాబు

సాక్షి, హైదరాబాద్: కుటుంబ తగాదాను రచ్చకీడ్చావంటూ చిన్న కుమారుడు మంచు మనోజ్‌పై మోహన్‌బాబు మండిపడ్డారు. మనోజ్ ప్రవర్తన మొదలు, ఆస్తుల పంపకం వరకు వివిధ అంశాలపై తన అభిప్రాయాలను తెలియజేస్తూ ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అది సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**ఆడియో సందేశంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..**

'నువ్వు నీ భార్య మాటలు విని తాగుడుకు అలవాటు పడ్డావు. గారాబంగా పెంచిన నా గుండెలపై తన్నావు. ఆస్తులు ముగ్గురికీ సమపాళ్లు ఇస్తానా.. గంగపాలు చేస్తానా.. దానధర్మాలు చేస్తానా అనేది నా వ్యక్తిగతం. అది నా కష్టార్జితం. ఇంట్లో పనిచేసే వాళ్లను ఎందుకు కొడుతున్నావ్? పొట్టకూటి కోసం వచ్చిన వారిని కొట్టడం మహాపాపం. సినీ పరిశ్రమలో మోహన్‌బాబు పరుషంగా ఉంటాడేమో కానీ ఇంట్లో అలా కాదు. గతంలో ఇలాంటి పొరపాట్లు జరిగాయి. బయటకు వెళ్లావు.. మళ్లీ చేయనని వచ్చావు. నీ భార్య, నువ్వు, మీ అమ్మ... ఇలాంటి పొరపాట్లు చేయమని చెబితే ఇంట్లోకి ఆహ్వానించా. కానీ ఈ విషయం ప్రజలు నమ్ముతారో లేదో. విద్యాసంస్థల బ్యాంకు లావాదేవీల్లో ఏమైనా అవకతవకలు జరిగితే అందుకు అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఉంది లేదా ప్రభుత్వ విభాగాలు ఉన్నాయి. మన విద్యాసంస్థలను ప్రపంచ ఖ్యాతికి తీసుకువెళ్లడానికి విష్ణు తీవ్రంగా కృషి చేశాడు. విద్యాసంస్థలను అభివృద్ధి చేయడానికి వినయ్ అనే వ్యక్తి వస్తే నువ్వు అతనిపై చేయి చేసుకోవడం ఎంత వరకు సబబు? మీ నాన్నకు ఎవరైనా సహాయం చేయడానికి వస్తే వాళ్లను అడ్డుకుంటున్నావ్. ఇది ఎంతవరకు సబబు అని అడుగుతున్నా? వినయ్, నీకు మధ్య జరిగిన గొడవలో మీ అన్న విష్ణు అడ్డుపడితే అతన్ని కూడా కొట్టడానికి సిద్ధపడ్డావ్'అని మోహన్‌బాబు ఆరోపించారు.


# నిర్మలా సీతారామన్‌తో విజయసాయిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఫ్లోర్ లీడర్, ఎంపీ వి.విజయసాయి రెడ్డి భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని నార్త్‌బ్లాక్ కార్యాలయంలో సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ పనులపై ఆయన చర్చించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను త్వరితగతిన ఇవ్వాలని విజయసాయి రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు.

# 2023-24లో ఏపీ జీఎస్‌డీపీ పెరిగింది

## రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీల ప్రశ్నలకు కేంద్రం సమాధానం




సాక్షి, న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నివేదిక ప్రకారం 2018–19 కంటే 2023–24 ఏడాదిలో జీఎస్‌డీపీ పెరిగిందని కేంద్ర ఆర్థిక సహాయ కార్యదర్శి పంకజ్ చౌదరి తెలిపారు. 2018–19లో రూ.7.9లక్షల కోట్లు ఉంటే 2023–24 నాటికి 12.91లక్షల కోట్లకు పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. 2023–24లో 4.31లక్షల కోట్లతో 12.97శాతం వృద్ధిరేటు సాధించిన విషయంపై ప్రశ్నిస్తూ.. ఆ వివరాలను తెలపాలని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ కార్యదర్శి పంకజ్ చౌదరి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

### రాష్ట్ర ప్రభుత్వ జీఎస్టీ కౌన్సిల్‌పై నిర్ధేశిస్తారు..


జీఎస్టీ రేట్లు, మినహాయింపులు అనేవి రాష్ట్ర ప్రభుత్వ జీఎస్టీ కౌన్సిల్ యొక్క సిఫార్సులపై నిర్దేశిస్తారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ కార్యదర్శి పంకజ్ చౌదరి తెలిపారు. వైద్య పరికరాలు, రోగనిర్ధారణలపై ప్రస్తుతం విధిస్తున్న 18శాతం జీఎస్టీ నుంచి 5శాతానికి తగ్గిస్తారా అంటూ రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

### ఎరువులు నిత్యావసర వస్తువులే..



ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్–1955 ప్రకారం ఎరువులు నిత్యావసర వస్తువులుగా ప్రకటించారని కేంద్ర రసాయనాలు, ఎరువుల సహాయక మంత్రి అనుప్రియ పాటిల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

### రసాయనాల రంగాల్లో ప్రమాదాలను తగ్గించేందుకు కృత్రిమ మేధస్సు




పెట్రోకెమికల్ పరిశ్రమ యొక్క ప్రకృతి దృశ్యాన్ని మార్చగల సామర్థ్యం కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి వాటికి ఉన్నాయని కేంద్రసహాయ మంత్రి అనుప్రియ పాటిల్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.



## బాధ్యతలు స్వీకరణ

చిలకలపూడి: కృష్ణాజిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను ఎస్.వి. మోహనరావు స్వీకరించారు. కలెక్టర్ డీకే బాలాజీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 583.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.



## దుర్గమ్మకు బంగారు గాజులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లికి చెందిన హర్షిత్‌కుమార్ పెదర్ల కుటుంబం 11.5 గ్రాముల బంగారు గాజులను మంగళవారం కానుకగా సమర్పించింది.

## న్యూస్‌రీల్

### నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ మొగల్రాజపురానికి చెందిన పసుమల్లి శ్రావణి, ఓం ప్రకాష్ కుటుంబం మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

### ఉర్దూ పాఠశాల తనిఖీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని ఉర్దూ పాఠశాలను మంగళవారం నేషనల్ మైనార్టీ కమిషన్ సభ్యుడు సయ్యద్ షహజాది ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలను తనిఖీ చేసిన వారిలో సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షేక్ షేరీన్ బేగం, ఉమ్మడి కృష్ణా జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి అబ్దుల్ రబ్బాని, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

### అంబాసిడర్లుగా స్ఫూర్తి నింపాలి

గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమలుకు అంబాసిడర్లుగా ప్రజల్లో స్ఫూర్తి నింపి, లబ్ధిదారులుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సచివాలయ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. తొలుత ఏపీసీపీడీసీఎల్ అధికారులు కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలు, ప్రయోజనాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తొలుత పథకం కింద లబ్ధి పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం తమ పరిధిలోని ప్రజలకు పథకంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, నోడల్ అధికారి ఎం.భాస్కర్ పాల్గొన్నారు.

### చెక్ పోస్ట్ వద్ద నిఘా పెంచాలి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌ను, గరికపాడు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శర్మతో కలిసి మంగళవారం సందర్శించారు. తెలంగాణ నుంచి అక్రమంగా వచ్చే మద్యాన్ని నియంత్రించడంలో కట్టుదిట్టంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే చెక్‌పోస్టు వద్ద నిఘాను పెంచాలని ఎక్సైజ్ అధికారులకు వారు సూచించారు. మద్యం అమ్మకాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎక్సైజ్ డీసీ శ్రీనివాస్, ఏఈఎస్ స్థానిక అధికారులు ఉన్నారు.

### స్కేటింగ్ పోటీల్లో జంక్షన్ చిన్నారికి స్వర్ణం



అన్విత

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన చిన్నారి అన్విత జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. డాక్టర్ పోలవరపు కల్యాణ చక్రధర్, డాక్టర్ స్వరాజ్యం దంపతుల కుమార్తె అన్విత ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూరులో ఇన్‌లైన్ హాకీ కేడెట్స్ ఆధ్వర్యంలో జరిగిన 62వ నేషనల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటింది. అండర్-11 కేటగిరీలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

# పొమ్మనలేక పొగ!

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై సర్కారు చిన్నచూపు

- విద్యార్హతలు, సామర్థ్యాన్ని బట్టి కాక ఇష్టానుసారంగా విధులు
- వలంటీర్ల విధులన్నీ ఉద్యోగులకు కేటాయింపు
- ప్రధానంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై తీవ్ర పని ఒత్తిడి
- అవమానాలు, ఛీత్కారాల మధ్య భారంగా విధులు



ఏక కాలంలో లక్షన్నర ప్రభుత్వ ఉద్యోగాలు.. అది కూడా తామున్న ప్రాంతంలోనే.. విద్యార్హతలు, సామర్థ్యాన్ని బట్టి విధులు.. జీవితం మూడు పువ్వులు.. ఆరు కాయలు.. ఇది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరిస్థితి.
సీన్ కట్ చేస్తే.. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు వీరిని పొమ్మనలేక పొగ పెడుతున్నట్లుగా వ్యవహరిస్తోంది. తీవ్రమైన పని ఒత్తిడి, అవమానాల నడుమ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల తిప్పలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

గుడ్లవల్లేరు: కూటమి సర్కారు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను చిన్న చూపు చూస్తోంది. వారి విద్యార్హతలు, సామర్థ్యాన్ని బట్టి కాక ఇష్టానుసారంగా విధులు కేటాయిస్తూ వారితో చెడుగుడు ఆడుకుంటోంది. ముఖ్యంగా జిల్లాలో 310 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్(ఈఏ)లు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వీరికి ఒక ఉద్యోగానికి జీతం ఇచ్చి.. వంద రకాల పనులను చేయిస్తూ.. కనీస ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీని కారణంగా పలు అభివృద్ధి పనులపై వీరు క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఉంచలేకపోతున్నారు. ఫలితంగా నిబంధనలు పక్కదారి పట్టించి, అధికార పార్టీల నేతలు తమ పబ్బం గడుపుకునేందుకు పావులు కదుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**జల్‌జీవన్ బాధ్యత..**

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన రూ.50.19 కోట్ల విలువైన పనుల బాధ్యతను ఈఏలకే అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఈల కొరత అధికంగా ఉండేసరికి పూర్తిగా జిల్లాలోని ఈ పనులపై ఇంజినీరింగ్ పర్యవేక్షణ బాధ్యతలను ఈఏలే చూస్తున్నారు.

**రోడ్ల పనులు కూడా..**

జాతీయ ఉపాధి హామీ నిధులతో పల్లె పండుగ పేరిట జిల్లాలో సంక్రాంతికి పూర్తి చేయాలని లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉపాధి నిధులు రూ.15,537.59లక్షలతో 1,964పనులను చేపట్టవలసి ఉంది. కేవలం 30శాతం పనులనే పూర్తి చేసినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ రోడ్ల నిర్మాణాల పనులను సైతం పీఆర్ ఏఈలు ఉన్నా.. గ్రామాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లే చూస్తున్నారు.

**హౌసింగ్‌లో సైతం..**

గత వైఎస్సార్ సీపీ పాలనలో జిల్లాకు 88,438 ఇళ్లు మంజూరయ్యాయి. జిల్లాలోని హౌసింగ్ ఏఈలు దాదాపుగా రిటైర్‌మెంట్ అయిపోయి నలుగురే మిగిలారు. ఆ ఏఈల స్థానంలో సీనియర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించి వారితో పనులు చేయించుకుంటున్నారు. ప్రభుత్వం రిక్రూట్ చేయకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పని భారం పెంచేసింది. తమ గ్రామ స్థాయి విధులతో పాటు మండల స్థాయిలో హౌసింగ్ పనులను పర్యవేక్షించటం సాధ్యం గాక గృహ నిర్మాణ పనులు పడకేస్తున్నాయి. తమ శాఖలో ఏఈలు ఉద్యోగ విరమణ చేయటం వల్ల నలుగురు తప్ప మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమేనని జిల్లా హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు వివరణ ఇచ్చారు.

**టాయిలెట్ల పనులన్నీ..**

జిల్లాలో సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.60.48 లక్షలతో అంగన్‌వాడీల వద్ద మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. ఒక్కో టాయిలెట్‌కు రూ.36 వేలను వెచ్చిస్తూ.. 168 టాయిలెట్స్‌ను నిర్మిస్తున్నారు. వీటి పర్యవేక్షణ బాధ్యతను కూడా ఇంజినీరింగ్ అసిస్టెంట్లే చూస్తున్నారు. ఎస్ఎస్ఏ ఏఈలు ఉన్నా.. వారికి పట్టకుండా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతోనే పర్యవేక్షణ విధులను చేయించుకుంటున్నారు. ఇన్ని పనులు తమ భుజ స్కంధాలపై వేసుకొని చేస్తున్న ఈఏలకు కనీస మర్యాద దొరకడం లేదని తెలుస్తోంది. వేధింపులు, ఛీత్కారాలు మధ్య విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కూటమి నాయకుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని, వాటిల్లో నాణ్యత కూడా సక్రమంగా ఉండటం లేదని విమర్శలు వస్తున్నాయి.



అంగలూరు గ్రామ సచివాలయం

**వెట్టి చాకిరి ఇలా..**

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈఏలచే పింఛన్లు పంపిణీ చేయించారు.
- వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ఇది మంచి ప్రభుత్వం పేరిట కార్యక్రమాలను నిర్వహించి ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు, కరపత్రాల పంపిణీ చేయించారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై రెండు రోజులకు ఒకసారి పరిశీలన చేసి యాప్‌లో నమోదు చేయాలి.
- చెత్తను బండ్లకు పారిశుద్ధ్య కార్మికులు ఎత్తేటపుడు పర్యవేక్షించాలి.

**జియో ట్యాగింగ్‌లో ఇబ్బందులెన్నో..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులతో పాటు ఈఏలు ఇంటింటికీ తిరిగి జియో ట్యాగింగ్ సర్వే నిర్వహిస్తున్నారు. ఎంప్లాయీస్ మొబైల్ అప్లికేషన్ పేరిట వచ్చిన యాప్‌లో ప్రతి ఇంటినీ ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆధార్ నంబర్ అప్‌లోడ్ చేయాలి. ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా లక్ష్యాలు ఇచ్చారు. సర్వే సమయంలో గృహ యజమాని తప్పనిసరిగా బయో మెట్రిక్ లేదా.. ఫేషియల్ అథంటిఫికేషన్ ఇవ్వాలి. పలు చోట్ల నెట్‌వర్క్ పని చేయక.. సిగ్నల్స్ రాక యాప్ ఓపెన్ కానందున ఉద్యోగులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఒకవైపు టార్గెట్ల పేరుతో వస్తున్న తీవ్ర ఒత్తిళ్ల కారణంగా పలువురు సచివాలయ ఉద్యోగులు సెలవు పెట్టి ఇతర ఉద్యోగాల కోసం వెతుక్కుంటున్నట్లు తెలుస్తోంది.

# యువత ఉన్నతంగా ఎదగాలి

- రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రారంభమైన కృష్ణా తరంగ్–2024



కృష్ణా తరంగ్–24ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు పాటుపడాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృష్ణా తరంగ్ – 2024 అంతర కళాశాలల యువజనోత్సవం మంగళవారం విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ యువజనోత్సవాలను మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కొల్లు మాట్లాడుతూ యువతలోని ప్రతిభాపాటవాలను వెలికి తీసి ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం ఓ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ ఉత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలోనే స్కిల్ సెన్సెస్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. యువతలోని నైపుణ్యాలు ఏంటనేవి నమోదు చేసి, ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా, సుస్థిర ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేందుకు తగిన నైపుణ్యాలు పెంపొందించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (ఇన్‌చార్జ్) ఆచార్య ఆర్.శ్రీనివాసరావు, రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. శోభన్‌బాబు, కృష్ణా తరంగ్ కన్వీనర్ డాక్టర్ ఎం. కోటేశ్వరరావు, కళాశాల కార్యదర్శి టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు పాశ్చాత్య బృందగానం, శాస్త్రీయ వోకల్ సోలో, క్విజ్, మెహిందీ, జానపద బృంద వాద్యం, శాస్త్రీయ నాట్యం, శాస్త్రీయ వాద్యం, కార్టూనింగ్ అంశాల్లో పోటీలు జరిగాయి.

# ఏరివేతే లక్ష్యం!

- సామాజిక పింఛన్ల తనిఖీ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం
- లబ్ధిదారులపై కస్సుబుస్సుమన్న నందిగామ మున్సిపల్ కమిషనర్
- కన్నీరు పెట్టుకున్న పింఛన్‌దారులు
- అద్దె చెల్లిస్తున్న రశీదు, ఇంటి పన్ను ఉంటేనే పింఛన్



మసీదు వీధిలో పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పింఛన్ల తనిఖీ ప్రక్రియ తీరు చూస్తుంటే కొందరి ఏరివేతే లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు పింఛన్ తీసుకుంటున్నవారి పేర్లు తొలగించేందుకే ప్రభుత్వం ఇప్పుడు సర్వే నిర్వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో పెన్షన్ల తనిఖీకి పైలెట్ ప్రాజెక్ట్‌గా విజయవాడ అర్బన్ పరిధిలోని భవానీపురం కరకట్ట రోడ్‌లోని 121వ సచివాలయాన్ని కలెక్టర్ లక్ష్మీశ గుర్తించారు. ఈ క్రమంలో మంగళవారం ఈ సచివాలయ పరిధిలో 378 మంది పెన్షనర్లు ఉండగా 9 బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందానికి 42 మంది పెన్షనర్లను పరిశీలించే బాధ్యతను అప్పగించారు. ఒక్కో బృందానికి ఎంత మంది ఉంటారనేది స్పష్టత లేదు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**వ్యంగ్యంగా..**

స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చిన నందిగామ మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు వ్యవహార శైలి పింఛన్‌దారులకు బాధ కలిగించింది. వారిపై కస్సుబుస్సులాడటంతో వారు చిన్నబుచ్చుకున్నారు. 'ఇంటి పన్ను ఉందా?' 'లేదు సార్.. అద్దెకు ఉంటున్నాం..' 'అయితే అద్దె చెల్లించిన రశీదు చూపించండి. అప్పుడే మీ పింఛన్ పునరుద్ధరిస్తాం' అంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల సంభవించిన బుడమేరు వరద కారణంగా మునిగిన ఇంటిని ఖాళీ చేసి రెండు మూడు ఇళ్ల అవతల మేడపై అద్దెకు ఉంటున్న మహిళా పింఛన్‌దారుల ఆధార్ కార్డ్ చూసి డోర్ నంబర్ తేడాపై అసహనం వ్యక్తం చేశారు. తమను చూసేవారు ఎవరూ లేరని, పింఛనే ఆధారమని కన్నీరు పెట్టుకున్న వృద్ధ మహిళలను ఉద్దేశించి 'ఏమిటో ప్రతి ఒక్కరూ వెనుక ముందూ లేనివారే ఉంటున్నారు' అంటూ వెటకారం చేయగా వారు కన్నీటి పర్యంతం అయ్యారు. మొత్తం మీద మసీదు వీధిలో ఆయన చేసిన తనిఖీపై పింఛన్‌దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పింఛన్ తొలగిస్తే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాసాంజనేయస్వామి వీధిలో ఒక బృందం చెట్టు నీడన ఉండి పింఛన్‌దారులను అక్కడికి పిలిపించి తనిఖీ చేశారు. రెండు వీధుల అవతల ఉంటున్నవారు పరుగులు పెడుతూ అక్కడికి చేరుకుని తనిఖీ చేయించుకున్నారు. ఒక బృందం కరెంట్ బిల్లులు, రేషన్ కార్డులు తనిఖీ చేసి ఫొటోలు తీసుకున్నారు. మరో బృందం ఇంటి పన్నులు, పింఛన్‌దారులు అర్హులేనా.. అక్కడే ఉంటున్నారా వంటి అంశాలను తనిఖీ చేశారు.

# టెక్ ఫెస్ట్‌లతో సృజనాత్మకత

- ఎమ్మెల్సీ అశోక్‌బాబు, స్పా కళాశాల డైరెక్టర్ రమేష్
- ముగిసిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024



ఫెస్ట్–2024లో ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు



మొదటి బహుమతి పొందిన విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న అతిథులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువతలో ఉన్న ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు ఇలాంటి టెక్‌ఫెస్ట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు చెప్పారు. విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024ను అశోక్‌బాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారు చదువుకున్న అంశాలకు వారిలో ఉన్న తెలివితేటలను జోడించి మంచి ప్రాజెక్టులను రూపొందించారన్నారు. కొత్త ఆవిష్కరణలు చిన్నవిగానే మొదలైన తర్వాతే మల్టీనేషనల్ కంపెనీ స్థాయికి ఎదుగుతాయని చెప్పారు. విద్యార్థిలో ఉన్న ఆలోచనలే వారిలో నైపుణ్యాలను పెంచుతాయన్నారు. రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024 కన్వీనర్ ఎం.విజయ సారథి మాట్లాడుతూ ఇక్కడ బహుమతులు పొందిన ప్రాజెక్టు నమూనాలు జనవరి 6, 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌కు ఎంపిక అవుతాయన్నారు.

**విజేతలు వీరే..**

సాయంత్రం జరిగిన ముగింపు సభకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ (స్పా) కళాశాల డైరెక్టర్ సి.రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలను సందర్శించి వారిని అభినందించారు. రీజనల్ పాలిటెక్ ఫెస్ట్–2024లో మొదటి బహుమతి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మెకానికల్ విభాగం విద్యార్థులు తయారు చేసిన ప్రొటోటైపింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఆన్ 3డీ ప్రింటింగ్ ప్రాజెక్టు నమూనాకు వచ్చింది. రెండో బహుమతి విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఈసీఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఆటోమేటెడ్ స్మార్ట్ స్ట్రీట్ లైట్ ఇన్‌టెన్‌సిటీ కంట్రోలర్ ప్రాజెక్టు నమూనాకు లభించింది. మొదటి బహుమతి ఎంపికైన ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులకు రూ.25వేల చెక్కు, రెండో బహుమతిగా ఎంపికైన ప్రాజెక్టును తయారు చేసిన వారికి రూ.10 వేల చెక్కును అతిథులు అందజేశారు.

## త్వరలో క్రిస్మస్ కానుక

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయ స్వామి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విజయవాడ నాల్గో డివిజన్ వరలక్ష్మి నగర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ప్రారంభించిన కమ్యూనిటీ హాల్స్‌ను జనరల్ నిధులతో పూర్తి చేసి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్స్‌ను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని క్రిస్టియన్స్ అందరికీ క్రిస్మస్ కానుక అందిస్తామన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెన పథకాన్ని పునరుద్ధరిస్తామన్నారు. రాష్ట్రంలో రూ.340 కోట్లతో ప్రభుత్వ సంక్షేమ నూతన వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డిసెంబర్, జనవరి నెలలోనే రుణాలు అందిస్తామన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అణచివేతను ఖండించాలి

**విజయవాడ సదస్సులో వక్తల పిలుపు**




మాట్లాడుతున్న విరసం నాయకుడు పాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆదివాసీలు, గిరిజనులపై జరుగుతున్న అణచివేతను ఖండించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఆదివాసీలు –హక్కులు–భారత రాజ్యాంగం' అనే అంశంపై సదస్సు జరిగింది. పాల్గొన్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టేందుకు ఆదివాసీలను అణచివేస్తున్నారన్నారు. అభివృద్ధిలో ఆదివాసీలకు వాటా దక్కడం లేదన్నారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ మూలవాసీ బచావో నిషేధం విధించడానికి గల కారణాలను బహిర్గతం చేయాలన్నారు.

ఏపీ సీఎల్‌సీ కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దండకారణ్యంలో ఆదివాసీలపై జరుగుతున్న అణచివేత, మానవ హక్కుల హననాన్ని వివరించారు. నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం నాయకులు ముక్తి సత్యం, ఎస్ డానీ, సిద్ధార్థ దొర మాట్లాడుతూ అదానీ, అంబానీల కోసం ఆదివాసీల చట్టాలకు సవరణలు చేస్తున్నారన్నారు. ఖనిజ సంపదను దోచిపెట్టేందుకే చట్టాలు అనుకూలంగా సవరించుకుంటున్నారన్నారు. సదస్సులో ఏపీసీఎల్‌సీ ఉపాధ్యక్షుడు టి.ఆంజనేయులు, సి.భాస్కరావు(ఆలిండియా ఓ.పి.డి.ఆర్ అధ్యక్షుడు) చిట్టి బాబు (సి.ఎల్.సి.ఎ.పి), బాబు (ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ కమిటీ), రాధ(సి.ఎం.ఎస్), లక్ష్మణ్ (సి.ఎల్.సి.టి.ఎస్), హనుమంతరావు (ఓ.పి.డి.ఆర్), రోహిత్ (హెచ్.ఆర్.ఎఫ్) తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అన్నదాతకు అండగా నిలుద్దాం

- 13న కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అవినాష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వంలో తీరని అన్యాయానికి గురైన అన్నదాతలకు అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. అందులో భాగంగా ఈ నెల 13న జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులకు పిలుపునిచ్చారు. విజయవాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో పాటు ఉచిత పంటల బీమాని ఎత్తివేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా పంపిణీచేసిన యూరియా వంటి ఎరువులకు ముందుగా డబ్బులు చెల్లించాలని అడగటం వంటి అనేక సమస్యలు నేడు రైతులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఇటీవల రైతులు ధాన్యం విక్రయాలకు సైతం అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారులకు తక్కువ రేటుకు అమ్మాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 13న జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లాలోని నేతలందరూ పాల్గొనాలని సూచించారు. తొలుత అంబేడ్కర్ స్మృతి వనంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి, అక్కడి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తామని దేవినేని అవినాష్ తెలిపారు.

### 8 మందికి కారుణ్య నియామకాలు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ విధుల్లో అంకితభావంతో పనిచేసి అధికారుల మన్ననలు పొందాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో మంగళవారం ఎనిమిది మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. అప్పగించిన విధులు నిర్వర్తించి పనిచేస్తున్న శాఖలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులు ఎనిమిది మందికి ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అభ్యర్థుల అర్హతలను బట్టి ఐదుగురిని జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించారు.

### పలు రైళ్లు దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని గన్నవరం - ముస్తాబాద, చెర్రోలు - బాదంపూడి సెక్షన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 11, 13, 14, 16, 17, 20, 21, 23, 24 తేదీల్లో హౌరా - బెంగళూరు (12863), ఈ నెల 10, 16, 17, 20, 21, 23, 24 తేదీల్లో ధన్‌బాద్ - అలప్పుజ (13351), ఈ నెల 16, 23 తేదీల్లో హతియ - యర్నాకులం (22837), ఈ నెల 17, 24 తేదీలలో హతియ - యర్నాకులం (12835), ఈ నెల 20న టాటానగర్ - బెంగళూరు (12889), ఈ నెల 21న హతియ - బెంగళూరు (18637), ఈ నెల 11, 13, 14, 25, 27, 28, 30 తేదీల్లో ముంబై - భువనేశ్వర్ (11019), ఈ నెల 26, 28, 29, 31 తేదీల్లో గుంటూరు - విశాఖపట్నం (17239) రైళ్లను వయా నూజివీడు - భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

### పోలీసు అదుపులో మల్లికార్జునరావు!

విజయవాడస్పోర్ట్స్: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే అభియోగంపై నెల్లూరుకు చెందిన నక్క మల్లికార్జునరావును విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసినట్లు సమాచారం. పవన్‌కల్యాణ్‌ను ఫోన్‌లో అసభ్య పదజాలంతో నిందితుడు మల్లికార్జునరావు దూషించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇందిరాగాంధీ స్టేడియం వద్ద నుంచే నిందితుడు ఫోన్‌లో మాట్లాడినట్లు తమ విచారణలో వెల్లడైందని పోలీసులు చెబుతున్నారని సమాచారం.





# పెనమలూరులో పేదల ఇళ్లు నేలమట్టం

- దిక్కుతోచని స్థితిలో బాధితులు
- కర్కశంగా వ్యవహరించిన అధికారులు



పెనమలూరులో పూర్తిగా నేలమట్టమైన పేదల ఇళ్లు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులో పేదల ఇళ్లను అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. పెనమలూరు - చోడవరం రహదారి పక్కన ఆక్రమణల్లో ఉన్న దాదాపు 100 ఇళ్లను సోమవారం 10 జేసీబీలతో కూల్చివేత కార్యక్రమం చేపట్టి మంగళవారంతో ముగించారు. అనేక పేద కుటుంబాలు పెనమలూరు రోడ్డులో హైస్కూల్ సెంటర్ నుంచి అంబేడ్కర్ నగర్ వరకు దాదాపు 40 సంవత్సరాలుగా ఇళ్లు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. రహదారి విస్తరణ పేరుతో కూటమి నేతలు పేదల ఇళ్లపై కన్నేశారు. దీంతో భారీ జేసీబీలను రంగంలోకి దించారు. నివాసితులు నిద్రలో ఉండగా సోమవారం ఒక్కసారిగా పేదల ఇళ్లపై విరుచుకు పడ్డారు. పేదలకు ఏమాత్రం గడువు ఇవ్వకుండా ఇళ్లను జేసీబీలతో కూల్చివేశారు. రెండో రోజుల కూడా కూల్చి వేత పనులను పోలీసుల బందోబస్తుతో కొనసాగించారు. ఇళ్లు కూల్చివేసిన తరువాత ఆ ప్రాంతం బీభత్సంగా మారింది. భూకంప పరిస్థితులు తలపిస్తోం. ఇళ్లు కూల్చివేయటంతో పేదలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**హైస్కూల్ వరకూ విస్తరిస్తారా..**

పెనమలూరు వంతెన వద్ద నుంచి హైస్కూల్ వరకు ఉన్న రోడ్డు కూడా విస్తరిస్తారా లేదా అనే విషయం గ్రామంలో చర్చనీయంగా మారింది. ఈ ప్రాంతంలో పెద్దల భవనాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరుచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. మరి ఈ పరిస్థితిలో ఇక్కడ కూడా పారదర్శకంగా రహదారి విస్తరిస్తారా లేదా అనే విషయం గ్రామంలో చర్చనీయంగా మారింది.

**కోర్టుకు వెళ్లిన బాధితులు**

ఇళ్ల కూల్చివేతపై పలువురు బాధితులు కోర్టుకు వెళ్లారు. తమకు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా ఇళ్లు కూల్చి వేశారని కోర్టును ఆశ్రయించారు. పలు దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు రోడ్డు ఆక్రమణల్లోనే ఉన్నాయి. వాటి పై అధికారులు ఏమి చర్యలు తీసుకుంటారనేది గ్రామంలో చర్చ జరుగుతోంది.

### లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: ప్రేమ పేరుతో 17 ఏళ్ల బాలికను నమ్మించి ఆమెపై పలుమార్లు లైంగికదాడి చేసిన యువకుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవాని మంగళవారం తీర్పు చెప్పారు. ఇంటర్మీడియెట్ చదువుతూ మొగల్రాజపురంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న బాలికకు కానూరు సనత్‌నగర్‌కు చెందిన పోతిన నాని అలియాస్ మహేంద్ర(21) ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. మాయమాటలు చెప్పి బాలికను మచిలీపట్నం బీచ్ వద్ద ఉన్న రిసార్ట్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత హైదరాబాద్, ముంబై తీసుకెళ్లి అక్కడ పలుమార్లు లైంగికదాడి చేశారు. బాలిక కనిపించడం లేదంటూ ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. 2015 అక్టోబర్‌లో వెలుగు చూసిన ఈ ఘటనపై పోలీసులు విస్తృతంగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితురాలి తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.కృష్ణవేణి కోర్టులో వాదనలు వినిపించారు. పది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు పోతిన నాని అలియాస్ మహేంద్రకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానాలో రూ.5 వేలతో పాటు, మరో రూ.4 లక్షలను బాధితురాలికి నష్టపరిహారంగా చెల్లించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

## మామిడి పంటకు బీమా పథకం

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లాలో మామిడి పంటకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకంలో అవకాశం కల్పించిందని ఉద్యానవన శాఖాధికారి టి.వర్ధిని తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ.. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో బీమా చెల్లింపునకు ఒప్పందం చేసుకున్నాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రైతులు బీమా ప్రీమియం ఎకరానికి రూ.2050 చొప్పున డిసెంబర్ 15వ తేదీ లోపు చెల్లించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతింటే ఎకరానికి రూ.41 వేల నష్టపరిహారం వస్తుందని పేర్కొన్నారు. ఈ బీమా కాలాన్ని ఈ ఏడాది డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో అధిక వర్షం, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలులు తదితర కారణాలతో నష్టం వాటిల్లితే ప్రభుత్వం నిబంధనల మేరకు అంచనా వేసి బీమా వర్తింపజేస్తారని వివరించారు. ప్రీమియం చెల్లింపునకు రైతులు తమ బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. ఈ పథకం ఐదేళ్లకు పైబడిన చెట్లకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా సమీపంలోని బ్యాంక్ లేదా పీఎంఎఫ్‌బీవై పోర్టల్ ద్వారా మొబైల్‌లో ప్రీమియం చెల్లించొచ్చని సూచించారు. వివరాలకు రైతు సేవా కేంద్రాల్లో లేదా ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

# అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల్లేవ్

- పదో తేదీ దాటినా ఎదురుచూపులే
- గతంలో మొదటి తేదీనే ఇచ్చిన వైనం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల పదో తేదీ వచ్చినా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పడలేదు. ప్రతినెలా మొదటి తేదీనే పడే జీతాలు పదో తారీఖు వచ్చినా పడలేదు. దీంతో జీతాలు ఎప్పుడు పడతాయా అని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో దాదాపు 300 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వారిలో స్టాఫ్ నర్సులతో పాటు, నాల్గో తరగతి ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్‌లు ఉన్నారు. గతంలో ప్రతినెలా మొదటి తేదీనే జీతాలు రావడంతో ఆ భరోసాతో కొందరు ఉద్యోగులు చిన్న చిన్న రుణాలు తీసుకున్నారు. వాటికి ప్రతినెలా ఏడు నుంచి పదో తేదీలోపు ఈఎంఐలు చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు జీతాలు పడక పోవడంతో తాము ఈఎంఐలు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని చిరుద్యోగులు వాపోతున్నారు. మరికొందరు ఇంటి అద్దెలు చెల్లించేందుకు అప్పులు చేస్తున్నారు.

**గతంలో ప్రతినెలా మొదటి తేదీనే**

ఒకప్పుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏజెన్సీల కింద పనిచేసే వారు. వారు ప్రభుత్వం నిధులు ఇచ్చినా, ఉద్యోగులకు సరిగా జీతాలు ఇచ్చేవారు కాదు. ఈ విషయాన్ని గ్రహించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఈ కార్పొరేషన్ పరిధిలోనికి తీసుకొచ్చారు. దీంతో ప్రతినెలా పర్మినెంట్ ఉద్యోగుల కంటే ముందుగానే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేవారు. దీంతో ఉద్యోగులు సైతం తమకు ప్రతినెలా జీతం వస్తుందనే ధైర్యంతో ఉండేవారు.

**మళ్లీ కష్టాలేనా..**

ప్రస్తుతం పదోతేదీ వచ్చినా జీతాలు ఇవ్వకపోవడంతో మళ్లీ తమకు గతంలో ఎదుర్కొన్న కష్టాలు రానున్నాయా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్‌లో ఉన్న వారమంతా చిరుద్యోగులమేనని, తక్కువ జీతాలకు పనిచేస్తున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు జీతాలు సత్వరమే విడుదల చేయాలని కోరుతున్నారు.

## ఎన్నికల హామీల అమలుకు 23న ధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు, నరసింహారావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరించాలని, మెమో నంబర్ 1214ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టిపు అప్పారావు, పిల్లి నరసింహారావు కోరారు. విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పనిచేయించి పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మ్యానిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికే యూనియన్ ద్వారా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులకు అనేకసార్లు విన్నవించామని, తమ సమస్యలను పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వేల మంది వలస కార్మికులు వచ్చి పనిచేస్తున్నారని, వారికి ఇక్కడ ఆధార్ కార్డు లేదని సంక్షేమబోర్డులో చేర్చుకోకపోవడంతో వారికి ఎలాంటి పథకాలు అందటం లేదని వివరించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, కోశాధికారి బి.బెనర్జీ, వి.బి.రాజు, ఎం.బాబూరావు, డి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## 'బీసీలను వంచించిన కూటమి'

భవానీపురం(విజయవాడపశ్చిమ): డబ్బున్న వారికే రాజ్యసభ సీటు ఇచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలను వంచించి తమ నైజాన్ని బయట పెట్టుకుందని వైఎస్సార్ సీపీ నాయీబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్లు పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీసీలను ముఖ్యపెట్టి ముగ్గురు రాజ్యసభ సభ్యులను రాజీనామా చేయించి వారికి మొండి చెయ్యి చూపించిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. బీసీల కోసం ఎక్కడి వరకైనా వెళ్తాననే ఆర్.కృష్ణయ్య స్వప్రయోజనాల కోసమే పార్టీలు మారుతున్నారని విమర్శించారు. హవాలా, మనీ లాండరింగ్ కేసుల్లో సీబీఐ, ఈడీ విచారణ ఎదుర్కొంటున్న సాన సతీష్‌కు రాజ్యసభ ఇవ్వడం చంద్రబాబుకే చెల్లిందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో మంది బీసీలకు రాజ్యాధికారాన్ని కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రులుగా, రాజ్యసభ సభ్యులుగా, శాసన మండలి సభ్యులుగా బీసీలను నియమించిన సామాజిక న్యాయవేత్త వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వివరించారు. తనకు కులం, మతం లేదని చెప్పుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని గ్రహించాలని కోరారు.

## మద్యం దుకాణంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- అక్రమంగా తరలుతున్న 408 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ముగ్గురు వ్యక్తులు అరెస్టు.. కారు సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాల బాక్సులు

కంకిపాడు: మద్యం దుకాణంపై టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం రాత్రి ఆకస్మికంగా దాడులు జరిపింది. దుకాణం నుంచి అక్రమంగా తరలిపోతున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఉయ్యూరు ఎక్సైజ్ అధికారులకు అప్పగించింది. ఉయ్యూరు ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు... కంకిపాడు పట్టణంలోని ఎస్ వైన్స్‌పై రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం ముందస్తు సమాచారం మేరకు దాడి జరిపింది. దాడిలో భాగంగా మద్యం దుకాణం నుంచి బెల్టు షాపులకు తరలిస్తున్న 408 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకుంది. మద్యం సీసాలతో పాటు కారును సీజ్ చేసింది. ఉయ్యూరు ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించింది. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ఇరువురిని, మంగళవారం ఉదయం ఒకరిని అదుపులోకి తీసుకుంది. మద్యం రవాణాలో పాత్ర ఉన్న కె.విద్యాసాగర్, కె.సురేష్, టీ.శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా సీఐ శేషగిరిరావు 'సాక్షి'తో మాట్లాడుతూ బెల్టుషాపులను ప్రోత్సహించేది లేదన్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు సాగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిరంతరం గ్రామాలపై నిఘా ఉంటుందని, బెల్టు నడిపితే శిక్ష తప్పదని హెచ్చరించారు.

### వైద్య, ఆరోగ్యశాఖలో పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): వైద్య, ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పోస్టుల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్‌టెక్నీషియన్ గ్రేడ్-2 నాలుగు పోస్టులు, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ ఎనిమిది పోస్టులు, శానిటరీ అటెండర్ కం వాచ్‌మన్ పది పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం వెబ్‌సైట్‌లో ఉందని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మచిలీపట్నంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీలోగా అందజేయాలని కోరారు.

## చదువు ఒత్తిడితోనే విద్యార్థి ఆత్మహత్య

పెనమలూరు: మండలంలోని పోరంకిలో ఉన్న ఓ కార్పొరేట్ కాలేజీలో నీట్ లాంగ్‌టర్మ్ చదువుతున్న జనావత్ పరుశురామ్‌నాయక్ (19) చదువు ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నాడని అతని తండ్రి జనావత్ శంకర్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోరంకిలో సోమవారం కార్పొరేట్ కాలేజీలో నీట్ విద్యార్థి హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి పోలీసులకు చేసిన ఫిర్యాదు చేశారు. తన కుమారుడు చదువు ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని అందులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# మైనింగ్ మంత్రి ఇలాకా.. కూటమి తాలూకా..

- మచిలీపట్నం మండలంలో మట్టి దందా
- చెలరేగిపోతున్న మట్టి మాఫియా
- మామూళ్ల మత్తులో అధికారులు



పోర్టుభూముల్లో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కోనేరుసెంటర్(మచిలీపట్నం): మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మైనింగ్ శాఖ మంత్రి ఇలాఖాలో అవినీతి దందా పెరిగిపోతోంది. కూటమి అండతో అవినీతిపరులు చెలరేగిపోతున్నారు. అదేమని ఎవరైనా అడిగితే మేమింతే అడ్డొస్తే అంతే అంటూ బెదిరిస్తున్నారు. అక్రమమార్గంలో అడ్డంగా దోచేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దున్నేవాడిదే భూమి అన్న చందంగా తవ్వుకున్న వాడిదే మట్టి అనుకుంటున్నారో ఏమో గ్రామాల్లో అయినకాడికి మట్టిని మాయం చేసేస్తున్నారు. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న ఈ మట్టి దందాను ఎదుర్కోలేక, వారు ఇచ్చే ముడుపులు తీసుకుని చూసీ చూడనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఆ మూడు గ్రామాల్లో..**

బందరు మండలంలోని గోపువానిపాలెం, కరగ్రహారం, మంగినపూడి గ్రామాల్లో మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు మట్టిని మాయం చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. పోర్టు భూముల్లోని మట్టిని అయిన కాడికి తవ్వి బయటి ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని దూరాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చీకటి రాజ్యంలో కార్యకలాపాలు సాగించిన వారు, ప్రస్తుతం పట్టపగలే మట్టి తవ్వుకుని అమ్మేసుకుంటున్నారు. గోపువానిపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళా ప్రజాప్రతినిధి కొడుకు, కరగ్రహారంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆ పార్టీ నేతల అండతో మట్టి దందాను సాగిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం.

**వందల ఎకరాల్లో మట్టి మాయం**

కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ మూడు గ్రామాలకు సంబంధించి వందల ఎకరాల పోర్టు భూముల్లోని మట్టి తవ్వి అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. తద్వారా తమ తమ స్థాయిని బట్టి కూటమి నేతల దగ్గర వారికున్న పలుకుబడి, పరపతిని బట్టి రూ.లక్షలు, రూ.కోట్లు దిగమింగినట్లు ప్రచారం సాగుతోంది. మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సొంత నియోజకవర్గమైన మచిలీపట్నంలో మట్టి దందా సాగుతున్నా పట్టించుకోకపోవడం సర్వత్ర విమర్శలకు దారి తీస్తోంది. దీంతో నియోజకవర్గ ప్రజలకు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

**కచ్చితంగా చర్యలు తీసుకుంటాం**



పోర్టుభూముల్లో మట్టిని తవ్వితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మట్టి ట్రాక్టర్‌లను అడ్డుకుని కేసులు నమోదు చేస్తాం. వాటికి జరిమానా విధించటంతో పాటు వాహనాలను సీజ్ చేస్తాం. సిబ్బందిని అప్రమత్తం చేసి పోర్టు భూముల్లో మట్టి తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం.

– పి.మధుసూదనరావు, తహసీల్దార్, బందరు

## క్లుప్తంగా

### ప్రతిభను వెలికి తీయడానికే టాలెంట్ టెస్ట్‌లు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు సాయిమేధ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ అన్నారు. ఎంజీ రోడ్డులోని సాయిమేధ కోచింగ్ సెంటర్‌లో చైర్మన్ రమణ ఆధ్వర్యాన 2024 -25 ఈసెట్ విద్యార్థులకు మంగళవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

### రెండు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణలంకలోని బీజేజేఆర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు కృష్ణా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు పేర్కొన్నారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. రోస్టర్ ప్రకారం బీసీ(ఏ), ఓసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### నేటి నుంచి వస్త్ర ప్రదర్శన



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో లబ్బీపేటలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నుంచి మూడు రోజులపాటు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ప్రదర్శన - అమ్మకాల ఎగ్జిబిషన్‌లో వివాహాలకు అవసరమైన సంప్రదాయ వస్త్రాలు, విభిన్న రంగులు, విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలు లభిస్తాయి. ఈ హ్యాండ్ టు హ్యాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో వివాహది శుభకార్యాల వేడుకలకు కావల్సిన అన్ని రకాల సంప్రదాయ చీరలు, సల్వార్ సూట్స్, నేషనల్ సిల్క్ ఉత్పత్తులు లభిస్తాయి. అలాగే మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమ బెంగాల్, బీహార్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్ ప్రాంతాల నుంచి తయారీదారులు తమ ఉత్పత్తులను నేరుగా ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### విద్యార్థులకు ఉపయుక్తం.. అటల్ ఎఫ్‌డీపీ

విజయవాడస్పోర్ట్స్: అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సాంబశివరావు తెలిపారు. ఎస్ఆర్‌కె కాలేజీ చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ ప్రోత్సాహంతో 50 మంది అధ్యాపకుల బృందం అవెరా విద్యుత్ వాహన పరిశ్రమను మంగళవారం పరిశీలించింది. విద్యుత్ వాహనాల తయారీ ప్రక్రియ, మోటారు సిస్టం, బ్యాటరీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలను ఈ బృందం ప్రత్యక్షంగా చూసినట్లు కో ఆర్డినేటర్ చెప్పారు.

# పనులు చేయరు.. గోతులు పూడ్చరు

- శాంతినగర్‌లో పదిహేను రోజులుగా ఇదే పరిస్థితి
- వాహనచోదకులు, పాదచారుల అవస్థలు





శాంతినగర్ రహదారి మలుపులో ప్రమాదకరంగా గొయ్యి, పక్కనే పైపులు : రహదారిని తవ్వి గోతుల వద్ద అడ్డుగా ఉంచిన పైపులు, చెట్టు కొమ్మలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పనులు చేయకుండా గోతులు పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మొగల్రాజపురంలోని శాంతినగర్ ప్రధాన రహదారిలో తాగునీటి సరఫరా పైపుల మార్పిడి కోసం రెండు వారాల క్రితం రోడ్డు మార్జిన్లను తవ్వారు. రోడ్డులో కొంత భాగం పైపులు అమర్చి పూడ్చారు. మిగిలిన భాగంలో పైపులు అమర్చే పనిలో భాగంగా అక్కడక్కడ పెద్ద గోతులు తవ్వి అలాగే వదిలేశారు. భూమిలో అమర్చడానికి తెచ్చిన పైపులను అక్కడే రోడ్డు మార్జిన్‌లోనే ఉంచారు. రెండు వారాలుగా అక్కడ ఇదే పరిస్థితి.

### గోతులు పూడ్చటం లేదు

పైపులు అమర్చే పనులు చేయడం లేదు. గోతులు పూడ్చటం లేదు. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థ పడుతున్నారు. మధుచౌక్, శిఖామణి సెంటర్ల నుంచి వాహనచోదకులు ఈ రోడ్డు మీదుగా పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్, బందరురోడ్డు వైపునకు రాకపోకలు సాగిస్తుంటారు. ఏఎస్ రామారావు రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండటంతో ఎక్కువ మంది వాహనచోదకులు ఈ రోడ్డులో ప్రయాణానికి ఆసక్తి చూపుతున్నారు. శాంతినగర్ ప్రధాన రహదారి, అంతర్గత రోడ్లు కలిసే మలుపుల్లో గోతులు ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఇవి దగ్గరకు వచ్చే వరకు కనపడటం లేదు. జమ్మిచెట్టు సెంటర్, సిద్ధార్థ స్కూల్ రోడ్డులో నుంచి వచ్చే వాహనాలు కూడా ఈ రోడ్డునే ఉపయోగిస్తుంటారు. శాంతినగర్‌తో పాటుగా సమీపంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలు, దుకాణాలు, రెస్టారెంట్స్ ఉండటంతో ఈ ప్రాంతం కూడా నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రధాన రహదారిలో గొయ్యి తవ్వడమే కాకుండా రోడ్డుపై సగ భాగం మట్టి ఉండటంతో సగ భాగం మాత్రమే రాకపోకలకు వీలుగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో ట్రాఫిక్ నిలుస్తోంది.

### పనుల ఆలస్యంపై అసహనం

శాంతినగర్ వాసులు బందరురోడ్డుకు వెళ్లడానికి ఈ దారే ప్రధాన మార్గం. ఇంతటి ప్రధాన రహదారిపై గుంతలు తవ్వి పనులు చేయడంలో ఆలస్యంతో వాహనచోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గొయ్యి అతి సమీపంలో నుంచే రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు

రోడ్డులో కొంత భాగం పైపులను అమర్చిన ప్రాంతంలో కూడా సరిగా పూడ్చలేదు. అటుగా వాహనాలు ప్రయాణించే సమయంలో వాహనచోదకులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది తక్షణమే స్పందించి పైపులు అమర్చే పనులను వేగవంతంగా చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. పైపులు అమర్చే పనులు పునఃప్రారంభించడానికి సమయం పడితే అప్పటి వరకు రోడ్డుపై అడ్డుగా ఉన్న మట్టినైనా తొలగించి రాకపోకలు ఇబ్బంది లేకుండా చేయాల్సిందిగా కోరుతున్నారు.

> **పనులు త్వరగా కావడానికి చర్యలు తీసుకుంటా**
>
> శాంతినగర్ మెయిన్ రోడ్డులో జరుగుతున్న తాగునీటి సరఫరా పైపులైన్ల మార్పిడి పనులు వేగవంతం అయ్యేలా చూస్తాం. పైపులను త్వరగా అమర్చి వెంటనే ఈ గోతులను కూడా పూడ్చేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తాను.
>
> –వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్)

### రోడ్ల నిర్మాణ ప్రాంతాల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణాలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో త్వరలో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. సర్కిల్-1 పరిధిలోని బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, కేటీ రోడ్, కుమ్మరిపాలెం, సితార సెంటర్ నుంచి సీవీఆర్ ఫ్లైఓవర్, మొత్తం 7.37 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్-2 పరిధిలోని బీఆర్టీఎస్ రోడ్, సాంబమూర్తి రోడ్, జీఎస్ రాజు రోడ్, 7.26 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్-3 పరిధి లోని పటమట హైటెన్షన్‌లైన్ రోడ్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, టిక్కిల్ రోడ్, సిద్ధార్థ స్కూల్ రోడ్, జమ్మిచెట్టు సెంటర్ నుంచి సిద్ధార్థ సర్కిల్ వరకు, మదర్‌థెరిసా సర్కిల్ నుంచి అమ్మ కల్యాణ మండపం వరకు, పీవీపీ మాల్ రోడ్, రమేష్ హాస్పటల్ ప్రాంతాల్లో జరుగుతున్న 8.37 రోడ్లను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సభ్యులు, పాల్గొన్నారు.

# స్పందన లేని రెవెన్యూ సదస్సు



సదస్సులో కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం



ఖాళీగా ఉండటంతో ముందు వరుసలో రెవెన్యూ అధికారులు, వెనుక వరుసలో టీడీపీ నాయకులు కూర్చున్న దృశ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కరువైంది. రెవెన్యూ అధికారులు, స్థానిక టీడీపీ నేతలు ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఎవరూ రాకపోవడంతో సదస్సు బోసిపోయింది. సెంట్రల్ మండలం పరిధిలోని 17, 18 డివిజన్లలో భూసమస్యల పరిష్కారానికి రాణిగారితోటలోని సిమెంట్ గోడౌన్‌లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. సదస్సు ప్రారంభం నుంచే సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. కేవలం రెవెన్యూ ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే సీట్లలో కనిపించారు. ప్రజలెవ్వరూ సదస్సుకు రాకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులే కొంతమందిని తీసుకొచ్చి వారితో జీఓ నంబర్ 9గా ఉన్న ఇళ్లను 10గా మార్చాలని, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇంటి పన్ను పేర్లు మార్చాలని, రేషన్ కార్డు లేని వారికి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వాలని అర్జీలు ఇప్పించారు. విషయం తెలుసుకున్న ఒకరిద్దరు వరద బాధితులు వచ్చి తమకు వరద నష్టపరిహారం పడలేదని వినతి పత్రం ఇచ్చారు. ముందు నాలుగు వరుసల్లో రెవెన్యూ ఉద్యోగులు, వెనుక నాలుగు వరుసల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూర్చొని తూతూమంత్రంగా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ తహసీల్దార్ ఎం.వెంకటరామయ్య, స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఎ.రవీంద్రరావు, ఎండోమెంట్ సీనియర్ అసిస్టెంట్ రామలింగేశ్వరరావు, 17, 18 డివిజన్ల టీడీపీ నాయకులు రాయ రంగమ్మ, దుర్గారావు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ హాలు ప్రారంభం

గుణదల(విజయవాడ తూర్పు): అర్హులకు సంక్షేమ పథకాలు అందడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. నాలుగో డివిజన్ పరిధిలోని వరలక్ష్మీనగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాలును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రూ.80 లక్షల వ్యయ అంచనాతో కమ్యూనిటీ హాలును నిర్మించారన్నారు. నగరంలో కమ్యూనిటీ హాలు నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, అపర్ణ, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఎస్ఆర్ఆర్‌లో జాబ్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేకేసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీ గురువారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్నవారు వివరాలకు 77996 69907 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

# మహిళలు సవాళ్లను అధిగమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఉష

పటమట(విజయవాడతూర్పు): మహిళలు సవాళ్లను అధిగమించి ముందుకెళ్లాలని కృష్ణా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా అన్నారు. విద్యార్థినులు పర్సనల్ విషయాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని, సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్లేనన్నారు. మంగళవారం స్టెల్లా కళాశాలలో ఏపీ ఉమెన్ కమిషన్, స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న హింసను నివారించడం ఎలా..? ఎదుర్కోవడం ఎలా అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై జరుగుతున్న గృహహింస, లైంగిక వేధింపులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా కమిషన్ కార్యదర్శి వసంత బాలా మాట్లాడుతూ మహిళల భద్రతపై ఇప్పటికే పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సీఐడీ సీఐ శిరీష మాట్లాడుతూ సమాజంలో మహిళల భద్రతకు, సైబర్ వేధింపుల నిరోధానికి కృషి చేస్తున్నామని, ఇటీవల కాలంలో మహిళలపై సైబర్ లైంగిక వేధింపులు అధికమయ్యాయని వీటిని నిరోధించాలంటే ఇతరులకు తమ వ్యక్తిగత ఫొటోలు పంపకూడదని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్, మహిళా కమిషన్ సభ్యులు షేక్ రుకియా బేగం, బూసి వినీత, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎన్టీయార్ జిల్లా పీడీ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద



భగవద్గీత పోటీల్లో విజేతలతో ధర్మప్రచార పరిషత్ సభ్యులు

విజయవాడ కల్చరల్: భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద అని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి వజ్రదాస్ గురూజీ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను మంగళవారం చుట్టుగుంటలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. వజ్రదాస్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ కృష్ణుడు మనకు అందించిన వరం భగవద్గీత అని అని నిత్య పారాయణ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, బొగ్గవరపు రాధాకృష్ణ, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్, మిత్తింటి శారద, వాసవీ క్లబ్ సభ్యుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, పొక్కులూరి సుబ్బారావు, టి.సావిత్రి, ఆర్.సావిత్రి కనకదుర్గ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేతలు: జూనియర్ విభాగం సంపూర్ణ భగవద్గీత పోటీలో దీక్షిత( ప్రథమ), సీనియర్ విభాగంలో పి.లక్ష్మీ ప్రసన్న( ద్వితీయ), వీవీఎస్ శ్రీధర్ శర్మ (తృతీయ), సీనియర్ విభాగంలో లక్ష్మీప్రసన్న( ప్రథమ) వీవీఎస్ శ్రీధర్ శర్మ( ద్వితీయ), ఎం.దివ్యసాహితీ (తృతీయ)కి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

## కార్మికవాడను కమ్ముకుంటున్న పొగ!



కార్మికవాడ లో కాలుష్యం వెదజల్లుతోంది. ఇక్కడ వ్యర్థాలను బయటకు తరలించకుండా తగలబెడుతున్నారు. దీంతో కార్మికవాడ పొగతో నిండిఉంటోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే చెత్తాచెదారాలకు ఉదయం పూట పలు ప్రాంతాల్లో నిప్పపెడుతున్నారు. ఒక పక్క పొగ అధికంగా రావడంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడ వీధులను పరిశుభ్రం చేసేందుకు నెలకు సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేస్తున్నారు. చెత్తను తీసుకెళ్లడానికి నాలుగు చెత్త లారీలు ఉన్నాయి. సుమారు 42 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. అయినా ఇక్కడి చెత్తను తగలబెట్టడాన్ని కార్మికులు తప్పుపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

–ఆటోనగర్(విజయవాడతూర్పు)

# ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు



స్విమ్మింగ్ పోటీల విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 170 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి బత్తుల సుందర్‌రెడ్డి, యూత్ సర్వీస్ ఉపాధ్యక్షుడు నందూరి త్రినాథ్, సంయుక్త కార్యదర్శులు మద్దినేని శ్రీనివాస్, ఎడ్ల పార్థసారథి గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దీనిలో భాగంగానే స్విమ్మింగ్ పోటీలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షులు కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు. క్లబ్ ప్రతినిధులు సాగర్, దేవా, బాచి, విష్ణు, తొండేపు ఉదయ్ పోటీలను పర్యవేక్షించారు.

# స్కేటింగ్ జాతీయ పోటీల్లో జెస్సీరాజ్‌కు సిల్వర్



జాతీయ స్కేటింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించిన జెస్సీరాజ్

విజయవాడస్పోర్ట్స్: జాతీయ 62వ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ సత్తా చాటింది. తమిళనాడు రాష్ట్రం పోలాచి నగరంలోని కేశవ విద్యా మందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 14 నుంచి 17 ఏళ్ల విభాగం సోలో డాన్స్‌కు జెస్సీరాజ్ ఏపీకి ప్రాతినిధ్యం వహించి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. జెస్సీరాజ్ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఆర్టిస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీపక్ మాల్వాయి, ఏపీ ఆర్టిస్టిక్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆకుల ప్రవీణ్ కుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి తామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు.

# ఆహ్లాదం, ఆనందం.. ఆమడదూరం

## అధ్వానంగా లెనిన్‌సెంటర్ ఐలాండ్ పార్క్

- నిర్వహణను గాలికి వదిలేసిన కార్పొరేషన్
- పార్క్ లోపలి భాగంలో చెత్త, పశువుల వ్యర్థాలు
- దెబ్బతిన్న విద్యుత్ దీపాలు



పార్క్ లోపల చెత్త కుప్ప

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డున లెనిన్‌సెంటర్‌లో నిర్మించిన ఐలాండ్ పార్క్ నిర్వహణను కార్పొరేషన్ గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్క్‌ను సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పార్క్ అధ్వాన స్థితికి చేరుకుంది. దీనిలోపలకు అడుగు పెట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి ఉంది. ఎక్కడ చూసినా పశువ్యర్థాలతో కంపు కొడుతోంది. పార్క్‌లో ఆహ్లాదం, ఆనందం రెండూ కరువయ్యాయి.

### ప్రజలు సేదదీరడానికి

లెనిన్‌సెంటర్ వ్యాపార, వాణిజ్య కూడలి. నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. సాధారణ రోజుల్లోనే రద్దీ వాతావరణం కనిపిస్తుంది. ఇక ప్రత్యేక దినాల్లో ఇసుకేస్తే రాలనంత జనం. బట్టలు, బంగారం, ఫర్నిచర్ ఇలా ఏ వస్తువు కావాల్సిన వారైన, ఎక్కడి వారైనా లెనిన్‌సెంటర్‌కు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడకు వచ్చే వారు సేదతీరేందుకు గానీ, కాసేపు పిల్లలతో గడిపేందుకు గానీ ఇక్కడ సరైన అవకాశం లేదు. ఇది గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లెనిన్ విగ్రహం ముందు వెనుక స్థలంలో ఆక్రమణలు తొలగించింది. దీన్ని అందమైన పార్క్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. వెంటనే పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.75 లక్షల వ్యయ అంచనాతో పార్క్ నిర్మించింది. లెనిన్ సెంటర్ ఐలాండ్ పార్క్‌గా నామకరణం చేసింది. ఇక్కడకు షాపింగ్ వచ్చిన పిల్లలు, పెద్దలు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్క్‌లో సౌకర్యాలు తీర్చిదిద్దింది.

### నేడు వెలవెల

పిల్లలకు ఆట వస్తువులు, కాకి- కడవ , మొసలి వేలాడే కోతి వంటి బొమ్మలను ఏర్పాటు చేసింది. పార్క్ చుట్టూ సీటింగ్ అమర్చింది. షాపింగ్ చేసిన వారంతా కాసేపు కూర్చొని వెళదాం అనే భావన కలిగేలా సకల సౌకర్యాలు కల్పించింది. కాకి-కడవ కథ ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా బొమ్మలు ఏర్పాటు చేసి దాని చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. అన్ని హంగులతో కళకళలాడిన ఐలాండ్ పార్క్ ఇప్పుడు వెలవెలబోతోంది.

### నిర్వహణ ఏదీ?

కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత పార్క్ నిర్వహణను కార్పొరేషన్ పూర్తిగా గాలికి వదిలేసింది. పార్క్‌ను విస్మరించడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. లోపలి భాగంలో చెత్త.. కుప్పగా పేరుకుపోయింది. పచ్చదనం కరువైంది ఎక్కడ చూసిన పశువుల వ్యర్థాలతో నిండిపోయింది. పార్క్‌లో అడుగు పెడదామంటేనే భయపడేలా నిర్వహణ తయారైంది. కాకి-కడవ బొమ్మలను విరగ్గొట్టారు. దాని చుట్టూ ఏర్పాటు చేసిన అందమైన విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పశువుల పేడ, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. తాగుబోతులు, పులిమేక ఆడే ఆకతాయిలతో నిండి పోయింది. నగరం నడిబొడ్డులో ఉన్న పార్క్ నిర్వహణను కార్పొరేషన్ గాలికి వదిలేయడం పట్ల చుట్టుపక్కల వ్యాపార సముదాయాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్క్ అధ్వానంగా తయారై పాత రోజుల్లో మాదిరి తయారయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పార్క్‌ను తీర్చిదిద్దాలని కోరుతున్నారు. దెబ్బతిన్న ఆట వస్తువుల స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని, మిగిలిపోయిన పనులను పూర్తి చేసి నగరానికి వచ్చే వారు చక్కగా సేదతీరేలా చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.



కాకి కడవ బొమ్మలు దాని చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు దెబ్బతిన్న దృశ్యం



పార్క్‌లో ఎక్కడబడితే అక్కడ పశువుల వ్యర్థాలు

## 'చాగంటి' నియామకం సరికాదు

**భారత నాస్తిక సమాజ కేంద్ర కమిటీ సభ్యులు శ్రీరామ్మూర్తి, రవి**

**మహారాణిపేట:** విద్య, విలువల సలహాదారుడిగా ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును నియమించడం సబబు కాదని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి మంగళవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. పౌరాణిక విలువలకు, ఆధునిక, ప్రజాస్వామ్య లౌకిక వైజ్ఞానిక విలువలకు ఏమాత్రం పొసగదన్నారు. ఆయన నియామకంపై మేధావుల సలహాలు తీసుకోవాలని వారు కోరారు.



## ఈ గుడ్డు వెరీ స్మాల్ గురూ..



కాకినాడ జిల్లా తుని పట్టణంలోని ఓ రైతుకు చెందిన నాటుకోడి అతి చిన్న గుడ్డు పెట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. రైతు గండి రమణ నాటు కోళ్లు పెంచుతున్నారు. ఇందులో ఒక పెట్ట ముందు రోజు సాధారణ పరిమాణం కలిగిన గుడ్డు పెట్టగా.. మంగళవారం చిన్న గుడ్డు పెట్టింది. జన్యుపరమైన లోపం వల్ల ఇలా జరుగుతుందని పశు వైద్యుడు శ్రీధర్ చెప్పారు.

- తుని

## జైలులో కాయగూర పంటలు



విశాఖ కేంద్ర కారాగారం ఆవరణలో సీజనల్ పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం శీతాకాలం కూరగాయల పంటలు ప్రారంభమయ్యాయి. కొన్ని కాపు దశకు వచ్చాయి. జైలులో ఉండే ఓపెన్ ఎయిర్ ఖైదీలచే రసాయనిక ఎరువుల్లేకుండా అధికారులు ఇక్కడ పంటలు పండిస్తుంటారు. జైలు లోపల మామిడి, కొబ్బరితోపాటు, బయట ఆవరణ సుమారు 20 ఎకరాల్లో సీజనల్ పంటలు పండించి వాటిని ఖైదీలకు వినియోగిస్తుంటారు. మిగిలిన వాటిని జైలు గేటు ముందు బీఆర్‌టీఎస్ పక్కన సుధార్ కేంద్రంలో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం వంగ, బీర, క్యాబేజీ, టమాటా, ఆనప (సొర) సాగు చేస్తున్నారు. ఈ పంటలతో జైలు ఆవరణ అన్ని కాలాల్లోను పచ్చదనంతో కళకళలాడుతోంది.

- ఆరిలోవ

## సీఎం ఇలాకాలో దాహం కేకలు



తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కిన ఘటన సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని వీర్నమల ఎస్సీ కాలనీలో మూడు నెలలుగా తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. ఎస్సీ కాలనీలో ఉన్న బోరులో నీరు ఇంకిపోవడంతో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, డబ్బులిచ్చి నీళ్లు కొనుక్కోవాల్సిన ఖర్మ పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోకపోవడంతో వారంతా ఖాళీ బిందెలతో ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ కారణంగా వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది.

- రామకుప్పం

## క్యూ కట్టిన రేషన్ బ్యాగులు



చౌక దుకాణాల వద్ద రేషన్ కోసం లబ్ధిదారులు గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి మళ్లీ ఎదురైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని అమలు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాల్లో ఈ వ్యవహారాన్ని తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. చిత్తూరులోని 27వ వార్డు చామంతిపురం రేషన్‌షాపు వద్ద మంగళవారం ప్రజలు రేషన్ కోసం గంటల కొద్దీ పడిగాపులు కాశారు. గంటల కొద్దీ నిలబడలేక తాము తెచ్చుకున్న సంచులను వరుస క్రమంలో పెట్టారు. సమీపంలోని 28వ వార్డులో, మరికొన్ని మండలాల్లో సైతం ఇదే పరిస్థితులు ఉన్నట్లు సమాచారం. దీంతో ప్రజలు గత ప్రభుత్వ పాలనే బాగుందని వ్యాఖ్యానిస్తున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

# బియ్యం ఇస్తే ఓకే.. లేదంటే '6ఏ' అస్త్రం

**బియ్యం ఇవ్వని రేషన్ డీలర్లపై పచ్చబ్యాచ్ కక్షసాధింపు**

**తొలగించిన డీలర్ల స్థానంలో సొంత మనుషులను నియమించుకుంటున్న మాఫియా**

- చీరాలలో పేట్రేగిపోతున్న రేషన్ మాఫియా
- ఓ పచ్చనేతకు నెలకు రూ.20 లక్షలు కప్పం
- రెవెన్యూ, పోలీసు అధికారులకూ వాటాలు
- మండలానికొక వ్యక్తిని నియమించి దందా



**సిక్స్-ఏ కేసు అంటే..**

ప్రభుత్వ రేషన్ షాపుల్లో అవకతవకలు జరిగితే రెవెన్యూ అధికారులు (ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ, తహసీల్దారు తదితరులు) ఈ 6ఏ కేసులు నమోదు చేస్తారు. ప్రధానంగా డీలర్ వద్ద ఉన్న స్టాకు రికార్డులకు అనుగుణంగా ఉండకపోతే ఈ కేసులు పెట్టడం పరిపాటి. విచారణలో నిజమని తేలితే ఆర్డీఓ స్థాయిలో డీలర్‌ను తొలగించవచ్చు. రాజకీయంగా ఎలాంటి మద్దతు లేకపోతే ఈ కేసు బుక్ చేసిన వెంటనే తహసీల్దార్ స్థాయిలోనే డీలర్‌షిప్ నిలిపివేసి వేరొకరికి కేటాయిస్తారు.

చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలంలోని ఒక రేషన్ డీలర్ (ఇతను రేషన్ మాఫియాలో నెలకు రూ.25 వేల జీతానికి పనిచేస్తున్నాడు) మండలంలో ఉన్న రేషన్ డీలర్ల నుంచి మాఫియా తరఫున నెలనెలా బియ్యం సేకరించి అప్పగిస్తాడు. ఇదే మండలంలో కూతురు పేరుతో రేషన్ షాపు నడుపుతున్న మరో డీలర్‌ను బియ్యం ఇవ్వాలని నవంబరు 2న కోరాడు. అమ్మకాలు పూర్తికాలేదని, బియ్యం తర్వాత ఇస్తానని ఆ డీలర్ చెప్పాడు. దీంతో డీలర్ కం మాఫియా ఉద్యోగి వెంటనే రేషన్ మాఫియాను నడిపిస్తున్న 'ఒంగోలు ప్రసాద్'కు ఫోన్‌చేశాడు. బియ్యం అడిగితే డీలర్ స్పందించడంలేదని, అతను మనకు సక్రమంగా బియ్యం ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశాడు. అంతే.. రేషన్ షాపులు పర్యవేక్షించే ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారికి ప్రసాద్ ఫోన్ కొట్టి తనకు బియ్యం ఇవ్వని రేషన్ డీలర్‌ను వెంటనే బుక్ చేయాలని హుకుం జారీచేశాడు. అరగంటలో అక్కడ వాలిన అధికారి షాపును తనిఖీచేసి 92 బస్తాల బియ్యం అధికంగా ఉన్నాయంటూ ఆ డీలర్ వివరణ కూడా తీసుకోకుండా సిక్స్-ఏ కింద బుక్‌చేసి వెంటనే ఆయనను తొలగించారు. కొసమెరుపు ఏంటంటే రేషన్ మాఫియాలో నెలజీతానికి పనిచేస్తున్న వేటపాలెంకు చెందిన డీలర్‌కే ఈ డీలర్‌షిప్ అప్పగించారు.

బియ్యం విషయంలో చీరాల రూరల్ పరిధిలోని ఒక డీలర్‌తో రేషన్ మాఫియాకు నవంబరులో గొడవైంది. ఏకంగా డీలర్‌పైనే రేషన్ మాఫియా మనుషులు దాడిచేసి కొట్టారు. రేషన్ డీలర్ చీరాల టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదైంది. చీరాల నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. రేషన్ మాఫియా ఆగడాలు శృతిమించాయనడానికి ఈ రెండు ఘటనలు ఉదాహరణ.

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** పేదల బియ్యాన్ని చవగ్గా కొట్టేసి రీసైక్లింగ్ చేసి అక్రమార్జనకు పాల్పడుతున్న మాఫియా, రేషన్ డీలర్లను శాసిస్తోంది. పేదల కడుపుకొట్టి మొత్తం చౌక బియ్యాన్ని తమకే అప్పగించాలని బెదిరిస్తోంది. ఈ ప్రాంతంలో ఓ పచ్చనేత ఇలాగే రేషన్ మాఫియా నుంచి రూ.20 లక్షలు కప్పం పుచ్చుకుంటున్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. దీంతో రెచ్చిపోతున్న మాఫియా రేషన్ డీలర్లతో కుమ్మక్కైంది. ఈ అక్రమ వ్యాపారం తొలిరోజుల్లో కార్డుదారులకు కిలోకు రూ.8 నుంచి రూ.10.. డీలర్లకు రూ.13 చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు బియ్యానికి డిమాండ్ నెలకొనడంతో ఎక్కువ ధర ఇస్తామని వ్యాపారులు పోటీపడుతున్నారు. కిలో బియ్యానికి రూ.10 నుంచి రూ.13 ఇస్తామని లబ్ధిదారులకు.. అదే సమయంలో డీలర్లకు రూ.16 ఇస్తామని చెబుతున్నారు. ఈ డిమాండ్ నేపథ్యంలో.. లబ్ధిదారులు, డీలర్లు ఇంకా ఎక్కువ మొత్తం కోరుతున్నారు. మరోవైపు.. నియోజకవర్గ పచ్చనేతల డిమాండ్ కూడా పెరిగింది. ప్రారంభంలో చీరాల ప్రాంతంలోని ఒక పచ్చనేతకు నెలకు రూ.12 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న మాఫియా ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ. 20 లక్షలకు పెంచినట్లు సమాచారం. ఇలా పచ్చనేతకు పెద్ద మొత్తంలో కప్పం కడుతున్న చీరాల మాఫియా రేషన్ డీలర్లను ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. కొందరు ఎక్కువ మొత్తం కావాలని డిమాండ్ చేస్తూ బియ్యం సక్రమంగా ఇవ్వకపోవడంతో ఈ మాఫియా ప్రైవేటు సైన్యాన్ని పెట్టి బెదిరింపులకు దిగడమే కాక ఏకంగా భౌతికదాడులకు తెగబడుతోంది. రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సైతం నెలనెలా మామూళ్లు ఇస్తుండడంతో వారు మాఫియాకు దన్నుగా నిలుస్తున్నారు. వారిని అడ్డుపెట్టి మాటవినని డీలర్లపై సిక్స్-ఏ కేసులు నమోదు చేయించి డీలర్లను తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన వారి స్థానంలో తమకు అనుకూలంగా ఉన్న చుట్టుపక్కల డీలర్లకు ఈ షాపులను అప్పగిస్తున్నారు. దీంతో.. పచ్చనేత, అధికారుల మద్దతు ఉండడంతో రేషన్ మాఫియా ఆడింది ఆట పాడింది పాట అన్నట్లుగా ఉంటోంది. మరోవైపు.. కొందరు డీలర్లు కార్డుదారులకు బియ్యం అస్సలు ఇవ్వకుండా మొత్తం బియ్యం తీసేసుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే కార్డులు రద్దుచేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో రీసైక్లింగ్ చేసి కృష్ణపట్నం పోర్టు ద్వారా ఎగుమతి చేస్తున్నారు. కొందరు జిల్లాస్థాయి అధికారులు మాఫియాతో కుమ్మక్కై, తమకేమీ పట్టనట్లు మిన్నకుండి పోవడంతో రేషన్ దందా జోరుగా సాగుతోంది.

## 30మందిని కాపాడి ఆర్మీ జవాన్ వీరమరణం

- జమ్మూలో విధి నిర్వహణలో ఉండగా దుర్ఘటన
- ల్యాండ్‌మైన్‌ను గుర్తించి తోటి జవాన్‌లు 30 మందిని దూరంగా పంపిన సుబ్బయ్య
- అనంతరం దాని బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్
- మృతుడి స్వగ్రామం ప్రకాశం జిల్లా రావిపాడులో విషాదం



వరికుంట్ల సుబ్బయ్య (ఫైల్)

**కంభం/నార్పల:** తోటి జవాన్‌లు 30 మందిని ల్యాండ్‌మైన్ ఉచ్చు నుంచి కాపాడి.. తాను మాత్రం దాని బారిన బడి ప్రాణాలు కోల్పోయాడు. జమ్మూలో నియంత్రణ రేఖ వద్ద సోమవారం విధి నిర్వహణలో ఉన్న ఆర్మీ జవాన్ ల్యాండ్ మైన్ పేలి దుర్మరణం పాలయ్యాడు. ప్రకాశం జిల్లా రావిపాడుకు చెందిన వరికుంట్ల సుబ్బయ్య(45) జమ్మూలోని పూంచ్ జిల్లాలో 30 మంది జవానులతో కలిసి సరిహద్దు వద్ద కాపలా కాస్తున్నాడు. అంతలో అక్కడ ల్యాండ్‌మైన్ ఉన్నట్టు గుర్తించాడు. వెంటనే తోటి జవాన్లను దూరంగా పంపించేసి తాను పొరపాటున దాని ఉచ్చులో చిక్కుకున్నాడు. అది ఒక్కసారిగా పేలడంతో సుబ్బయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు ఆర్మీ అధికారులు సమాచారం ఇచ్చారు. అధికార లాంఛనాలు ముగించుకుని మృతదేహాన్ని బెంగళూరు వరకు విమానంలో.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తరలించనున్నట్లు సమాచారం. మృతుడి తండ్రి వెంకట సుబ్బయ్య కొన్నేళ్ల కిందట చనిపోగా, తల్లి గాలెమ్మ గ్రామంలోనే ఉంటోంది. కుమారుడు మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న ఆ తల్లి కుమారుడి ఫొటో పట్టుకుని గుండెలవిసేలా రోదిస్తోంది. మృతుడి భార్య లీల స్వగ్రామం అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం నార్పాల. ఇద్దరు పిల్లలతో ఆమె అక్కడే ఉంటోంది. మృతదేహాన్ని నార్పాల గ్రామానికి తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో బంధువులు అక్కడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. జవాన్ భౌతిక కాయానికి గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.



## చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఏ పోలీస్‌నూ వదిలిపెట్టం

- ప్రైవేటు కేసులతో న్యాయస్థానంలో నిలబెడతాం
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పోలీసులు యథేచ్ఛగా చట్ట ఉల్లంఘన చేస్తున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, ప్రైవేటు కేసులతో న్యాయస్థానంలో నిలబెడతామని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిబంధనల ప్రకారం నడుచుకోకుండా కూటమి నాయకుల ఒత్తిళ్లకు లోబడి పని చేస్తోందన్నారు. ఐజీ స్థాయి అధికారి మొదలు కానిస్టేబుల్ వరకు దాదాపు అందరూ అలాగే పని చేస్తున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో సివిల్ డ్రెస్‌లో నంబర్ ప్లేట్ లేని కారులో వెళ్లిన పోలీసులు ఒక దళిత కుటుంబానికి చెందిన సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌ను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి జిల్లా ఎస్పీకి ఫోన్ చేసినా పట్టించుకోలేదన్నారు. బెయిలబుల్ కేసుల్లో 41-ఏ నోటీస్ ఇవ్వాలని, అరెస్ట్ చేయడానికి వెళ్లినప్పుడు పోలీసుల ఐడెంటిటీ ఉండాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నా.. ఇవేవీ ఇక్కడి పోలీసులకు పట్టడం లేదన్నారు. సివిల్ డ్రెస్‌లు ధరించి నంబర్ ప్లేట్లు లేని కార్లు, బైకులపై వెళ్లి పలువుర్ని దౌర్జన్యంగా తీసుకెళ్లిపోతుండటంతో వచ్చిన వారు పోలీసులో గూండాలో కూడా అర్థం కాని దుస్థితి నెలకొందన్నారు.

**వాళ్లపై కేసులేవీ**

చంద్రబాబు మొదలుకొని మంత్రి లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు వంటి వారు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి 15 రోజులు గడిచినా పోలీసులు కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఒక సోషల్ మీడియా యాక్టివిస్ట్ తన స్టేటస్‌లో పార్టీకి చెందిన వీడియో పెట్టుకుంటే ఆ వ్యక్తిని తీసుకెళ్లి విపరీతంగా లాఠీలతో చావబాదారన్నారు. రాజమహేంద్రవరంలో పులి సాగర్ అనే దళిత విద్యావంతుడిని పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్ల ముందు అర్ధనగ్నంగా నిలబెట్టి బూతులు తిట్టి బెదిరించారని గుర్తు చేశారు. ఇంకా వందల మందిని ఇరికించే కుట్రలో భాగంగా బలవంతంగా సంతకాలు పెట్టించి కన్ఫెషన్ స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారందరి మీదా ప్రైవేట్ కేసులు పెడతామని, వారిని కోర్టు ముందు నిలబెడతామని చెప్పారు.


## వక్ఫ్ బోర్డు పునర్నియామక జీవోలను రద్దు చేయండి

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వక్ఫ్ బోర్డును నియమిస్తూ 2023లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవోని ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 30న జారీ చేసిన జీవో 75ను, అలాగే మొత్తం వక్ఫ్‌బోర్డును పునర్నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న జారీ చేసిన జీవో 77ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ జీవోలను రద్దు చేయాలని కోరుతూ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ, మీరా హుస్సేన్, ఖాదర్ బాషా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ, 2023లో జారీ చేసిన జీవో 47 ప్రకారం పిటిషనర్లు వక్ఫ్‌బోర్డు సభ్యుల పదవీ కాలం 2028 వరకు ఉందన్నారు. రాజకీయ కారణాలతో అకస్మాత్తుగా వీరిని తొలగించి మొత్తం బోర్డును పునర్నియమించారని వివరించారు. సభ్యులను తొలగించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. వక్ఫ్‌బోర్డు సభ్యులుగా పిటిషనర్లు కొనసాగేందుకు వీలుగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 13కు వాయిదా వేశారు.

## కాలువలో దూసుకెళ్లిన కారు

**తల్లి, కొడుకు మృతి..మరో కుమారుడు గల్లంతు**

**అరకు నుంచి తిరిగి వస్తుండగా విషాదం**



కాలువలోకి దూసుకెళ్లిన కారు

**పి.గన్నవరం :** విహార యాత్ర చివరికి విషాదంగా ముగిసింది. నిద్ర మత్తు కారణంగా కారు రోడ్డు పక్కన కాలువలోకి దూసుకెళ్లడంతో తల్లి, కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. మరో కుమారుడు పంట కాలువలో గల్లంతయ్యాడు. కుటుంబంలో భర్త మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన నేలపూడి విజయకుమార్ కారు డ్రైవర్. అతని భార్య ఉమ(31) కూడా కారు నడుపుతుంది. వీరి కుమారులు రోహిత్(9), మనోజ్(5). అరకు పరిసర ప్రాంతాలను సందర్శించేందుకు భార్యాభర్తలు గత శుక్రవారం ఇద్దరు కుమారులతో కలిసి కారులో వెళ్లారు. రెండు రోజులు ఆనందంగా గడిపి.. విశాఖ నుంచి తిరిగి ఇంటికి బయల్దేరారు. ఇంటికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈతకోట గ్రామానికి చేరుకునే సరికి విజయకుమార్‌కు నిద్ర రావడంతో.. కారు డ్రైవింగ్‌ను భార్య తీసుకుంది. చింతావారిపేట వచ్చేసరికి ఆ కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. నీట మునిగిన పెద్ద కుమారుడు రోహిత్‌ను తండ్రి ఒడ్డుకు చేర్చాడు. చుట్టూ చీకటి కారణంగా రోహిత్ మళ్లీ కాలువలోకి జారి పడి మునిగిపోయాడు. చిన్న కుమారుడు మనోజ్‌ను రక్షించే క్రమంలో భార్య ఉమ నీటిలో కొట్టుకుపోయింది. ముగ్గురినీ కాపాడుకునేందుకు భర్త విఫలయత్నం చేశాడు. ఉమ, రోహిత్ మృతదేహాలను స్థానికులు ఉదయం వెలికి తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## శబరిమలకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు



**రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):** శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యం కోసం ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లతో పాటు అదనంగా మరికొన్ని రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాకినాడ పోర్టు-కొల్లం (07173) ఈనెల 11, 18, 25 తేదీల్లో బుధవారం రాత్రి 11.50 గంటలకు కాకినాడ పోర్టులో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07174) ఈనెల 13, 20, 27 తేదీల్లో శుక్రవారం ఉదయం 8.40 గంటలకు కొల్లంలో బయలుదేరుతుంది. సికింద్రాబాద్-కొల్లం (07175) ఈనెల 19, 26 తేదీల్లో గురువారం రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07176) ఈనెల 21, 28 తేదీల్లో శనివారం ఉదయం 5 గంటలకు కొల్లంలో బయలుదేరుతుంది.

## 17 నుంచి శ్రీవారికి తిరుప్పావై

**16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం**



**తిరుమల:** తిరుమల శ్రీవారి మాసోత్సవాల్లో ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14తో ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్రనామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ ప్రసాదాలను నివేదిస్తారు.

## రద్దీరోజుల్లోనూ మల్లన్న స్పర్శదర్శనం



**శ్రీశైలం టెంపుల్:** రద్దీ రోజుల్లోనూ శ్రీశైల మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తూ ఈవో ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు తదితర రద్దీ రోజుల్లోనూ నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనం ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శదర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు.



# ఊరు ఉమెన్ అనుకున్నారా... నేషనల్!




ఆ ఊరి జనాభా పదకొండు వందలు కూడా ఉండదు. 'గ్రామాభివృద్ధికి జనాభా కాదు... చైతన్యం ప్రమాణం' అనుకుంటే చిల్లపల్లి చిన్న ఊరు కాదు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పెద్ద ఊరు. కేంద్ర ప్రభుత్వం 'దీన్‌దీయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్' పురస్కారాలు ప్రకటించింది. అందులో 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయితీ' విభాగంలో పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయితీకి రెండో ర్యాంకు వచ్చింది. నేడు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా చిల్లపల్లి గ్రామపంచాయతీ ఈ అవార్డులను అందుకోనుంది...

● చిల్లపల్లికి 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ'గా జాతీయ పురస్కారం ● నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

చిల్లపల్లి గ్రామంలో 1081 మంది జనాభా ఉండగా, అందులో 508 మంది మహిళలు ఉన్నారు. గ్రామంలో ఉన్న 33 స్వశక్తి సంఘాలలో 335 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ 'శ్రీ జ్యోతి గ్రామ సమైక్య సంఘం' ఏర్పాటు చేసుకుని రూ.3.35కోట్ల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. రుణవాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించడమే కాకుండా పొదుపు ఖాతాల్లో సైతం డబ్బును జమ చేస్తున్నారు. కిరాణాషాపులు, కుట్టు మిషన్‌లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్‌హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్, టిఫిన్‌సెంటర్‌లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండిగిర్ని, కూరగాయల సాగు, విక్రయం, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం... మొదలైన పనులతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు.

### సక్సెస్ మంత్రం ఇదే...

కొన్ని గ్రామాల్లో మహిళ సంఘాలలోని సభ్యులు డబ్బులు పొదుపు చేసి, రుణాలు తీసుకొని బయట అధిక వడ్డీకి ఇవ్వడానికి ఇష్టపడతారు. దీనివల్ల సంఘాలకు, సభ్యులకు పెద్దగా ఉపయోగం ఉండదు. ఈ విషయాన్ని గ్రహించిన చిల్లపల్లి గ్రామ మహిళలు పొదుపు చేసిన డబ్బులతో పాటు, ప్రభుత్వం ఇచ్చే రుణాలను ఉపాధి కల్పన కోసం ఉపయోగిస్తున్నారు. దీనివల్ల తాము ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి చూపించగలుగుతున్నారు. రుణాలు తీసుకోవడంతో పాటు జీరో బకాయిలతో ముందుకు వెళుతున్నారు.

ఆర్థిక స్వావలంబన నుంచి ఆరోగ్య పరిరక్షణ వరకు చిల్లపల్లి ఆదర్శగ్రామంగా నిలుస్తోంది.

'గ్రామాల్లో ఉండడం దండగ' అనుకుంటూ ఉపాధి కోసం పట్నం బాట పడుతున్న ఎన్నో కుటుంబాలకు చిల్లపల్లి కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. పట్టణంలో బతుకీడుస్తున్న వాళ్లను కూడా 'నేను నా ఊళ్లో హాయిగా బతక వచ్చు' అనుకునేలా భరోసా ఇస్తోంది. ఇంతకు మించిన విజయం ఏమిటి!

– గుడ్ల శ్రీనివాస్
సాక్షి, పెద్దపల్లి
ఫోటోలు: మర్రి సతీష్‌రెడ్డి

### రైతు మిత్రులు



రమాదేవి, సరోజన, సౌజన్య... ముగ్గురు కలిసి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ధాన్యం వచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లుకు తరలించే వరకు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రతి క్వింటాకు ప్రభుత్వం ఇచ్చే రూ.32 కమీషన్‌తో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రైతులకు చేదోడు వాదోడుగా ఉండడంతో పాటు ఐకేపీ సెంటర్‌ల ద్వారా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

### ఆ ఊళ్లో రోజూ పండగే!

ఆర్థిక స్వావలంబనలోనే కాదు ఆరోగ్యం, పారిశుధ్యంలోనూ చిల్లపల్లి ముందు ఉంటుంది. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంది. బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్‌పై. తల్లిదండ్రులకు పేరెంటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈ చిన్న ఊళ్లో గాఢమైన నిశ్శబ్దం రాజ్యమేలేది. పెద్ద సందడి ఉండేది కాదు. ఇప్పుడు అలా కాదు. 'ప్రతిరోజూ మా ఊళ్లో పండగే. సందడే' అన్నట్లుగా కనిపిస్తుంది. అది మహిళా చైతన్యానికి సంకేతమైన సందడి!

### మినీ ఏటీఎంతో....



డ్వాక్రా సంఘంలో చేరిన తరువాత సుమారు ఐదుసార్లు లోన్ తీసుకున్నాను. మొదటిసారి తీసుకున్నప్పుడు గేదెలు కొనుగోలు చేశాను. ఆ అప్పు తీర్చి మళ్లీ లోను ఎత్తుకుని పిల్లల చదువులకు ఉపయోగించాను. మరోసారి లోన్ ఎత్తుకొని సెంట్రింగ్ కర్రలు కొనుగోలు చేసి అద్దెకు ఇస్తున్నా. తరువాత మినీ ఏటీఎం నిర్వహించేందుకు ల్యాప్‌టాప్ కొనుగోలు చేసేందుకు లోన్ తీసుకున్నా. మినీ ఏటీఎం నిర్వహణతో నెలకు పదమూడు నుంచి పదిహేను వేల వరకు ఆదాయం వస్తుంది.

- కూర వనిత
మినీ ఏటీఎం నిర్వాహకురాలు

### అందుకే ఆదర్శంగా నిలిచింది



పన్నెండేళ్ల క్రితం మహిళ సంఘంలో చేరాను. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆరు సార్లు రుణం తీసుకున్నా. మొదట్లో అయిదువేలు ఎత్తుకోని కుట్టుమిషన్ కొన్నాను. తరువాత లోన్లు తీసుకుంటూ మగ్గం, మెడికల్ షాపు ఏర్పాటు చేసుకున్నాను. స్త్రీనిధి కింద రూ.75వేలు తీసుకుని కిరాణాషాపు ఏర్పాటు చేసుకున్నాం. సంఘంలో లోన్ తీసుకోవడం, ఆ పైసలను సద్వినియోగం చేసుకోవడం, తిరిగి సకాలంలో చెల్లించడంలో మా గ్రామ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తుంది.

- అరె.శ్వేత
మెడికల్ షాపు యజమాని

### ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం



నలుగురు కలిస్తే ఎన్ని అద్భుతాలు సాధించవచ్చో నిరూపించింది చిల్లపల్లి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఏ వ్యాపారానికైనా ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం. ఈ విషయంలో చిల్లపల్లి మహిళలు పర్‌ఫెక్ట్‌గా ఉన్నారు. 'ఫ్రెండ్లీ ఉమెన్ విభాగం'లో జాతీయ అవార్డు రావటం సంతోషంగా ఉంది. అయితే ఇది ఒక ఊరి విజయం మాత్రమే కాదు ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం. 'మనం కూడా ఇలా చేసి విజయం సాధించవచ్చు' అని ప్రతి గ్రామం ధైర్యం తెచ్చుకునే విజయం.

- సంతోషం పద్మ,
ఏపీఎం, మంథని

న్యూస్‌మేకర్



● పాయల్ కపాడియా



# పుష్పా సరే పాయల్‌ని చూడండి

**మన తెలుగు పుష్పా- 2 రికార్డు బద్దలు కొడుతోంటే అదే సమయంలో మన భారతీయ మహిళా డైరెక్టర్ 80 ఏళ్ల చరిత్ర గల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో రెండు నామినేషన్స్ సాధించి రికార్డు స్థాపించింది. బెస్ట్ డైరెక్టర్ (మోషన్ పిక్చర్) బెస్ట్ మోషన్ పిక్చర్ (నాన్ ఇంగ్లిష్) కేటగిరీల్లో ఆమె దర్శకత్వం సినిమా 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' నామినేషన్ పొందింది. ఇంతకు ముందు ఇలాంటి ఘనత సాధించిన మన దేశపు మహిళ మరొకరు లేరు.**




'సినిమా తీయాలంటే అందరికీ ఫిల్మ్ స్కూల్ అక్కర్లేదు. కాని నాకు ఉపయోగపడింది' అంటారు పాయల్ కపాడియా. ముంబైలో, ఆంధ్రప్రదేశ్‌లోని రిషి వ్యాలీలో బాల్యం, కౌమారం గడిచిన పాయల్ పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్షన్ కోర్సు చదివి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకురాలు అయారు. 2014 నుంచి సినిమాలు తీస్తున్నా 2021లో తీసిన డాక్యుమెంటరీ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'తో ఆమె ప్రతిభ లోకానికి పరిచయం కాసాగింది.

### ఎవరికీ లేని ఘనత

ఆస్కార్ అకాడెమీ అవార్డ్స్‌తో సమానమైన ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కోసం పోటీ పడే భారతీయ సినిమాలు చాలా తక్కువ. 1994లో చివరిసారిగా ఒక భారతీయ సినిమా నామినేషన్ పొందింది. ఆ తర్వాత ఇన్నాళ్లకు అదీ ఒక మహిళా దర్శకురాలిగా పాయల్ కపాడియా తాను తీసిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'తో 2024 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ డైరెక్టర్', 'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' విభాగం కింద రెండు నామినేషన్స్ పొందారు. ఇప్పటికే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో రెండవ ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ డైరెక్టర్ అవార్డును (గ్రాండ్ ప్రి) పొందిన డింపుల్ కపాడియా గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా సాధిస్తే ఆమె పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోతుంది.

### సినిమాలు చూస్తూ...

పాయల్ కపాడియా బాల్యంలో రిషి వ్యాలీలోనే సినిమాల మీద ఆసక్తి పెంచుకున్నారు. 'మా అమ్మా నాన్నలు నాకు చిన్నప్పుడు ప్రగతికాముక సినిమాలు చూపించేవారు. రష్యన్, ఫ్రెంచ్ సినిమాలు... ఆనంద్ పట్వర్ధన్ తీసిన డాక్యుమెంటరీలు చూస్తూ పెరిగాను. ఆ తర్వాత పూణెలో డైరెక్షన్ కోర్సులో చేరాక వేరు వేరు ప్రాంతాల, నేపథ్యాల నుంచి వచ్చిన బ్యాచ్‌మేట్స్ సినిమాల గురించి ఎన్నో చర్చలు సాగించేవారు. రోజూ స్క్రిప్ట్‌లు వినడమే సరిపోయేది. అదంతా చిన్న ఎక్స్‌పోజర్ కాదు. అలాగే ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రాక్టికల్స్ ఉండేవి. అవి చేసే ముందు కష్టంగా ఉన్నా చేశాక ఏదో తెలుసుకున్నాం అనే సంతృప్తి ఉండేది. ఉదాహరణకు అందరూ తప్పనిసరిగా 4 నిమిషాల లాంగ్‌షాట్ తీయాలి మా ప్రాక్టికల్ ఫిల్మ్స్‌లో. ఎవరు ఎలా తీస్తారనేది ఒక అనుభవం. మా ప్రొఫెసర్లు కూడా ఎంతో బాగా పాఠాలు చెప్పారు. అవన్నీ నేను దర్శకురాలు కావడానికి సాయం చేశాయి' అంటారామె.


### ముగ్గురు స్త్రీలు, ఒక నగరం

మూడు నాలుగేళ్లుగా రాసుకున్న స్క్రిప్ట్ 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'ను తీయడానికి కావలసిన బడ్జెట్ కోసం ఫ్రాన్స్, ఇటలీ, లగ్జంబర్గ్, ఇండియా, నెదర్లాండ్స్‌లోని ప్రొడక్షన్ సంస్థలను ఆశ్రయించి వారి సహ భాగస్వామ్యంతో పూర్తి చేశారు పాయల్. కేరళ నుంచి ముంబైకి భుక్తి కోసం వచ్చిన ఇద్దరు నర్సుల కథ ఇది. వీరు పనిచేసే ఆస్పత్రిలోనే వంటమనిషిగా చేస్తున్న మహారాష్ట్ర మహిళ వీరితో కలుస్తుంది. ఆ నర్సుల్లో ఒకామె భర్త ఆమెను విడిచిపెట్టి జర్మనీ వెళ్లిపోయి ఉంటాడు. మరో నర్సు అవివాహితగా ఉంటూనే ఒక యువకునితో రిలేషన్‌లో ఉంటుంది. ఇక వంటామె ఇరవై ఏళ్లుగా తాను ఏ చాల్ (చిన్న కొట్టం)లో అయితే నివసిస్తోందో ఆ చాల్‌ను బిల్డర్ కూల్చడానికి వస్తే దానిని సొంతం అని చెప్పుకోవడానికి ఏ పత్రమూ లేక కలిగే నిస్పృహ... ఈ ముగ్గురి జీవితం ఎక్కడకు చేరుతుంది... ఏ వెలుతురికీ ప్రస్థానం అని చూపేదే కథ.

### లోతైన కథనం

పాయల్ కపాడియా ఈ కథలో ఎన్నో పొరలు ఉంచి కథకు బహుముఖ పార్శ్వాలు ఇవ్వడమే ప్రపంచ విమర్శకులను ఆకర్షించి అవార్డుల పంట పండేలా చేస్తోంది. ఈ కథలో మూడు పాత్రలతో పాటు ముంబై నగరం కూడా ఒక పాత్రగా ఉండటం విశేషం. ఒక నగరం పెరిగే కొద్దీ పేదవాళ్లను దూరంగా నెట్టేస్తూ ఉంటుందని ఈ సినిమా చూపుతుంది. ఒకప్పటి మామూలు ఏరియా ఖరీదైన భవంతులతో నిండిపోతే అప్పటివరకూ అక్కడ ఉన్నవారు ఎక్కడకు వెళ్లి వుంటారు? ఎవరూ ఆలోచించరు. 'ఈ నగరం కలల నగరం అని కొందరు అనుకుంటారు. ఇది భ్రాంతుల నగరం. కలా నిజమా... తెలుసుకునే లోపే జీవితం గడిచిపోతుంది' అనే డైలాగ్ ఇందులో ఉంది. 'నువ్వు జీవితాన్ని తప్పించుకోలేవు' అనే డైలాగ్ కూడా ఉంది. తప్పించుకోలేని జీవితంలో తగిన ఆనందాలు వెతుక్కోవడం ఎలాగో ప్రతి జీవికీ తెలుస్తుంది. ఈ కథలోని ముగ్గురు స్త్రీలు ఆ ఆనందాలను వెతుక్కుని వెలుతురు పొందుతారు.

జనవరి 5న గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ఈవెంట్ ఉంది. చూద్దాం మన అదృష్టం.



# ఎగతాళి నుంచి సంతాలి రుచుల దాకా...

మధుస్మిత సోరెన్ ముర్ము ఓ ట్రెండ్‌సెట్టర్. సంతాలి ఆదివాసీ వంటకాలను, ఇటాలియన్ వంటకాల శైలితో మేళవించి కొత్త రుచులను ఆవిష్కరిస్తోంది. సంతాలి సంప్రదాయ వంటల గురించి బ్లాగ్‌లో రాస్తోంది. కొద్దిరోజుల్లోనే ఓ సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుంది మధుస్మిత. బాల్యంలో ఎదురైన చిన్న చూపు నుంచి ఎదిగిన విజయ కిరణం ఆమె. ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లా, రాయ్‌రంగపూర్ అమ్మాయి మధుస్మిత.



● మధుస్మిత



### పోటీలో విజయం

ఆదివాసీల ఆహారపు అలవాట్లు నాగరక సమాజానికి భిన్నంగా ఉంటాయి. అడవుల్లో దొరికే చీమలు, నత్తలు, ఇతర కీటకాల వంటలు వారి ఆహారంలో ప్రధానంగా ఉంటాయి. లంచ్ బాక్సులో ఆమె ఆహారాన్ని చూసిన ఇతర విద్యార్థులు ఆమెను తక్కువగా చూసేవారు. అప్పటి నుంచి ఆమెలో తమ ఆహారపు అలవాట్లను నాగరకులు ఎందుకు తక్కువగా చూస్తారు... అనే సందేహం కలిగింది. ఆమెతోపాటే ఆమె సందేహం కూడా పెద్దదైంది. 'ఒడిశా హోమ్‌ఫుడ్ షెఫ్' పోటీల్లో గెలవడం మధుస్మితలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తమ సంప్రదాయ వంటకాలను ఇతర ప్రాంతాల వంటకాల శైలితో మేళవించి వండడం అనే ప్రయోగం కూడా విజయవంతమైంది. బీటెక్ చదివేనాటికి ఆమెకు ఒక పరిష్కారం దొరికింది. ఆ పరిష్కారం విజయవంతం అవుతుందా లేదా అనే ప్రశ్నకు కోవిడ్ లాక్‌డౌన్ చక్కటి సమాధానాన్ని చెప్పింది. లాక్‌డౌన్ సమయంలో వంటల మీద పరిశోధనలు మొదలుపెట్టింది. లాక్‌డౌన్ తర్వాత సంతాలి వంటలు ఎన్ని రకాలున్నాయో తెలుసుకోవడానికి ఆ గ్రామాల్లో పర్యటించింది. ఎలా వండుతున్నారో తెలుసుకుంది. తెలుసుకున్న విషయాలను బ్లాగ్‌లో రాయడం మొదలుపెట్టింది. ఇప్పుడామె చెఫ్‌లకు శిక్షణనిస్తోంది. ప్రముఖ రెస్టారెంట్‌లలో సంతాలి తెగ వంటకాలు ప్రముఖ స్థానంలో కనిపిస్తున్నాయి. 2022లో మాస్టర్ షెఫ్ పోటీల్లో పాల్గొంది. ఆమె చేసిన రెండు వంటలు న్యాయనిర్ణేతల జిహ్వను మైమరిపించాయి. ఇటాలియన్ వంటకం పోలెంతాని మధుస్మిత స్థానిక పద్ధతిలో ఎర్రబియ్యంతో చేసింది. వేయించిన చికెన్‌కు తోడుగా ఎర్ర చీమల చట్నీ వడ్డించింది. అలాగే పాల్వా చట్నీతో పాట్లపీత వంటకం కూడా. ఎండిన చింతాకు పొడితో చేసిన వంటకాలను నగరవాసులు లొట్టలేసుకుని తింటున్నారు.

### గవర్నమెంట్ ఉద్యోగం కంటే ఎక్కువ

''మా తల్లిదండ్రుల ఆలోచనలు చాలా సంప్రదాయబద్ధమైనవి. నేను బాగా చదువుకుని ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనుకునేవారు. కానీ నేను మాత్రం మా సంతాలి తెగ మీద సమాజంలో నెలకొని ఉన్న తేలిక అభిప్రాయాన్ని తొలగించాలనుకున్నాను. సంతాలి వంటకాలను తెలియచేసే ఫుడ్ బ్లాగర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యాను. మా వంటలను పరిచయం చేశాను. ప్రపంచ పటంలో వంటకాల్లో ఇటలీకున్న స్థానంలో మా సంతాలి వంటకాలను చేర్చగలిగాను. పెద్ద పేరున్న రెస్టారెంట్‌లు మా వంటకాలకు మెనూ కార్డులో 'ట్రైబల్ క్విజిన్' అని ప్రత్యేక కేటగిరీ కల్పిస్తున్నారు. ఇప్పుడు మా సంతాలి వంటకాలు ప్రపంచ ఆహారపట్టికలో ఉన్నాయి. నేను అనుకున్నది సాధించాను'' అని సంతోషంగా చెప్తోంది 32 ఏళ్ల మధుస్మిత. బాల్యంలో మనసుకైన గాయంతో తమ సంతాలి తెగకు ప్రపంచస్థాయి గౌరవాన్ని తెచ్చి పెట్టింది మధుస్మిత సోరెన్ ముర్ము.

# ప్రతిష్ఠాత్మక పదవిలో...



● అనౌష్క కాలే

ఇరవై సంవత్సరాల బ్రిటిష్-ఇండియా స్టూడెంట్ అనౌష్క కాలే కేంబ్రిడ్జిలోని చారిత్రాత్మకమైన 'కేంబ్రిడ్జి యూనియన్ డిబేటింగ్ సొసైటీ' అధ్యక్షురాలిగా ఎన్నికైంది. కేంబ్రిడ్జి యూనివర్శిటీలో ఇంగ్లీష్ సాహిత్యం చదువుతున్న కాలే ఈ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టిన అతి కొద్దిమంది దక్షిణాసియా మహిళల్లో ఒకరిగా నిలిచింది.

'ఎంతో చరిత్ర కలిగిన కేంబ్రిడ్జి యూనియన్ సొసైటీకి అధ్యక్షురాలిగా ఎన్నిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అంటుంది అనౌష్క.

వివిధ సాంస్కృతిక సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా యూనియన్‌లో మరింత వైవిధ్యాన్ని తీసుకువస్తాను అని చెబుతుంది. గ్లోబల్ డిబేట్స్‌పై తనకు ఉన్న ఆసక్తిని తెలియజేసింది. ఇంటర్నేషనల్ స్పీకర్స్‌కు ఆతిథ్యం ఇవ్వడంపై ప్రధానంగా దృష్టి సారించింది.

లీగల్

# అవి ఒరిజినల్ దస్తావేజులతో సమానం

**మేము 15 సంవత్సరాల క్రితం ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటు కొన్నాము. ఇప్పుడు అమ్మాలి అనుకుంటున్నాము. అయితే కొన్ని సంవత్సరాల క్రితం మా ఒరిజినల్ దస్తావేజులు పోయాయి. మేము రెవెన్యూ ఆఫీసు నుంచి సర్టిఫైడ్ కాపీలను తీసుకున్నాము. ఆ కాపీల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని కొనుక్కునే వారికి చెప్పగా వారు వెనకడుగు వేస్తున్నారు. కొందరేమో 'కాగితాల పని మేము చూసుకుంటాము కానీ పాతిక లక్షలు తక్కువ ఇస్తాం..' అంటున్నారు. నాకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. దయచేసి పరిష్కారం చూపగలరు.**

**– విజయ్ వర్ధన్, వరంగల్**

ఇంటి రిజిస్ట్రేషన్ / పూర్వ ఒరిజినల్ పత్రాలు లేనప్పుడు కొనేవారు కొంత సంకోచించడం సమంజసమే. ఒరిజినల్ దస్తావేజులని ప్రైవేటు వ్యక్తుల దగ్గర తాకట్టుపెట్టి తర్వాత అదే ఆస్తిని మరొకరికి అమ్మడం తరచుగా జరుగుతూ ఉంటుంది. ప్రైవేట్ తాకట్టు ఈ.సీ లో కూడా కనపడదు కాబట్టి కొనుక్కునేవారు అమాయకంగా మోసపోతూ తర్వాత కోర్టుల చుట్టూ తిరగడం సర్వసాధారణం అయిపోయింది. టైటిల్ డీడ్ డిపాజిట్ చేస్తే తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి అనే నిబంధన లేకపోవడం ఇందుకు కారణం.

ఒరిజినల్ దస్తావేజులు లేని కారణం చూపించి మార్కెట్ విలువ కన్నా తక్కువ ధరకు మాత్రమే కొంటాము అని చాలామంది అంటారు. ఒరిజినల్ పత్రాలు లేనంత మాత్రాన ఆ స్థలం కానీ, ఇల్లు కానీ మీది కాకుండా పోదు, మీకు మీ ఆస్తిని అమ్మే హక్కు లేకుండా పోదు! మీరు తక్షణమే మీ ఇంటి పత్రాలు పోయాయి అని పోలీసులకి ఫిర్యాదు ఇవ్వండి. అదే విధంగా మీరు ఒక లాయర్ ద్వారా పేపర్ ప్రకటన కూడా ఇవ్వవలసి ఉంటుంది. అలా ఇచ్చిన ప్రకటన కాపీలను మరలా పోలీసు వారికి అందించాలి. పోలీసు వారు 'ఫలానా వారి దస్తావేజులు పోయాయి, తిరిగి వెతికినా దొరకడం లేదు' అని ధ్రువీకరిస్తూ ఒక సర్టిఫికెట్ (నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్) జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ను తీసుకొని మీరు రెవెన్యూ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకుంటే మీకు డూప్లికేట్ కాపీలు ఇస్తారు. అలా పొందిన పత్రాలు ఒరిజినల్ దస్తావేజులతో సమానం. మీరు వివరించిన పరిస్థితులలో అమ్మే వారికి – కొనేవారికి కూడా ఇది సురక్షితమైన పరిష్కారం.



**- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది**

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

# హక్కుల గొంతుక



● హర్మీత్ కే ఢిల్లాన్

భారత సంతతికి చెందిన లాయర్ హర్మీత్ కే ఢిల్లాన్‌ను న్యాయశాఖ అసిస్టెంట్ అటర్నీ జనరల్(సివిల్ రైట్స్)గా నామినేట్ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు.

'పౌరహక్కులను కాపాడడానికి హర్మీత్ గట్టిగా నిలబడింది. హర్మీత్ సమర్థవంతురాలైన న్యాయవాది' అని 'ట్రూత్' సోషల్ పోస్ట్‌లో రాశాడు ట్రంప్.

పంజాబ్‌లో పుట్టింది హర్మీత్ ఢిల్లాన్. తండ్రి తేజ్‌పాల్‌సింగ్ ఢిల్లాన్ ఆర్థోపెడిక్ సర్జన్. అతడు యుఎస్‌లో అడుగుపెట్టినప్పుడు హర్మీత్ చిన్న పిల్ల. తేజ్‌పాల్‌సింగ్ కుటుంబం నార్త్ కరోలినాలోని స్మిత్‌ఫీల్డ్‌లో స్థిరపడింది. 'డార్ట్ మౌత్ కాలేజీ'లో చదువుకున్న హర్మీత్‌కు హైస్కూల్ రోజుల నుంచి రచనలు చేయడం అలవాటు

కాలేజీ మ్యాగజైన్ 'ది డార్ట్ మౌత్ రివ్యూ'కు ఎడిటర్–ఇన్–చీఫ్‌గా పనిచేసింది.

స్కూల్ ప్రెసిడెంట్, అతని విధానాలను విమర్శిస్తూ వ్యంగ్యాత్మక రచన చేసింది. వివక్షపూరిత విధానాల ప్రెసిడెంట్‌ను హిట్లర్‌తో పోల్చింది. ఈ సెటైర్ పెద్ద వివాదంగా మారింది.

'డార్ట్ మౌత్'లో చదువు పూర్తయిన తరువాత 'వర్జీనియా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ లా'లో చదువుకుంది. 'వర్జీనియా లా రివ్యూ' ఎడిటోరియల్ బోర్డ్‌లో పనిచేసింది.

అమెరికాలోని టాప్ ఎలక్షన్ లాయర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న హర్మీత్ ఢిల్లాన్ ట్రంప్ 2020 ఎలక్షన్ క్యాంపెయిన్‌లో లీగల్ అడ్వైజర్‌గా పనిచేసింది.




## గుకేశ్, డింగ్ లిరెన్ కీలక పోరు నేడు

సింగపూర్ సిటీ: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ కీలకదశకు చేరుకుంది. భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ మధ్య జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోరులో నేడు 13వ గేమ్ జరగనుంది. వీరిద్దరి మధ్య మొత్తం 14 గేమ్‌లను నిర్వహించనుండగా... ఇప్పటికి 12 గేమ్‌లు ముగిశాయి. గుకేశ్, లిరెన్ చెరో రెండు గేముల్లో గెలిచారు. మిగతా ఎనిమిది గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. వీరిద్దరు 6-6 పాయింట్లతో సమఉజ్జీగా ఉన్నారు. నేడు జరిగే 13వ గేమ్‌లో గుకేశ్ తెల్ల పావులతో ఆడతాడు. ఈ నేపథ్యంలో గుకేశ్ ఓపెనింగ్‌కు డిఫెండింగ్ చాంప్ లిరెన్ ఏ విధంగా జవాబు ఇస్తాడో చూడాలి. ఇప్పటికే ఒకసారి ప్రపంచ చాంపియన్ అయిన లిరెన్‌కు గత అనుభవం కలిసొచ్చే అవకాశముంది. 13వ గేమ్‌లో గుకేశ్ గెలిస్తే, చివరిదైన 14వ గేమ్‌లో లిరెన్ తీవ్ర ఒత్తిడిలో బరిలోకి దిగాల్సి ఉంటుంది. ఒకవేళ గేమ్ 'డ్రా' అయినా, గుకేశ్ ఓడినా... చివరి గేమ్‌లో తెల్ల పావులతో ఆడనున్న లిరెన్‌కు పరిస్థితి పూర్తి అనుకూలంగా ఉంటుంది.



పుల్లెల గాయత్రి
ట్రెసా జాలీ

# విజయోస్తు!

- నేటి నుంచి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్
- మహిళల డబుల్స్ బరిలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం
- భారత జోడీకి క్లిష్టమైన 'డ్రా'

హాంగ్జౌ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) సీజన్ ముగింపు టోర్నమెంట్ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు నేడు తెర లేవనుంది. ఐదు రోజులపాటు జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో మొత్తం ఐదు విభాగాల్లో (పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్) మ్యాచ్‌లను నిర్వహిస్తారు. ఈసారి భారత్ నుంచి కేవలం మహిళల డబుల్స్‌లో మాత్రమే ప్రాతినిధ్యం ఉంది. భారత బ్యాడ్మింటన్ జట్టు చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె పుల్లెల గాయత్రి, కేరళ అమ్మాయి ట్రెసా జాలీ మహిళల డబుల్స్‌లో జోడీగా బరిలోకి దిగనున్నారు. ఈ ఏడాది ఆయా టోర్నీలలో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా టాప్-8లో నిలిచిన వారు వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత సాధించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో భారత క్రీడాకారులెవరూ టాప్-8లో నిలవకపోవడంతో ఈ టోర్నీలో పాల్గొనే అవకాశాన్ని పొందలేకపోయారు. ఈ టోర్నీ చరిత్రలో భారత్ నుంచి పీవీ సింధు 2018లో మహిళల సింగిల్స్ విభాగంలో చాంపియన్‌గా నిలిచింది.

**కఠిన ప్రత్యర్థులే...**

సీజన్ ముగింపు టోర్నీలో గాయత్రి–ట్రెసా జోడీకి క్లిష్టమైన 'డ్రా' పడింది. మహిళల డబుల్స్ గ్రూప్ 'ఎ'లో ప్రపంచ నంబర్‌వన్ జంట లియు షెంగ్ షు–టాన్ నింగ్ (చైనా), ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ షిడా చిహారు–నామి మత్సుయామ (జపాన్), ప్రపంచ ఆరో ర్యాంకర్ ద్వయం పియర్లీ టాన్–థీనా మురళీధరన్ (మలేసియా)లతో 13వ స్థానంలో ఉన్న గాయత్రి–ట్రెసా తలపడాల్సి ఉంది. బుధవారం జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ లియు షెంగ్ షు–టాన్ నింగ్‌లతో గాయత్రి–ట్రెసా ఆడతారు.

**ప్రైజ్‌మనీ ఎంతంటే...**

వరల్డ్ టూర్ ఫైనల్స్ మొత్తం ప్రైజ్‌మనీ 25 లక్షల డాలర్లు (రూ. 21 కోట్ల 21 లక్షలు). పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 2 లక్షల డాలర్ల (రూ. 1 కోటీ 69 లక్షలు) చొప్పున... మూడు డబుల్స్ విభాగాల్లో టైటిల్స్ నెగ్గిన వారికి 2 లక్షల 10 వేల డాలర్ల (రూ. 1 కోటీ 78 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభిస్తుంది. రన్నరప్, సెమీఫైనలిస్ట్‌లకు, గ్రూపుల్లో మూడో స్థానంలో, నాలుగో స్థానంలో నిలిచిన వారికి కూడా ప్రైజ్‌మనీ అందజేస్తారు.

## శ్రీతేజకు రజతం




భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన థోలెం శ్రీతేజ రజత పతకం సాధించింది. భద్రాచలం పట్టణానికి చెందిన శ్రీతేజ అండర్-18 మహిళల హెప్టాథ్లాన్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 1000 మీటర్లు) సమాహారమైన హెప్టాథ్లాన్‌లో శ్రీతేజ మొత్తం 5087 పాయింట్లు స్కోరు చేసి రన్నరప్‌గా నిలిచింది. హరియాణాకు చెందిన పూజా (5102 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని... ఖుషీ (4350 పాయింట్లు) కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు.

# ఎంసీజీ 'హౌస్‌ఫుల్'

**భారత్, ఆస్ట్రేలియా 'బాక్సింగ్ డే' టెస్టు తొలి రోజు టికెట్లన్నీ ఖతం**

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'కి అభిమానులు పోటెత్తుతున్నారు. గత రెండు మ్యాచ్‌లను వీక్షించేందుకు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు మైదానాలకు తరలిరాగా... ఇరు జట్ల మధ్య ఈ నెల 26 నుంచి జరగనున్న 'బాక్సింగ్ డే' టెస్టు మ్యాచ్ తొలి రోజు టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరగనున్న నాలుగో టెస్టు తొలి రోజు ఆటకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్నీ టికెట్లు అమ్ముడుపోయినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మంగళవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. అడిలైడ్ వేదికగా జరిగిన 'పింక్ బాల్' టెస్టును మూడు రోజుల్లో కలిపి రికార్డు స్థాయిలో 1,35,012 మంది వీక్షించినట్లు సీఏ తెలిపింది. 2014–15లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌ను ఐదు రోజుల్లో కలిపి 1,13,009 మంది వీక్షించగా... ఇప్పుడు కేవలం మూడు రోజుల్లోనే ఆ సంఖ్య దాటిపోయింది. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో ఇప్పటి వరకు రెండు మ్యాచ్‌లు ముగియగా... 1–1తో సిరీస్ సమంగా ఉంది. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి బ్రిస్బేన్‌లో మూడో టెస్టు మొదలవుతుంది.



**91,112** ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య 2013లో మెల్‌బోర్న్‌లో జరిగిన 'బాక్సింగ్ డే' టెస్టు తొలి రోజున హాజరైన ప్రేక్షకులు సంఖ్య ఇప్పటి వరకు ఇదే అత్యధికం. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈనెల 26న మొదలయ్యే 'బాక్సింగ్ డే' టెస్టు తొలి రోజున ఈ రికార్డు బద్దలయ్యే అవకాశం ఉంది.



భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసింది. ఈ నెల 22న ఉదయ్‌పూర్‌లో జరగనున్న తన వివాహానికి రావాల్సిందిగా కాబోయే భర్త వెంకట దత్తసాయితో కలిసి సింధు ప్రధానిని ఆహ్వానించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నిర్మలా సీతారామన్‌ను కూడా కలిసి పెళ్లి పత్రికలు అందించింది. కాబోయే దంపతుల వెంట సింధు సోదరి దివ్య కూడా ఉంది.

# ముమ్మర సాధన

**బ్రిస్బేన్ టెస్టు కోసం భారత జట్టు సన్నాహాలు ● అడిలైడ్‌లో నెట్ ప్రాక్టీస్**



కోహ్లి, రోహిత్

అడిలైడ్: రెండో టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో ఘోర పరాజయం మూటగట్టుకున్న భారత జట్టు తిరిగి గాడిన పడటంపై దృష్టి పెట్టింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య అడిలైడ్ వేదికగా 'గులాబీ బంతి'తో జరిగిన రెండో టెస్టు మూడు రోజుల్లోనే ముగియగా... మంగళవారం టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. 'అదనపు సమయాన్ని హోటల్ రూమ్స్‌లో కాకుండా... మైదానంలో గడపండి' అని మాజీ ఆటగాడు సునీల్ గావస్కర్ అన్న మాటల ప్రభావమో, లేక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించాలనే తపనో కానీ మంగళవారం భారత ఆటగాళ్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా ఇరు జట్ల మధ్య శనివారం నుంచి బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టు ప్రారంభం కానుంది. దీని కోసం బుధవారం బ్రిస్బేన్ బయలుదేరనున్న టీమిండియా... మంగళవారం అడిలైడ్‌లో కఠోర సాధన చేసింది. దీనికి సంబంధించిన వీడియోను బీసీసీఐ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'మూడో టెస్టు కోసం సాధన మొదలైంది' అని రాసుకొచ్చింది. గత 12 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో కేవలం ఒకే ఒక్క అర్ధశతకంతో 142 పరుగులు మాత్రమే చేసిన రోహిత్ శర్మ... పేసర్లు, స్పిన్నర్లను ఎదుర్కొంటూ కనిపించగా... పెర్త్ టెస్టులో సెంచరీ బాదిన కోహ్లి తన ఆఫ్‌స్టంప్ బలహీనతను అధిగమించడంపై దృష్టి పెట్టాడు. హెడ్ కోచ్ గంభీర్ పర్యవేక్షణలో ఆటగాళ్లంతా నెట్స్‌లో సుదీర్ఘంగా ప్రాక్టీస్ చేశారు. కేఎల్ రాహుల్ డిఫెన్స్‌పై దృష్టి సారించగా... పంత్ భారీ షాట్లు సాధన చేశాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ పేసర్లతో బంతులు వేయించుకొని ప్రాక్టీస్ సాగించాడు. హర్షిత్ రాణా, ఆకాశ్‌దీప్, యశ్ దయాళ్, జడేజా, రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్ బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. వీరితో పాటు త్రో డౌన్ స్పెషలిస్ట్‌ల బంతులతో కూడా బ్యాటర్లు సాధన చేశారు. సీనియర్ పేసర్లు బుమ్రా, సిరాజ్‌తో పాటు ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నారు.

బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటి వరకు 7 టెస్టులు జరిగాయి. ఒక మ్యాచ్‌లో భారత్ నెగ్గగా... ఐదు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలిచింది, మరో మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# సినిమా

## వేసవిలో షురూ


● అల్లు అర్జున్

'పుష్ప 2: ది రూల్' సినిమా సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్నారు అల్లు అర్జున్. అయితే ఆయన నటించనున్న తర్వాతి చిత్రంపై ఫిల్మ్‌నగర్‌లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్ ఇప్పటికే దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, సందీప్ రెడ్డి వంగాలతో సినిమాలు చేసేందుకు పచ్చజెండా ఊపారు. అయితే ప్రస్తుతం ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమా చేసే పనిలో బిజీగా ఉన్నారు సందీప్ రెడ్డి. దీంతో అల్లు అర్జున్ తర్వాతి మూవీ త్రివిక్రమ్‌తోనే ఉండబోతుందనే విషయం స్పష్టం అవుతోంది. 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల.. వైకుంఠపురములో...' వంటి సూపర్‌హిట్ ఫిల్మ్స్ తర్వాత అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. హారిక హాసినీ క్రియేషన్స్, గీతా ఆర్ట్స్ సంస్థలు నిర్మించనున్న ఈ సినిమాని గత ఏడాది జూలైలో ప్రకటించారు. ఈ సినిమా గురించి సంక్రాంతి సందర్భంగా ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అంతేకాదు.. ఈ మూవీని వచ్చే వేసవిలో సెట్స్‌పైకి తీసుకెళ్లేలా సన్నాహాలు చేస్తున్నారట అల్లు అర్జున్, త్రివిక్రమ్. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


## కౌంట్‌డౌన్ స్టార్ట్



● రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్' విడుదలకి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. సరిగ్గా 30 రోజుల్లో(జనవరి 10) ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించి, రామ్‌చరణ్ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటించిన చిత్రం 'గేమ్ చేంజర్'. 'వినయ విధేయ రామ' చిత్రం తర్వాత రామ్‌చరణ్–కియారా అద్వానీ రెండోసారి 'గేమ్ చేంజర్'లో జోడీగా నటించారు. ఈ సినిమాలో అంజలి, ఎస్‌జే సూర్య, సముద్రఖని, జయరాం ఇతర పాత్రలు పోషించారు. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదలకానుంది. పొలిటికల్, యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రూపొందింది. కాగా ఈ సినిమా విడుదలకి 30 రోజులు ఉండటంతో కౌంట్‌డౌన్ స్టార్ట్ అంటూ బైక్ పై వస్తున్న రామ్‌చరణ్ సరికొత్త లుక్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. ఇదిలా ఉంటే.. 'గేమ్ ఛేంజర్' కు సంబంధించిన ఓ వీడియోను రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చిత్రబృందంతో షూటింగ్‌లో పాల్గొన్న క్షణాలను వీడియో రూపంలో షేర్ చేశారాయన. 'గేమ్ ఛేంజర్'కి తమన్ సంగీతం అందించారు.

## థర్టీ ఇయర్స్ తర్వాత...


● రజనీకాంత్


● ఆమిర్ ఖాన్

'కూలీ' సినిమా కోసం దాదాపు మూడు దశాబ్దాల తర్వాత రజనీకాంత్, ఆమిర్ ఖాన్ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, ఉపేంద్ర, శ్రుతీహాసన్, సత్యరాజ్, రెబ్బా మౌనికా జాన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ఈ చిత్రంలోని మరో కీలక పాత్రలో ఆమిర్‌ఖాన్ నటిస్తున్నారు. 'కూలీ' సినిమా లేటెస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ జైపూర్‌లో మొదలైందని కోలీవుడ్ సమాచారం. రజనీ, ఆమిర్‌తో పాటుగా ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు మేకర్స్. 'కూలీ' సినిమాలో ఆమిర్‌ఖాన్ నటిస్తారనే ప్రచారం గతంలో సాగింది. తాజాగా ఆయన జైపూర్‌కు వెళ్లడంతో ఈ మూవీలో ఓ రోల్‌లో నటిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. 1995లో వచ్చిన 'అతంక్ హీ అతంక్' సినిమాలో రజనీకాంత్, ఆమిర్‌ఖాన్ లీడ్ రోల్స్‌లో నటించిన సంగతి తెలిసిందే. థర్టీ ఇయర్స్ తర్వాత ఇప్పుడు 'కూలీ' కోసం రజనీకాంత్, ఆమిర్‌ఖాన్ స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 'కూలీ' మే 1న రిలీజ్ కానుందని టాక్.

## సినిమా అంటే సినిమా అంతే

**- ఎమ్మెల్సీ మల్లన్న**

''చిన్న సినిమా? పెద్ద సినిమా? అనే తేడా ఎక్కడ పుట్టిందో నాకు తెలీదు. సినిమా అంటే సినిమా అంతే. 'ప్రణయ గోదారి' టైటిల్ చాలా బాగుంది. ట్రైలర్, సాంగ్స్ కూడా బాగా నచ్చాయి. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా, సాయి కుమార్ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో పీఎల్‌వీ క్రియేషన్స్‌పై పారమళ్ల లింగయ్య నిర్మించారు. ఈ నెల 13న రిలీజ్ కానున్న ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఎమ్మెల్సీ మల్లన్న, నిర్మాత రాజ్ కందుకూరి, హీరో సోహెల్ అతిథులుగా హాజరయ్యారు. పీఎల్ విఘ్నేశ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం నా ఆస్తులు అమ్మడంతో పాటు అప్పులు తెచ్చాను. సినిమా తీయడం, రిలీజ్ చేయడం సులభం కాదనే విషయం అర్థమైంది'' అన్నారు.


● పీఎల్ విఘ్నేష్, మల్లన్న, సోహెల్, రాజ్ కందుకూరి

## బాలీవుడ్ ఎంట్రీ


● ఫాహద్ ఫాజిల్

ప్రముఖ మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నారు. హిందీలో 'జబ్ వియ్ మెట్, లవ్ ఆజ్ కల్, రాక్ స్టార్, హైవే' వంటి సినిమాలను తీసిన ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో ఫాహద్ ఫాజిల్ హీరోగా నటించనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటించనున్నారు. కాగా ఈ సినిమాకు 'ఇడియట్స్ ఆఫ్ ఇస్తాంబుల్' అనే టైటిల్‌ను మేకర్స్ అనుకుంటున్నారని బాలీవుడ్ టాక్. అంతేకాదు.. ఈ సినిమా చిత్రీకరణ వచ్చే ఏడాది ప్రారంభంలో మొదలుకానుందని, వీలైనంత త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని ఇంతియాజ్ అలీ సన్నాహాలు చేస్తున్నారట. మలయాళ నటుడిగా ఫాహద్ ఫాజిల్ హిందీ ప్రేక్షకులకు తెలుసు. అయితే 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాతో ఫాహద్ క్రేజ్ బాగా పెరిగింది. మరి.. ఆయన హిందీలో చేయబోయే తొలి సినిమా ఎలా ఉండబోతుందనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

## డబుల్ ధమాకా

పంజాబీ నటి సోనమ్ భజ్వా బాలీవుడ్‌లో డబుల్ ధమాకా కొట్టారు. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, సంజయ్‌దత్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'హౌస్‌ఫుల్ 5'. తరుణ్ మన్సుఖాని ఈ మూవీకి దర్శకుడు. ఈ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు సోనమ్ భజ్వా. ఈ చిత్రంలో సోనమ్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా 'హౌస్‌ఫుల్ 5' చిత్రీకరణ పూర్తి కాకముందే మరో బాలీవుడ్ చిత్రం 'బాఘీ 4'లో హీరోయిన్‌గా నటించే చాన్స్‌ను దక్కించుకున్నారు సోనమ్ భజ్వా. టైగర్ ష్రాఫ్ హీరోగా నటించనున్న ఈ సినిమాకు ఎ.హర్ష దర్శకత్వం వహించనుండగా, సంజయ్‌దత్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తారు. 'బాఘీ, హౌస్‌ఫుల్'.. ఈ రెండూ బాలీవుడ్‌లో హిట్ ఫ్రాంచైజీలే. అలాగే ఈ రెండు సినిమాలకు నిర్మాత సాజిద్ నడియాడ్ వాలాయే కావడం విశేషం. ''హౌస్‌ఫుల్ 5' చిత్రీకరణ పూర్తి కాకుండానే, 'బాఘీ 4'లో నటించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు సోనమ్ భజ్వా.


● సోనమ్ భజ్వా

## మంచి సినిమాకు భాషా హద్దులు లేవు - జోజు జార్జ్


● జోజు జార్జ్, అభినయ

''నా దృష్టిలో మంచి సినిమాకు భాషా హద్దులు లేవు. ఏ భాషలో అయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'పని' చిత్రం మలయాళంలో విజయం సాధించింది. తెలుగు వారికి కూడా నచ్చుతుంది'' అని నటుడు జోజు జార్జ్ తెలిపారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'పని'. ఈ మూవీలో అభినయ కీలక పాత్రలో నటించారు. సిజో వడక్కన్ నిర్మించిన ఈ మూవీ అక్టోబరు 24న మలయాళంలో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని 'పని' పేరుతోనే ఆమ్ వర్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ నెల 13న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'పని' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజ వంశీ మాట్లాడుతూ– ''పని' మంచి థ్రిల్లర్ సినిమా. ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ''ఈ సినిమా తెలుగులోనూ పెద్ద విజయం అందుకుంటుంది'' అని అభినయ పేర్కొన్నారు. ఈ వేడుకలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, తెలుగు ఫిలించాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్, నిర్మాత సిజో వడక్కన్, నటుడు 'జెమినీ' సురేష్ మాట్లాడారు.

## కోర్టులో థ్రిల్


● బేబీ శణ్య, వీర్ రెడ్డి

వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశన్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'లీగల్లీ వీర్'. దివంగత ఎం. వీర నారాయణ రెడ్డి సమర్పణలో రవి గోగుల దర్శకత్వంలో శాంతమ్మ మలికి రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం గ్లింప్స్ విడుదల కార్యక్రమంలో వీర్ రెడ్డి మాట్లాడుతూ– ''మనకు లీగల్ థ్రిల్లర్ సినిమాలు అంతగా రాలేదు. రియల్ కోర్టు డ్రామాని చూపించాలనుకున్నాను. అందుకే ఈ సినిమాని నిర్మించాం. స్వతహాగా నేను లీగల్ లాయర్‌ని. అందుకే ఈ చిత్రంలో లాయర్ పాత్రని చేయడం సులభంగా అనిపించింది. అయితే నటన నాకు కొత్త కావడంతో చాలా టేక్స్ తీసుకున్నాను. కానీ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ నెల 27 సినిమాని విడుదల చేస్తున్నాం'' అని తెలిపారు. ''వీర్‌గారు నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాననిపిస్తోంది'' అన్నారు డైరెక్టర్ రవి. ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ వల్లం కళాధర్, నటుడు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 2 | 81,510 |
| నిఫ్టీ ▼ | 9 | 24,610 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 19,756 | ▲ | 17 |
| డోజోన్స్ | 44,418 | ▲ | 16 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 8,280 | ▲ | 72 |
| డాక్స్ | 20,329 | ▼ | 17 |
| షాంఘై | 3,423 | ▲ | 20 |
| నికాయ్ | 39,368 | ▲ | 207 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (24 క్యారట్) | 77,175 | ▲ | 483 |
| బంగారం (22 క్యారట్) | 76,866 | ▲ | 481 |
| వెండి (కిలో) | 92,810 | ▲ | 1,010 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 83.02 | 86.70 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 105.81 | 110.74 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.15 | 91.62 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 44.00 | 66.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 51.91 | 56.72 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.95 | 65.64 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.73 | 23.28 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 22.21 | 23.99 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.82 | 12.64 |

# పెళ్లి మీది.. ఫండ్ మాది



మన సంస్కృతిలో వివాహానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. జీవితాన్ని మలుపు తిప్పే అతి ముఖ్యమైన పెళ్లి వేడుక చిరకాలం గుర్తుండిపోయేలా నిర్వహించుకోవలాన్న ఆకాంక్ష పెరుగుతోంది. కలిగిన కుటుంబాలు సహజంగానే పెళ్లిళ్లకు ఘనంగా ఖర్చు చేస్తుంటాయి. ఆ మధ్య రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తన చిన్న కుమారుడి వివాహానికి ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టారో గుర్తుండే ఉంటుంది. అంబానీ రేంజ్ కాకపోయినా.. తమ పరిధిలో భారీ బడ్జెట్‌తో వివాహం చేసుకునేందుకు ఎక్కువ మంది ముందుకొస్తున్న ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

- ముహూర్తం పెట్టడమే ఆలస్యం
- రుణాల రూపంలో వచ్చి పడుతున్న నిధులు
- బడ్జెట్‌కు వెనుకాడని యువతరం
- పెళ్లి వేడుక గొప్పగా ఉండాలన్న ఆకాంక్ష

మిలీనియల్స్ (1981-1996 మధ్య జన్మించిన వారు), జెనరేషన్ జెడ్ (1996-2009 మధ్య జన్మించిన వారు) యువతీయువకులు వివాహం విషయంలో కేవలం తల్లిదండ్రుల ఆర్థిక సామర్థ్యం పైనే ఆధారపడాలని అనుకోవడం లేదని ఇండియా లెండ్స్ సర్వేలో వెల్లడైంది. వ్యక్తిగత రుణం (పర్సనల్ లోన్) తీసుకుని, బాలీవుడ్ స్టైల్‌లో లేదా డెస్టినేషన్ వెడ్డింగ్ (తమకు నచ్చిన వేరే ప్రాంతంలో)కు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా 20 పట్టణాల పరిధిలో వివాహంపై 1,200 మంది మిలీనియల్స్ అభిప్రాయాలను ఇండియాలెండ్స్ సర్వే తెలుసుకుంది. 42 శాతం మంది తమ వివాహానికి తామే సొంతంగా నిధులు సమకూర్చుకోవాలనే ప్రణాళికతో ఉన్నట్టు తెలిసింది. ఇందులోనూ 41 శాతం మంది తమ పొదుపు నిధులను వాడుకోవాలని అనుకుంటుంటే.. 26 శాతం మంది పర్సనల్ లోన్ తీసుకోవాలని అనుకుంటున్నారు. మరో 33 శాతం మంది పెళ్లి ఖర్చు విషయంలో ఇంకా ఎలాంటి ప్రణాళికతో లేనట్టు వెల్లడైంది. ఇప్పటికీ 82 శాతం పెళ్లిళ్ల వ్యక్తిగత పొదుపు సొమ్ములతోనే పూర్తవుతుండగా.. ఆస్తులు విక్రయించి 6 శాతం మేర, మరో 12 శాతం పెళ్లి వేడుకలు అప్పులతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెళ్లిళ్ల సర్వే వివరాలతో 'వెడ్డింగ్ స్పెండ్స్ రిపోర్ట్ 2.0'ను ఇండియాలెండ్స్ విడుదల చేసింది.

### పెరిగిపోయిన వ్యయాలు

వివాహాలకు ఖర్చులు పెరిగిపోతుండడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. 68 శాతం మంది రూ.లక్ష నుంచి రూ.5 లక్షల మధ్య రుణం తీసుకోవాలని అనుకుంటున్నారు. సగటు వివాహ వేడుక వ్యయం రూ.36.5 లక్షలకు పెరిగినట్టు 'వెడ్‌మీగుడ్' అనే వెడ్డింగ్ ప్లానర్ చెబుతోంది. ఇక డెస్టినేషన్ వెడ్డింగ్ వేడుక కోసం చేసే ఖర్చు రూ.51 లక్షలకు పెరిగినట్టు తెలిపింది. 2023తో పోల్చితే ఈ వ్యయాలు 7 శాతం వరకు పెరిగాయి. ముఖ్యంగా కల్యాణ మంటపం, క్యాటరింగ్ చార్జీలు 10 శాతం వరకు పెరిగాయి. పెళ్లి ఘనంగా చేసుకునేందుకు నిధుల లోటును అడ్డంకిగా మెజారిటీ యువతరం భావించడం లేదు. రుణాల లభ్యత పెరిగిపోవడమే ఇందుకు కారణం.

**మారిన ధోరణి..**

గతంలో తెలిసిన వారి వద్ద, స్థానిక రుణదాతల నుంచి వివాహం కోసం అప్పు తీసుకునే వారు. ఇప్పుడు ఈ మార్కెట్ సంఘటితంగా మారి బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల వైపు మళ్లుతోంది
– ప్రవీణ్ ఖండేల్‌వాల్, సీఏఐటీ వ్యవస్థాపకులు

### రూ.15,000 ఆదాయం ఉంటే చాలు..

నెలవారీ రూ.15,000 ఆదాయం ఉన్న వారు సైతం రూ.50,000 నుంచి రూ.40 లక్షల వరకు రుణాలు పొందొచ్చని యాక్సిస్‌బ్యాంక్ అధికారి తెలిపారు. వివాహ రుణాలపై వడ్డీ రేటు 10 శాతం నుంచి ప్రారంభమవుతోంది.

వివాహాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా భావించడం, ఖర్చుకు వెనుకాడని ధోరణి ఈ మార్కెట్లో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలకు భారీ అవకాశాలు కల్పిస్తున్నాయి. పెళ్లి సంబంధాలకు వేదిక అయిన మ్యాట్రిమోనీ డాట్ కామ్ దీన్ని ముందే గుర్తించి.. వెడ్డింగ్‌లోన్ డాట్ కామ్ పేరుతో ఇటీవలే ఒక ప్రత్యేక పోర్టల్ ప్రారంభించింది. వివాహం కోసం వధూవరులు లేదా తల్లిదండ్రులు ఈ ప్లాట్‌ఫామ్ సాయంతో రుణం తీసుకోవచ్చు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, టాటా క్యాపిటల్, ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్‌తో

### ముందుకొస్తున్న సంస్థలు..

ఈ సంస్థ జట్టుకట్టింది. ''అన్‌సెక్యూర్డ్ పర్సనల్ రుణాల్లో 25–30 శాతం మేర వివాహాల కోసమే తీసుకుంటున్నట్టు మా అధ్యయనంలో తెలిసింది. గడిచిన రెండేళ్లలో ఈ డిమాండ్ 20 శాతం మేర పెరిగింది''అని మ్యాట్రిమోనీ డాట్ కామ్ వైస్ ప్రెసిడెంట్ మయాంక్ ఝా తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ అయితే తనఖా లేకుండానే వివాహ రుణాలు అందిస్తోంది. సులభతర చెల్లింపులతో ఆన్‌లైన్‌లో రుణాలను మంజూరు చేస్తున్నట్టు బ్యాంక్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ అర్జున్ చౌదరి చెప్పారు. వెడ్డింగ్‌లోన్ డాట్ కామ్ ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం, పర్సనల్ లోన్స్, రివాల్వింగ్ క్రెడిట్ లైన్ పేరుతో 3 రకాల ఉత్పత్తులను ఆఫర్ చేస్తోంది. ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం అన్నది రుణ గ్రహీత సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాతో అనుసంధానమై ఉంటుంది.

## సూచీలు అక్కడక్కడే..!

- సెన్సెక్స్‌కు 2 పాయింట్లు లాభం
- నిఫ్టీకి 9 పాయింట్ల నష్టం



ముంబై: ఆద్యంతం ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు మంగళవారం అక్కడిక్కడే ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ రెండు పాయింట్ల లాభంతో 81,510 వద్ద నిలిచింది. నిఫ్టీ తొమ్మిది పాయింట్లు నష్టపోయి 24,610 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రథమార్ధంతా లాభాల్లో కదిలాయి. మిడ్‌సెషన్‌లో లాభాల స్వీకరణతో నష్టాలు చవిచూశాయి. ట్రేడింగ్ చివర్లో ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు రాణించడంతో నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 543 పాయింట్ల పరిధిలో 81,508 – 81,726 శ్రేణిలో ట్రేడైంది. నిఫ్టీ 24,678 వద్ద కనిష్టాన్ని, 24,511 గరిష్టాన్ని తాకింది. రియల్టీ, ఐటీ, మెటల్, కమోడిటీ, ఫైనాన్స్ సర్వీసెస్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్, పవర్, సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

## సేవలకు ఇక సెలవు..!



ముంబై: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం ముంబైలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరేళ్లలో ఆర్థిక–ద్రవ్య సమన్వయం అత్యుత్తమంగా ఉందని చెప్పారు. దేశ ద్రవ్య వ్యవస్థకు సంబంధించి కీలక అధికారాలకు సారథ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ పురోగతికి గత ఆరేళ్లుగా తాను చేయాల్సిందంతా చేశానని పేర్కొన్నారు. వృద్ధి మందగమనం రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు అధిక స్థాయిలో ఉండడం వల్ల సంభవించబోదని, ఇందుకు పలు కారణాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వృద్ధి పురోగతి– ద్రవ్యోల్బణం కట్టడి ఆర్‌బీఐ ముందు మున్ముందు ఉన్న సవాలని వివరించారు. ఉర్జిత్ పటేల్ ఆకస్మిక నిష్క్రమణ తర్వాత 2018 డిసెంబర్ 12న దాస్ ఆర్‌బీఐ 25వ గవర్నర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత ఆయన పదవీ కాలాన్ని మరో మూడేళ్లు కేంద్రం పొడిగించింది. ఈ పొడిగించిన పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా నియమితులైన రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారు. మూడేళ్లు ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తారు.

### ఆర్థిక వ్యవస్థ పురోగతికి కృషి చేస్తా..: సంజయ్ మల్హోత్రా




న్యూఢిల్లీ: అన్ని అంశాలను అర్థం చేసుకుని ఆర్థిక వ్యవస్థ పురోగతికి కృషి చేస్తానని ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టనున్న రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఆర్థికశాఖ కార్యాలయం వద్ద విలేకరులు అడిగిన ప్రశ్నకు మల్హోత్రా సమాధానం చెబుతూ, ''కీలక బాధ్యతల్లోని అన్ని దృక్కోణాలను అర్థం చేసుకోవాలి. ఆర్థిక వ్యవస్థకు ఉత్తమమైన చర్యలు చేపట్టాలి'' అన్నారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 11-12-2024 | |
|---|---|
| విశాఖ | 618–00 |
| చిత్తూరు | 633–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 628–00 |
| విజయవాడ | 630–00 |
| హైదరాబాద్ | 620–00 |
| వరంగల్ | 622–00 |
| రిటైల్ ధర | 6.80 |

## అయిదేళ్లలో తొలిస్థానంలో భారత ఆటోమొబైల్

ఆశాభావం వ్యక్తం చేసిన గడ్కరీ



న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో భారత ఆటోమొబైల్ పరిశ్రమ ప్రపంచంలో తొలి స్థానానికి చేరుతుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ విశ్వాసం వ్యక్తం చేశారు. రెండేళ్లలో దేశంలో రవాణా ఖర్చులను 9 శాతానికి తగ్గించాలని తన మంత్రిత్వ శాఖ లక్ష్యంగా చేసుకుందని ఒక కార్యక్రమంలో వివరించారు. తాను అధికారం చేపట్టినప్పటి నుండి భారతీయ వాహన పరిశ్రమ రూ.7 లక్షల కోట్ల నుండి రూ.22 లక్షల కోట్లకు దూసుకెళ్లిందని చెప్పారు. 'రూ.78 లక్షల కోట్లతో తొలి స్థానంలో యూఎస్‌ఏ, రూ.47 లక్షల కోట్లతో రెండవ అతి పెద్ద ఆటోమొబైల్ పరిశ్రమగా చైనా ఉందన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

క్విక్‌కామర్స్ ఎంట్రీకి అమెజాన్ సన్నాహాలు..

నవంబర్‌లో ఈక్విటీ ఫండ్స్ వెనుకంజ!

# భవిత

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## మెరిసే కెరీర్‌కు మ్యాథ్స్

మ్యాథమెటిక్స్..నేటి ఏఐ యుగంలో కెరీర్‌కు ఊతమిస్తోంది. ఉపాధ్యాయ వృత్తి మొదలు టెక్ రంగంలో డేటా అనలిటిక్స్ వరకూ..మ్యాథమెటిక్స్ విస్తృత కొలువులకు మార్గంగా నిలుస్తోంది. గణితంపై పట్టుంటే.. పోటీ పరీక్షలు నుంచి బ్లాక్‌చైన్ టెక్నాలజీ దాకా.. వివిధ రంగాల్లో రాణించే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. మ్యాథమెటిక్స్‌తో లభించే నైపుణ్యాలు, కెరీర్ ట్రెండ్స్, అకడమిక్ కోర్సులు తదితర వివరాలు..

» మ్యాథమెటిక్స్ నైపుణ్యంతో అనేక కెరీర్ అవకాశాలు
» ఏఐ విభాగాల్లోనూ కీలకంగా గణిత స్కిల్స్
» యూజీ, పీజీతో విస్తృత ఉపాధి మార్గాలు




నేడు అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ ఆధారిత కార్యకలాపాలు ఊపందుకుంటున్న పరిస్థితి. ముఖ్యంగా టెక్ రంగంలో కీలకంగా భావించే కోడింగ్, ప్రోగ్రామింగ్, అల్గారిథమ్‌లు సమర్థవంతంగా చేయాలంటే.. మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు ఎంతో కీలకంగా మారుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌గా పేర్కొనే సీ, సీ++, జావా, పైథాన్ వంటి లాంగ్వేజెస్‌లో రాణించేందుకు మ్యాథమెటిక్స్ స్కిల్స్ తప్పనిసరి. గణితంపై పట్టుంటే సాఫ్ట్‌వేర్ రంగంలో ఎంతో కీలకంగా భావించే ప్రోగ్రామర్స్, డెవలపర్స్, అప్లికేషన్స్ వంటి వాటికి సంబంధించిన విధులను రాణించే సామర్థ్యం లభిస్తుంది.

### మూడు విభాగాలు

- మ్యాథమెటిక్స్‌ను ముఖ్యంగా మూడు భాగాలుగా వర్గీకరిస్తున్నారు. అవి.. అప్లయిడ్ మ్యాథమెటిక్స్, ప్యూర్ మ్యాథ్స్, మ్యాథమెటికల్ ఫిజిక్స్. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ పూర్తిగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ఉంటుంది. సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో వాస్తవ సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు మార్గంగా అప్లయిడ్ మ్యాథమెటిక్స్ నిలుస్తోంది.
- ప్యూర్ మ్యాథ్స్ అనేది పూర్తిగా నెంబర్ థియరీగా ఉంటుందని చెప్పొచ్చు. ఈ నైపుణ్యాలతో ఫైనాన్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో అడుగు పెట్టే అవకాశం ఉంది.
- మ్యాథమెటికల్ ఫిజిక్స్‌లో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌ల మధ్య అంతర్గత సమ్మేళనం ఉంటుంది. క్వాంటమ్ థియరీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో ఇది ఎంతో కీలకంగా మారుతోంది.

### కొలువులకు మార్గాలు

- బ్యాచిలర్ డిగ్రీలో మ్యాథమెటిక్స్‌తోపాటు డేటా అనాలిసిస్, డేటా సైన్స్ వంటి సర్టిఫికేషన్స్ పూర్తి చేసుకుంటే సాఫ్ట్‌వేర్ రంగంలోనూ కొలువు సొంతం చేసుకోవచ్చు.
- మ్యాథమెటిక్స్ పీజీ అర్హతతో జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ పలు జాబ్స్ అందుబాటులో ఉన్నాయి.
- గణితంలో పీహెచ్‌డీ పట్టాతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, హరీశ్‌చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఇస్రో, సెంట్రల్ సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఆర్గనైజేషన్, హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ వంటి సంస్థల్లో రీసెర్చ్ విభాగంలో శాస్త్రవేత్తలుగా కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా డీఆర్‌డీఓ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలలోనూ మ్యాథమెటిక్స్ పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు అవకాశాలు లభిస్తున్నాయి. అదే విధంగా బోధన విభాగంలో ప్రొఫెసర్ హోదాలను సొంతం చేసుకోవచ్చు.

### మ్యాథ్స్‌తో టాప్ జాబ్స్

ప్రస్తుత జాబ్ మార్కెట్ పరిస్థితుల్లో మ్యాథమెటిక్స్ నిపుణులకు అందుబాటులో ఉన్న టాప్ కెరీర్ మార్గాలు..

### క్రిప్టో గ్రాఫర్

నేడు అన్ని వ్యాపారాల్లోనూ ఇంటర్నెట్ ఆధారిత కార్యకలాపాలు సాగుతున్నాయి. కీలకమైన సమాచారాన్ని భద్రపర్చాల్సిన ఆవశ్యకత నెలకొంది. దీంతో రక్షిత సమాచార వ్యవస్థను రూపొందించడానికి క్రిప్టోగ్రాఫర్స్ అవసరమవుతున్నారు. ముఖ్యంగా డేటా సెక్యూరిటీకి సంబంధించి పలు ప్రోగ్రామ్‌లు రూపొందించడానికి మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఫలితంగా క్రిప్టో విభాగంలో మ్యాథ్స్ నిపుణులకు కొలువులు లభిస్తున్నాయి.

### స్టాటిస్టిషియన్

కంపెనీలు డేటా అనాలిసిస్, డేటా కంపేరిజన్ వంటి విభాగాల్లో స్టాటిస్టిక్స్‌తోపాటు మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు ఉన్న వారిని నియమించుకుంటున్నాయి. డేటాను ఒక క్రమ పద్ధతిలో అమర్చడానికి, లోపాలు లేకుండా చూడడానికి మ్యాథమెటిక్స్ నిపుణుల అవసరం ఏర్పడుతోంది. ముఖ్యంగా ఫార్మా, ఫైనాన్స్, టెక్నాలజీ విభాగాల్లో వీరు ఉద్యోగాలు సొంతం చేసుకునే వీలుంది.

### మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్

మ్యాథమెటిక్స్ స్కిల్స్ ఉన్న వారు మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్లుగానూ కొలువుదీరే అవకాశం ఉంది. ముఖ్యంగా భారీ స్థాయిలో ఉండే డేటా షీట్స్‌ను నిర్వహించడానికి, మెషీన్ లెర్నింగ్ మోడల్స్ రూపొందించడానికి, వాటికి సంబంధించి కోడ్స్, అల్గారిథమ్స్ రాయడానికి మ్యాథమెటిక్స్ నిపుణుల అవసరం ఏర్పడుతోంది. దీంతో..అల్జీబ్రా,కాలిక్యులస్, ప్రాబబిలిటీ అంశాల్లో నైపుణ్యాలున్న వారికి మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్స్‌గా ఉద్యోగాలు లభిస్తున్నాయి.

### యాక్చుయేరియల్ సైంటిస్ట్

ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో.. బీమా పాలసీల రూపకల్పన, ప్రీమియం నిర్ధారణ వంటి అంశాల్లో మ్యాథమెటిక్స్ నిపుణుల అవసరం ప్రధాన పాత్ర పోషిస్తోంది. ప్రాబబిలిటీ, కాలిక్యులస్ స్కిల్స్‌తోపాటు ప్రాబ్లమ్ సాల్వింగ్, అనలిటికల్ నైపుణ్యాలుంటే యాక్చుయేరియల్ సైంటిస్ట్‌గా కొలువులు సొంతం చేసుకోవచ్చు.

### ఆపరేషన్ రీసెర్చ్ అనలిస్ట్

వ్యాపార కార్యకలాపాలు, వ్యూహాల వృద్ధికి ఆపరేషనల్ రీసెర్చ్ అనలిస్ట్‌ల సేవలు తప్పనిసరిగా మారుతున్నాయి. మ్యాథమెటికల్ టెక్నిక్స్ ఉపయోగించి సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ వంటి విభాగాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేలా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

### డేటా సైంటిస్ట్

గణితంపై పట్టుంటే.. మ్యాథమెటికల్, స్టాటిస్టికల్ టూల్స్ సమ్మేళనంగా ఉండే కీలకమైన డేటా అనలిస్ట్ జాబ్స్ సొంతం చేసుకోవచ్చు. నిర్దేశిత డేటాను విశ్లేషించి.. దాని ఆధారంగా కంపెనీలు తీసుకోవాల్సిన నిర్ణయాలపై నివేదిక ఇవ్వడం డేటా సైంటిస్ట్‌ల ప్రధాన విధిగా ఉంటుంది.

### అల్గారిథమ్ ఇంజనీర్స్

మ్యాథ్స్‌పై పట్టుంటే ప్రస్తుత టెక్ యుగంలో సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల్లో అల్గారిథమ్ ఇంజనీర్స్‌గానూ అడుగు పెట్టొచ్చు. డేటాను వినియోగించి వాస్తవ పరిస్థితులను విశ్లేషించడం.. దానికి సంబంధించిన నివేదికలు ఇవ్వడం వంటి విధులు అల్గారిథమ్స్ ఇంజనీర్స్ నిర్వర్తించాల్సి ఉంటుంది.

### మార్కెట్ రీసెర్చర్స్

వ్యాపార ప్రపంచంలో కస్టమర్లు, పోటీ దారుల డేటాను విశ్లేషించి.. తమ కంపెనీ లక్ష్యాలకు అనుగుణంగా నివేదికలు రూపొందించడం, సర్వేలు నిర్వహించడం, మార్కెట్ ట్రెండ్స్‌ను ఎప్పటికప్పుడు విశ్లేషించడం వంటి విధులు మార్కెట్ రీసెర్చర్స్ నిర్వర్తించాల్సి ఉంటుంది.

### అకడమిక్ మార్గాలు

మ్యాథమెటిక్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు బ్యాచిలర్స్ నుంచి పీహెచ్‌డీ వరకూ.. పలు కోర్సులు అభ్యసించే అవకాశం ఉంది. మ్యాథమెటిక్స్ కోర్సులు, వాటిని అందిస్తున్న ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ వివరాలు..

- **చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్: కోర్సులు:** బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ. ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది.
- **ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్: కోర్సులు:** బీఎస్సీ మ్యాథమెటిక్స్(ఆనర్స్), ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, పీహెచ్‌డీ(మ్యాథమెటిక్స్). ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్షలో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- **ఐఐఎస్‌సీ–బెంగళూరు:** బీటెక్ (మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్). జేఈఈ –అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ పొందొచ్చు.
- **ఐఐటీ–ఖరగ్‌పూర్:** ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్. ఐఐటీ–జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం లభిస్తుంది. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ(మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)లో జేఈఈ–అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.
- **ఐఐటీ–కాన్పూర్:** మ్యాథమెటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ సైన్స్‌లో బీఎస్ డిగ్రీ, బీఎస్–ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ. జేఈఈ–అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో ఐఐటీ–జామ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది.
- **టీఐఎఫ్‌ఆర్:** ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ ప్రోగ్రామ్. ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశానికి గేట్, జెస్ట్, సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటారు.
- **ఐఐటీ–చెన్నై:** ఎమ్మెస్సీ (మ్యాథమెటిక్స్). ఐఐటీ–జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం లభిస్తుంది. ఎంటెక్ (ఇండస్ట్రియల్ మ్యాథమెటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్)లో గేట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

## జాబ్ పాయింట్

### సుప్రీంకోర్టులో 107 ఉద్యోగాలు

భారత సుప్రీంకోర్టులో గ్రూప్–ఏ, గ్రూప్–బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 107.
» **పోస్టుల వివరాలు:** కోర్టు మాస్టర్(షార్ట్‌హ్యాండ్)(గ్రూప్–ఏ గెజిటెడ్)–31, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్(గ్రూప్–బి)–33, పర్సనల్ అసిస్టెంట్(గ్రూప్–బి)–43.

**అర్హతలు**

» **కోర్టు మాస్టర్:** గుర్తింపు పొందిన యూనివర్శిటీలా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 120 డబ్ల్యూపీఎంతో ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ స్పీడ్, 40 డబ్ల్యూపీఎం కంప్యూటర్ టైపింగ్ స్పీడ్ ఉండాలి.
» **సీనియర్ పర్సనల్ అసిస్టెంట్:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 110 డబ్ల్యూపీఎం షార్ట్‌హ్యాండ్ ఇంగ్లిష్, 40 డబ్ల్యూపీఎం కంప్యూటర్ టైపింగ్ స్పీడ్ ఉండాలి.
» **పర్సనల్ అసిస్టెంట్:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. 100 డబ్ల్యూపీఎం షార్ట్‌హ్యాండ్ ఇంగ్లిష్, స్పీడ్ 40 డబ్ల్యూపీఎం కంప్యూటర్ టైపింగ్ స్పీడ్.
» **వేతనం:** నెలకు కోర్టు మాస్టర్ పోస్టుకు 30 నుంచి 45 ఏళ్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్‌కు 18 నుంచి 30 ఏళ్లు, పర్సనల్ అసిస్టెంట్‌కు 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** టైపింగ్ టెస్ట్, రాతపరీక్ష, కంప్యూటర్ నాలెడ్జ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2024.
» **వెబ్‌సైట్:** https://www.sci.gov.in

### సీఎస్ఐఆర్–సీఈఈఆర్ఐలో 33 సైంటిస్ట్ పోస్టులు

పిలానీ(రాజస్థాన్)లోని సీఎస్ఐఆర్–సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఈఈఆర్ఐ).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 33.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 07.01.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,09,089.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.01.2025.
» **వెబ్‌సైట్:** www.ceeri.res.in

### నిమ్‌హాన్స్, బెంగళూరులో 23 పోస్టులు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్‌హాన్స్).. గ్రూప్–బి, గ్రూప్–సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్(సబ్ స్పెషాలిటీ బ్లాక్)–01, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2–20, ఎలక్ట్రీషియన్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదోతరగతి, ఐటీఐ,డిగ్రీ,ఎండీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ టైపింగ్ స్పీడ్, ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుకు రూ.44,900 నుంచి రూ.1,42,400, స్టెనోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100.
» **వయసు:** జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌కు 35 ఏళ్లు, స్టెనోగ్రాఫర్ గ్రేడ్2 కు 27 ఏళ్లు, ఎలక్ట్రీషియన్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్, షార్ట్‌లిస్టింగ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్, పోస్ట్ బాక్స్ నెం.2900, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.01.2025.
» **వెబ్‌సైట్:** https://nimhans.ac.in

### రైట్స్ లిమిటెడ్‌లో 223 అప్రెంటిస్‌లు

గురుగ్రామ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 223.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–141, డిప్లొమా అప్రెంటిస్–36, ట్రేడ్ అప్రెంటిస్–46.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలు/ట్రేడుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, ఐటీఐ, ఇంజనీరింగ్ డిగ్రీ(బీఈ/బీటెక్/బీఆర్క్) నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్(బీఏ/బీబీఏ/బీకాం/బీఎస్సీ/బీసీఏ) ఉత్తీర్ణులవ్వాలి. ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు రూ.14,000, డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.12,000,ట్రేడ్ అప్రెంటిస్‌లకు రూ.10,000
» **ఎంపిక విధానం:** అర్హతలో సాధించిన మార్కుల శాతం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2024.
» **వెబ్‌సైట్:** www.rites.com

# నిల్వ ఆహారం తిని 8 మంది బాలికలకు అస్వస్థత

- మెగా పీటీఎం ఆహారాన్నే మరుసటి రోజు పెట్టిన నిర్వాహకులు
- గోమంగి పీహెచ్‌సీలో చికిత్స


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పెదబయలు: ప్రభుత్వం ఆదేశాల మేరకు అట్టహాసంగా నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పీటీఎం)లో వండిన ఆహారం మిగిలిపోవడంతో దాన్ని మరుసటి రోజు విద్యార్థులకు వడ్డించారు. దీంతో ఫుడ్ పాయిజన్ జరిగి 8 మంది విద్యార్థినులు అస్వస్థకు గురైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పెదబయలు మండలం, గోమంగి మినీ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 7వ తేదీన మెగా పీటీఎం నిర్వహించారు. ఆరోజు తల్లిదండ్రులకు పెట్టిన తరువాత మిగిలిన బంగాళదుంప, బఠానీ కూరను మరుసటి రోజైన ఆదివారం కొంతమంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంలో పెట్టారు. అదే రోజు సాయంత్రం వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. 5వ తరగతి విద్యార్థులు జి.శ్రావణి, చాందిని, పి.స్వాతి, పి.బిందు (4వ తరగతి), కె.హర్షిత(3వ తరగతి), 2వ తరగతి విద్యార్థులు పి.హిందువదన, పి.సెల్లమ్మి, జి.రష్మి అస్వస్థతకు గురయ్యారు. వారిని అంబులెన్స్‌లో గోమండి పీహెచ్‌సీకి తరలించి, సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ పి.వసంతను వివరణ కోరగా... తల్లిదండ్రుల సమావేశానికి వచ్చిన 200మందికి ఆహారం వడ్డించామనీ, మిగిలిన అన్నం, కూరను పారేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. తనకు ట్రైనింగ్ ప్రోగ్రాం ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం విజయనగరం వెళ్లానని, విద్యార్థుల అస్వస్థత విషయం ఏఎన్ఎం తనకు ఫోన్‌లో చెప్పడంతో తక్షణమే పీహెచ్‌సీకి సమాచారం అందించి, విద్యార్థులకు చికిత్స అందించినట్లు ఆమె పేర్కొన్నారు. పాఠశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం స్కూల్‌కు వెళ్లి 11మంది విద్యార్థులకు వైద్యం చేశామనీ, వారిలో పరిస్థితి బాగోలేని 8మందిని పీహెచ్‌సీకి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్యకుమార్ తెలిపారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

# మహిళా రోగిపై అసభ్య ప్రవర్తన

- కేర్ ఆస్పత్రిలో రేడియాలజీ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ వెకిలి చేష్టలు
- దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించిన బంధువులు

బీచ్‌రోడ్డు : స్కానింగ్ కోసం వచ్చిన మహిళ పట్ల అసభ్యంగా కేర్ ఆస్పత్రి రేడియాలజీ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో తోటి రోగులు, బంధువులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సిరిపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ గాయపడటంతో ఆమెను బంధువులు రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తలకు గాయం కావడంతో వైద్యులు కేర్ ఆస్పత్రిలోని రేడియాలజీ విభాగానికి స్కానింగ్ కోసం ఆమెను తీసుకెళ్లారు. అక్కడ ఉన్న రేడియాలజీ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ ప్రకాష్ స్కానింగ్ పేరిట మహిళ బట్టలు.. విప్పి, ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో బయట ఉన్న రోగులు, వారి బంధువులు వచ్చి విషయాన్ని తెలుసుకుని ప్రకాష్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో పోలీసులు ఆస్పత్రికి వచ్చి ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రకాష్‌పై బీఎన్ఎస్ 74, 76 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ పల్లా రమణయ్య తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు చెప్పారు. సిరిపురం వద్ద ఉదయం 6:30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయం కావడంతో కేర్ ఆస్పత్రికి తెచ్చామని, అయితే ఇక్కడి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత మహిళ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం ఏడు గంటలకు కూడా వైద్యం అందించలేదని మండిపడ్డారు. అత్యవసర విభాగంలో స్కానింగ్ పరికరం ఉన్నప్పటికీ వేరే చోటికి పంపారని ఆరోపించారు.



## 15న పాఠశాలల్లో 'ఆత్మార్పణ దినం'

సాక్షి, అమరావతి: పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 15న అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఆత్మార్పణ దినం నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా 14 ఏళ్లలోపు విద్యార్థులకు అమరజీవి జీవితంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని డీఈవోలకు సూచించారు.

## 20 పనులకు అనుమతి

సాక్షి, అమరావతి: సీఆర్డీఏ పరిధిలో 20 ఇంజినీరింగ్ పనులను రూ.11,467.27 కోట్లతో చేపట్టేందుకు మున్సిపల్‌శాఖ పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) కె.కన్నబాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) సిఫారసుల మేరకు ఈ పనులకు అనుమతి ఇస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పాఠశాలల్లో 'స్కిల్' పీరియడ్స్

సాక్షి, అమరావతి: విద్యార్థులు చదువు నుంచి విశ్రాంతి పొందాలని, అందుకు యాక్టివిటీ మార్పును అలవాటు చేసుకుంటే సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు అలసట నుంచి విముక్తి పొందవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు తెలిపారు. ఇందుకోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో కో-కరిక్యులర్ కార్యక్రమం కింద స్కిల్ పీరియడ్స్ ప్రవేశపెడతామన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్, బాలరంగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజయవాడ సమీపంలోని పోరంకిలో జరిగిన ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజయ్ రామరాజు మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలోను చివరి పీరియడ్ కో-కరిక్యులర్ కార్యక్రమాలకు కేటాయిస్తామన్నారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జాతీయ పోటీల్లోనూ గెలిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

## హోం మంత్రి అనిత అప్పు కేసు కొట్టివేత

- తొమ్మిదేళ్ల క్రితం అనిత తీసుకున్న అప్పు రూ.70 లక్షలు
- రూ.15 లక్షలు తీసుకుని రాజీ పడేందుకు వేగి అంగీకారం
- దీంతో కేసును కొట్టేస్తున్నట్టు హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: తన వద్ద తీసుకున్న రూ.70 లక్షల అప్పు చెల్లించేందుకు ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన చెక్ చెల్లలేదంటూ వేగి శ్రీనివాసరావు విశాఖ కోర్టులో వేసిన కేసును ఇరుపక్షాలు రాజీపడటంతో కొట్టి వేస్తున్నట్టు హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2015 అక్టోబర్ 1న ఎన్నికల ఖర్చుల కోసం చేసిన అప్పుల్ని తీర్చేందుకు వేగి శ్రీనివాసరావు నుంచి అనిత రూ.70 లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని ఎంతకీ చెల్లించకపోవడంతో శ్రీనివాసరావు 2018లో అనితపై విశాఖపట్నం కోర్టులో సూట్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై విశాఖపట్నం 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ చేపట్టింది. కాగా.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, అనిత హోం మంత్రి అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ మధ్య రాజీ కుదిరిందంటూ అనిత, శ్రీనివాసరావు హైకోర్టులో జాయింట్ మెమో దాఖలు చేశారు. అందులో శ్రీనివాసరావుకు రాజీ కింద ఎంత మొత్తం ఇస్తున్నారు? ఆ మొత్తానికి శ్రీనివాసరావు అంగీకరించారా? అన్న విషయాలేవీ లేవు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్.. రాజీలో ఇరుపక్షాల మధ్య ఏం ఒప్పందం కుదిరించి, సమస్యకు ఏం పరిష్కారం చూపారు, శ్రీనివాసరావుకు ఇవ్వాల్సిన దాంట్లో ఎంత ఇచ్చారు.. తదితర వివరాలు లేకుండా రాజీ అంటే ఎలా సాధ్యమని అనితను ప్రశ్నించారు. పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశించారు. కాగా.. మంగళవారం అనిత కేసు రాజీ వ్యవహారం హైకోర్టు ముందు మరోసారి విచారణకు వచ్చింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ విచారణ జరిపారు. విచారణకు అనిత, అమెకు అప్పు ఇచ్చిన వేగి శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనిత అధీకృత ప్రతినిధి స్వయంగా కోర్టు ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత తరపు న్యాయవాది వీవీ సతీష్ వాదనలు వినిపిస్తూ.. వేగి శ్రీనివాసరావు తనకు రావాల్సిన రూ.70 లక్షలకు గాను రూ.15 లక్షలే తీసుకునేందుకు స్వచ్ఛందంగా అంగీకరించారని తెలిపారు. ఇరువుర్నీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరిన నేపథ్యంలో విశాఖపట్నం 7వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో అనితపై కేసును కొట్టేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## దారికి పచ్చటి తోరణం



కనువిందు చేసే పచ్చని చెట్లు... బడలికను పోగొట్టే చల్లగాలి... ఎవరైనా సరే ఆ మార్గంలో ఒకసారి ప్రయాణిస్తే ఫిదా అవ్వాల్సిందే. మళ్లీ మళ్లీ ఆ దారిలో వెళ్లాలనే కోరిక తట్టాల్సిందే. రహదారికి పచ్చటి తోరణం కట్టినట్లుండి.. వాటి కిందకు వెళ్లగానే ఏదో గుహలోకి ప్రవేశించినట్లుగా కలిగే అనుభూతి ప్రయాణికులను కొద్దిసేపు అక్కడ ఆగేలా చేస్తోంది. అనంతపురం జిల్లా గార్లదిన్నె నుంచి మిడ్‌పెన్నార్ డ్యాంకు వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా చెట్లు ప్రయాణికులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

## పుష్ప విలాసం



గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు అంటే గుర్తుకువచ్చేది పత్తి, మిర్చి సాగు. దశాబ్దాలుగా ఇవే పంటలు ఈ ప్రాంతంలో సాగుచేస్తుంటారు. కానీ ఇటీవల ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగానే బంతి పూల తోటలు కూడా సాగుచేశారు. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి పుల్లడిగుంట సమీపంలో పండించిన బంతి పూలు పసుపు, ఆరెంజ్ రంగుల్లో చూపరులను ఆకర్షిస్తున్నాయి.

–ప్రత్తిపాడు

## అలలు పోయి.. శిలలు వచ్చె..



నిత్యం అలలతో ఎగసి పడే సంద్రం.. వెనక్కు తగ్గింది. ఇప్పటి వరకు అలల మాటున ఉన్న శిలలు అందమైన ఆకృతులతో సరికొత్తగా పరిచయం చేసుకున్నాయి. వాతావరణ మార్పులతో సముద్రం వెనక్కు వెళ్లడంతో విశాఖ బీచ్‌లోని వైఎంసీఏ ప్రాంతంలో నల్లని రాళ్లు కనువిందు చేశాయి. దీంతో సందర్శకులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## క్లుప్తంగా...

### 'ఆరోపణలను వెనక్కు తీసుకోవాలి'

సాక్షి, అమరావతి: ఫార్మసీ అసోసియేషన్లపై ఆరోపణలు చేస్తూ ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సాయిప్రియ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఫార్మసీ కౌన్సిల్ వెబ్‌సైట్ హ్యాక్ అయిందంటూ పలు సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రిజిస్ట్రార్ సోమవారం విడుదల చేసిన సర్క్యులర్‌ను ఆమె తప్పుబట్టారు.

### గిరిజన టీచర్ల సమ్మెకు పరిష్కారం చూపండి

**రాష్ట్ర గవర్నర్‌కు ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ లేఖ**

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పలు డిమాండ్లపై 25 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వంతో మాట్లాడి వారి సమ్మె విరమణకు పరిష్కారం చూపాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు. కొద్ది రోజుల క్రితం గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మీనాయక్ ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రస్తావిస్తూ శంకర్ నాయక్ మంగళవారం గవర్నర్‌కు లేఖ రాశారు.

### రెండోరోజు విచారణకు హాజరైన రాఘవరెడ్డి

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి రెండోరోజు మంగళవారం కడపలోని సైబర్ క్రైమ్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో న్యాయవాది ఓబుళరెడ్డి సమక్షంలో రాఘవరెడ్డిని విచారించారు. అనంతరం బుధవారం ఉదయం 10 గంటలకు కడప సైబర్ క్రైమ్ స్టేషన్‌లో మళ్లీ విచారణకు హాజరుకావాలని నోటీసు ఇచ్చారు.

### బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్): బాలికతో లైంగిక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పోతురాజు మీరయ్యకు జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు మనుబోలు మండలం పిడూరుమిట్ట గ్రామానికి చెందిన పోతురాజు మీరయ్య చిల్లర అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక అంగడికి వెళ్తున్నప్పుడు మాయమాటలు చెప్పి లైంగిక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. బాధిత బాలిక 2022 జనవరి పన్నెండో తేదీన మనుబోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు పోతురాజు మీరయ్యను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో మీరయ్య నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

### లోకాయుక్తను ఆశ్రయించిన దళిత సర్పంచ్ భర్త

రామకుప్పం: తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు తనపై అక్రమంగా కేసు నమోదు చేశారని వేరే విచారణ సంస్థ ద్వారా కేసు దర్యాప్తు చేయాలని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని 89 పెద్దూరు సర్పంచ్ మల్లిక భర్త గోవిందప్ప సోమవారం కర్నూలులో లోకాయుక్త సంస్థ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ సర్పంచ్‌గా మల్లిక గెలుపొందారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత తన భార్యను సర్పంచ్ పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారన్నారు. అదేవిధంగా మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాలేదని, పంచాయతీలో ప్రజలకు అందుబాటులో లేదన్న కారణాలతో సర్పంచ్ మల్లిక చెక్ పవర్‌ను రద్దు చేశారన్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గకపోవడంతో తప్పుడు ఫిర్యాదుతో అన్యాయంగా తనపై హత్యాయత్నం కేసు నమోదుచేసి 35 రోజుల పాటు రిమాండ్‌లో ఉంచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసును వేరే విచారణ సంస్థ ద్వారా విచారణ చేసి తనకు న్యాయం చేయాలని గోవిందప్ప కోరారు.

# కాఫీ రైతు హ్యాపీ

అల్లూరి జిల్లాలో ఈ ఏడాది కాఫీ విరగ్గాసింది. ఎక్కడ చూసినా ఎర్రటి పండ్లతో తోటలు కళకళలాడుతున్నాయి. తోటలు మంచి కాపుకాయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా పండ్ల దశలోనే కొనుగోలు చేస్తుండడంతో వాటి సేకరణను రైతులు **ప్రారంభించారు. తుఫాన్ కారణంగా** ఇటీవల కురిసిన వర్షాలు **అనుకూలంగా ఉండడంతో కాఫీ పంట** విరగ్గాసిందని కాఫీ విభాగం **అధికారులు అంటున్నారు.**



**ఐటీడీఏ ప్రకటించిన మద్దతు ధరలు (కిలో)**

| | |
|---|---|
| కాఫీ పండ్లు | : రూ.44 |
| పార్చ్‌మెంట్ గింజలు | : రూ.285 |
| అరబికా చెర్రీ | : రూ.150 |
| రోబస్ట చెర్రీ | : రూ.80 |

గత ఏడాది విక్రయం **17** వేల మెట్రిక్ టన్నులు

ఈ ఏడాది అమ్మకాల అంచనా **18** వేల మెట్రిక్ టన్నులు

ఏడాదిలో మొత్తం లావాదేవీలు రూ.**400** కోట్లు (అంచనా)

## విరగ్గాసిన పండ్లు • సేకరణ ప్రారంభం

### పండ్ల దశలోనే కొనుగోలుకు ప్రైవేట్ సంస్థల మొగ్గు

సాక్షి,పాడేరు: అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి పొందిన అల్లూరి జిల్లాలో కాఫీకి ఈఏడాది కూడా మహర్దశ పట్టింది. కాయలు పక్వానికి వచ్చాయి. తోటల్లో విరగ్గాసిన ఎర్రని కాఫీ పండ్ల సేకరణను గిరిజన రైతులు ప్రారంభించారు. కాఫీ పంటను పండ్ల దశలోనే పాడేరు ఐటీడీఏతో పాటు గిరిజన రైతు ఉత్పత్తి సంఘాలు,పలు ఎన్జీవో సంస్థలు కొను గోలు ప్రారంభించాయి. చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా పాడేరు ఐటీడీఏ రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. కాఫీ పండ్ల సేకరణలో కాఫీ రైతులు వారం రోజుల నుంచి బిజీగా ఉన్నారు. సేకరించిన పండ్లను ఐటీడీఏతో పాటు పలు సంస్థలు వెంటనే కొనుగోలు చేస్తూ పల్పింగ్ యూనిట్లకు తరలిస్తున్నాయి. జీసీసీ సిబ్బంది కూడా కాఫీ గింజలు కొనుగోలు చేస్తున్నారు.

### 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం



పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 2.42 లక్షల ఎకరాల్లో కాఫీతోటలను గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు.వీటిలో 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇచ్చే కాఫీతోటలు ఉన్నాయి. ఆయా తోటల్లో కాఫీ పండ్లు విరగ్గాయడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది 17వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను రైతులు విక్రయించారు. ఈ ఏడాది కూడా కాపు ఆశాజనకంగా ఉండడంతో 18వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీ గింజల ఉత్పత్తి ఉంటుందని కేంద్ర కాఫీబోర్డు, పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు మండలం గుర్రగరువు ప్రాంతంలో కాఫీ పండ్లను సేకరిస్తున్న మహిళ

### జీసీసీ,ఐటీడీఏలు గిట్టుబాటు ధరలు ప్రకటన

ఈఏడాది కూడా గిరిజన రైతులు ఉత్పత్తి చేసే కాఫీ పంటకు ఎఫెక్స్ కమిటీ సిఫారసు మేరకు జీసీసీ,పాడేరు ఐటీడీఏలు గిట్టుబాటు ధరలను ప్రకటించాయి.చింతపల్లి మాక్స్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసే కాఫీ పండ్లకు కిలో రూ.44ధర చెల్లించేందుకు పాడేరు ఐటీడీఏ నిర్ణయించింది. పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285 ధరతో, అరబికా చెర్రీ రకాన్ని కిలో రూ.150,రోబస్ట చెర్రీ రకాన్ని కిలో రూ.80కు కొనుగోలు చేయనున్నారు. డ్రైకాఫీ దిగుబడి ఎకరాకు 150 కిలోల వరకు ఉంటుంది. ఐటీడీఏ ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఎకరాకు సుమారు రూ.40 వేల నుంచి 45 వేల వరకు రైతుకు ఆదాయం లభిస్తుంది. ఈ ఏడాది రూ. 8 కోట్లతో పండ్లు కొనుగోలు చేయాలని లక్ష్యంగా ఐటీడీఏ నిర్ణయించుకోగా, రూ. 57 కోట్ల లావాదేవీలు నిర్వహించాలని జీసీసీ భావిస్తోంది. జిల్లా మొత్తం ఈ ఏడాది రూ.400 కోట్ల వరకూ కాఫీ లావాదేవీలు జరగవచ్చని భావిస్తున్నారు.

### పండ్ల సేకరణ ప్రారంభించాం



నాకు ఉన్న రెండు ఎకరాల్లో కాఫీ తోటలు విరగ్గాసాయి. కాపు ఆశాజనకంగా ఉంది. రెండు రోజుల నుంచి పండ్ల సేకరణ జరుపుతున్నాం. గత ఏడాది కాఫీ పంట విక్రయం ద్వారా రూ.70వేల ఆదాయం వచ్చింది. ఈ సారి కాపు అధికంగా ఉండడంతో దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నాను. సొంతంగా పల్పింగ్ చేసి పార్చ్‌మెంట్ కాఫీని తయారు చేసి జీసీసీకే విక్రయిస్తాను.

– సుర్ర చిట్టిబాబు, కాఫీ రైతు, కరకపుట్టు, పాడేరు మండలం

### కాఫీ పంటకు గిట్టుబాటు ధర



గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పంట నాణ్యతలో నంబర్-1గా నిలుస్తుంది. కాఫీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. ఐటీడీఏ,జీసీసీ యంత్రాంగం ద్వారా కాఫీ రైతులకు మేలు చేసేలా గిట్టుబాటు ధరలను ప్రకటించాం.గిరిజనులు ఎలాంటి అపోహలకు గురికాకుండా కాఫీ పండ్లను ఐటీడీఏకు,పార్చ్‌మెంట్,అరబికా, రొబస్ట కాఫీ గింజలను జీసీసీకి విక్రయించి లాభాలు పొందాలి.దళారీలను ఆశ్రయించి మోసపోవద్దు. –ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్.

## హైస్కూల్ ప్లస్ విద్యను కొనసాగించాలి: ఏపీఎస్టీఏ

సాక్షి, అమరావతి: గ్రామీణ పేద విద్యార్థులకు స్థానికంగా ఇంటర్ విద్యను అందించేందుకు గాను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ పాఠశాలలను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**వేతనాలు చెల్లించండి**

ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నవంబర్ నెల వేతనాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, నైట్ వాచ్‌మెన్‌లకు ఇప్పటి వరకు గత నెల వేతనాలు జమ చేయలేదన్నారు.

**కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్**

వివిధ కారణాలతో 2022 నుంచి సర్వీసులో మరణించిన మున్సిపల్ ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకం కింద అవకాశం కల్పించాలని మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హరినారాయణన్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు 90 కుటుంబాలకు కారుణ్య నియామకం కింద మేలు జరగనున్నది.

## మైనార్టీల బడ్జెట్‌ను దారి మళ్లించొద్దు

**జాతీయ మైనారిటీ కమిషన్ మెంబర్ సయ్యద్ షాహెజాది**

సాక్షి, అమరావతి: మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్‌ను వారి సంక్షేమానికే వినియోగించాలని, ఇతర పథకాలకు దారి మళ్లించకూడదని జాతీయ మైనారిటీ కమిషన్ మెంబర్ సయ్యద్ షాహెజాది స్పష్టం చేశారు. మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్రంలో ప్రధానమంత్రి కొత్త 15 పాయింట్ల కార్యక్రమం అమలు తీరును సమీక్షించేందుకు సచివాలయంలో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సయ్యద్ సాహెజాది మాట్లాడుతూ మైనారిటీల ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చేందుకు పెద్ద ఎత్తున మైక్రో స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎమ్‌ఇ)లను పెట్టుకునేలా ప్రోత్సహించాలన్నారు. మైనారిటీల్లో బాల కార్మికులు ఎక్కువగా ఉంటారని, అందుకు కారణమౌతున్న వ్యక్తులు, సంస్థలపై కేసులు పెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర, కేంద్ర సర్వీసులకు నిర్వహించే రిక్రూట్‌మెంటుల్లో మైనారిటీలు పెద్ద ఎత్తున పోటీపడేలా శిక్షణా అవకాశాలు కల్పించాలని సూచించారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్**

తాడేపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని, ఇందులో భాగంగా మహిళలకు మెప్మా ద్వారా మరిన్ని ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ఇండియా ఎస్‌ఎంఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ చెప్పారు. మంగళవారం తాడేపల్లి రాష్ట్ర మెప్మా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇండియా ఎస్‌ఎంఈ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీల్లో 2.79 లక్షల డ్వాక్రా సంఘాల్లో 28,77,109 మంది పేద, నిరుపేద మహిళలు ఉన్నారని, వీరందరికి లబ్ధి చేకూరే విధంగా ఈ సంస్థలో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న నగదును ఎటువంటి వ్యాపారాలు చేస్తున్నారు, బ్యాంకుకు చెల్లించాల్సిన రుణాలు ఎలా చెల్లిస్తారు, ఆ వ్యాపారాలు ఏ విధంగా చేస్తే లాభాలు వస్తాయి, మార్కెటింగ్‌తోపాటు ఇతర అంశాలపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు.

## 249 రోజుల్లోనే 55 ఎంఎంటీ నిర్వహణతో రికార్డు

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ) 2024–25 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) సరుకు నిర్వహణ లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తూ.. 249 రోజుల్లోనే 55 ఎంఎంటీ నిర్వహించి గత చరిత్రను తిరగరాసినట్లు వీపీఏ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు వెల్లడించారు. రాడిసన్ హోటల్‌లో భాగస్వాముల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పోర్ట్ అత్యధికంగా 81.09 ఎంఎంటీ సరకు నిర్వహణ చేసి పాత రికార్డులను తిరగరాసిందని తెలిపారు. ఆ రికార్డును చెరిపేసి ఈ ఏడాది నూతన మైలురాయిని సాధించేందుకు భాగస్వాముల సహకారం అవసరమన్నారు. రాష్ట్ర, జిల్లా అధికారులు, రైల్వే, కస్టమ్స్, ఎస్‌హెచ్‌ఏఐ వంటి పీఎస్‌యూల అమూల్యమైన సహకారాన్ని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతలకు అనుకూలంగా మారీటైమ్ ఇండియా విజన్ 2047, ముఖ్యమంత్రి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలకు అనుగుణంగా పోర్ట్ ఆధారిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు వివరించారు. ఫిబ్రవరి 2025 నాటికి పూర్తయ్యే మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వాముల సూచనలను ఆహ్వానించారు.

## నెల్లూరు బాలసదన్ నుంచి పారిపోయిన బాలికలు

• రాత్రి తిరుపతి జిల్లా తడలో ప్రత్యక్షం

తడ: వివిధ కారణాలతో కుటుంబానికి, అయినవారికి దూరంగా నెల్లూరు వేదాయపాళెంలోని బాలసదన్‌లో ఉంటున్న ముగ్గురు బాలికలు మంగళవారం రాత్రి తిరుపతి జిల్లా తడ రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షం అయ్యారు. స్థానికుల సమాచారం మేరకు సుమారు 15 నుంచి 17 సంవత్సరాల వయసు కలిగిన ముగ్గురు బాలికలు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తడ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అక్కడి వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలికల కోసం గాలించారు. బజారు నుంచి సూళ్లూరుపేటకు వెళ్లేందుకు వారు ఆటోకోసం ఎదురు చూస్తుండగా గుర్తించి విచారించారు. వాళ్లు తెలిపిన వివరాల మేరకు వేదాయపాళెంలోని బాలసదన్ నుంచి మంగళవారం మధ్యాహ్నం పారిపోయి వచ్చినట్టు తెలుసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి బాలసదన్‌కు సమాచారం అందించారు. వారిని ఎందుకు పారిపోయి వచ్చారని పోలీసులు విచారించగా బాల సదన్‌లో తమకు అందించే ఆహారం బాగా లేదని, సిబ్బంది బాలికల పట్ల వ్యవహరించే తీరు కూడా నచ్చక పారిపోయి వచ్చినట్టు తెలిపారు.

## శ్రీవారి వాకిలి.. బంగారు లోగిలి

• స్వామి అంతరాలయం, ముఖ ద్వారాలు స్వర్ణమయం
• రూ.2.62 కోట్లతో ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్ పనులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి అంతరాలయం స్వర్ణ శోభితమైంది. స్వామివారి భక్తులకు కనువిందు చేస్తోంది. స్వర్ణ కాంతులతో ధగధగలాడుతున్న వాకిలి నుంచి చిన వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు మంత్రముగ్ధులవుతున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీవారి దివ్య క్షేత్రాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తున్నారు. శని, ఆదివారాలు, భక్తులు పోటెత్తుతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్షేత్రంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దాతల సహకారంతో దేవస్థానం ఇప్పటికే స్వామివారి వాకిలిని దాదాపుగా స్వర్ణమయం చేశారు. అందులో భాగంగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 2021 లో రూ.98,31,693 వ్యయంతో, 264 గ్రాముల 647 మిల్లీ గ్రాముల బంగారం, 147 కేజీల 641 గ్రాముల 700 మిల్లీ గ్రాముల రాగి రేకులతో ఆలయ ప్రధాన ముఖద్వారానికి, తలుపులకు, అంతరాలయ ద్వారానికి బంగారు తాపడం (ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్) చేయించారు. వీటిని అదే సంవత్సరం జనవరి 10న అప్పటి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభించారు. కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు రూ.1,64,19,411తో స్వామి అంతరాలయానికి బంగారు తాపడాన్ని చేయించారు. దీన్ని ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఈ ఏడాది అక్టోబర్ 4న ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, దాతలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు.

**త్వరలో స్తంభాలకు బంగారు పూత**

అంతరాలయం ముందు పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు ఎదురుగా ఉన్న స్తంభాలకు ఇదే తరహాలో గోల్డ్ కోటెడ్ చేయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో ఒక దాత సహాయంతో పనులు ప్రారంభించనున్నారని ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉంటే విమాన గోపుర స్వర్ణమయ పథకం ద్వారా భక్తుల నుంచి దేవస్థానం విరాళాలను సేకరిస్తోంది. విమాన గోపురాన్ని సైతం స్వర్ణమయం చేస్తే చినవెంకన్న ఆలయాన్ని చూడడానికి రెండు కనులు చాలవనే చెప్పొచ్చు.



స్వర్ణ కాంతులీనుతున్న శ్రీవారి అంతరాలయం, ముఖ ద్వారం. (ఇన్‌సెట్‌లో) అంతరాలయం గోడపై శ్రీవారి కల్యాణ ఘట్టం

సాక్షి ప్లస్
బుధవారం । 11 । 12 । 2024



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు


మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న ప్రజలు


జీతాల పెంపు సహా తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

# ఏమయ్యారో? ఎక్కడున్నారో?

**తెలంగాణలో పరిపాటిగా 'మిస్సింగ్'లు...**

- ఐదేళ్లలో 1,03,496 మంది అదృశ్యం
- ఇంకా దొరకని 6,468 మంది ఆచూకీ
- 2014 నుంచి 2019 వరకు ఇదే కథ..
- 2020–2024 మధ్య అత్యధికం
- అదృశ్యమైన వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఎక్కువని అప్పట్లో పిటిషన్.. ప్రభుత్వానికి హైకోర్టు మందలింపు

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** తెలంగాణ రాష్ట్రంలో 'అదృశ్యం'కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వయోభేదాలు లేకుండా ఇంటినుంచి బయటికి వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకుండా తప్పిపోతుండటం కలకలం రేపుతోంది. ప్రేమ పేరుతో కొందరు, ఇంట్లో పెద్దలు మందలించారని ఇంకొందరు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో మరికొందరు కనిపించకుండా పోతున్నారు. ఇలా తప్పిపోతున్న వారి కుటుంబసభ్యులు సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేక.. చివరకు పోలీసుస్టేషన్లలో 'మిస్సింగ్'కేసులు నమోదు చేస్తున్నారు. ఫిర్యాదు చేసి కళ్లు కాయలు కాయేలా ఎదురుచూసిన కొందరికి తమ కుటుంబసభ్యుల ఆచూకీ దొరకగా.. మరికొందరికీ ఎదురుచూపులే మిగిలాయి. తప్పిపోయిన వారిలో కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరికొంతమంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు.




**అదృశ్యం కేసులపై హైకోర్టు తీవ్ర స్పందన**

అప్పట్లో రాష్ట్రంలో పెరిగిన మిస్సింగ్ కేసులపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం.. ఏటా తొమ్మిది వరకు మిస్సింగ్ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. 2019 నుంచి 2020 నవంబర్ వరకు ఆ కేసులు రెట్టింపు అయ్యాయని హైకోర్టులో ఓ ప్రైవేట్ పిటిషన్ కూడా దాఖలైంది. అదృశ్యమైన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలే అధికంగా ఉన్నట్టు కేసులు నమోదయ్యాయని పిటిషనర్ వివరించారు. దీనిపై ప్రభుత్వం హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో షీ టీమ్, దర్పన్ యాప్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, ఆపరేషన్ ముస్కాన్ లాంటి కార్యక్రమాల ద్వారా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. ఆ తర్వాత కూడా 2020 నుంచి 2024 అక్టోబర్ 19 వరకు రాష్ట్రంలో 1,03,496 మంది బాలురు, బాలికలు, పురుషులు, స్త్రీలు తప్పిపోయినట్లు కేసులు నమోదయ్యాయి. 2023లో అత్యధికంగా 23,509 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది డిసెంబర్ 19 నాటికి 20,403 కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైన 1,03,496 మందిలో 97,028 మంది ఆచూకీ లభించగా, ఇంకా 6,468 మంది ఎక్కడ ఉన్నారో, ఏమైపోయారో తెలియని పరిస్థితి నెలకొంది.

**'అదృశ్యం'కేసుల్లో మహిళలే ఎక్కువ..**

తెలంగాణవ్యాప్తంగా ఐదేళ్లలో అదృశ్యమైన 1,03,496 మందిలో మహిళలే 54,744 మంది ఉన్నారు. పురుషులు 34,643 మంది, బాలురు 5,750 మంది కాగా బాలికలు 8,359 మంది. ఇదే సమయంలో ఆచూకీ లభ్యమైన వారి జాబితాలోనూ 52,312 మంది మహిళలు ఉండగా, 31,291 మంది పురుషులు, 5,450 మంది బాలురు, 7,070 మంది బాలికలు ఉన్నారు. ఆచూకీ దొరకని 6,468 మందిలో పురుషులు 3,352 మంది, మహిళలు 2,432 మంది, బాలురు 295 మంది, బాలికలు 389 మంది ఉన్నారు.

**2020 నుంచి 2024 వరకు తెలంగాణలో మిస్సింగ్ కేసుల వివరాలు**

| | |
|---|---|
| అదృశ్యమైన వారి మొత్తం సంఖ్య: | 1,03,496 మంది |
| 18 ఏళ్ల లోపు అబ్బాయిలు: | 5,750 |
| ఆచూకీ దొరికినవారు: | 5,455 |
| ఇంకా ఆచూకీ దొరకనివారు: | 295 |
| 18ఏళ్ల లోపు అమ్మాయిలు: | 8,359 |
| ఆచూకీ దొరికిన వారు: | 7,970 |
| ఇంకా ఆచూకీ దొరకని వారు: | 389 |
| అదృశ్యమైన మహిళలు: | 54,744 |
| ఆచూకీ దొరికిన వారు: | 52,312 |
| ఇంకా ఆచూకీ లేని వారు: | 2432 |
| అదృశ్యమైన పురుషులు: | 34,643 |
| ఆచూకీ దొరికిన వారు: | 31291 |
| ఇంకా ఆచూకీ దొరకని వారు: | 3352 |

**పరిష్కారం చూపాలి**



రాష్ట్రంలో ప్రతీరోజు ఎంతో మంది తప్పిపోతున్నారు. కొంతమంది ఆచూకీ పోలీసులు కనుగొన్నా.. మరికొంత మంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు. బాలికలు, బాలురు, మహిళలు, పురుషుల ఆచూకీ దొరక్క... వారి కుటుంబాల బాధ వర్ణనాతీతం. ఇప్పటికీ ఆచూకీ తెలియని వారు చాలామంది ఉన్నారు. వారు బతికి ఉన్నారో, లేదో తెలియక క్షణక్షణం బాధ అనుభవిస్తూ ఉంటారు. వారి బాధకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వం, పోలీసులపై ఉంది. ఇప్పటికైనా వారి ఎదురు చూపులకు పరిష్కారం చూపాలి.

– రాజేంద్ర పల్నాటి, ఫౌండర్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్

## కౌశిక్‌రెడ్డికి మొబైల్ తిరిగి ఇచ్చేయండి

పోలీసులను ఆదేశించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మొబైల్‌ను అప్పగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో తాము ఉత్తర్వులు జారీ చేయాల్సి వస్తుందని చెప్పింది. ఈ విషయంపై పోలీసుల నుంచి సూచనలు పొంది తెలపాలని హోంశాఖ జీపీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. తన విధులను అడ్డుకున్నారని బంజారాహిల్స్ సీఐ ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు ఈ నెల 5న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాసాబ్‌ట్యాంక్ ఎస్‌హెచ్‌ఓ తన ఐఫోన్‌ను బలవంతంగా తీసుకున్నారని, తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆయన లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. అవసరం లేకున్నా బలవంతంగా ఫోన్ లాక్కున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది టీవీ రామారావు వాదించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రాజకీయ ప్రత్యర్థి కావడంతో కౌశిక్ ఇంటిపై 50 మంది పోలీసులు దాడి చేసి.. గందరగోళ వాతావరణం సృష్టించారని చెప్పారు. ప్రభుత్వం తరఫున జీపీ వాదనలు వినిపిస్తూ.. కౌశిక్‌రెడ్డి, అతని అనుచరులు పోలీస్ స్టేషన్‌లో వికృతంగా ప్రవర్తించారన్నారు. పోలీస్ అధికారులు న్యాయబద్ధంగా విధులు నిర్వర్తించకుండా అడ్డంకులు సృష్టించారని తెలియజేశారు. ప్రభుత్వంపై కుట్ర జరుగుతోందని, పిటిషనర్ మొబైల్‌లో తొలగించిన డేటాను తిరిగి పొందడానికి ఎఫ్ఎస్ఎల్‌కు పంపనున్నట్టు చెప్పారు. దీనిపై న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మొబైల్ స్వాధీనం చేసుకునే సమయంలో పోలీసులు చట్ట విధానాన్ని పాటించలేదని అభిప్రాయపడ్డారు. మొబైల్ అప్పగింతపై సూచనలు పొంది తమకు తెలపాలని జీపీ ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.



## భుజంగరావు మధ్యంతర బెయిల్ 16 వరకు పొడిగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు (ఏ–3), మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఈ కేసులో మార్చిలో అరెస్టయిన భుజంగరావుకు వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం ఆగస్టులో నాంపల్లి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. గత నెల 14 తర్వాత మధ్యంతర బెయిల్ పొడిగింపునకు ట్రయల్‌కోర్టు నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. లంచ్‌మోషన్ రూపంలో వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం తొలుత గత నెల 18 వరకు, అనంతరం మరో రెండుసార్లు మధ్యంతర బెయిల్ పొడిగించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. భుజంగరావు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నందున రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. మళ్లీ జైలుకు పంపితే ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పటికే ఓ స్టంట్ ఉండగా గుండె జబ్బుతో పాటు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. రోజూ డయాలసిస్ చేయించుకోవాలని వైద్యులు సూచించారని చెప్పారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేసిన న్యాయమూర్తి.. మధ్యంతర బెయిల్‌ను డిసెంబర్ 16 వరకు పొడిగించారు.

## ఆశ వర్కర్లకు బీఆర్ఎస్ అండ

**పార్టీ మహిళా నేత ఉమ**

**సాక్షి, హైదరాబాద్:** ఆశ వర్కర్ల సమస్యలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తించిందని, వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ మహిళా నేత తుల ఉమ చెప్పారు. ఆమె మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు సుమిత్ర, సుశీలారెడ్డి, అర్పిత ప్రకాశ్, కీర్తి లతాగౌడ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన ఆశ వర్కర్లపై పోలీసులు జరిపిన దాడిని మహిళా కమిషన్‌కు వివరించామని తెలిపారు. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, మగ పోలీసులు మహిళలపై దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ చెప్పారన్నారు. ఇటీవల లగచర్లలో.. నేడు అసెంబ్లీ దగ్గర మహిళా ఆశ వర్కర్లపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చిన రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తుల ఉమ స్పష్టం చేశారు.

# మళ్లీ.. మావోలకు చెక్ పెడదాం!

**దండకారణ్యం నుంచి సేఫ్‌జోన్‌కు మావోయిస్టు అగ్రనేతలు? ● 'ఆపరేషన్ కగార్' నేపథ్యంలో తాత్కాలిక వలస**

**ఎస్ఐబీ సమాచారంతో పోలీసుల అప్రమత్తం ● గోదావరి తీరం పోలీసు బలగాలమయం**

**రంగంలోకి ఎన్ఐఏ.. మావోయిస్టు కీలక నేతలపై ఆరా ● మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో రెడ్ అలర్ట్**

**సాక్షి ప్రతినిధి, వరంగల్:** ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో పారా మిలటరీ, కేంద్ర సాయుధ బలగాలు భీకర దాడులు చేస్తున్న నేపథ్యంలో సీపీఐ మావోయిస్టు ముఖ్యనేతలు సహా, క్యాడర్ అంతా తమ మకాంను మార్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అలర్ట్ అయ్యారు. అందులో భాగంగానే మకాం మారుస్తూ ములుగు జిల్లా చెల్పాక అటవీ ప్రాంతంలో పోలీస్‌లకు తారసపడ్డ ఘటనలో పెద్దపల్లి జిల్లాకు చెందిన, మావోయిస్టు మహాదేవపూర్ ఏరియా కార్యదర్శి ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు సహా మరో ఆరుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఘటనకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించారంటూ డిసెంబర్ 7న మావోయిస్టులు బీజాపూర్‌లో ఓ మహిళను గొంతుకోసి హత్య చేశారు. మొన్నటి వరకు దండకారణ్యంలోనే యుద్ధ వాతావరణం ఉండగా చెల్పాక ఎన్‌కౌంటర్ తర్వాత తెలంగాణ సరిహద్దుల్లోనూ పోలీస్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అనుమానిత ప్రాంతాలను యాంటీ నక్సల్స్ స్క్వాడ్‌లు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో కమాండోలు జల్లెడ పడుతున్నారు. 1980 నుండి 2008 వరకు తెలంగాణ జిల్లాల్లో మావోయిస్టుల విస్తరణకు కారణమైన దండకారణ్యంలో అంబుష్ పార్టీలతో అప్రమత్తంగా ఉంటే.. సులువుగానే వారికి చెక్ పెట్టవచ్చన్న వ్యూహంతో పోలీస్‌శాఖ పావులు కదుపుతోంది.



**తెరపైకి రివార్డుల పెంపు..?**

మావోయిస్టు పార్టీలో కీలక నేతలపై మరోసారి రివార్డులు పెరిగే అవకాశం ఉన్నదని పోలీసు వర్గాలు అంటున్నాయి. మోస్ట్‌వాంటెడ్ జాబితాను నిఘావర్గాలు మళ్లీ రూపొందిస్తున్నాయని చెబుతున్నారు. ఈసారి కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగినట్లు సమాచారం. తెలంగాణలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతల వివరాలను జిల్లాలు, పోలీసుస్టేషన్ల వారీగా ఎన్ఐఏ సేకరిస్తోంది. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి అజ్ఞాతంలో ఉన్న నేతల వివరాలను కోరినట్లు తెలిసింది. దీంతో ఏళ్ల తరబడి ఉద్యమంలో పనిచేస్తున్న కీలక నేతలు, దాడుల వ్యూహకర్తలపై మరోసారి రివార్డులను పెంచుతారన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలోని పూర్వ 10 జిల్లాల నుంచి 54 మంది కీలక మావోయిస్టు నేతలు ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు తేలింది. కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతిపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే రూ.3.12 కోట్ల వరకు రివార్డు ఉంది. కేంద్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న నంబళ్ల కేశవరావు అలియాస్ బస్వరాజ్‌పై రివార్డు రూ.1.75 కోట్లకు చేరింది. కేంద్ర కమిటీ సభ్యులపైన రివార్డులు గత ఏడాది పెంచారు. కాగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టులే కీలకంగా మారినట్లు తాజా నివేదికల్లో వెల్లడించిన ఎన్ఐఏ.. మరోమారు రివార్డులపై దృష్టి పెట్టిందన్న ప్రచారం జరుగుతోంది. అలాగే ముప్పాల లక్ష్మణ్‌రావు, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి, కదారి సత్యనారాయణరెడ్డి అలియాస్ సాధు, మల్లా రాజిరెడ్డి, గంకిడి సత్యనారాయణరెడ్డి, మోడెం బాలకృష్ణ, పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, గాజర్ల రవి అలియాస్ గణేశ్, తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, తిప్పిరి తిరుపతి, బల్మూరి నారాయణరావు తదితర అగ్రనేతల గురించి పోస్టర్ల ద్వారా ఎన్ఐఏ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. డీకే ఎస్‌జెడ్‌సీకి చెందిన భయంకరమైన నక్సల్ నాయకుడిగా మడ్వి హిడ్మా అలియాస్ హిడ్మన్నతోపాటు లెంగు అలియాస్ సంజీవ్, రామ్.దర్ అలియాస్ సోమా సహా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 40 మందిని మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు చర్చ జరుగుతోంది.

**సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ బలగాలు**

ఎస్ఐబీ హెచ్చరికలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ బలగాలు మోహరించారు. ఈ నాలుగు రాష్ట్రాల సరిహద్దు.. గోదావరి తీరం సాయుధ బలగాలమయంగా మారింది. ఓ వైపు మావోయిస్టు అగ్ర నాయకత్వంలో ఉన్న పలువురు తెలుగు రాష్ట్రాల నాయకులు వృద్ధాప్యంతోపాటు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్న సమాచారం పోలీసులకు ఉంది. ఇదే సమయంలో తమకు దశాబ్దాలుగా సేఫ్‌జోన్లుగా ఉన్న దండకారణ్యంలోని ఒక్కో స్థావరాన్ని కేంద్ర పారా మిలిటరీ బలగాలు స్వాధీనం చేసుకుంటున్నాయి. దీంతో కొత్త ప్రదేశాలకు మకాం మార్చే యోచనలో భాగంగా మావోయిస్టు ఉద్యమాల కేరాఫ్ తెలంగాణ వైపు చూస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలక నేతల్లో ఎక్కువ మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే కాగా.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని స్టేట్ కమిటీల్లోనూ ఎక్కువగానే ఉన్నారు. ఇక్కడ పట్టున్న ప్రాంతాలు కూడా ఉన్నందున తెలంగాణను షెల్టర్ జోన్‌గా మార్చుకునే యోచనలో మావోయిస్టులు ఉన్నారన్న ప్రచారంతో అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు గ్రేహౌండ్స్ బలగాలను భారీగా మోహరించారు. దీంతో అటవీ పల్లెల్లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

మిరప పంటను తీవ్రంగా నష్టపరిచే కొత్త రకం నల్ల తామర (త్రిప్స్ పార్విస్పినస్ - బ్లాక్ త్రిప్స్) జాతి 2021లో ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. 2022లో ఆరు దక్షిణాది రాష్ట్రాల్లో మిరప పంటను బాగా దెబ్బతీసింది. కొన్ని ప్రాంతాల్లో 85 నుంచి 100% వరకు పంట నష్టం చేకూరింది. తామర పురుగులు (త్రిప్స్) మిరప, ఉల్లిపాయలు, టమోటాలు, స్ట్రాబెర్రీలు, ద్రాక్ష సహా వివిధ పంటలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయి, వాతావరణాన్ని బట్టి సంవత్సరానికి ఎనిమిది తరాల వరకు సంతతిని పెంచుకుంటూ ఉంటాయి. మిర్చి సహా అనేక పంటలను ఆశిస్తున్న నల్ల తామర యాజమాన్యంపై రైతులు, విస్తరణ అధికారులకు డిజిటల్ సాధనాలు ఉపకరిస్తాయి. ఈ డిజిటల్ యుగంలో అనేక సంస్థలు డిజిటల్ సలహాలను, సమాచారాన్ని రైతులకు అందుబాటులోకి తెస్తున్నాయి. సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్ (సిఎబిఐ - కాబి) 148 దేశాలలో రైతులకు ఉచితంగా డిజిటల్ సేవలు అందిస్తోంది.



# నల్ల తామరకు డిజిటల్ కట్టడి!

తామర పురుగులు (త్రిప్స్) రెక్కలు కలిగిన చిన్న కీటకాలు. వీటిలో అనేక జాతులున్నాయి. ఇవి ఉల్లిపాయలు, టమోటాలు, స్ట్రాబెర్రీలు, ద్రాక్ష సహా వివిధ పంటలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తాయి. మరికొన్ని వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుస్తాయి కూడా. ఎలాగంటే.. అవి పంటలకు హాని చేసే పురుగులను తింటాయి!

తామర పురుగులు మొక్కల బయటి పొరను చీల్చుకుని అందులోని పదార్థాలను తినడం ద్వారా మొక్కలను దెబ్బతీస్తాయి. జాతులను బట్టి, జీవిత దశను బట్టి వివిధ రంగుల్లో ఉంటాయి. పిల్ల పురుగు (లార్వా) సాధారణంగా పారదర్శకంగా ఉంటాయి. చాలావరకు పెరిగిన తామర పురుగులు పొడవాటి సన్నని రెక్కలతో, అంచుల్లో చిన్న వెంట్రుకలను కలిగి ఉంటాయి. గుడ్లు సాధారణంగా పొడుగ్గా ఉంటాయి. మూత్రపిండాల ఆకారంలో కనిపిస్తాయి. ఉష్ణమండలంలో నివసించే తామర పురుగులు సమశీతోష్ణ వాతావరణంలో కంటే పెద్దవిగా పెరుగుతాయి. తామరపురుగుల జీవిత కాలం సాధారణంగా నెలన్నర. జాతులను, వాతావరణాన్ని

## తామర పురుగులు.. ఏడాదికి 8 తరాలు!

బట్టి సంవత్సరానికి ఎనిమిది తరాల వరకు సంతతిని పెంచుకుంటూ ఉంటాయి. ఆడ పురుగులు అతిథేయ (హోస్ట్) మొక్కల ఆకులపై గుడ్లు పెడతాయి. లార్వా పొదిగిన తర్వాత ఆహారం తీసుకోవడం ప్రారంభిస్తుంది. లార్వా నాలుగు దశల్లో (రెండు ఫీడింగ్, రెండు నాన్-ఫీడింగ్) పెరిగి పెద్దది అవుతుంది. వెచ్చని వాతావరణంలో యుక్తవయస్సులో దీని పెరుగుదల వేగంగా ఉంటుంది. శీతాకాలంలో జీవించగలవు. అయితే ఈ సీజన్‌లో వాటి సంఖ్య సాధారణంగా తగ్గుతుంది.



తామర పురుగులు మొక్కల లోపల ద్రవాలను పీల్చుకొని బతుకుతాయి. పండ్లు, ఆకులు, రెమ్మలను ఆశించి.. బయటి పొర లోపలికి చొచ్చుకుపోయి తింటాయి. త్రిప్స్ పెద్ద మొత్తంలో పంటని ఆశించినప్పుడు, పంట పెరుగుదల, దిగుబడిని కోల్పోవడానికి కారణమవుతాయి. ఇవి చాలా పెద్ద చెట్ల జాతులపై కూడా దాడి చేయగలవు. ఐతే సాధారణంగా పండ్లు, కూరగాయల కంటే పెద్ద చెట్లు ఎక్కువ వీటి దాడికి తట్టుకోగలుగుతాయి.

తామర పురుగులు మొక్కల వైరస్‌లను కూడా వ్యాప్తి చేస్తాయి. వేరుశనగలో మొవ్వు కుళ్ళు (బడ్ నెక్రోసిస్ ), టొమాటో-స్పాటెడ్ విల్ట్ వైరస్.. ఇలా వ్యాపించేవే.

మిరప కాయల ఉత్పత్తి, వినియోగం, ఎగుమతిలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మన మిరప కాయ ఘాటైన రుచికి, రంగుకు ప్రసిద్ధి చెందింది. మన దేశం ఎగుమతి చేసే సుగంధ ద్రవ్యాల్లో 42% వాటా మిరపదే! మిరప ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది, తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుంటూరు మిర్చి యార్డ్ ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెట్. ఇది దేశీయ, అంతర్జాతీయ ధరలను ప్రభావితం చేయగలదు.

2021లో ఆంధ్రప్రదేశ్‌లో మిరప పంటను తీవ్రంగా నష్టపరిచే కొత్త రకం నల్ల తామర (త్రిప్స్ పార్విస్పినస్ - బ్లాక్ త్రిప్స్) జాతి వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. ఇది ఆగ్నేయాసియా నుంచి మన దేశంలోకి వచ్చింది. ఇది 2015లో బొప్పాయి పంటపై కూడా మన దేశంలో మొదటిసారిగా కనిపించింది. ఈ పురుగులు ఆకుల కణజాలాన్ని తినే ముందు లేత ఆకులు, పువ్వులను చీల్చివేస్తాయి. పూరేకుల చీలికల వల్ల పండ్లు సెట్‌కావటం కష్టతరంగా మారుతుంది. ఇది మిరప ఆశించే నల్ల తామర పత్తి, మిర్చి, కంది, మినుము, మామిడి, పుచ్చ, తదితర పంటలను కూడా దెబ్బతీస్తుంది. 2022లో ఆరు దక్షిణాది రాష్ట్రాల్లో మిరప పంటను బాగా దెబ్బతీసింది. కొన్ని ప్రాంతాల్లో 85 నుంచి 100% వరకు పంట నష్టం చేకూరింది. పంటలను రక్షించుకోవడానికి రసాయన పురుగుమందులను విపరీతంగా వాడటం తప్ప రైతులకు వేరే మార్గం లేకుండా పోయింది. ఖర్చు పెరిగిందే తప్ప ఉపయోగం లేకుండా పోయింది. దీనికి తోడు, నల్ల తామర సోకిన మిర్చికి మార్కెట్‌లో తక్కువ ధర పలకటంతో రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు.



### 148 దేశాల్లో రైతులకు ఉచిత సేవలు

చిన్న కమతాల రైతులు ఆచరణాత్మక సలహా సమాచారాన్ని పొందడానికి విస్తరణ సేవలు, ఇతర వ్యవసాయ సేవలను అందించే వారిపై ఆధారపడతారు. ఈ రైతుల విస్తృత అవసరాలను తీర్చే సలహాదారులు సరైన నిర్ణయం తీసుకోవాలంటే వారు తగిన సమాచారం పొందాలి. గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయంలో డిజిటల్ సేవల సాధనాలు గణనీయంగా పెరిగాయి. అయినప్పటికీ, ఇవి రైతు సలహాదారులకు చాలా వరకు చేరువ కాలేకపోతున్నాయి.

ఈ డిజిటల్ యుగంలో అనేక సంస్థలు డిజిటల్ సలహాలను, సమాచారాన్ని రైతులకు అందుబాటులోకి తెస్తున్నాయి. వీటివల్ల రైతులకు సరైన సలహాలు, సరైన సమయంలో మొబైల్ ఫోన్‌లోనే అందుబాటులో ఉండటం వల్ల తన దైనందిన కార్యక్రమాలకు అంతరాయం లేకుండా రైతు సమాచారాన్ని పొందుతున్నారు. ఇటువంటి డిజిటల్ సాధనాల్లో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్ (సిఎబిఐ - కాబి) డిజిటల్ సాధనాలు అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచాయి. 148 దేశాలలో ఈ సంస్థ రైతులకు ఉచితంగా డిజిటల్ సేవలు అందిస్తోంది. ఇది లాభాపేక్ష లేని సంస్థ. వంద సంవత్సరాలకు పైగా చీడపీడల యాజమాన్యంలో అనుభవమున్న సంస్థ. ఈ డిజిటల్ సాధనాలు మనదేశంలో కూడా తెలుగు సహా అనేక భాషల్లో కూడా అందుబాటులో ఉన్నాయి. ఇది హైదరాబాద్‌లో గల సుస్థిర వ్యవసాయ కేంద్రంతో పాటు అనేక ఐసిఎఆర్ అనుబంధ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఈ జ్ఞానాన్ని రైతులకు అందించడం కోసం కాబి కృషి చేస్తోంది. ఈ డిజిటల్ సాధనాలు ఉచితంగా అందించటం విశేషం. విజ్ఞానపరంగా పరీక్షించి, నిరూపితమైన, స్థానికంగా లభ్యమౌతున్న ఉత్పత్తుల వివరాలు ఇందులో పొందుపరిచారు.

'కాబి' భాగస్వాములతో కలిసి 'పెస్ట్ మేనేజ్‌మెంట్ డెసిషన్ గైడ్' (పిఎండిజి)ని అభివృద్ధి చేసింది. పంటలను ఆశించిన నల్ల తామర పురుగులను గుర్తించడం, సేంద్రియ/ సురక్షితమైన యాజమాన్య పద్ధతులపై ఈ గైడ్ సలహాలను అందిస్తుంది. మన దేశంలో వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న అనేక జీవ రసాయనాలకు సంబంధించిన సమాచారం ఇప్పుడు తెలుగు, కన్నడ, తమిళం భాషల్లో అందుబాటులోకి వచ్చాయి.

మిర్చి సహా అనేక పంటలను ఆశిస్తున్న నల్ల తామర యాజమాన్యంపై రైతులు, విస్తరణ అధికారులు, విద్యార్థులు, శిక్షకులు, పరిశోధకులు ఈ క్రింద పేర్కొన్న డిజిటల్ సాధనాలు ఉపకరిస్తాయి. 'కాబి' ఉచితంగా అందిస్తున్న డిజిటల్ సాధనాలను మరింత సమర్థవంతంగా, త్వరగా ఉపయోగించడం ద్వారా నల్ల తామరకు సంబంధించి, యాజమాన్య మెలకువల గురించిన మరింత సమాచారం కోసం ఈ క్రింద పేర్కొన్న వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లు ఉపయోగపడతాయి.

**1. బయోప్రొటెక్షన్ పోర్టల్ :** చీడపీడల నియంత్రణ, యాజమాన్యానికి స్థానిక బయోపెస్టిసైడ్స్ సమాచారం కోసం ఈ క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి.

**2. క్రాప్ స్ప్రేయర్ యాప్ :** పురుగుమందు/ బయోపెస్టిసైడ్ మోతాదు ఎంత వాడాలి అన్నది తెలుసుకోవడం కోసం ఈ క్యూ.ఆర్.కోడ్‌ను స్కాన్ చేయండి.


**3. ఫ్యాక్ట్‌షీట్ యాప్/నాలెడ్జ్ బ్యాంక్ :** చీడపీడలకు సంబంధించి విస్తృతమైన సమాచారం కోసం ఈ క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి.

– డాక్టర్ జి. చంద్రశేఖర్,
సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త,
సుస్థిర వ్యవసాయ కేంద్రం, సికింద్రాబాద్.
మొబైల్: 94404 50994

## తామర పురుగుల యాజమాన్యం

1. తామర పురుగులు నేలపై పడ్డ వ్యర్థపదార్థాలలో జీవిస్తూ పంటలను ఆశిస్తుంటాయి. కాబట్టి, పంట వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉండాలి.
2. ఎండను పరావర్తనం చెందించే మల్చింగ్ షీట్‌లను లేదా ఇతర అచ్ఛాదన పదార్థాలను బెడ్స్ మీద పరచాలి.
3. నీలం రంగు జిగురు అట్టలను ఏకరానికి 20 వరకు ఏర్పాటు చేయాలి. ఇవి పురుగులతో నిండగానే మార్చుకోవాలి.
4. సహజ శత్రువులైన అల్లిక రెక్కల పురుగు (లేస్ వింగ్ బగ్స్) అతిచిన్న పైరేట్ బగ్స్, పరాన్న భుక్కు నల్లులు (ప్రిడేటరీ మైట్స్)ను రక్షించుకోవాలి.
5. వేప నూనె 3% చల్లితే పంటలను తామర పురుగులు ఆశించవు. వీటి సంతానోత్పత్తి ప్రక్రియకు వేప నూనె అంతరాయం కలిగిస్తుంది.
6. బవేరియా బాసియానా, మెటార్హిజియం అనిసోప్లియె అనే శిలీంధ్రాలు తామర పురుగులకు రోగాన్ని కలిగించి నశింపజేస్తాయి. ఇవి రైతులకు అందుబాటులో ఉన్నాయి.

## మిరపలో నల్ల తామర జీవిత చక్రం




# నౌకాయానంలో వర్చువల్ వ్యవసాయ శాస్త్రవేత్త



నౌకాయాన పరిశ్రమ సొంత ఆహార అవసరాల కోసం అధునాతన సేద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నది. కృత్రిమ మేధతో నడిచే కూరగాయలు, ఆకు కూరలు, ఔషధ మొక్కలను నౌకల్లోనే సాగు చేయటం ప్రారంభమైంది. సిబ్బందికి మెరుగైన ఆహారాన్ని అందించటంతోపాటు వారి మనోబలాన్ని పెంపొందించేందుకు కొన్ని షిప్పింగ్ కంపెనీలు డిజిటల్ సేద్య పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఈ సంస్థల జాబితాలో సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సినర్జీ మెరైన్ గ్రూప్ ముందంజలో ఉంది. 'అగ్వా' సంస్థ రూపొందించిన అటానమస్ వెజిటబుల్ గ్రోయింగ్ టెక్నాలజీ నావికులకు అనుదినం పోషకాలతో నిండిన తాజా శాకాహారం అందించడానికి ఉపయోగపడుతోంది. గతంలో తీరప్రాంతాలకు చేరినప్పుడు మాత్రమే తాజా కూరగాయలు, ఆకుకూరలు వీరికి అందుబాటులో ఉండేవి. ఇప్పుడు రోజూ అందుబాటులోకి రావటం వల్ల నౌకా సంస్థల సిబ్బంది సంతృప్తిగా, ఆరోగ్యంగా ఉంటూ మెరుగైన సేవలందించగలుగుతున్నారట. సినర్జీ మెరైన్ గ్రూప్ బాటలో ఈస్టర్న్ పసిఫిక్ షిప్పింగ్, సీస్పాన్ కార్ప్, కాపిటల్ షిప్పింగ్, కూల్‌కో నడుస్తూ సముద్ర యానంలో తాజా ఆహారాన్ని పండిస్తూ, వండి వార్చుతున్నాయి.





సినర్జీ మెరైన్ గ్రూప్‌నకు చెందిన సూయెజ్‌మాక్స్ ఎఫ్పీ మెర్స్క్ ఓడలో సిబ్బంది సెప్టెంబర్ నుండి మూడు ప్రత్యేక అగ్వా యూనిట్లను ఉపయోగించి ఆకు కూరలు, ఔషధ మొక్కలు, దుంప కూరలు, టొమాటోలు, స్ట్రాబెర్రీలను నడి సముద్రంలో ప్రయాణం చేస్తూనే సాగు చేసుకుంటూ ఆనందంగా ఆరగిస్తున్నారు.

### స్వయంచాలిత సేద్యం

ఆకర్షణీయమైన వేతనాలకు మించి సముద్రయాన సంస్థ సిబ్బంది సమగ్ర సంక్షేమం, జీవనశైలి ప్రయోజనాలను అందించడంలో అగ్వా సంస్థ రూపొందించిన అత్యాధునిక ఇన్‌డోర్ సాగు పరికరాలు ఉపయోగపడుతున్నాయి.

సిబ్బంది శ్రేయస్సును మెరుగుపరుస్తుంది. తాజా కూరగాయలను స్థిరంగా సరఫరా చేయడం ఒక కీలకమైన ఆవిష్కరణ. పూర్తి స్వయంప్రతిపత్తి కలిగిన అగ్వా ఆన్‌బోర్డ్ కూరగాయల పెంపక యూనిట్లు అత్యాధునిక సాంకేతికతతో వినియోగదారుల అవసరాలకు, ఆసక్తులకు తగిన రీతిలో తాజా ఉత్పత్తులను అందిస్తున్నాయి.

అధునాతన కృత్రిమ మేధ, ఇమేజ్ ఎనలైజర్, సెన్సరీ డేటా ద్వారా వినియోగదారు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా అగ్వా యూనిట్లు పనిచేస్తాయి. ఇవి చూడటానికి ఒక ఫ్రిజ్ మాదిరిగా ఉంటాయి. ఇవి పూర్తిస్థాయిలో 'వర్చువల్ అగ్రానామిస్ట్' (వర్చువల్ వ్యవసాయ శాస్త్రవేత్త) పాత్రను పోషిస్తాయి. వెల్తురు, తేమ, మొక్కలకు పోషకాల సరఫరా.. వంటి పనులన్నిటినీ వాతావరణాన్ని బట్టి ఇవే మార్పులు చేసేసుకుంటాయి.

అగ్వా యాప్ సాగులో ఉన్న కూరగాయల స్థితిగతులు, పెరుగుదల తీరుతెన్నులపై ఎప్పటికప్పుడు మెసేజ్‌లు పంపుతూ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా నౌకా సిబ్బంది శ్రేయస్సు కోసం మెరుగైన ప్రయోజనాలు కల్పించటం, ప్రతికూల పరిస్థితుల్లోనూ నావికా సిబ్బందికి మెరుగైన ఆహారాన్ని అందించడానికి ఈ అధునాతన హైడ్రోపోనిక్ సాంకేతికత ఉపయోగపడుతోంది.

వాతావరణంలో మార్పులకు తగిన రీతిలో పంట మొక్కల అవసరాలను అగ్వా 2.0 యూనిట్లు స్వయంచాలకంగా, రిమోట్‌గా సర్దుబాటు చేసుకుంటాయి. ఇది ఏకకాలంలో వివిధ కూరగాయలను పండించగలదు. 'వర్చువల్ వ్యవసాయ శాస్త్రవేత్త' అగ్వా యూనిట్‌లో పెరిగే ప్రతి మొక్కను నిరంతరం పర్యవేక్షిస్తుంది. సరైన నాణ్యత, మెరుగైన దిగుబడి సాధనకు అనుగుణంగా సర్దుబాటు చేస్తుంది.





# చౌడు పీడ రబీలోనే ఎక్కువ!

చౌడు సమస్య ఖరీఫ్‌లో కన్నా రబీలోనే ఎక్కువగా ఇబ్బందిపెడుతుంది. చౌడు వల్ల ధాన్యం దిగుబడి తగ్గడం కూడా రబీలోనే ఎక్కువని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చౌడును తట్టుకొని 20-25 బస్తాల దిగుబడినిచ్చే డి.ఆర్.ఆర్. ధన్ 39, జరవ, వికాస్ అనే వరి వంగడాలు ఉన్నాయి. ఇవి 120-130 రోజుల్లో కోతకొస్తాయి.

కోస్తా ఆంధ్ర ప్రాంతంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో చౌడు సమస్య ఉంది. మట్టిలో లవణ సూచిక (ఇ. సి.) 4 వరకు ఉంటే కొంత ఫర్వాలేదు. కానీ, మా క్షేత్రంలో ఈ ఏడాది 10.9 ఉంది. ఎక్స్ఛేంజబుల్ సోడియం పర్సంటేజ్ (ఈ.ఎస్.పి.) 15% కన్నా పెరిగితే చౌడు సమస్య తలెత్తుతుంది.

చౌడు భూముల్లో కాలువ నీటితో సాగు చేయడానికి అనువైన మూడు వరి వంగడాలను శాస్త్రవేత్తలు గతంలోనే రూపొందించారు. ఎం.సి.ఎం. 100 అనేది రబీకి అనుకూలం. 125 రోజులు. 28-30 బస్తాల దిగుబడి వచ్చింది. ఎం.సి.ఎం. 101 రకం 140 రోజుల పంట. ఖరీఫ్‌కు అనుకూలం. 35 బస్తాల దిగుబడి. అగ్గి తెగులును, దోమను తట్టుకుంది. ఎం.సి.ఎం. 103 ఖరీఫ్ రకం. ఇది రాయలసీమ జిల్లాల్లోనూ మంచి దిగుబడులనిస్తోంది.

చౌడు భూముల్లో నాట్లకు ముందు జీలుగ సాగు చేసి కలియదున్నాలి. ఇతర పచ్చిరొట్ట పైర్లు వేస్తే ఉపయోగం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పైపైనే దమ్ము చేయాలి. సమతూకంగా ఎరువులు వాడాలి. సేంద్రియ ఎరువులు వేయడం మంచిది. రబీలో పొలాన్ని ఖాళీగా ఉంచితే, ఖరీఫ్‌లో చౌడు సమస్య ఎక్కువ అవుతుందట.

## బిజినెస్ రీల్

### మరో 100 విమానాలకు ఎయిరిండియా ఆర్డరు



ముంబై: విమానయాన సంస్థ ఎయిరిండియా మరో 100 ఎయిర్‌బస్ విమానాల కోసం ఆర్డర్ ఇచ్చింది. వీటిలో వైడ్‌-బాడీ ఏ350 రకం ఎయిర్‌క్రాఫ్టులు 10, ప్రాంతీయ రూట్లలో ఉపయోగించే నారో-బాడీ ఎ320 రకం విమానాలు 90 ఉన్నాయి. కంపెనీ ఇప్పటికే ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు ఇచ్చిన 470 విమానాలకు ఇవి అదనం. అలాగే ఎ350 ఎయిర్‌క్రాఫ్టుల విడిభాగాలు, నిర్వహణ సహకారం కోసం ఎయిర్‌బస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎయిరిండియా తెలిపింది. తాజా ఆర్డరుతో కలిపి ఎయిర్‌బస్ నుంచి ఎయిరిండియా కొనుగోలు చేసే మొత్తం ఎయిర్‌క్రాఫ్టుల సంఖ్య 350కి చేరుతుంది. 2023లో కంపెనీ 250 విమానాల కోసం ఆర్డరిచ్చింది.

### లూమినా డేటామ్యాటిక్స్ చేతికి టీఎన్‌క్యూ టెక్

రెండు దశల్లో కొనుగోలు



న్యూఢిల్లీ: చెన్నైకి చెందిన డిజిటల్ పబ్లిషింగ్ టెక్నాలజీ సంస్థ టీఎన్‌క్యూ టెక్‌లో నూరు శాతం వాటా కొనుగోలుకు లుమినా డేటామ్యాటిక్స్ ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో ఈ లావాదేవీ పూర్తికానుంది. మొదటి దశలో 80 శాతం వాటాను ఈ నెల 31లోపు, మిగిలిన 20 శాతం వాటాను 2026 జూలై 31లోపు కొనుగోలు చేయనున్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో సమీర్ కనోడియా తెలిపారు. మొదటి దశ 80 శాతం వాటా కోసం రూ.336 కోట్లను చెల్లించనుంది. మిగిలిన 20 శాతం వాటాను భవిష్యత్తు ఎబిట్డా ఆధారంగా నిర్ణయించనున్నారు. డిజిటల్ కంటెంట్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన సంస్థగా అవతరించేందుకు ఈ కొనుగోలు సయపాడుతుందని లుమినా డేటామ్యాటిక్స్ తెలిపింది. కొనుగోలు తర్వాత డేటామ్యాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్‌కు టీఎన్‌క్యూ అనుబంధ సంస్థగా మారుతుంది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయిన డేటామ్యాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్‌కు లుమినా డేటామ్యాటిక్స్ అనుబంధ సంస్థగా ఉంది.

### 1,000 బ్రాండ్లతో కాన్‌ఎక్స్‌పో



న్యూఢిల్లీ: నిర్మాణ రంగంలో ప్రముఖ ప్రదర్శన బౌమా కాన్ఎక్స్‌పో ఇండియా 2024 బుధవారం (డిసెంబర్ 11) నుంచి ప్రారంభం అవుతోంది. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్ వేదికగా నాలుగు రోజులపాటు జరిగే ఈ ఎక్స్‌పోలో జర్మనీ, ఇటలీ, దక్షిణ కొరియా తదితర 100 దేశాల నుంచి 1,000కి పైగా బ్రాండ్లు పాలుపంచుకుంటున్నాయి. నిర్మాణ యంత్రాలు, బిల్డింగ్ మెటీరియల్ మెషీన్లు, మైనింగ్ మెషీన్లు, నిర్మాణ వాహనాల కోసం అంతర్జాతీయ స్థాయిలో ఈ వాణిజ్య ప్రదర్శన కొలువుదీరింది. భవనాల కూల్చివేతలు, రీసైక్లింగ్‌కు సంబంధించి అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, అవకాశాలపై చర్చించేందుకు డెమ్‌టెక్ ఇండియా 2024 సదస్సు సైతం నిర్వహించనున్నారు.

## నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| SHRIRAMFIN | 3,181.60 | 2.4 |
| BAJAJFINSV | 1,664.00 | 1.65 |
| HCLTECH | 1,937.00 | 1.42 |
| WIPRO | 308 | 1.4 |
| INFY | 1,947.10 | 1.22 |

## నిఫ్టీ 50


టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BHARTIARTL | 1,580.05 | -1.4 |
| DRREDDY | 1,238.40 | -1.33 |
| ADANIPORTS | 1,252.00 | -1.17 |
| ADANIENT | 2,467.50 | -1.14 |
| HDFCLIFE | 634.8 | -1.09 |

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,150 |
| ఎన్ఎస్ఈ | 1,08,765 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,39,667 |
| ఎఫ్ఐఐ | + 1,286 |
| డీఐఐ | + 606 |

## ముడిచమురు... (బ్యారెల్)



| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 68.92 | $ 68.37 |
| బ్రెంట్ | 72.53 | $ 72.14 |

## వొడాఫోన్ ఐడియా షేర్ల జారీ

### రూ. 1,980 కోట్ల సమీకరణకు బోర్డు ఓకే

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన 175.53 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. షేరుకి రూ. 11.28 ధరలో వొడాఫోన్ గ్రూప్ సంస్థలకు వీటిని కేటాయించనుంది. తద్వారా రూ. 1,980 కోట్లు సమకూర్చుకోనుంది. ఒమెగా టెలికం హోల్డింగ్స్‌కు రూ. 1,280 కోట్లు, ఉషా మార్టిన్ టెలిమాటిక్స్‌కు రూ. 700 కోట్లు విలువైన షేర్లను జారీ చేయనుంది. 2025 జనవరి 7న నిర్వహించనున్న అసాధారణ సమావేశం(ఈజీఎం)లో ఈ అంశాలను బోర్డు చేపట్టనున్నట్లు కంపెనీ తెలియజేసింది. ప్రస్తుతం కంపెనీలో వొడాఫోన్ గ్రూప్ వాటా 22.56 శాతంకాగా.. ఆదిత్య బిర్లా గ్రూప్ 14.76 శాతం, కేంద్ర ప్రభుత్వం 23.15 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి. ఈ ఏడాది(2024-25) రెండో త్రైమాసికంలో కంపెనీ నికర నష్టం రూ. 8,747 కోట్ల నుంచి తగ్గి రూ. 7,176 కోట్లకు పరిమితమైంది. ఇందుకు ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) మెరుగుపడటం సహకరించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 2 శాతం మెరుగుపడి రూ. 10,918 కోట్లను తాకింది. కాగా.. ఇటీవల టెలికం దిగ్గజాలు నోకియా, ఎరిక్సన్, శామ్‌సంగ్‌తో నెట్‌వర్క్ పరికరాల సరఫరా కోసం సుమారు రూ. 30,000 కోట్ల(3.6 బిలియన్ డాలర్లు) విలువైన డీల్‌ను వొడాఫోన్ ఐడియా కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.




ఎన్ఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు రూ. 8.11 వద్ద ముగిసింది.

## ఈకా మొబిలిటీకి రూ.150 కోట్ల ఆర్డర్లు




ముంబై: ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో ఉన్న ఈకా మొబిలిటీ తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నుండి రెండు ఆర్డర్లను దక్కించుకుంది. ఇందులో భాగంగా 70 ఎయిర్ కండిషన్డ్ ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయనుంది. ఈ డీల్ విలువ సుమారు రూ.150 కోట్లు. ఈ డీల్ కింద 12 మీటర్ల పొడవైన 40 ఈ-బస్‌లు, అలాగే 9 మీటర్ల పొడవున్న 30 ఈ-బస్‌లను ఈకా సరఫరా చేయాల్సి ఉంటుంది. సజావుగా కార్యకలాపాలను ప్రారంభించడానికి బ్యాటరీ ఛార్జర్లను కూడా సరఫరా చేస్తామని ఈకా తెలిపింది. రాబోయే 10 సంవత్సరాల పాటు గరిష్ట పనితీరును కొనసాగించడానికి దీర్ఘకాలిక వార్షిక నిర్వహణ ఒప్పందాలను కలిగి ఉన్నట్లు పేర్కొంది.

# 80 బిలియన్ డాలర్ల ఎగుమతులు

### 2030 నాటికి అమెజాన్ లక్ష్యం • కంపెనీ ఎస్‌వీపీ అమిత్ అగర్వాల్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 2030 నాటికి భారత్ నుండి మొత్తం ఎగుమతులు 80 బిలియన్ డాలర్లకు చేర్చనున్నట్టు ప్రకటించింది. 2015 నుంచి కంపెనీ ఎగుమతులు చేపడుతోంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం, లక్షలాది భారతీయ చిన్న వ్యాపారులు, డైరెక్ట్ టు కంజ్యూమర్ బ్రాండ్లతోపాటు ఇతర కీలక వాటాదారులతో కలిసి పనిచేస్తున్నట్టు అమెజాన్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఎస్‌వీపీ అమిత్ అగర్వాల్ తెలిపారు. సంస్థ ఏటా నిర్వహించే సంభవ్ సదస్సు సందర్భంగా ఆయన మాట్లాడారు. 2030 నాటికి మొత్తం 80 బిలియన్ డాలర్ల ఎగుమతులను అందుకునేందుకు నిబద్ధతతో ఉన్నట్టు వివరించారు. 2015లో ప్రారంభించినప్పటి నుండి అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ భారత్‌లోని 200లకుపైగా నగరాల నుండి 1,50,000 పైచిలుకు నమోదిత విక్రేతలను కలిగి ఉందని చెప్పారు. 2025 చివరి నాటికి భారత్ నుండి మొత్తం ఎగుమతులు 20 బిలియన్ డాలర్లను అధిగమించబోతున్నాయని కంపెనీ బ్లాగ్ తెలిపింది.



**గడువు కంటే ముందుగానే..**

భారత్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా స్థాపించడానికి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్‌తో (డీపీఐఐటీ) అమెజాన్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. తయారీ స్టార్టప్స్‌లో 120 మిలియన్ డాలర్లు పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. అమెజాన్ ఒక కోటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను డిజిటలీకరణ చేస్తామని, 2025 నాటికి భారత్ నుండి మొత్తం 20 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులను సాధించి.. దేశంలో 20 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని గతంలో హామీ ఇచ్చింది. గడువు కంటే ఏడాది ముందుగానే డిజిటలీకరణ లక్ష్యాన్ని పూర్తి చేసినట్టు అమెజాన్ తెలిపింది. 1.2 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డిజిటలైజ్ చేశామని, మొత్తం ఎగుమతులు 13 బిలియన్ డాలర్లు నమోదయ్యాయని, 14 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు అందించామని వివరించింది.

**లాజిస్టిక్స్ సేవలు..**

దేశవ్యాప్తంగా వ్యాపార సంస్థలు, డైరెక్ట్ టు కంజ్యూమర్ (డీ2సీ) బ్రాండ్స్ కోసం అమెజాన్ షిప్పింగ్, అమెజాన్ ఫ్రైట్ పేరుతో సరుకు రవాణా సేవలను ప్రారంభించినట్లు అమిత్ అగర్వాల్ ప్రకటించారు. అమెజాన్ ఫ్రైట్ కింద నగరాల మధ్య, నగరాల్లో రవాణా కోసం పూర్తి ట్రక్‌లోడ్ సరుకు రవాణా సేవలను అందిస్తారు. అలాగే అమెజాన్ షిప్పింగ్ కింద బిజినెస్ టు కంజ్యూమర్ (బీ2సీ) పార్సిల్ డెలివరీలను చేపడతారు.

## క్విక్‌కామర్స్ ఎంట్రీకి అమెజాన్ సన్నాహాలు..

### ఈ నెలలో బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ దేశీయంగా క్విక్ కామర్స్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది. '15 నిమిషాల లోపే' నిత్యావసరాలను డెలివరీ చేసేలా బెంగళూరులో పైలట్ ప్రాజెక్టును ఈ నెలలో మొదలుపెట్టబోతున్నట్లు అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ తెలిపారు. దేశీయంగా ఇప్పటికే క్విక్ కామర్స్ మార్కెట్లో బ్లింకిట్, జెప్టో మొదలైనవి విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. డేటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం ప్రస్తుతం ఈ మార్కెట్ 6.1 బిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి 40 బిలియన్ డాలర్లకు చేరొచ్చనే అంచనాలు ఉన్నాయి. మరోవైపు భారత్‌లో ఈ-కామర్స్ వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని కుమార్ వివరించారు. ఇక్కడ విక్రేతలు.. ఔత్సాహిక వ్యాపారవేత్తల సంఖ్య పెరుగుతుండటం, నాణ్యమైన తయారీ, సానుకూల పాలసీలు, టెక్నాలజీ మొదలైనవన్నీ ఇందుకు దోహదపడే అంశాలని పేర్కొన్నారు. భారీ డిస్కౌంట్లతో చిన్న వ్యాపారాలను దెబ్బతీస్తోందంటూ అమెజాన్‌పై వచ్చే ఆరోపణల మీద స్పందిస్తూ.. తమ కంపెనీ కస్టమర్లకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా, నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహిస్తోందని కుమార్ చెప్పారు. చిన్న, మధ్య స్థాయి వ్యాపారాలు కూడా మనుగడ సాగించేలా తోడ్పాటు అందించడమనేది ఒక పెద్ద కంపెనీగా తన బాధ్యతగా అమెజాన్ భావిస్తుందని పేర్కొన్నారు.

## ఐటీ రంగంలో అధిక నియామకాలు

- 2025లో 15-20 శాతం వృద్ధి
- ఎన్ఎల్‌బీ సర్వీసెస్ అంచనా



ముంబై: ఐటీ రంగంలో 2025లో 15-20 శాతం మేర అధిక నియామకాలు నమోదవుతాయని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ అంచనా వేసింది. ముఖ్యంగా ఈ ఏడాది ద్వితీయ ఆరు నెల్లలో ఈ రంగంలో కదలిక వచ్చిందని, దీంతో 2025లో ఈ పరిశ్రమలోని పలు విభాగాల్లో నియామకాలు ఆశావహంగా ఉంటాయని తెలిపింది. కీలక నైపుణ్యాలు కలిగిన.. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా అనలైటిక్స్, క్లౌడ్ టెక్నాలజీలకి డిమాండ్ 30-35 శాతం మేర పెరుగుతుందని అంచనా వేసింది. డిమాండ్‌లో పెరుగుదల కేవలం ఈ నైపుణ్యాలకు మాత్రమే పరిమితం కాదని, టెక్నాలజీ నైపుణ్యాలను పెంచుకోవడంపైనా దృష్టి సారించాలని పేర్కొంది. మారుతున్న టెక్నాలజీల నేపథ్యంలో తమ మానవవనరులను అవసరమైన నైపుణ్యాలపై తర్ఫీదు ఇవ్వడంపై కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నట్టు వివరించింది. పెద్ద కంపెనీలకు ఇప్పటికీ క్యాంపస్ నియామకాలు ప్రాధాన్యంగా కొనసాగుతాయని, 2024-25 ద్వితీయ ఆరు నెలల్లో ఇవి చురుగ్గా నియామకాలు చేపట్టొచ్చని పేర్కొంది. ఏఐ, ఎంఎల్, డేటా అనలైటిక్స్, పైథాన్, క్లౌడ్ టెక్నాలజీలకు నెలకొన్న అధిక డిమాండ్ 2025లో ఐటీలో ఫ్రెషర్ల నియామకాలు పెరిగేందుకు దోహదం చేయనున్నట్టు తెలిపింది. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్లు (జీసీసీలు), తయారీ, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్ కంపెనీలు సైతం 30-35 శాతం అధికంగా ఐటీ నిపుణులను తీసుకోవచ్చని అంచనా వేసింది.

# ఈక్విటీ ఫండ్స్ వెనుకకంజ!

**నవంబర్‌లో రూ.35,943 కోట్లు**

- నెలవారీగా చూస్తే 14 శాతం తక్కువ
- సిప్ పెట్టుబడులు రూ.25,300 కోట్లు
- డెట్ పథకాల్లో గణనీయంగా తగ్గుదల

న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు నవంబర్ నెలలో రూ.35,943 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అక్టోబర్ నెల పెట్టుబడులతో పోల్చి చూసినప్పుడు 14 శాతం తగ్గాయి. అయినప్పటికీ వరుసగా 45వ నెలలోనూ ఈక్విటీ ఫండ్స్‌లో సానుకూల పెట్టుబడులు నమోదయ్యాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) నవంబర్ నెల గణాంకాలను విడుదల చేసింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఎన్నికలు తదితర పరిణామాలతో ఈక్విటీ మార్కెట్లు గత రెండు నెలల కాలంలో ఎన్నో అస్థిరతలు ఎదుర్కోవడం తెలిసిందే. దీంతో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణి అనుసరించి ఉండొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఏఎంసీ సీబీవో అఖిల్ చతుర్వేది తెలిపారు. మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి నవంబర్‌లో నికరంగా రూ.60,295 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్‌లో పెట్టుబడుల రాక రూ.2.4 లక్షల కోట్లతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గడం గమనార్హం. ప్రధానంగా డెట్ ఫండ్స్ అక్టోబర్‌లో రూ.1.57 లక్షల కోట్లను ఆకర్షించగా, నవంబర్‌లో ఇవి కేవలం రూ.12,915 కోట్లకు పరిమితమయ్యాయి. మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) అక్టోబర్ చివరికి ఉన్న రూ.67.25 లక్షల కోట్ల నుంచి నవంబర్ చివరికి రూ.68.08 లక్షల కోట్లకు పెరిగింది.

**లక్ష్యాలకు కట్టుబాటు..**

నెలవారీ సిప్ పెట్టుబడులు రూ.25,000 కోట్లకు పైనే ఉండడం అన్నది దీర్ఘకాల లక్ష్యాలు, ప్రణాళిక పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న అంకిత భావానికి నిదర్శనమని యాంఫి సీఈవో వెంకట్ చలసాని పేర్కొన్నారు. సిప్ పెట్టుబడులను స్థిరంగా ఉండడం దీర్ఘకాలంలో ఫండ్స్ విలువను సమకూర్చుతాయన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు.



**విభాగాల వారీగా..**

- లార్జ్‌క్యాప్ పథకాల్లోకి రూ.2,548 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్‌లో వచ్చిన రూ.3,452 కోట్లతో పోల్చితే 26 శాతం తగ్గాయి.
- సెక్టోరల్, థీమ్యాటిక్ ఫండ్స్ అత్యధికంగా రూ.7,658 కోట్లను రాబట్టాయి. అక్టోబర్‌లో ఇవే పథకాల్లోకి రూ.12,279 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.13,255 కోట్ల చొప్పున రావడం గమనార్హం.
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,084 కోట్లు వచ్చాయి.
- ఇక స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాల దూకుడు కొనసాగుతూనే ఉంది. అక్టోబర్ నెలతో పోల్చితే నవంబర్‌లో స్మాల్ క్యాప్ ఫండ్స్ 9 శాతం అధికంగా రూ.4,112 కోట్లు, మిడ్ క్యాప్ ఫండ్స్ 4.3 శాతం అధికంగా రూ.4,883 కోట్ల చొప్పున ఆకర్షించాయి.

రిస్క్ ఉన్నా కానీ ఇన్వెస్టర్లు అధిక రాబడులు కోరుకుంటున్నారనే దానికి ఈ గణాంకాలు నిదర్శనంగా నిలుస్తాయి.

- లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.4,680 కోట్లు, వ్యాల్యూ ఫండ్స్ రూ.2,088 కోట్లు, ఫోకస్డ్ ఫండ్స్ రూ.430 కోట్లు, ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ రూ.619 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- 18 కొత్త పథకాలు (ఎన్ఎఫ్‌వోలు) నవంబర్ లో మార్కెట్లోకి వచ్చి రూ.4,052 కోట్లను సమీకరించాయి. అక్టోబర్లో 29ఎన్ఎఫ్‌వోలు రూ.6,078 కోట్లు సమీకరించడం గమనార్హం.
- డెట్ విభాగంలో 16 విభాగాలకు గాను 9 విభాగాల్లోకి పెట్టుబడులు రాగా, మిగిలినవి పెట్టుబడులు కోల్పోయాయి.
- ఓవర్‌నైట్ ఫండ్స్‌లోకి రూ.2,109 కోట్లు, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోకి రూ.2,962 కోట్లు, లో డ్యురేషన్ ఫండ్స్ రూ.4,374 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్‌లోకి రూ.2,426 కోట్లు, కార్పొరేట్ బాండ్ ఫండ్స్‌లోకి రూ.2,138 కోట్ల చొప్పున వచ్చాయి.
- డెట్‌లో లిక్విడ్ ఫండ్స్ రూ.1,779 కోట్లు, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ రూ.454 కోట్లు, మీడియం డ్యురేషన్ ఫండ్స్ రూ.201 కోట్ల చొప్పున కోల్పోయాయి.

**సిప్ పెట్టుబడులు ఫ్లాట్**

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో నవంబర్‌లో ఈక్విటీ పథకాల్లోకి రూ.25,320 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అక్టోబర్ సిప్ పెట్టుబడులు రూ.25,323 కోట్లతో పోల్చి చూస్తే ఫ్లాట్‌గా నమోదయ్యాయి. కొత్తగా 49.46 లక్షల సిప్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. అక్టోబర్‌లో ఇవి 63.70 లక్షలుగా ఉన్నాయి. మొత్తం సిప్ ఖాతాలు 10.12 కోట్ల నుంచి 10.23 కోట్లకు పెరిగాయి.



# మరోసారి డేటా లీక్ కాదు

- అందుకోసం ఎన్నో చర్యలు
- స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్

చెన్నై: పాలసీదారుల కీలక సమాచారం లీక్ కావడంతో స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ తన భద్రతను పటిష్టం చేసుకునేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ తరహా డేటా లీకేజీ ఘటన మరోసారి చోటు చేసుకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో ఆనంద్‌రాయ్ తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగిన డేటా లీకేజీ ఘటనలో 3.1 కోట్ల స్టార్ హెల్త్ కస్టమర్ల మొబైల్ ఫోన్, పాన్, చిరునామా తదితర సున్ని సమాచారం బయటకు రావడం గమనార్హం. షెంజెన్ అనే హ్యాకర్ ఈ సమాచారాన్ని ఏకంగా ఒక పోర్టల్‌లో విక్రయానికి పెట్టినట్టు వార్తలు వచ్చాయి. ''ఒకరితో ఒకరు అనుసంధానమై పనిచేయాల్సిన ప్రపంచం ఇది. ఏజెంట్లు, ఆస్పత్రులు, బీమా కంపెనీలు అన్ని అనుసంధానమై పని చోసే చోట తమ వంతు రక్షణలు ఏర్పాటు చేసుకోవాల్సిందే. బలహీన పాస్‌వర్డ్‌లు తదితర వాటిని హ్యాకర్లు సులభంగా గుర్తించగలరు. కేవలం అంతర్గతంగానే కాకుండా, స్వతంత్ర నిపుణుల సాయంతో మేము ఇందుకు సంబంధించి రక్షణ చర్యలు తీసుకున్నాం''అని వివరించారు. ఈ తరహా ఘటనలు పెరిగిపోయాయంటూ, బీమా కంపెనీలను హ్యాకర్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్టు చెప్పారు.

## రూ. 500 కోట్ల సమీకరణలో ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ సంస్థ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ. 500 కోట్ల వరకు నిధులు సమీకరించనుంది. బేస్ ఇష్యూ పరిమాణం రూ. 100 కోట్లు కాగా, రూ. 400 కోట్ల వరకు ఓవర్‌సబ్‌స్క్రిప్షన్‌ను అట్టే పెట్టుకునే విధంగా ఈ ఇష్యూ ఉండనుంది. ఒక్కో ఎన్‌సీడీ ముఖ విలువ రూ. 1,000గా ఉంటుంది. వార్షికంగా 8.85 శాతం నుంచి 9.25 శాతం కూపన్ రెట్ ఉంటుంది. 24 నెలల నుంచి 84 నెలల వరకు కాలవ్యవధితో కంపెనీ వీటిని జారీ చేస్తుంది. ఈ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను తదుపరి రుణాలిచ్చేందుకు, కంపెనీకి ఉన్న ఇతరత్రా రుణాలను తీర్చివేసేందుకు, కార్పొరేట్ అవసరాలకు ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ వినియోగించుకుంటుంది. డిసెంబర్ 19తో ఇష్యూ ముగుస్తుంది.

# డీఏఎమ్ క్యాపిటల్ ఐపీవోకు ఓకే

- సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్
- కంటిన్యూమ్ ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ డీఏఎమ్ క్యాపిటల్ అడ్వయిజర్స్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇష్యూలో భాగంగా కంపెనీ ప్రమోటర్‌తోపాటు ప్రస్తుత ఇన్వెస్టర్లు 3.2 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. దీంతో ఐపీవో నిధులు కంపెనీకి లభించబోవు. కంపెనీ సెబీకి ప్రాస్పెక్టస్‌ను సెప్టెంబర్‌లో దాఖలు చేసింది. డీఏఎమ్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్లు, విలీనాలు.. కొనుగోళ్లు, పీఈ, ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీల బ్రోకింగ్, రీసెర్చ్ సర్వీసులు సమకూర్చుతోంది. క్రిసిల్ నివేదిక ప్రకారం దేశీయంగా 12.1 శాతం మార్కెట్ వాటాతో డీఏఎమ్ క్యాపిటల్ లీడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులలో ఒకటిగా నిలుస్తోంది. కాగా.. ఐపీవోకు అనుమతించమంటూ ఎమ్అండ్‌బీ ఇంజినీరింగ్ సెప్టెంబర్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను సెబీ తాజాగా తిప్పి పంపింది.

**ఐపీవో బాటలో కంటిన్యూమ్**

ఇండిపెండెంట్ విద్యుదుత్పత్తి కంపెనీ(ఐపీపీ) కంటిన్యూమ్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. లిస్టింగ్‌కు అనుమతించమంటూ సెబీకి తాజాగా ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 1,250 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,400 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ప్రమోటర్ కంటిన్యూమ్ గ్రీన్ ఎనర్జీ హోల్డింగ్స్ విక్రయానికి ఉంచనుంది. తద్వారా మొత్తం రూ. 3,650 కోట్లు సమీకరించాలని ప్రణాళికలు వేసింది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 1,100 కోట్లు అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ దేశీయంగా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల గుర్తింపు, అభివృద్ధి, నిర్మాణం, నిర్వహణ చేపడుతోంది. 2007లో ప్రారంభమైన కంపెనీ 2.22 గిగావాట్ల నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉంది. మరో 1.31 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. గతేడాది(2023-24)లో ఆదాయం 33 శాతం జంప్‌చేసి రూ. 1,294 కోట్లను తాకింది.

## హల్దీరామ్‌లో వాటాపై కన్ను

### రేసులో మూడు సంస్థలు

న్యూఢిల్లీ: ప్యాక్‌డ్ స్వీట్లు, స్నాక్స్, రెస్టారెంట్ల నిర్వాహక కంపెనీ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో మైనారిటీ వాటా కొనుగోలుపై మూడు కంపెనీలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం 15-20 శాతం వాటా కొనుగోలు రేసులో బ్లాక్‌స్టోన్‌కు పెట్టుబడులున్న బెయిన్ క్యాపిటల్ కన్సార్షియం ముందుంది. అయితే అల్ఫా వేవ్ గ్లోబల్ సైతం ఆసక్తి చూపడతో ప్రస్తుతం మూడు సంస్థల మధ్య పోటీ నెలకొంది. బిలియన్ డాలర్ల(సుమారు రూ. 8,400 కోట్లు) విలువైన బైండింగ్ ఆఫర్ ద్వారా అల్ఫా వేవ్ పోటీని తీవ్రతరమైంది. హల్దీరామ్ ప్రమోటర్లు అగర్వాల్ కుటుంబం కొత్త ఏడాది జనవరిలో వాటా విక్రయాన్ని పూర్తిచేయవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తొలుత మెజారిటీ వాటాను విక్రయించాలని భావించిన ప్రమోటర్లు తదుపరి మైనారిటీ వాటా విక్రయానికి కట్టుబడ్డారు. తద్వారా సమీకరించిన నిధులను విస్తరణకు వినియోగించే యోచనలో ఉన్నారు. అంతేకాకుండా తదుపరి దశలో ఐపీవో వైపు సైతం దృష్టిసారించనున్నట్లు అంచనా. టెమాసెక్ భాగస్వామ్యంతో బెయిన్ క్యాపిటల్, అబు ధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, సింగపూర్ సంస్థ జీఐసీ వాటా కొనుగోలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.




# భారత్‌లో ఆశావహంగా ఏవియేషన్

### ఐఏటీఏ చీఫ్ విల్లీ వాల్ష్

జెనీవా: భారత మార్కెట్లో ఏవియేషన్ రంగ వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ తెలిపారు. దేశీ విమానయాన సంస్థలు పెద్ద ఎత్తున ఎయిర్‌క్రాఫ్టులకు ఆర్డర్లు ఇస్తున్న నేపథ్యంలో పైలట్ కావాలనుకునే ఔత్సాహికులు భారత్ వైపు చూడొచ్చని ఆయన సూచించారు. ఎయిర్ కనెక్టివిటీని పెంచుకోవడం ద్వారా ఆర్థిక పురోగతి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని గుర్తించిన భారత్.. విమానాశ్రయాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై ఇన్వెస్ట్ చేస్తోందని వాల్ష్ చెప్పారు. మరోవైపు, దేశీయంగా ఎయిర్‌పోర్ట్ చార్జీలపై స్పందిస్తూ.. పరిస్థితి క్రమంగా మెరుగుపడుతుండటం సానుకూలాంశమని ఆయన వివరించారు. పరిశ్రమపై చార్జీల ప్రభావాన్ని గుర్తెరిగిన నియంత్రణ సంస్థ .. విమానయాన సంస్థలు, పరిశ్రమ అభిప్రాయాలు కూడా తెలుసుకోవడంపై సానుకూలంగా వ్యవహరిస్తోందని వాల్ష్ చెప్పారు.



# విద్యలో క్రీడలు భాగమైతేనే...

**ఓటమి విలువ తెలుస్తుంది: అగస్సీ**



**బెంగళూరు:** స్కూలు విద్యలో క్రీడల్ని భాగం చేయాలని, అప్పుడే విద్యార్థులకు ఓటమి విలువేంటో ఆటలు నేర్పిస్తాయని టెన్నిస్ దిగ్గజం ఆంద్రీ అగస్సీ చెప్పాడు. టీఐఈ (ద ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన అమెరికన్ మాజీ నంబర్‌వన్ టెన్నిస్ స్టార్... క్రీడలతో భవిష్యత్తు, పాఠశాల విద్యపై తన అభిప్రాయాలు వెలిబుచ్చాడు. 'ఒకవేళ వైఫల్యం ఎదురైనా... తట్టుకొని నిలబడేందుకు, మళ్లీ మరుసటి రోజు వెంటనే ఆడేందుకు స్థయిర్యాన్ని క్రీడలే ఇస్తాయి. అందుకే చెబుతున్నా... క్రీడల్లోని గెలుపోటములు మనకు పాఠాలు నేర్పుతాయి. ఓడిన ప్రతీసారి గెలవడంపై మరింత దృష్టి పెట్టేలా చేస్తాయి. అంటే మెరుగయ్యేందుకు, ప్రగతి సాధించేందుకు దోహదం చేస్తాయి' అని వివరించాడు. ఈ దిగ్గజం రెండు దశాబ్దాల క్రితమే బలహీనవర్గాల పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో పాఠశాలలు నిర్మించాడు. 2001లో మొదలైన ఈ సంకల్పంతో అతను 130 పాఠశాలల్ని ఏర్పాటు చేసి 80 వేల మంది చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాడు. టెన్నిస్ క్రీడ వల్లే తాను ఇంతలా రాటుదేలానని చెప్పుకొచ్చాడు. ఆటలు ఆడటం వల్ల మానసిక, శారీరక స్థయిర్యం పెరిగి... జీవితానికి సరిపడా ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకున్నానని అగస్సీ చెప్పాడు. 'స్పోర్ట్స్ అంటేనే సవాళ్లు... వాటిని అధిగమించడం. అంటే సమస్యకు ఎదురీది పరిష్కరించుకోవడం. టెన్నిస్ నాకు అదే నేర్పించింది. సవాళ్లు ఎదురైన ప్రతీసారి నిలబడి ఎదుర్కోవాలన్న ధైర్యాన్ని అలవర్చింది. ఓడితే గెలిచేందుకు మరింత శ్రద్ధపెట్టాలన్న కసిని నాలో పెంచింది. పోరాటానికి అవసరమైన సాధన, సంపత్తిని సమకూర్చింది' అని పేర్కొన్నాడు. ప్రస్తుత విద్యలో టెక్నాలజీది ప్రముఖ పాత్రని అన్నాడు. అవసరమైన ప్రతి విద్యార్థి వ్యక్తిగత అభ్యాసానికి ఆధునిక టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పాడు. తన కెరీర్‌లో ఎనిమిది గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించిన 54 ఏళ్ల అగస్సీ 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో స్వర్ణ పతకం కూడా గెలిచాడు. 2001లో జర్మనీ దిగ్గజం స్టెఫీ గ్రాఫ్‌ను అగస్సీ పెళ్లి చేసుకున్నాడు.



స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్

# క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలని...

**నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో భారత్ చివరి వన్డే**

ఉదయం గం. 9:50 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

**పెర్త్:** ఇప్పటికే ఆస్ట్రేలియా చేతిలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత మహిళల జట్టు నేడు ఆఖరి వన్డే బరిలోకి దిగనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి రెండు వన్డేల్లోనూ ఓడిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు... బుధవారం పెర్త్ వేదికగా చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో పోటీపడనుంది. ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ నెగ్గిన టీమిండియా... ఆసీస్ చేతిలో క్లీన్‌స్వీప్ తప్పించుకోవాలని ప్రయత్నిస్తోంది. వచ్చే ఏడాది భారత్‌లో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో మెగా టోర్నీకి ముందు... ఆఖరి వన్డేలో నెగ్గి హర్మన్ బృందం ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంటుందా చూడాలి. గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఆస్ట్రేలియా సంపూర్ణ ఆధిపత్యం కనబర్చగా... భారత జట్టు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో ఘోర ప్రదర్శన కనబర్చింది. సీనియర్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోగా... మిగిలిన వాళ్లు కూడా సత్తా చాటడం లేదు. దీంతో బ్యాటింగ్ వైఫల్యం జట్టును దెబ్బ తీస్తోంది. ఇక చివరి మ్యాచ్‌లోనైనా టీమిండియా కలిసికట్టుగా కదంతొక్కాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. వరల్డ్‌కప్‌నకు ముందు బ్యాటింగ్ కూర్పునకు ఈ సిరీస్ ఉపయోగపడుతుందని భావించగా... అదీ సాధ్యపడలేదు. ఫామ్ కోల్పోయి జట్టుకు దూరమైన యువ ఓపెనర్ షఫాలీ వర్మ స్థానంలో ఎవరిని ప్రయత్నించినా... ముద్ర వేయలేకపోగా... మిడిలార్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ మినహా తక్కిన వాళ్లెవరూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. గత రెండు మ్యాచ్‌ల్లో కలిపి ఆసీస్ ప్లేయర్లు 2 సెంచరీలు, 2 అర్ధసెంచరీలు నమోదు చేస్తే... భారత్ నుంచి అత్యధికంగా రిచా ఘోష్ మాత్రమే ఒక హాఫ్ సెంచరీ చేసింది. రెండో వన్డే ఓటమి అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ... 'ఎక్కువ సేపు క్రీజులో నిలవడంపై దృష్టి పెట్టాలి. మొత్తం 50 ఓవర్లు ఆడటంతో పాటు... బౌలింగ్‌లోనూ భిన్నమైన ప్రణాళికలు అమలు చేయాలి' అని చెప్పింది. మరి మూడో మ్యాచ్‌లోనైనా అలాంటి ప్రయత్నం చేస్తారా చూడాలి. మరోవైపు సీనియర్ ప్లేయర్లు అందుబాటులో లేకపోయినా... ఆసీస్ అమ్మాయిలు అదరగొడుతున్నారు. ఈ సిరీస్‌తోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన జార్జియా వోల్... భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని పరుగులు రాబడుతోంది. ఆ తెగింపు మన ప్లేయర్లు కూడా కనబర్చాల్సిన అవసరముంది.



**6** ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో మూడు లేదా అంతకంటే ఎక్కువ వన్డేలతో కూడిన ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత జట్టు ఆరుసార్లు (1984లో 0-4తో; 2006లో 0-3తో; 2008లో 0-5తో; 2012లో 0-3తో; 2018లో 0-3తో; 2023లో 0-3తో) క్లీన్‌స్వీప్ అయింది.

# బరిలో 13,522 మంది షూటర్లు



గనీమత్

**నేటి నుంచి జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్**

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఈసారి రికార్డుస్థాయిలో 13,522 మంది షూటర్లు పాల్గొననున్నారు. న్యూఢిల్లీలోని కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో బుధవారం నుంచి షాట్‌గన్ పోటీలు జరగనుండగా... శుక్రవారం నుంచి పిస్టల్ పోటీలు ప్రారంభం కానున్నాయి. రైఫిల్‌కు సంబంధించి పోటీలను మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నారు. స్కీట్ విభాగంలో నేడు జరగనున్న ప్రి ఈవెంట్‌తో జాతీయ చాంపియన్‌షిప్ ప్రారంభం కానుంది. గురువారం నుంచి క్వాలిఫయింగ్ రౌండ్‌లు జరుగుతాయి. పురుషుల స్కీట్ విభాగంలో అనంత్‌జీత్ సింగ్ నరూకా, మహిళల స్కీట్‌లో గనీమత్ సెఖాన్ డిఫెండింగ్ చాంపియన్‌లుగా బరిలోకి దిగనున్నారు. దేశ నలుమూలల నుంచి షూటర్లు ఈ టోర్నీలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'ప్రధాన షూటర్లతో పాటు ప్రతి ఒక్కరూ 67వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నారు. ఈ ప్రదర్శన ఆధారంగా 2025 అంతర్జాతీయ షూటింగ్ సీజన్‌ను ప్రకటిస్తాం' అని జాతీయ రైఫిల్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

# భారత్‌కు ఆరో స్థానం



**న్యూఢిల్లీ:** ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు ఆరో స్థానంతో ముగించింది. మంగళవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో టీమిండియా 30-41 గోల్స్ తేడాతో చైనా చేతిలో పరాజయం పాలైంది. ఈ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత జట్టుకు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. భారత్ తరఫున భావన శర్మ 9 గోల్స్, మెనిక 7 గోల్స్, గుల్షన్ శర్మ 6 గోల్స్, ప్రియాంక ఠాకూర్ 3 గోల్స్, ప్రియాంక 2 గోల్స్ సాధించగా... షాలిని ఠాకూర్, సుష్మా, మణీందర్ కౌర్ ఒక్కో గోల్ చేశారు. మంగళవారమే జరిగిన ఫైనల్లో జపాన్ 25-24 తేడాతో దక్షిణ కొరియాపై గెలిచి స్వర్ణం గెలుచుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోరులో కజకిస్తాన్ 28-22 తేడాతో ఇరాన్‌పై నెగ్గింది. 'ఈ టోర్నీకి తొలిసారి భారత్ ఆతిథ్యమిచ్చింది. సొంత అభిమానుల మధ్య ఆడటం చాలా ఆనందంగా ఉంది. పతకం సాధించాలని బలంగా అనుకున్నాం కానీ, అది సాధ్య పడలేదు. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకొని భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తాం' అని భారత మహిళల జట్టు ప్లేయర్ మెనిక చెప్పింది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జపాన్, దక్షిణ కొరియా, కజకిస్తాన్, ఇరాన్ జట్లు వచ్చే ఏడాది జరిగే ప్రపంచ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత పొందాయి.

# సహజ శుభారంభం



**సోలాపూర్ (మహారాష్ట్ర):** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ సహజ 6-0, 6-0తో భారత్‌కే చెందిన ఈశ్వరి మాతెరెపై ఘన విజయం సాధించింది. 51 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక్క గేమ్ కూడా కోల్పోలేదు. ఐదు ఏస్‌లు సంధించిన సహజ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసిన ప్రపంచ 311వ ర్యాంకర్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోలేదు. మరోవైపు ఈశ్వరి ఏకంగా ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన స్మృతి భాసిన్-చిలకలపూడి శ్రావ్య శివాని (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో స్మృతి-శ్రావ్య శివాని ద్వయం 6-4, 6-2తో టాప్ సీడ్ వాలెంటిని గ్రమాటికోపౌలో (గ్రీస్)-ఎకతెరీనా యషీనా (రష్యా) జోడీపై సంచలన విజయం సాధించింది.

# అఫ్గానిస్తాన్ కోచ్ ట్రాట్‌కు పొడిగింపు



**న్యూఢిల్లీ:** అఫ్గానిస్తాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ పదవీ కాలాన్ని ఏడాది పొడిగించారు. వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ జరగనుండటంతో అందులో తొలిసారి పాల్గొనబోతున్న అఫ్గానిస్తాన్ తమ కోచ్ కాంట్రాక్టును కొనసాగించింది. 2025 ఏడాది ముగింపుదాకా ట్రాట్ హెడ్ కోచ్‌గా కొనసాగుతాడు. 43 ఏళ్ల ఈ ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ 2022 జూలై నుంచి అఫ్గానిస్తాన్ హెడ్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. అతని శిక్షణలోని అఫ్గానిస్తాన్ జట్టు అంతర్జాతీయ క్రికెట్‌లో పలు చిరస్మరణీయ విజయాలు సాధించింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లాంటి మేటి జట్లను కంగుతినిపించింది. ఈ ఏడాది సఫారీ ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్ తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరింది. గతేడాది భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనూ గ్రూప్ దశలో మాజీ చాంపియన్లు ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంక జట్లకు షాక్ ఇచ్చింది. తద్వారా కటాఫ్ సమయానికి ర్యాంకింగ్స్‌లో 8వ స్థానంలో నిలవడం ద్వారా అఫ్గాన్ చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సంపాదించింది. ఇటీవల దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లపై ద్వైపాక్షిక సిరీస్‌లను 2-1తో కైవసం చేసుకుంది. ట్రాట్ నియామకం తర్వాత అఫ్గాన్ 14 వన్డేలు, 20 టి20ల్లో గెలిచింది. ఇలాంటి సానుకూలతలతో అఫ్గాన్ బోర్డు ట్రాట్ కాంట్రాక్టును ఏడాది పొడిగించింది. అయితే ఈ దఫా అతను కేవలం వన్డే ఫార్మాట్‌కు మాత్రమే జట్టుకు అందుబాటులో ఉంటాడు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కుటుంబంతో గడిపేందుకు టి20లు, టెస్టులకు జట్టుతో పయనించడు.

# సిరాజ్‌ను సీనియర్లే నియంత్రించాలి

**అనుచిత సంబరాలపై టేలర్ వ్యాఖ్య**



**అడిలైడ్:** భారత సీమర్ సిరాజ్ బౌలింగ్ సమయంలో చేసుకునే అనుచిత సంబరాలపై సీనియర్లు నచ్చజెబితే బాగుంటుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మార్క్ టేలర్ అన్నాడు. ప్రస్తుతం జరుగుతోన్న 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో సిరాజ్ చేస్తున్న పదేపదే అప్పీళ్లపై, ముందస్తు సంబరాలపై పలువురు ఆస్ట్రేలియన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ కెప్టెన్ టేలర్ మాట్లాడుతూ భారత సీనియర్లే తమ పేసర్‌ను నియంత్రించాలన్నాడు. కొన్ని సందర్భాల్లో సిరాజ్ అప్పీల్ చేసి అంతటితో ఆగట్లేదు! అంపైర్ నిర్ణయం వెలువరించకపోయినా... తను మాత్రం వికెట్ తీసినట్లుగా సంబరాలు చేసుకోవడం కంగారూ క్రికెటర్లను అసహనానికి గురి చేస్తోంది. 'సిరాజ్‌కు తోటి సీనియర్లే సర్దిచెప్పాలి. ఒక్క ట్రవిస్ హెడ్ అవుట్ విషయంలోనే కాదు... పదేపదే అతను అప్పీల్ చేయడం. అవుటయ్యాడా... నాటౌట్‌గా ఉన్నాడా అనే కనీస విచక్షణ కూడా మరిచి... అంపైర్ వేలు ఎత్తకపోయినా (నిర్ణయం) తను చేసుకునే పరిపక్వత లేని సంబరాలు చూసేందుకు ఏమాత్రం బాగోలేవు. ఇది ఆటకు కూడా అంత మంచిది కాదని నా అభిప్రాయం' అని టేలర్ అన్నాడు. సిరాజ్ మంచి బౌలరని చెప్పుకొచ్చిన మాజీ కెప్టెన్ అతని ఉత్సాహాన్ని తాను అర్థం చేసుకోగలనని చెప్పాడు. 'బౌలింగ్‌లో అతని ఉత్సాహం నన్ను ఆకట్టుకుంటుంది. తన పోటీతత్వాన్ని ఇష్టపడతాను. ఇరు జట్ల మధ్య మంచి సిరీస్ జరుగుతుంటే సిరాజ్ ఆటను కూడా గౌరవించాలి కదా. ఇదే విషయాన్ని అతనికి అర్థమయ్యే విధంగా సహచరులు చెప్పాలి' అని టేలర్ చెప్పాడు. మాజీ కెప్టెన్ క్లార్క్ స్పందిస్తూ హెడ్ అవుటైనపుడు చేసిన సంజ్ఞల కంటే కూడా మితిమీరిన అప్పీళ్లకే రిఫరీ శిక్ష వేయాలని అన్నాడు. మాజీ బ్యాటర్ సైమన్ కటిచ్ మాట్లాడుతూ సిరాజ్‌కు ఆ క్షణంలో (హెడ్ అవుటైనపుడు) బుర్ర దొబ్బిందో ఏమో! లేకపోతే ఆ సమయంలో శ్రుతిమించిన సంబరాలెందుకు చేసుకుంటాడని అన్నాడు. సిరాజ్ చికాకు తెప్పించాడని మిచెల్ స్టార్క్ పేర్కొన్నాడు.

# క్రికెట్ కోచ్ సన్నీ ఢిల్లాన్‌పై నిషేధం

**దుబాయ్:** అబుదాబి టి10 లీగ్‌కు చెందిన ఫ్రాంచైజీ మాజీ సహాయ కోచ్ సన్నీ ఢిల్లాన్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సస్పెన్షన్ వేటు వేసింది. లీగ్‌లో పలు మ్యాచ్‌ల ఫిక్సింగ్‌కు ప్రయత్నించడం వల్లే అతనిపై ఆరేళ్ల నిషేధం విధించినట్లు ఐసీసీ తెలిపింది. గతేడాదే అతనిపై తాత్కాలిక నిషేధం విధించారు. 2023, సెప్టెంబర్ 13వ తేదీ నుంచే ఈ నిషేధం అమలవుతుందని ఐసీసీ పేర్కొంది. 2021లో అబుదాబిలో జరిగిన టి10 క్రికెట్ లీగ్ సందర్భంగా పుణేకు చెందిన ఢిల్లాన్ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఇందులో అతనితో పాటు మొత్తం ఎనిమిది మంది ప్రమేయం ఉన్నట్లు ఐసీసీకి చెందిన అవినీతి నిరోధక విభాగం తేల్చింది. 'ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) అవినీతి నిరోధక నియమావళిని అతిక్రమించినట్లు దర్యాప్తులో తేలడంతో సన్నీ ఢిల్లాన్‌పై చర్యలు తీసుకున్నట్లు ఐసీసీ తెలిపింది. ఢిల్లాన్‌తో పాటు ఫిక్సింగ్‌కు పాల్పడిన పరాగ్ సాంఘ్వి, కృష్ణ కుమార్ చౌదరీలపై కూడా ఐసీసీ లీగల్ చర్యలు చేపట్టింది.

# అర్జున్ అదరహో

- 13 పాయింట్లతో మెరిసిన పింక్‌పాంథర్స్ రెయిడర్
- గుజరాత్ జెయింట్స్‌పై జైపూర్ విజయం



అర్జున్ దేశ్వాల్

**పుణే:** స్టార్ రెయిడర్ అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో సత్తా చాటాడు. దాంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ తొమ్మిదో విజయం నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన ఈ పోరులో పింక్‌పాంథర్స్ 42-29 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి సూపర్ రెయిడ్‌లతో అర్జున్ అదరగొట్టగా... నీరజ్ నర్వాల్ (8 పాయింట్లు) అతడికి సహకరించాడు. గుజరాత్ జెయింట్స్ జట్టు తరఫున గుమాన్ సింగ్, రాకేశ్ చెరో 9 పాయింట్లు సాధించారు. తాజా సీజన్‌లో 18 మ్యాచ్‌లు ఆడిన జైపూర్ పింక్ పాంథర్స్ 9 విజయాలు, 7 పరాజయాలు, 2 'టై'లతో 54 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు గుజరాత్ కేవలం ఐదు విజయాలతో పట్టికలో 11వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 44-29 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. వారియర్స్ తరఫున విశ్వాస్ 14 పాయింట్లు, ప్రణయ్ 9 పాయింట్లతో రాణించగా... బెంగళూరు తరఫున స్టార్ రెయిడర్, 'డుబ్కీ కింగ్' ప్రదీప్ నర్వాల్ 14 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో హరియాణా స్టీలర్స్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 8 గంటలకు), యు ముంబాతో తమిళ్ తలైవాస్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

# బరోడా బ్యాటింగ్ X బెంగాల్ బౌలింగ్

- నేడు ముస్తాక్ అలీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు
- జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

**బెంగళూరు:** శస్త్రచికిత్స అనంతరం తిరిగి మైదానంలో అడుగు పెట్టిన భారత సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ... దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మరో పోరుకు సిద్ధమయ్యాడు. రంజీ ట్రోఫీలో రాణించి ఫిట్‌నెస్ చాటుకున్న షమీ... ముస్తాక్ అలీ ట్రోఫీలో అటు బంతితో ఇటు బ్యాట్‌తోనూ అదరగొడుతున్నాడు. చండీగఢ్‌తో కీలక ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆల్‌రౌండ్ మెరుపులతో షమీ బెంగాల్ జట్టు విజయంలో ముఖ్యపాత్ర పోషించాడు. ఈ టోర్నీలో నేడు నాలుగు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. బరోడాతో బెంగాల్, మధ్యప్రదేశ్‌తో సౌరాష్ట్ర, ముంబైతో విదర్భ, ఢిల్లీతో ఉత్తరప్రదేశ్ తలపడనున్నాయి. గాయం నుంచి కోలుకున్న అనంతరం షమీ దేశవాళీల్లో 64 ఓవర్ల పాటు బౌలింగ్ చేసి 16 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ' చివరి రెండు టెస్టుల కోసం షమీ ఆసీస్ వెళ్లనున్నాడనే వార్తల నేపథ్యంలో... అతడికి ముస్తాక్ అలీ టోర్నీ క్వార్టర్ ఫైనల్ మరో అవకాశం ఇస్తోంది. మరోవైపు ఇటీవల సిక్కింపై 20 ఓవర్లలో 349 పరుగులు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన బరోడా జట్టు... అదే జోష్‌లో సెమీఫైనల్లో అడుగు పెట్టాలని భావిస్తోంది. బరోడా బ్యాటింగ్ సామర్థ్యానికి... బెంగాల్ బౌలింగ్ నైపుణ్యానికి మధ్య తీవ్ర పోటీ ఖాయం. ఢిల్లీతో జరిగే మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి రింకూ సింగ్‌పై అందరి దృష్టి నిలవనుంది. మధ్యప్రదేశ్, సౌరాష్ట్ర మ్యాచ్‌లో వెంకటేశ్ అయ్యర్, రజత్ పాటిదార్ కీలకం కానుండగా...విదర్భతో పోరులో ముంబై జట్టు తరఫున శ్రేయస్ అయ్యర్, అజింక్య రహానే, సూర్యకుమార్ యాదవ్, పృథ్వీ షా మెరుపులు మెరిపించేందుకు సిద్ధమయ్యారు.

**క్వార్టర్ ఫైనల్ షెడ్యూల్**

| | | |
|---|---|---|
| మధ్యప్రదేశ్ X సౌరాష్ట్ర | ఆలూరు | ఉ.గం. 9:00 |
| బరోడా X బెంగాల్ | బెంగళూరు | ఉ.గం.11:00 |
| ముంబై X విదర్భ | ఆలూరు | మ.గం.1:30 |
| ఢిల్లీ X ఉత్తరప్రదేశ్ | బెంగళూరు | సా.గం.4:30 |



షమీ



ఎర్ర రంగు ఏప్రాన్ ధరించి సైనికులకు ఆహారం వడ్డిస్తున్న వ్యక్తి బ్రిటన్ ప్రధానమంత్రి కియిర్ స్టార్మర్. ఈయిన మంగళవారం సైప్రస్‌లోని అక్రోటిరిలో ఉన్న తమ రాయల్ ఎయిర్ ఫోర్స్ బేస్ క్యాంటీన్‌ను సందర్శించిన సందర్భంగా తీసిన చిత్రమిది




కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇటీవల ఢిల్లీ భోగల్ ప్రాంతంలో ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇటువంటి 1.3 కోట్ల దుకాణాలు నడుపుకుంటూ సుమారు 20 కోట్ల కుటుంబాలు జీవిస్తున్నాయని మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. పెద్ద కంపెనీల గుత్తాధిపత్యం కారణంగా వీరు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్నానన్నారు.

# బీజేపీ చేతికి 'అద్దాల మేడ' అస్త్రం

- కేజ్రీవాల్ హయాంలో నిర్మించిన అధికార నివాసంపై ఆరోపణలు
- వీడియో విడుదల చేసిన కాషాయ దళం
- ప్రజల్ని పక్కదోవ పట్టించేందుకేనంటూ ఆప్ ఎదురుదాడి

**సాక్షి, న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆప్, బీజేపీ తమ కత్తులకు పదునుపెడుతున్నాయి. మూడో విడత అధికారం కైవసం చేసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ..ఈసారి ఎలాగైనా గెలవాలని బీజేపీ పట్టుదలతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల చోటుచేసుకున్న పలు నేర ఘటనలను ప్రస్తావిస్తూ ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ శాంతి భద్రతల పరిస్థితి దారుణమంటూ కాషాయ దళంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి బదులుగా అన్నట్లు, సీఎంగా ఉన్న సమయంలో కేజ్రీవాల్ 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డులోని అధికార నివాసానికి రూ.42 కోట్లు వెచ్చించిన అంశాన్ని బీజేపీ తెరపైకి తీసుకొచ్చింది. ప్రజాధనంతో విలాసవంతమైన శీష్ మహల్(అద్దాల మేడ), '7 స్టార్ రిసార్ట్'ను కట్టుకున్నారంటూ ఆ బంగ్లా వీడియోను మంగళవారం ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ విడుదల చేశారు. 'సామాన్యుడని చెప్పుకునే కేజ్రీవాల్ నిర్మించిన అద్దాల మేడ ఇదే. దీన్ని గురించిన వాస్తవాలను మీ ముందుంచబోతున్నాను'అని పేర్కొంటూ సచ్‌దేవ్..'ఢిల్లీ ప్రజల కష్టార్జితాన్ని సొమ్ము చేసుకొని ఒక సామాన్యుడు అద్దాల మేడను నిర్మించాడు. అధికారంలోకి వస్తే ప్రభుత్వ కారు, బంగ్లా, భద్రతను తీసుకోనని చెప్పిన ఈయన, ఇప్పుడు వైభవోపేతమైన 7 స్టార్ రిసార్ట్ నిర్మించుకున్నాడు'అని పేర్కొన్నారు. 'రూ.1.9 కోట్ల విలువైన మార్బుల్ గ్రానైట్ లైటింగ్, రూ.1.5 కోట్లతో ఇన్‌స్టాలేషన్, సివిల్ వర్క్, రూ.35 లక్షల విలువైన జిమ్, స్పా పరికరాలు కలిపి మొత్తంగా వీటికే రూ.3.75 కోట్లు ఖర్చు చేశారు. కేజ్రీవాల్ కూడబెట్టిన నల్లధనానికి రుజువు ఇదే'అని విమర్శించారు. ప్రభుత్వ వనరులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోబోమని ఇచ్చిన హామీని కేజ్రీవాల్ ఉల్లంఘించారన్నారు. ఈ డబ్బుతో నిరుపేదలకు 34 ఇళ్ల ఫ్లాట్లు, లేదా 326 ఈ-రిక్షాలను అందజేయవచ్చన్నారు. బీజేపీ ఎంపీ ప్రవీణ ఖండేల్వాల్ స్పందిస్తూ, కేజ్రీవాల్ చెప్పిన 'ఆమ్ ఆద్మీ'కథలను అద్దాల మేడ బట్టబయలు చేసిందని వ్యాఖ్యానించారు. ఈ విమర్శలను ఆప్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తిప్పికొట్టారు. 'హరియాణా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, ఆస్పత్రుల నిధుల దుర్వినియోగంపై అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వడానికి బదులుగా, వారు కేజ్రీవాల్ నివసించిన అధికారిక నివాసంపై దృష్టి పెట్టారు. విద్య, ఆరోగ్య సంస్కరణల గురించి ప్రజలు అడుగుతుంటే, బీజేపీ నేతలు సీఎం నివాసం గురించి మాట్లాడుతున్నారు'అని ఎదురుదాడికి దిగారు. రానున్న ఎన్నికల్లో ఈ అద్దాల మేడ అంశాన్నే ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ యోచిస్తోందని, ఈ అంశం రాజకీయంగా ఆప్‌ను ఇరుకున పెట్టేదేనని విశ్లేషకులు అంటున్నారు. కాగా, ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం ఆధునీకరణకు అయిన మొత్తం వ్యయం రూ.52.71 కోట్లని విజిలెన్స్ డైరెక్టరేట్ 2023లో లెఫ్టినెంట్ గవర్నర్‌కు అందజేసిన నివేదికలో పేర్కొంది.



ఢిల్లీ సీఎం అధికార నివాసం లోపలి దృశ్యాలు

## జన్‌ధన్ ఖాతాలు క్రియాశీలకంగా లేనివి 11.30 కోట్లు

**ఈ అక్కౌంట్లలో రూ.14,750 కోట్ల నిల్వలు: కేంద్రం**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి జన్ ధన్ యోజన(పీఎంజేడీవై)కింద దేశవ్యాప్తంగా ఉన్న వివిధ బ్యాంకుల్లో 54.03 కోట్ల ఖాతాలు తెరవగా ఇందులో సుమారు 11.30 కోట్ల ఖాతాలు క్రియాశీలకంగా లేవని కేంద్రం మంగళవారం రాజ్యసభలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. లావాదేవీలు నెరపని ఈ అకౌంట్లలో ఈ ఏడాది నవంబర్ 20వ తేదీ నాటికి రూ.14,750 కోట్ల బ్యాలెన్సు ఉందని వివరించారు. 2017లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 39.62% వరకు ఉన్న జన్ ధన్ ఖాతాల సంఖ్య 2024 నవంబర్‌కు 20.91%కి పడిపోయాయన్నారు. రెండేళ్లపాటు ఎటువంటి లావాదేవీలు జరగని సేవింగ్/కరెంట్ ఖాతాలను ఆర్‌బీఐ క్రియాశీలకం కాని ఖాతాగా పరిగణిస్తుందన్నారు. ఖాతాలను క్రియాశీలకంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. క్రియాశీలకం కాని ఖాతాల సంఖ్యను తగ్గించుకోవాలని బ్యాంకులను కోరామన్నారు. ఎప్పటికప్పుడు కేవైసీ అప్‌గ్రేడేషన్, వీడియో కస్టమర్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియ వంటి వాటితో అకౌంట్లను క్రియాశీలకం చేయాలని సూచిస్తున్నామన్నారు.

## పీఎం-కిసాన్‌తో 2 కోట్ల ఎస్సీ, ఎస్టీ రైతులకు లబ్ధి

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం-కిసాన్) ద్వారా దేశవ్యాప్తంగా 2.04 కోట్ల మందికి పైగా ఎస్సీ, ఎస్టీ రైతులకు లబ్ధి చేకూరుతోందని కేంద్రం పార్లమెంట్‌కు తెలిపింది. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన పీఎం-కిసాన్ కింద ఇప్పటి వరకు 18 విడతలుగా రూ.3.46 లక్షల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇటీవలి 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌లో 9.58 కోట్ల మంది లబ్ధిదారులు కాగా, వీరిలో 1.16 కోట్ల మంది ఎస్సీ రైతులు, 88.34 లక్షల మంది ఎస్టీ రైతులు, ఇతర కేటగిరీలో 7.54 కోట్ల మంది రైతులు ఉన్నారని వివరించారు. పథకం కింద ఏటా రూ.6 వేలను మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో కేంద్రం జమ చేస్తోందంటూ ఆయన ఈ మొత్తాన్ని పెంచే యోచన లేదని వివరించారు.

## 'పీఎం విశ్వ కర్మ'కింద రూ.1,751 కోట్ల రుణాలు

**న్యూఢిల్లీ:** పీఎం విశ్వకర్మ పథకం కింద అక్టోబర్ 31వ తేదీ నాటికి రూ.1,751 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి రాజ్యసభకు తెలిపారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి వృత్తులకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని నిపుణులు, పనివారికి సులభంగా రుణాలు అందేలా పలు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పథకం కింద ఈ వర్గం వారు మొత్తం 2.02 లక్షల బ్యాంకు అకౌంట్లు తెరిచారని చెప్పారు. 2023-24 నుంచి 2027-28 కాలానికి గాను కేంద్రం వీరికి ఈ పథకం కింద చేయూతనిచ్చేందుకు రూ.13 వేల కోట్లు కేటాయించింది.

## 18.74 కోట్ల రైతులకు పంట రుణాలు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా సుమారు 18.74 కోట్ల మంది రైతులు వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకున్నారని కేంద్రం తెలిపింది. ఇందులో మొదటిస్థానంలో తమిళనాడు నిలిచిందని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రాంనాథ్ ఠాకూర్ మంగళవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. మొత్తం 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల రైతులకు వ్యవసాయ రుణాలతో బ్యాంకు ఖాతాలున్నాయని వివరించారు. తమిళనాడులో అత్యధికంగా 2.88 కోట్ల మంది రైతులు పొందగా, తర్వాతి స్థానంలో యూపీలోని 1.88 కోట్ల మంది, కర్ణాటకలో 1.62 కోట్ల మంది రుణాలు పొందారని తెలిపారు. 2019-2024 మధ్య కాలంలో కేంద్రం ఎటువంటి పంట రుణాలను మాఫీ చేయలేదని చెప్పారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం రైతుల రుణాలను రద్దు చేశాయని మంత్రి పేర్కొన్నారు.

## మానవ హక్కులకు సరికొత్త సవాళ్లు.. సైబర్ నేరాలు, వాతావరణ మార్పులు


**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**



**న్యూఢిల్లీ:** సైబర్ నేరాలు, వాతావరణ మార్పులు నేడు మానవ హక్కులకు సరికొత్త సవాళ్లను విసురుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. మానవ హక్కుల గురించి మాట్లాడుకునేటప్పుడు, ఉల్లంఘన దారులు సహజంగా మనుషులే ఉండేవాళ్లు కాబట్టి, వారినే ప్రస్తావించే వాళ్లం. కానీ, నేడా పరిస్థితిలో మార్పు వచ్చింది. కొత్తగా కృత్రిమ మేధ రంగంలోకి ప్రవేశించింది. ఇప్పుడిక మానవ హక్కుల ఉల్లంఘనుల జాబితాలో మనుషులతోపాటు కృత్రిమ మేధ కూడా వచ్చి చేరింది. అంతేకాదు, ఈ కృత్రిమ మేధ ఎంతో తెలివైంది కూడా'అని ఆమె పేర్కొన్నారు. మంగళవారం హ్యూమన్ రైట్స్ దినోత్సవం సందర్భంగాజాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్చార్సీ) నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. డిజిటల్ యుగంలో సైబర్ వేధింపులు, డీప్ ఫేక్, గోప్యతకు సంబంధించిన సమస్యలు, తప్పుడు సమాచార వ్యాప్తి వంటి సంక్లిష్ట సవాళ్లు మనముందున్నాయన్నారు. భవిష్యత్తులోకి ముందుకు సాగే కొద్దీ మనం ఇలాంటి పలు కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. వ్యక్తిగత హక్కులు, గౌరవాన్ని రక్షించే సురక్షిత డిజిటల్ వాతావరణాన్ని పెంపొందించాల్సిన ప్రాముఖ్యతను ఈ సవాళ్లు చెప్పకనే చెబుతున్నాయని రాష్ట్రపతి తెలిపారు. మన జీవితాలపై కృత్రిమ మేధ ప్రభావం గురించి మాట్లాడుతూ ముర్ము.. 'కృత్రిమ మేధ నేడు మన నిత్య జీవితంలోకి ప్రవేశించింది. మనం ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపుతోంది. అదే సమయంలో ఎన్నో సవాళ్లను తెచ్చిపెడుతోంది'అని అన్నారు. మానవ హక్కులపై వాతావరణ మార్పులు చూపే ప్రభావంపైనా నేడు ప్రపంచ స్థాయిలో చర్చ జరుగుతోందని రాష్ట్రపతి ముర్ము తెలిపారు.

## వైద్య నేపథ్యం లేని వ్యక్తి ఆరోగ్య మంత్రా?

- రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ ఎంపికపై ఆగ్రహం
- అమెరికా సెనేట్‌కు 77 మంది నోబెల్ గ్రహీతల లేఖ



**వాషింగ్టన్:** ఆరోగ్య శాఖ మంత్రిగా రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ ఎంపిక ఆదినుంచే వివాదాస్పదమవుతోంది. ట్రంప్ నామినీని వ్యతిరేకిస్తూ 77 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు సోమవారం అమెరికా సెనేట్‌కు బహిరంగ లేఖ రాశారు. కెన్నడీని నియమించడం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని వైద్యశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాల గ్రహీతలు లేఖలో పేర్కొన్నారు. కోవిడ్ వ్యాధిపై పోరాటంలో కీలకంగా పనిచేసిన ఎంఆర్‌ఎన్‌ఏ వ్యాక్సిన్లను అభివృద్ధి చేసినందుకు 2023 ఏడాదికి వైద్యశాస్త్రంలో నోబెల్ పురస్కారం గెల్చుకున్న డ్రూ వీస్మాన్ కూడా సంతకం చేసిన వారిలో ఉన్నారు. అధ్యక్ష రేసు నుంచి తప్పుకొన్నందుకు.. రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ 2024 అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. అయితే కెన్నడీని తప్పుకోవాలని ట్రంప్ విజ్ఞప్తి చేశారు. అందుకు బదులుగా ఆయనకు ఆరోగ్యం, వైద్యం కార్యనిర్వాహక విభాగ బాధ్యతలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే ఆయనకు ఆరోగ్య శాఖను కేటాయించారు. అయితే అతని ఎంపికను అమెరికా పార్లమెంట్‌లో ఎగువసభ సెనేట్‌లో మెజారిటీ సభ్యులు ఆమోదించాలి. ఈ నేపథ్యంలో ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని సెనేట్‌ను నోబెల్ గ్రహీతలు కోరారు. ''వైద్యం, సైన్స్, ప్రజారోగ్యం లేదా పరిపాలనలో కెన్నడీ జూనియర్‌కు ఎలాంటి పరిపాలనా అనుభవం లేదు. చిన్నఅమ్మవారు, పోలియో వ్యాధుల నివారణకు ఉపయోగించే వ్యాక్సిన్లను కెన్నడీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన నియామకానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని గట్టిగా కోరుతున్నాం'' అని లేఖలో పేర్కొన్నారు. వివిధ విభాగాలకు అధిపతులుగా ట్రంప్ ఎంపిక చేసినవారిలో వివాదాస్పదమైన వ్యక్తులు మరికొందరు ఉన్నారు. రక్షణ శాఖకు ఎంపిక చేసిన ఫాక్స్ న్యూస్ వ్యాఖ్యాత పీట్ హెగ్సెత్‌పై లైంగిక వేధింపులు, మితిమీరిన మద్యపాన ఆరోపణలున్నాయి. అటార్నీ జనరల్‌గా ట్రంప్ తొలి ఎంపిక మాట్ గేట్జ్ కూడా వివాదాస్పదుడే. మైనర్‌తో లైంగిక సంబంధాల ఆరోపణలతో ఆయన చిట్టచివర్లో స్వయంగా రేస్ నుంచి తప్పుకున్నారు.

## బాధ్యతలన్నీ ముగించి.. తనువు చాలించి..

**బెంగళూరు:** జనం క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలను తరచూ చూస్తుంటాం. వింటున్నాం. ఇందుకు భిన్నంగా 34 ఏళ్ల ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడకుండా చాలా రోజులకు ముందుగానే తాను నెరవేర్చాల్సిన ఇతర బాధ్యతలను నెరవేర్చి నింపాదిగా తన మనోవ్యథను 80 నిమిషాల వీడియోలో, 24 పేజీల సూసైడ్ నోట్‌లో విడమర్చి చెప్పి తర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డారు. బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్ అనే టెకీ విషాద కథ ఇది. పోలీసులు, సూసైడ్ నోట్‌లోని వివరాల ప్రకారం సుభాష్ స్వస్థలం బిహార్. సుభాష్‌కు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే కొంతకాలంగా భార్య నుంచి విపరీతమైన వేధింపులు, మానసిక క్షోభను ఎదుర్కొంటున్నారు. ఉత్తరప్రదేశ్ కోర్టులో గృహహింస కేసులు నమోదయ్యాయి. నెలకు రూ.2 లక్షల మెయింటెనెన్స్ ఇవ్వాలని భార్య డిమాండ్‌చేస్తున్నారు. అత్తింటి వాళ్లు, భార్య తరపు బంధువుల నుంచి బెదిరింపులూ పెరిగాయి. దీంతో ఎంత సంపాదించినా సంతోషం లేదనే బాధతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆలోపు పూర్తిచేయాల్సిన పనులను జాబితాగా రాసి ఎప్పటికప్పుడు పూర్తయిన పనులకు టిక్ చేసేవారు. చివరకు సోమవారం బెంగళూరులోని మంజునాథ్ లేఅవుట్‌లోని ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెల్సుకుని పోలీసులు భార్య, అత్తపై కేసు నమోదుచేశారు.

## రూ.10 లక్షల బీమా, కుమార్తెల పెళ్లికి సాయం

**ఆటో డ్రైవర్లకు కేజ్రీవాల్ ఎన్నికల హామీ**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీకి మరో రెండు నెలల్లో జరగాల్సిన ఎన్నికలకు ప్రచారంలో ఆప్ అధినేత కేజ్రీవాల్ ఆటో డ్రైవర్లకు పలు హామీలను ప్రకటించారు. మంగళవారం కేజ్రీవాల్ కొండ్లిలో ఆటో డ్రైవర్ నవనీత్ కుటుంబంతో మాట్లాడారు. 'ఆటో డ్రైవర్ల కోసం ఐదు గ్యారెంటీలను ప్రకటిస్తున్నాను. అవి.. రూ.10 లక్షల వరకు జీవిత బీమా, రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుమార్తెల వివాహానికి రూ.1 లక్ష సాయం, పోటీ పరీక్షలకు హాజరయ్యే వీరి పిల్లలకు ఉచిత శిక్షణ ఇస్తాం' అని తెలిపారు.

## పీఎన్‌బీ కుంభకోణం బాధితుల కోసం.. రూ.125 కోట్ల చోక్సీ ఆస్తుల బదిలీ

**ముంబై:** మెహుల్ చోక్సీ- పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)కుంభకోణం బాధితులకు నష్ట పరిహారం చెల్లించేందుకు వీలుగా రూ.125 కోట్ల విలువైన ఆస్తులను లిక్విడేటర్‌కు బదిలీ చేసినట్లు ఈడీ తెలిపింది. ఇందులో మెహుల్ చోక్సీకి చెందిన ముంబైలోని ఫ్లాట్లు, గోదాములు/ఫ్యాక్టరీలు ఉన్నాయంది. వీటిని బాధితులు లేదా సొంతదారులకు అందజేస్తామని పేర్కొంది. మరో రూ.2,565.90 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించి, బాధితులకు అందజేసేందుకు ముంబైలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు తాజాగా ఈడీకి అనుమతినిచ్చింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపి పీఎన్‌బీ నుంచి మెహుల్ చోక్సీ రూ.6 వేల కోట్లు రుణంగా తీసుకుని మోసం చేసినట్లు తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన దేశ, విదేశాల్లోని రూ.597 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతోపాటు, రూ.1,968 కోట్ల ఆస్తుల్ని ఈడీ అటాచ్ చేసింది.

## 'ఇండియా' కూటమి బాధ్యతలు మమతా బెనర్జీ స్వీకరించాలి: లాలూ

**పట్నా:** విపక్ష 'ఇండియా' కూటమికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యం వహించాలన్న డిమాండ్ నానాటికీ బలం పుంజుకుంటోంది. రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ సైతం మమతా బెనర్జీకి మద్దతు పలికారు. ప్రతిపక్ష కూటమి పగ్గాలు ఆమె స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. లాలూ మంగళవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకత్వం వల్ల పెద్దగా ఫలితాలు కనిపించడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో కూటమి సారథ్య బాధ్యతలను మమతా బెనర్జీకి అప్పగించాలని స్పష్టంచేశారు.



అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో 'ఫ్రాంక్లిన్ ఫైర్' కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. మంగళవారం మలిబు నగరంలో మంటలార్పుతున్న అగ్ని మాపక సిబ్బంది



జపాన్‌కు చెందిన నిహోన్ హిడంక్యో తరఫున మంగళవారం నార్వే రాజధాని ఓస్లోలో ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతిని స్వీకరించిన ఆ సంస్థ ప్రతినిధి షిగెమిట్సు తనాకా

## నేను ముందొచ్చా.. కాదు నేనే

**రాహుల్ గాంధీ, సుఖ్‌జీందర్ రంధావా మధ్య సరదా సంభాషణ**

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అధికార ఎన్‌డీఏ కూటమి నేతలను వాగ్బాణాలతో పడగొట్టేందుకు కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభకు వస్తున్న సందర్భంగా పార్టీ నేత రాహుల్ గాంధీ, గుర్‌దాస్‌పూర్ కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌జీందర్ రంధావా మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. లోక్‌సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు పార్టీ ఎంపీలతో రాహుల్‌గాంధీ విడిగా సమావేశమయ్యారు. తర్వాత లోక్‌సభలోకి తోటి ఎంపీలతో కలిసి నడిచి వెళ్తూ పక్కన నడుస్తున్న సుఖ్‌జీందర్ రంధావతో '' మీరు సమావేశానికి సమయానికి రావాలి. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవు'' అని రాహుల్ అన్నారు. దానికి రంధావా వెంటనే స్పందించారు. ''నేను సమయానికే వచ్చాను. మీరే ఆలస్యంగా వచ్చారు. నేను మీకంటే ముందుగా వచ్చా'' అని అనగానే అక్కడున్నవారంతా ఫక్కున నవ్వేశారు.

## 14న మహా కేబినెట్ విస్తరణ

**పలువురు మంత్రులకు ఉద్వాసన?**



**ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ నెల 14న మంత్రి వర్గాన్ని విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 16 నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలు కానుండగా, రెండు రోజుల ముందుగానే కేబినెట్ విస్తరించనున్నారని సమాచారం. షిండే కేబినెట్‌లోని పలువురికి తాజా కేబినెట్‌లో చోటుదక్కే అవకాశాలు లేవన్నది పరిశీలకుల మాట. పనితీరు, ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని బీజేపీతోపాటు ఎన్సీపీ(అజిత్), శివసేన(షిండే)పార్టీలకు చెందిన పలువురు మంత్రులను ఈ దఫా పక్కనపెట్టే ఛాన్సుంది. మహారాష్ట్రలోని మహాయుతి కేబినెట్‌పై క్లీన్ ఇమేజీ ఉండాలన్నదే ఎన్‌డీఏ పెద్దల అసలు ఉద్దేశమని చెబుతున్నారు. మంత్రి పదవులు కోల్పోనున్న వారిలో శివసేనకు చెందిన సంజయ్ రాథోడ్, అబ్దుల్ సత్తార్, తానాజీ సావంత్ పేర్లు వినవస్తున్నాయి. అదేవిధంగా, ఎన్సీపీకి చెందిన దిలీప్ వల్సే పాటిల్, హసన్ ముష్రిఫ్, బీజేపీలోని సురేశ్ ఖడే, విజయ్‌కుమార్ గవిట్, ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి.మహాయుతి ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గింది.

సాక్షి ప్లస్
బుధవారం। 11-12-2024

# రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం చట్టం చేయొచ్చా?

భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)-11వ భాగం, ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)-11వ భాగం, ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు (Financial Relations) - 12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

### కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

**ప్రకరణ-245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:**

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు,అన్ని సంస్థలకు వర్తిస్తా యి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి (ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

**పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:**

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలి, డామన్-డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనను రాష్ట్రపతే నేరుగా నియంత్రిస్తారు. పరిపాలన ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

**ప్రకరణ- 246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన:** కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

### జాబితాలు

**కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1):** రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

**జాబితాలోని ముఖ్యాంశాలు:** దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు.

కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

**రాష్ట్ర జాబితా (State List) ప్రకరణ 246(3):** రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

**జాబితాలోని ముఖ్యాంశాలు:** శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

**ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2):** ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

### కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. అంతిమంగా కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

### కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

**డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్:** సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్దిష్ట అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ జాబితాలో పొందుపరిచిన అంశం, మరో జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనే అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది. మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా..ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం (1981), స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.

**డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్:** కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others) ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.



**డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ:** రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనికి అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అంతిమంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష పడుతుంది. బాల నేరస్థులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలకు సి.ఆర్.పి.సి.లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

**డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్:** రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం-1957; బహుమతి పన్ను చట్టం-1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లోకి వస్తాయి.

**డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోడానికి మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

**అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1):** అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇచ్చారు. భారత ప్రభుత్వ చట్టం -1935 ప్రకారం అవశిష్ట అధికారాలను ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250 (2) ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలకు, అంతకుముందే రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం-1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం-1955; వన్యప్రాణి సంరక్షణచట్టం-1972; జలకాలుష్య నివారణ చట్టం-1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం-1976; మానవ అవయవాల మార్పిడి చట్టం-1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకారణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం-1947; జెనీవా ఒప్పందం చట్టం-1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం-1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి ఆధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చేప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

**ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)**

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరఫున చట్టాలను రూపొందించవచ్చు.

# చింతా దీక్షితులు పిల్లల పాటలను ఏ పేరుతో రచించారు?




## తెలుగు బోధన పద్ధతులు

ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎందుకంటే డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులు విధిగా బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని చదవాలి. ఇక్కడ డీఎడ్, బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాల్లోని 'సహ పాఠ్య కార్యక్రమాలు- బోధనోపకరణాలు' అనే అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

## మాదిరి ప్రశ్నలు

1. భాషాభ్యసనంలో అతి ముఖ్యమైన వేటిని పెంపొందించడానికి భాషా ప్రయోగశాల ఉపకరిస్తుంది?
   1) శ్రవణ- పఠన నైపుణ్యాలు
   2) లేఖన- ఉచ్చారణ సామర్థ్యాలు
   3) పఠన- లేఖన సామర్థ్యాలు
   4) శ్రవణ- భాషణ నైపుణ్యాలు
2. ద్వితీయ భాష, తృతీయ భాషల అభ్యసనం లో బహుళ ప్రయోజనకారి ఏది?
   1) టేప్ రికార్డర్ 2) లింగ్వా ఫోన్
   3) భాషా ప్రయోగశాల
   4) దూరదర్శన్
3. భాషా ప్రయోగశాలను మొదట ఏ దేశంలో ఉపయోగించారు?
   1) అమెరికా 2) జర్మనీ
   3) ఇంగ్లండ్ 4) ఇండియా
4. 'భాషా ప్రయోగశాల' ఒక _____?
   1) స్వయం అధ్యయన కేంద్రం
   2) స్వయం అభ్యసన పరికరం
   3) స్వయంప్రదర్శనశాల
   4) నైపుణ్య ప్రదర్శన కేంద్రం
5. భాషా ప్రయోగశాలలో ఎన్ని గదులు ఉంటాయి?
   1) 5 గదులు లేదా అరలు
   2) 4 గదులు లేదా అరలు
   3) 3 గదులు లేదా అరలు
   4) 2 గదులు లేదా అరలు
6. భాషా ప్రయోగశాల వల్ల ప్రయోజనం కానిది?
   1) స్వీయ అభ్యసన శక్తి
   2) ఉచ్చారణ దక్షత
   3) అభ్యసనానికి సన్నద్ధం
   4) ప్రవర్తనలో పరివర్తన
7. సహపాఠ్య కార్యకలాపం కానిది?
   1) భాషా క్రీడలు 2) పుస్తక నిధి
   3) కవితా గోష్ఠులు 4) క్షేత్ర సందర్శన
8. 'వ్యాస రచన - లేఖా రచనలు' ఏ విభాగానికి చెందినవి?
   1) సహపాఠ్య కార్యకలాపాలు
   2) బోధన నైపుణ్యాలు
   3) భాషా క్రీడలు
   4) సృజనాత్మక రచనా క్రీడలు
9. నీతి గురించి అసత్య ప్రవచనం?
   1) సామాజిక దృష్టి కలది
   2) వ్యక్తిగత భావన
   3) మతమౌఢ్య భావన
   4) వ్యక్తికి, సమాజానికి ఉపయోగపడే విలువ
10. ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు కుక్క- గాడిద, నాలుగు ఎద్దులు- సింహం లాంటి కథలను బోధించడం ఎందులో భాగం?
    1) బాల సాహిత్యం 2) నీతి విద్య
    3) సాంకేతిక విద్య 4) సాహస కథలు
11. పిల్లలకు పనికొచ్చే పాటలను, కథలను రాసిన తొలితరం రచయితల్లో ప్రముఖులు
    1) ముళ్లపూడి వెంకటరమణ
    2) మునిమాణిక్యం నరసింహారావు
    3) కొడవటిగంటి కుటుంబరావు
    4) చింతా దీక్షితులు
12. చింతా దీక్షితులు పిల్లల పాటలను ఏ పేరుతో రచించారు?
    1) బుడుగులు 2) హరివిల్లు
    3) లక్కపిడతలు 4) చిన్నారిలోకం
13. భాషా ప్రయోగశాలలోని ఏ విభాగంలో మాస్టర్ టేపులు, రికార్డు చేసే విద్యార్థులు కోరిన టేపుల్ని వినిపించే యంత్రాలు ఉంటాయి?
    1) వినే బూత్ 2) సలహాదారు బూత్
    3) కంట్రోల్ రూమ్
    4)రికార్డింగ్ థియేటర్
14. పాఠశాల స్థాయిలో సారస్వత సంఘాల్లో ఎవరి భాగస్వామ్యం పట్టుకొమ్మలాంటిది?
    1) విద్యార్థి 2) భాషోపాధ్యాయుడు
    3) ప్రధానోపాధ్యాయుడు
    4) పై అందరూ
15. 'ఉపాధ్యాయులు పాఠ్యభాగ విశదీకరణలో లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. ఆ లక్ష్య సాధనకు సాధనాలే బోధనోపకరణాలు' అని ఎవరన్నారు?
    1) గిజూబాయి 2) కొంపెల్లి ఆంజనేయశాస్త్రి
    3) జాకీర్ హుస్సేన్
    4) హుమాయున్ కబీర్
16. "ఉపకరణం విషయ చిత్రీకరణకు, విషయాన్ని తొందరగా, సులువుగా అర్థం చేసుకోవడానికి, శాశ్వతమైన అవగాహనకు ఉపయోగపడుతుంది' అని ఎవరన్నారు?
    1) కొంపెల్లి ఆంజనేయ శాస్త్రి
    2) సర్వేపల్లి రాధాకృష్ణన్
    3) హుమాయున్ కబీర్
    4) గొడవర్తి సూర్యనారాయణ
17. విద్యార్థులు అదనపు సమాచారాన్ని ఇవ్వడానికి చక్కగా దోహదపడేవి?
    1) భాషా నైపుణ్యాలు
    2) కనీస అభ్యసన స్థాయిలు
    3) బోధన నైపుణ్యాలు
    4) బోధనోపకరణాలు
18. విద్యార్థులు బోధనాంశాలను సెట్లుగా జతపరచడం ఏ భాషా క్రీడ?
    1) డామినో ఆట 2) బింగో ఆట
    3) పదక్రీడ 4) అంత్యాక్షరి ఆట
19. విద్యార్థుల్లో అవధాన శక్తిని పెంపొందించడమే కాకుండా తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం అందించే శ్రవ్య ఉపకరణం?
    1) రేడియో 2) టేప్ రికార్డర్
    3) సెల్‌ఫోన్ 4) డీవీడీ ప్లేయర్
20. విద్యార్థుల ఉచ్చారణా దోషాలను ఏ పరికరం ద్వారా సవరించొచ్చు?
    1) రేడియో 2) వీడియో చిత్రాలు
    3) టేప్ రికార్డర్ 4) కంప్యూటర్
21. 28 పాచికలు ఉండే ఒక రకమైన పాచికలాట ఏది?
    1) పద క్రీడలు 2) వాక్య క్రీడలు
    3) బింగోఆట 4) డామినో ఆట
22. టేప్ రికార్డర్ స్థానాన్ని ఆక్రమించిన వేటిని శ్రవ్య, దృశ్య ఉపకరణాలుగా ఉపయోగించొచ్చు?
    1) కంప్యూటర్ 2) సీడీ/ డీవీడీ ప్లేయర్స్
    3) సెల్‌ఫోన్లు 4) వీడియో చిత్రాలు
23. బోధనాభ్యసన ప్రక్రియలో ఉపాధ్యాయులు తరగతి గదిలో ఎక్కువగా వినియోగిస్తున్న ఉపకరణాలు ఏవి?
    1) దృశ్య ఉపకరణాలు
    2) శ్రవ్య ఉపకరణాలు
    3) దృశ్య-శ్రవ్య ఉపకరణాలు
    4) ఏదీకాదు
24. రచనలు, చిత్రాలు, కృత్యాలతో స్వయంగా విద్యార్థులతో తయారు చేయించి తరగతి గదిలో ప్రదర్శిస్తే దాన్ని ఏమంటారు?
    1) కర పత్రిక 2) గోడ పత్రిక
    3) పాఠశాల పత్రిక 4) పైవన్నీ
25. ద్విపార్శ్వ ఉపకరణాలకు ఉదాహరణ?
    1) మెరుపు అట్టలు 2) వర్ణచిత్రాలు
    3) రేఖాచిత్రాలు 4) పైవన్నీ
26. పొడవు, వెడల్పు, ఎత్తులను కలిగిన ఉపకరణాలను ఏమని పిలుస్తారు?
    1) ద్విపార్శ్వ ఉపకరణాలు
    2) త్రిపార్శ్వ ఉపకరణాలు
    3) సాంకేతిక దృశ్య ఉపకరణాలు
    4) దృశ్య, శ్రవ్య ఉపకరణాలు
27. కీలుబొమ్మలు, తోలుబొమ్మలు ఏ రకమైన ఉపకరణాలు?
    1) దృశ్యశ్రవ్య 2) సాంకేతిక దృశ్య
    3) త్రిపార్శ్వ 4) ద్విపార్శ్వ
28. ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్, బులెటిన్ బోర్డ్‌లు ఏ రకమైన ఉపకరణాలు?
    1) సాంకేతిక దృశ్య 2) దృశ్యశ్రవ్య
    3) ద్విపార్శ్వ 4) త్రిపార్శ్వ
29. వ్యాఖ్యాయుత చిత్రాలు అని వేటినంటారు?
    1) కార్టూన్ చిత్రాలు
    2) వీడియో చిత్రాలు
    3) మూకీ చిత్రాలు
    4) డాక్యుమెంటరీ చిత్రాలు
30. పూర్వకాలంలో ఎక్కువగా ఏ చిత్రాలు మాత్రమే ఉండేవి?
    1) వీడియో చిత్రాలు
    2) డాక్యుమెంటరీ చిత్రాలు
    3) కార్టూన్ చిత్రాలు
    4) మూకీ చిత్రాలు
31. నేడు ప్రసార సాధనాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఉపకరణం?
    1) టేప్ రికార్డర్ 2) చలనచిత్రం
    3) టెలివిజన్ 4) కంప్యూటర్
32. మనరాష్ట్రంలో దూరదర్శన్‌లో ప్రసారమయ్యే ఏ కార్యక్రమాల్లో భాషకు సంబంధించిన పాఠ్యాంశాలు ఎక్కువగా కనిపిస్తాయి?
    1) టెలి స్కూల్ 2) మన టి.వి.
    3) మన బడి 4) వేద పాఠశాల
33. సంగణకం అంటే?
    1) దూరదర్శన్ 2) కంప్యూటర్
    3) ఇంటర్నెట్ 4) వెబ్ బ్రౌజింగ్
34. రాబోయే కాలంలో కంప్యూటర్ వాడకం తగ్గి అందరూ సెల్‌ఫోన్ మీదే ఆధారపడతారని పేర్కొన్న శాస్త్రవేత్త?
    1) జోనాథన్ రాట్‌బెర్గ్ 2) వెబ్‌స్టర్
    3) జాన్ ఆడమ్స్ 4) జాన్ అండర్సన్
35. విద్యార్థుల్లో పదజాలాభివృద్ధి కోసం ఉప కరించే క్రీడలు ఏవి?
    1) పద క్రీడలు 2) వాక్య క్రీడలు
    3) కథాపురాణ క్రీడలు
    4) అంత్యాక్షరి క్రీడలు

### సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2;
5) 3; 6) 4; 7) 2; 8) 1;
9) 3; 10) 2; 11) 4; 12) 3;
13) 3; 14) 1; 15) 2; 16) 3;
17) 4; 18) 2; 19) 1; 20) 3;
21) 4; 22) 2; 23) 1; 24) 2;
25) 4; 26) 2; 27) 3; 28) 1;
29) 4; 30) 4; 31) 3; 32) 1;
33) 2; 34) 4; 35) 1.

## గత డీఎస్సీ ప్రశ్నలు

1. త్రిపార్శ్వ ఉపకరణాలను ఉపయోగించి బోధించే సందర్భంలో నీవు ఉపయోగించే ఉపకరణాలు?
   1) మెరుపు అట్టలు 2) తోలుబొమ్మలు
   3) ఛాయాచిత్రాలు 4) వ్యంగ్య చిత్రాలు
2. మౌఖిక అభినయం ఏ బోధనోపకరణానికి చెందింది?
   1) దృశ్య ఉపకరణం 2) చలనచిత్రాలు
   3) శ్రవ్య ఉపకరణం
   4) దృశ్య చలన ఉపకరణాలు
3. కిందివాటిలో సహపాఠ్య కార్యక్రమాలకు చెందనిది?
   1) అవధాన ప్రక్రియ
   2) బోధాంతర్గత జట్టు కృత్యం
   3) ఆవిష్కరణ వ్యూహం
   4) సిములేషన్ వ్యూహం
4. విద్యార్థుల్లో భాషాభినివేశం, సాహిత్యాభిలాషను పెంచడానికి తోడ్పడే యాత్రలు
   1) విహార యాత్రలు 2) వినోద యాత్రలు
   3) భాషా విహార యాత్రలు
   4) విజ్ఞాన యాత్రలు
5. దృశ్యశ్రవణ పరికరానికి ఉదాహరణ?
   1) టేప్ రికార్డర్ 2) ఛాయాచిత్రాలు
   3) పత్రికలు 4) తోలుబొమ్మలాట
6. విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తులను వెలికితీసేందుకు, రచనా వ్యాసంగాన్ని పెంపొందించడానికి చక్కగా దోహదపడే సహపాఠ్య కార్యకలాపం?
   1) భాషా విహార యాత్రలు
   2) సారస్వత సంఘాలు
   3) పాఠశాల పత్రిక
   4) గోడ పత్రిక
7. భాషా ప్రయోగశాలలో ప్రధాన టేపులు, అభ్యాసకులను పరీక్షించడానికి అవసర మైన సామాగ్రి ఉండే అర?
   1) వినే బూత్ 2) సలహాదారు బూత్
   3) కంట్రోల్ రూమ్ 4) ఏదీకాదు
8. నల్లబల్ల, ఫ్లానెల్ బల్ల, బులెటిన్ బల్ల, అయస్కాంత బల్ల మొదలైన ఉపకరణాలు?
   1) ప్రక్షేపక ఉపకరణాలు
   2) దృశ్యశ్రవ్య ఉపకరణాలు
   3) శ్రవ్య ఉపకరణాలు
   4) దృశ్య ఉపకరణాలు

### సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3;
5) 4; 6) 3; 7) 2; 8) 4;

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
బుధవారం। 11-12-2024

# వ్యోమగాములు ఆహారంగా ఉపయోగించే శైవలం ఏది?

## మొక్కలు - వర్గీకరణ, విస్తరణ

ప్రకృతిలో పిండిపదార్థాన్ని స్వయంగా తయారుచేసుకొని, వినియోగించుకొని ఇతర జీవులకు ఆహారంగా అందించేవి మొక్కలు. మానవుడికి ఇవి అనేక విధాలుగా తోడ్పడుతున్నాయి. ఔషధాలు, కాగితం తయారీలో, వివిధ పరిశ్రమల్లో వీటిని విరివిగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ప్రాణులు జీవించడానికి అవసరమైన ఆక్సిజన్‌ను ఇవి అందిస్తున్నాయి.


మొక్కల గురించి తెలుసుకోవడానికి సౌలభ్యం కోసం వీటిని విభిన్న సముదాయాలుగా విభజించారు. జీవపరిణామక్రమం, ఆకృతులు, విస్తరణ ఆధారంగా వీటిని వివిధ రకాలుగా వర్గీకరించారు. మొట్టమొదటిసారిగా మొక్కలను వాటి స్వరూపం ఆధారంగా అరిస్టాటిల్ మూడు రకాలుగా వర్గీకరించారు.

అవి:
1) గుల్మాలు
2) పొదలు
3) వృక్షాలు

క్రీ.పూ.4000 ఏళ్ల కిందట ఈజిప్టు, అస్సీరియన్ దేశస్థులు పైరు మొక్కలు, ఫలాల మొక్కలు తదితరాలుగా వీటిని చిత్రపటాల (హీరోగ్లిఫిక్స్) రూపంలో నమోదు చేశారు. క్రీ.పూ. 2500 సంవత్సరాల నాటికే చైనా దేశస్థులు మొక్కలు, వాటి సాగు గురించి వివరించారు.

గ్రీకు తత్వవేత్తలైన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వృక్షశాస్త్ర అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. థియోఫ్రాస్టస్‌ను వృక్షశాస్త్ర పితామహుడిగా భావిస్తారు. ఈయన మొట్టమొదటిసారిగా 500 రకాల మొక్కల లక్షణాలను వివరిస్తూ 'హిస్టోరియా ప్లాంటారం' గ్రంథాన్ని రచించాడు. 16, 17 శతాబ్దాల్లో ఔషధ మొక్కలపై విస్తృత అధ్యయనం జరిగింది.

18వ శతాబ్దంలో లిన్నేయస్ (స్వీడన్ శాస్త్రజ్ఞుడు) ద్వినామీకరణ విధానాన్ని అభివృద్ధి పరిచి మొక్కలను వర్గీకరించారు. జీవ పరిణామ క్రమం ప్రకారం మొక్కలను వృక్ష రాజ్యంగా పేర్కొని వాటిని భిన్న రకాలుగా విభజించారు. వీటిలో అనేక లక్షణాలను పరిగణనలోకి తీసుకున్నారు. లిన్నేయస్‌ను వర్గీకరణ శాస్త్ర పితామహుడుగా పరిగణిస్తారు.




## పుష్పించని మొక్కలు (క్రిప్టోగామ్స్)

పుష్పించని మొక్కలు పుష్పాలు, ఫలాలు, విత్తనాలను కలిగి ఉండవు. నిర్మాణం ఆధారంగా వీటిని మూడు రకాలుగా వర్గీకరించారు.

1. **థాలోఫైటా:** ఇవి వేరు, కాండం, పత్రాలుగా విభేదనం చెంది ఉండవు. వీటి దేహ భాగాన్ని 'థాలస్' అంటారు. వీటిలో మళ్లీ రెండు రకాలు ఉన్నాయి.

**ఎ) ఆల్గె (శైవలాలు):** శైవలాల గురించి చేసే అధ్యయనాన్ని ఆల్గాలజీ/ఫైకాలజీ అంటారు. ఇవి ఆకుపచ్చగా ఉంటాయి. సాధారణంగా వీటిని 'నాచు' అని పిలుస్తారు. ఇవి సాధారణంగా నీటిలో ఆవాసం చేస్తాయి. వీటిలో వివిధ వర్ణాలు కలిగిన శైవలాలు ఉంటాయి.

అవి:
i) క్లోరోఫైసి-ఆకుపచ్చ
ii) ఫియోఫైసి-గోధుమ రంగు
iii) రోడోఫైసి-ఎరుపు రంగు

ఆహారంగా, ఆర్థికంగా ఉపయోగపడే శైవలాలు అనేకం ఉన్నాయి. స్పైరులినా, అల్వా, క్లోరెల్లా, పోర్ఫిరా, సెనిడెస్మస్, క్లాడోఫొరా మొదలైనవాటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి ఏకకణ ప్రోటీన్ల రూపంలో ఆహారంగా ఉపయోగపడుతున్నాయి.

ఎరుపు రంగు శైవలాలైన గ్రాసిల్లేరియా, జిలాడియం నుంచి అగార్-అగార్, లామినేరియా నుంచి అయోడిన్ లాంటి పదార్థాలు లభ్యమవుతున్నాయి. డయాటమ్‌లు ఎరువుగా, వడపోత విధానంలోనూ ఉపయోగపడతాయి.

**బి) ఫంగి (శిలీంద్రాలు):** సాధారణంగా వీటిని 'బూజులు' (Mould) అంటారు. శిలీంద్రాల గురించి చేసే అధ్యయనాన్ని 'మైకాలజీ' అంటారు. శిలీంద్రాలు సాధారణంగా కొన్ని పూతికాహారులు, మరికొన్ని పరాన్నజీవులు. వీటి కణకవచం కైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. శిలీంద్రాలలో ఆహార పదార్థం గ్లైకోజన్ రూపంలో నిల్వ ఉంటుంది. ఇవి బహుకేంద్రక, ద్వికేంద్రక స్థితుల్లో ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి సిద్ధబీజాల(spores) ద్వారా జరుగుతుంది. సాధారణంగా రొట్టెల మీద పెరిగే శిలీంద్రం రైజోపస్.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 1928లో పెన్సీలియం లాంటి శిలీంద్రాల నుంచి 'పెన్సిలిన్' అనే యాంటీబయాటిక్‌ను ఉత్పత్తి చేశారు. న్యూరోస్పోరా లాంటి శిలీంద్రాలను జన్యుశాస్త్ర పరిశోధనల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మొరెల్స్, ట్రఫుల్స్ అనేవి తినదగిన శిలీంద్రాలు. మష్‌రూం అంటే 'స్పాంజ్' అని అర్థం. కొన్ని శిలీంద్రాల్లో ముఖ్యంగా తినగలిగేవాటిలో పుట్టగొడుగులు ముఖ్యమైనవి. విషపూరితమైన పుట్టగొడుగులను 'టాడ్‌స్టూల్స్' అంటారు. భారతదేశంలో అగారికస్ బైస్పోరస్ (White button Mushroom) అనే తినదగిన పుట్టగొడుగులను సాగు చేస్తున్నారు. పుట్టగొడుగుల విత్తనాలను 'స్పాన్' అంటారు. కొన్ని రకాల శిలీంద్రాలు మొక్కల్లో కుంకుమ తెగులు, కాటుక తెగులు లాంటివాటిని కలిగిస్తాయి.

2. **బ్రయోఫైటా:** వీటిని సాధారణంగా వృక్షరాజ్య ఉభయచర మొక్కలు అంటారు. వీటి గురించి చేసే అధ్యయనాన్ని 'బ్రయాలజీ' అంటారు. ఇవి ఏక స్థితికంలో ఉండే మొక్కల మాదిరిగా కనిపిస్తాయి. వీటిలో ఉండే వేరు లాంటి నిర్మాణాలను రైజాయిడ్స్, కాండం లాంటి నిర్మాణాలను కాలాయిడ్స్, పత్రాల లాంటి నిర్మాణాలను ఫిల్లాయిడ్స్ అని అంటారు. వీటిలో లివర్ వర్ట్స్, హార్న్‌వర్ట్స్, మాసెస్ అనే మూడు రకాలు ఉన్నాయి. వీటిలోని లైంగిక భాగాలను ఆంథిరీడియం (పురుష ప్రత్యుత్పత్తి భాగం), ఆర్కిగోనియం (స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం) అని అంటారు. మాస్ మొక్కలు నేలపై తివాచీల మాదిరిగా కనిపిస్తాయి. మాస్ మొక్కల శైశవ దశను 'ప్రథమ తంతువు' అంటారు.

**ఉదా:** పాలిట్రిబం, ఫ్యునేరియా, స్ఫాగ్నం. బ్రయోఫైటా. వీటిని మొదటి నేల మొక్కలుగా పేర్కొంటారు.

3. **టెరిడోఫైటా:** సాధారణంగా ఈ రకమైన మొక్కలను అలంకరణ కోసం ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అధ్యయనాన్ని 'టెరిడాలజీ' అంటారు. వీటిని గార్డెన్‌క్రీపర్స్, గార్డెన్ స్నేక్స్, నాళికాయుత పుష్పించని మొదటి నిజమైన నేల మొక్కలు అని అంటారు. క్లబ్ మాస్, హార్స్‌టెయిల్స్, ఫెర్న్ మొదలైనవి టెరిడోఫైటాకు చెందిన మొక్కలు. వీటిలో భిన్నమైన ప్రసరణ స్తంభాలు ఉంటాయి. టెరిడోఫైటా మొక్కలు అతి తక్కువ భౌగోళిక ప్రాంతాలకు పరిమితమై ఉంటాయి. వీటిలో ప్రత్యుత్పత్తి నిర్మాణాలు అంథిరీడియం, ఆర్కిగోనియం. వీటిలో సంయోగ బీజదశను 'ప్రథమాంకురం' అంటారు.

**ఉదా:** టెరిస్, లైకోపోడియం, ఈక్విసిటం.

క్రీ.పూ.2000లో భారతీయులు అధర్వణ వేదంలో ఔషధ మొక్కల గురించి వివరించారు. పరాశరుడు వ్యవసాయం, కలుపు మొక్కల గురించి వివరిస్తూ 'కృషి పరాశరం'; అడవులు, ఔషధ మొక్కలు, మొక్కల బాహ్య, అంతర్నిర్మాణం గురించి వర్ణిస్తూ 'వృక్షాయుర్వేదం' గ్రంథాలను రచించారు. ఈయనను 'భారతదేశ వృక్షశాస్త్ర పితామహుడు'గా పేర్కొంటారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
బయాలజీ

### మాదిరి ప్రశ్నలు

1. శైవలాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) మైకాలజీ బి) ఫైకాలజీ
సి) టెరిడాలజీ డి) పేలినాలజీ
2. కిందివాటిలో ఎరువుగా ఉపయోగపడే శైవలం ఏది?
ఎ) స్పైరోగైరా బి) క్లామిడోమోనాస్
సి) స్పైరులినా డి) డయాటమ్స్
3. 'మొదటి నేల మొక్కలు'గా వేటిని పేర్కొంటారు?
ఎ) టెరిడోఫైటా బి) శైవలాలు
సి) బ్రయోఫైటా డి) జిమ్నోస్పెర్మ్స్
4. 'అయోడిన్' దేని నుంచి లభిస్తుంది?
ఎ) క్లామిడోమోనాస్ బి) క్లాడోఫొరా
సి) లామినేరియా డి) క్లోరెల్లా
5. కిందివాటిలో జీవ ఎరువుగా ఉపయోగపడేవి ఏవి?
ఎ) అజొల్లా బి) రైజోబియం
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ
6. 'కెల్ప్స్' అనేవి ఏ వర్గానికి చెందుతాయి?
ఎ) శిలీంద్రాలు బి) శైవలాలు
సి) బ్యాక్టీరియా డి) బ్రయోఫైటా
7. అంథిరీడియం అంటే ఏమిటి?
ఎ) పురుష ప్రత్యుత్పత్తి భాగం
బి) స్త్రీ ప్రత్యుత్పత్తి భాగం
సి) కేసరావళి డి) అండకోశం
8. మొక్కల్లో 'ఫ్రాండ్స్' అనేవి?
ఎ) వేర్లు బి) పత్రాలు
సి) కాండం డి) పుష్పాలు
9. కిందివాటిలో మైకోరైజాలో ఉండేది ఏది?
ఎ) శిలీంద్రం బి) శైవలం
సి) ఎ, బి
డి) నీలి ఆకుపచ్చ శైవలాలు
10. కిందివాటిలో అలంకరణ కోసం పెంచే పుష్పించని మొక్కలు ఏవి?
ఎ) బ్రయోఫైటా బి) శైవలాలు
సి) శిలీంద్రాలు డి) టెరిడోఫైటా
11. 'అగార్ - అగార్' వేటి నుంచి లభిస్తుంది?
ఎ) గ్రాసిల్లేరియా
బి) క్లామిడోమోనాస్
సి) నీలి ఆకుపచ్చ శైవలాలు
డి) పైవన్నీ
12. వ్యోమగాములు ఆహారం కోసం ఉపయోగించే శైవలం ఏది?
ఎ) క్లోరెల్లా బి) వాల్‌వాక్స్
సి) స్పైరులినా డి) పైవన్నీ
13. పెన్సిలిన్‌ను ఎవరు కనుగొన్నారు?
ఎ) వాక్స్‌మన్
బి) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
సి) వాట్సన్ డి) లివెన్ హక్
14. జన్యుశాస్త్ర ప్రయోగాల్లో వేటిని ఉపయోగిస్తారు?
ఎ) న్యూరోస్పొరా
బి) అగారికస్ సి) అజొల్లా
డి) రైజోబియం
15. జీవ పరిణామం ప్రకారం పుష్పించని మొక్కల్లో చివరి దశలో ఉండేవి?
ఎ) బ్రయోఫైటా బి) టెరిడోఫైటా
సి) శైవలాలు డి) శిలీంద్రాలు
16. లైకెన్స్‌లో ఉండేవి?
ఎ) శిలీంద్రం, శైవలం
బి) శైవలం, బ్రయోఫైటా
సి) శిలీంద్రం, బ్రయోఫైటా
డి) బ్రయోఫైటా, టెరిడోఫైటా
17. 'వృక్ష రాజ్య తివాచీలు'గా ఏ మొక్కలను పేర్కొంటారు?
ఎ) శైవలాలు బి) శిలీంద్రాలు
సి) బ్రయోఫైటా డి) టెరిడోఫైటా

### సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) డి; 6) బి; 7) ఎ; 8) బి; 9) ఎ; 10) డి; 11) ఎ; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) బి; 16) ఎ; 17) సి.

# Bank would prefer to mobilize deposits under..

### Model Questions

1. IFSC in a cheque means:
a) Indian Financial System Code
b) It has 11 digits alpha numeric
c) First 4 digits represent Bank Name
d) This code is used in remitting funds through RTGS and NEFT
e) All the above
2. "Hundi" is a
a) Draft b) Cheque
c) Bill of exchange
d) Promissory note
e) None of these
3. Banking Industry has been declared as public utility service for purpose of
a) Negotiable Instruments ACT, 1881
b) Reserve bank of India Act, 1934
c) Banking regulation Act, 1949
d) Industrial Disputes Act
e) None of these
4. Bank would prefer to mobilize deposits under Savings Bank accounts, because:
a) Account holders will be motivated to save since savings account offer interest also
b) It is a low cost deposit for the bank and banks can profitably deploy such funds
c) Banks want to inculcate the savings habit among the public
d) All of the above
e) None of the above
5. Basic Objective of SEBI is/are:
a) To promote the interests of investors in securities
b) To promote the development of Securities Market
c) To regulate the securities market
d) To protect the interest of the investors to improve the stock market investments
e) All of the above
6. Customer Day in the bank is on and customers are allowed to meet the top officials of the bank on this day in every month:
a) $5^{th}$ b) $10^{th}$ c) $15^{th}$ d) $30^{th}$
e) Any of the above dates
7. "Allonge" is
a) A piece of paper for making endorsements
b) A piece of paper attached to a negotiable instrument for making available more space for further endorsements
c) Both a and b
d) Duplicate DD issued to a customer
e) Bill payable after sight



BANK EXAMS
Banking Awareness

8. NEFT is useful because:
a) The remitter need not send the physical cheque or Demand Draft to the beneficiary.
b) The beneficiary need not visit his/her bank for depositing the paper instruments
c) The beneficiary need not be apprehensive of loss/ theft of physical instruments or the likelihood of fraudulent encashment thereof
d) Cost effective
e) All the above
9. Mutual Fund Scheme that operates continuously without any limit entry for subscriptions and redemptions is:
a) Fixed Income
b) Specific Fund
c) Close Ended
d) Open Ended
e) Mixed Fund
10. PAN number is required for all transactions above:
a) Rs. 25,000 b) Rs. 50,000
c) Rs. 1 lakh d) Rs. 10 lakh
e) No such restriction
11. Banking Ombudsman services are available to:
a) All Scheduled Commercial Banks
b) Regional Rural Banks
c) Scheduled Primary Co-operative Banks
d) Only a & c e) All the above
12. An asset, including a leased asset, becomes non-performing when:
a) It ceases to generate income for the bank
b) A performance Guarantee issued by the bank on behalf of the borrower is invoked
c) It is rendered useless due to wear and tear or its becoming obsolete
d) The borrower dies
e) None of the above
13. Counter guarantee means a guarantee obtained:
a) By bank from customers on whose behalf the banks have to issue guarantees in favour of third parties, such as government department, Public bodies, Corporations etc.
b) By banks from ECGC covering export risk
c) By banks from the beneficiary of the guarantee in whose favour the guarantee is to be issued
d) A guarantee issued to the guarantor
e) None of the above
14. Which of the following statements is correct about banks?
a) Banks cannot accept demand and time deposits from public.
b) Banks can accept only time deposits from public.
c) Banks can accept both demand and time deposits from public.
d) Banks can accept demand and time deposits only from government.
e) None of the above
15. The RBI issued the following guidelines for effective Asset Liability Management System
a) Bank should set up an internal Asset Liability Committee
b) The committee should be headed by CMD or ED
c) The Management committee of the Board should oversee implementation of the system
d) Decision of ALCO is to be implemented in letter and spirit
e) All of the above
16. The major responsibilities of Asset Liability Committee are
a) Product pricing for deposits and advances
b) The level of maturity profile and mix of the incremental assets and liabilities
c) The committee should also review the 3 results and progress of implementation
d) All of the above
e) None of the above
17. What is "NIKKET"
a) Share price Index of Tokyo share market
b) Name of Japanese central bank
c) Japanese name of the country's planning commission
d) Foreign Exchange market of Japan
e) Only a & d
18. Asia's oldest stock exchange which completed 140 years of operations on 2015 July 9?
a) NSE
b) Hyderabad Stock Exchange
c) BSE
d) Madras Stock Exchange
e) None of these
19. The bank allowed by the FIPB to raise its FII cap to 55% recently:
a) ICICI Bank b) Andhra Bank
c) Bank Of Maharastra
d) Kotak Mahindra Bank
e) Bank Of Baroda
20. Gilt - Edged Market refers to:
a) The market for government
b) Semi-government securities
c) It carries fixed rates of interest
d) Most secured investment
e) All the above
21. Which of the following terms is not used in the world of finance, banking and insurance?
a) Devaluation b) Amnesty
c) Hard currency
d) Preference share
e) None of the above
22. Which of the following organizations/ agencies frame the Monetary and Credit Policy which is followed by all banks in India?
a) Indian Bank's Association
b) Reserve Bank of India
c) Securities & Exchange Board of India
d) Government of India
e) Sinking fund
23. Upper limit prescribed for RTGS transaction is:
a) 1 lakh b) 2 lakhs c) 5 lakhs
d) 50 lakhs
e) No upper limit is prescribed
24. Which of the following bank launched "Project Tatkal" to expedite home loan applications?
a) SBH b) SBI
c) Axis Bank d) HDFC Bank
e) Union Bank Of India
25. Taking banking technology to the common man is the tagline of:
a) Indian Overseas Bank
b) ICICI
c) Union Bank of India
d) Indian Bank
e) State Bank of India

**Answers:**

| | | | | |
|---|---|---|---|---|
| 1) e | 2) c | 3) d | 4) d | 5) e |
| 6) c | 7) b | 8) e | 9) d | 10) b |
| 11) e | 12) a | 13) a | 14) c | 15) e |
| 16) d | 17) a | 18) c | 19) d | 20) e |
| 21) b | 22) b | 23) e | 24) b | 25) d |

### RuPAY CARD

- RuPay is a combination of two words – **Rupee** and **Payment**. RuPay Card is an Indian version of credit/debit card. It is very similar to international cards such as Visa/Master.
- RuPay is the Indian domestic card payment network set up by National Payments Corporation of India (NPCI) at the behest of banks in India with the approval of Reserve Bank of India.
- It is created to fulfill the Reserve Bank of India's desire to have a domestic, open loop, and multilateral system of payments in India.
- RuPay facilitates electronic payment at all Indian banks and financial institutions, and competes with Master Card and Visa in India.
- NPCI maintains ties with Discover Financial to enable the card scheme to gain international acceptance.
- National Payments Corporation of India (NPCI) has a plan to provide a full range of card payment services including the RuPay ATM, RuPay Micro ATM, Debit, Prepaid and Credit Cards which will be accepted in India and abroad, across various channels like POS, Internet, IVR and mobile etc.



- The initial focus of NPCI would be to approach those banks who have not been issuing any payment card at all more specifically – Regional Rural Banks (RRBs) and urban co-operative banks.
- RuPay cards are accepted at all automated teller machines (ATMs) across India under National Financial Switch, and under the NPCI's agreement with DFS. RuPay cards are accepted on the international Discover network.
- According to the data published by National Payments Corporation of India, there are around 145270 ATMs and more than 875000 Point of Sale (PoS) terminals in India under the RuPay platform.
- In addition to the ATMs and PoS terminals, RuPay cards are accepted online on 10,000 e-commerce websites with the same PIN which they use for ATM transactions.
- RuPay cards are accepted at all PoS terminals in India. To enable this, RuPay has certified 29 major banks in India to accept the RuPay card at their respective PoS terminals located at different merchant locations.
- NPCI has rolled out its chip card for high security transactions using EMV (Europay, MasterCard and Visa) chip technology, which is a global standard for debit and credit cards. RuPay chip cards have an embedded microprocessor circuit containing information about the card holder and because transactions are PIN-based rather than signature-based.
- RuPay also provides a unified "Kisan Card", issued by banks across the country under Kisan Credit Card, enabling farmers to transact business on ATMs and PoS terminals.